# భక్తి సారము

(ప్రథమ భాగము)

తిరునాయపాటి రాఘవయ్య




తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# భక్తిసారము

(ప్రథమ భాగము)

రచయిత

తిరువాయిపాటి రాఘవయ్యా

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2004

# BHAKTI SARAM (TELUGU)

by

**T. Raghavaiah**

T.T.D. Religious Publications Series No : 635

© All Rights Reserved

First Edition : 2004

Copies : 2000

*Published by*

**Sri Ajeya Kallam, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

DTP by:

Nithya Graphics, Tirupati.

*Printed at*

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# విషయ సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | తిరుప్పళ్లియెళుచ్చి (తొండరడిప్పొడి ఆళ్వార్ | 1 |
| 2. | అమలనాదిపిరాన్ (తిరుప్పాణి ఆళ్వారు) | 24 |
| 3. | వాడినేన్‌వాడి (తిరుమంగైయాళ్వార్) | 47 |
| 4. | తిరుప్పల్లాండు (పెరియాళ్వార్) | 73 |
| 5. | తిరుప్పావై (ఆండాళ్) | 100 |

# ముందు మాట

దక్షిణ భారతదేశంలో అవతరించిన వైష్ణవ భక్తశిరోమణులలో ఆళ్వారులకు ప్రత్యేక స్థానం వుంది. వీరు భగవంతుని గుణవిశేషాలను ద్రావిడభాషలో గీతికలుగా గానం చేశారు. ఆళ్వారు అనగా భగవంతుని భక్తిసాగరంలో మునిగి, లోతును కనుగొన్నవారు అనే అర్థం వుంది. భగవతత్త్వాన్ని ప్రతిపాదించి లోకోద్ధారణ కావించిన పన్నెండుమంది ఆళ్వారుల భక్తిమార్గం సర్వులకు మార్గదర్శకం. ఈ మహాత్ములు శ్రీమన్నారాయణుడి అనంత కళ్యాణ గుణాలను అనన్యభక్తితో పాశురాల ద్వారా కీర్తించారు. ద్రావిడదేశంలో పామరుల నుంచి పండితుల వరకు కూడా భక్తితో ఈ పాశురాలను పాడుకొని ఆనందిస్తుంటారు. ఈ పాశురాలకే "నాలాయిర దివ్య ప్రబంధం" అనే ప్రసిద్ధమైన పేరు వుంది. దివ్యశక్తులు కలిగి హరిపదసేవలో నిరంతరం లీనమై రచన చేసినందువల్ల వీటిని వేదాలవలె భక్తులు పరిగణిస్తున్నారు. అమృత ప్రవాహంలా భక్తిసారాన్ని లోకానికి అందించిన భాగవతోత్తములు ఆళ్వారులు. తమ మృదుమధుర కావ్యగానంతో సర్వేశ్వరుని తమ చెంతకు రప్పించుకొన్న మహాఘనులు వీరు. ప్రజల అజ్ఞానాంధకారాలను తమ 'భక్తి' అనే ప్రకాశం చేత తొలగిస్తూ తమ దివ్య ప్రబంధాలను శ్రీమన్నారాయణుని చరణాలను అలంకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు తమ ధార్మిక ప్రచురణల్లో భాగంగా భక్తిసారాన్ని రెండు భాగాలుగా ముద్రిస్తున్నారు. ఈ మొదటి భాగంలో ఐదుగురు ఆళ్వార్లచే రచింపబడిన ప్రబంధాల విశేషాలు వివరింపబడినాయి. అవి తిరుప్పళ్లి యెళుచ్చి (తొండరడిప్పొడి ఆళ్వారు), అమలనాది పిరాన్ (తిరుప్పాణి ఆళ్వారు), వాడినేన్వాడి(తిరుమంగై ఆళ్వారు), తిరుప్పల్లాండు (పెరియ ఆళ్వారు), తిరుప్పావై (ఆండాళ్). వీరందరు నిస్వార్థంగా దైవాన్ని పూజించి కీర్తించి ముక్తిని పొందారు.

మొదటిదైన 'తిరుప్పళ్లి యెళుచ్చిని' శ్రీరంగనాథ సుప్రభాతంగా చెప్పాలి. అనేకవైష్ణవ దేవాలయాల్లో దీనిని సుప్రభాత స్తోత్రంగా పఠిస్తారు. రెండవదైన ''అమలనాది పిరా㆑'' ప్రబంధంలో తిరుమల శ్రీనివాస, శ్రీరంగనాథుల స్తుతి కలదు. మూడవదైన ''వాడినే㆑ వాడి'' లో తిరుమంత్ర మహిమ కొనియాడబడింది. మంగళాశాసనము ''తిరుప్పల్లాండు''ను దివ్యస్థలాలలో ద్రావిడ వేదాధ్యయనం చేసేందుకు ముందు వీరు పాడిన ఈ తిరుప్పల్లాండును పఠిస్తారు.

నిత్యానుసంధానం చేసే కొన్ని పాశురాలను గ్రహించి తెలుగులో భావ వివరణను శ్రీ తిరువాయిపాటి రాఘవయ్య ఇచ్చారు. దేవస్థాన ప్రచురణగా వెలువడుతున్న ఈ గ్రంథాన్ని భక్తులు ఉపయోగించుకోగలరని మా ఆకాంక్ష.

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# ఉపోద్ఘాతము

"శ్రీ భక్తిసారము" శ్రీ మద్రామానుజాచార్యులకు పూర్వము చాల కాలము క్రిందట వెలసిన ఆళ్వారులలో కొందరును, శ్రీరామానుజుని కాలమున వారి శిష్యరత్నములుగా వెలుగొందిన కొందరును, ఆచార్యుల వారి తరువాత వెలసిన విశిష్టాద్వైత వైష్ణవభక్తులు కొందరు వ్యక్తపరచిన, భక్తిభావమును వీపులీకరించు పుస్తకము.

భక్తిభావమన్న విషయమును గూర్చి విపులముగా నెరుగదలచిన వారు, నాచే రచింపబడిన వాస్తవము (వ్యాసపంచకము), శ్రీ తిరుమల తిరుపతి వేంకటేశ్వర దివ్యవైభవము, శ్రీ ఆళ్వారులదివ్య వైభవము, శ్రీరామానుజ దివ్య వైభవము అను గ్రంథములఁ జదివి, భక్తియోగ, భక్తితత్త్వ, భక్తిభావ, భక్తిప్రదర్శన, భక్త్యనుభూతుల గూర్చి గ్రహింపగలరు.

భక్తియోగమున గీతాచార్యుడు శ్రీకృష్ణభగవానుడే భక్తుడిట్టివాడని నిర్వచించియున్నాడు గదా!

"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ॥
సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।
మయ్యర్పితమనోబుద్ధి ర్యోమద్భక్త స్సమే ప్రియః॥

(గీ. 12అ, 13, 14 శ్లో)

సర్వజీవులయెడ ద్వేషము లేనట్టివాడును, స్నేహకరుణా భావములు గలవాడును, మమకారము అహంకారము లేనివాడును, కష్టసుఖములను సమముగా నెంచువాడును, సహనము గలవాడును, తృప్తిగలవాడును, యోగయుక్తుడును, దృఢనిశ్చయుడును (అనగా సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తికి శరణాగతు డయినవాడును) నాయందు భక్తిగలవాడును అయిన చేతనుడు నాకు ఇష్టుడు.

"అనపేక్ష శ్శుచి ర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।
సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్త స్స మే ప్రియః ॥ (12-16)

కోరికలులేనివాడును, త్రికరణ శుద్ధిగలవాడును (ఆలోచన యందును, మాటయందును, చేష్టయందును సమముగా మెలగు వాడును), కార్యాచరణయందు సమర్థుడును, తటస్థుడును, దిగులుజెందనివాడును, సమస్తకార్యములందు కర్తృత్వమును వదలిన వాడును, (అనగా స్వలాభము కొరకు కామ్యకర్మముల వదలిన వాడును), నాయందు భక్తిగలవాడును అయినవాడు నాకు ఇష్టుడు.

"యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి।
శుభాశుభ పరిత్యాగి భక్తిమ్మా య స్స మే ప్రియ॥ (12-17)

ఎవడు సంతోషమున నుప్పొంగడో, ఎవడు అన్యుల ద్వేషింపడో, ఎవడు కష్టమున శోకింపడో, ఎవ్వడు శుభాశుభ భేదముల పాటింపడో, అట్టివాడు భక్తుడు, నాకు ప్రియుడు.

"సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణసుఖదుఃఖేషు సమ స్సంగ వివర్జితః ॥
తుల్య నిందా స్తుతి ర్మౌనీ సంతుష్టో యేనకేనచిత్।
అనికేతః స్థిరమతి ర్భక్తి మా న్మే ప్రియో నరః ॥

స్నేహితులయందును విరోధులయందును, మానావమానము లయందును, శీతోష్ణములయందును, సుఖదుఃఖములయందును, సమభావముగా నుండువాడును, దేనియందును తగుల్పాటు లేనివాడును, ప్రశంసను నిందను సమముగా స్వీకరించువాడును, ఆలోచనాయుక్తుడును, దొరకినదానితో తృప్తిని బొందువాడును, గృహాదులయందు పేరాస లేనివాడును, స్థిరమనస్కుడును, సర్వుల యందు ప్రేమ, భక్తి గలవాడును అయిన ఉత్తమమానవుడు నాకు ప్రియుడు.

ఈ విధముగా ఆలోచనాయుక్తుడై సత్యము నెరిగినవాడును, స్వార్థరహితుడును, సర్వప్రియుడును, సమభావముగలవాడును, కార్యశూరుడును, సేవాతత్పరుడును అయిన సజ్జనుని భక్తుడని గీతాచార్యుడు పేర్కొనెను. కాని కర్మసన్యాసిని, కొన్నిమూఢాచారముల గట్టిగా పాటించువానిని, ముక్కుమూసికొని యేకాంతమున కూర్చొను వానిని, సోమరిని, ఏవో కొన్ని ఆహారపదార్థముల విసర్జించినవానిని, అర్థములేని నియమవ్రతుని, తాంత్రికుని, కట్టు బొట్టు జుట్టు నందు ఒక నియమమును పాటించువానిని, శరీర వ్యాయామయోగముల ప్రదర్శించువానిని భక్తుడని చెప్పలేదు గీతాచార్యుడు.

నిజమైన భక్తునకున్న అనేక సద్గుణములలో మూలమైన ఉన్నత తమ గుణములు సర్వాంతర్యామియయిన ఈశ్వరశక్తికి శరణాగతు డగుట, విశ్వమానవ సౌభ్రాత్వము, స్వార్థరాహిత్యము, కర్మఫలత్యాగ మనునవి. ఈ నాల్గు సంగుణములకును మూలమైనది స్వార్థరాహిత్యము. ఈ దైవగుణమైన స్వార్థరాహిత్యము మానవులందు ఏ నిష్పత్తిలో నుంటే ఆ నిష్పత్తిలో ప్రపంచమున లేక సంఘమున శాంతిసుఖములు వర్ధిలును, భేదభావములు అంతరించును, భయమునకు అశాంతికి తావుండదు.

ఈ భక్తిభావము, ఈ సమాన ప్రేమభావము, ప్రాచీనఋషులు వేదములయందును, ప్రస్థానత్రయమనబడు ఉపనిషత్తులు బ్రహ్మసూత్రములు భగవద్గీతలయందును తేటతెల్లముగా వ్యక్తము జేసినను, ఈ భావరత్నము అడుగంటుచూ, మూఢవిశ్వాసములే పైకితేలుచూ వచ్చుచుండినవి. దీనికి కారణము మానవుని అజ్ఞానము, స్వార్థపరత్వము.

"సర్వేజనాః సుఖినో భవంతు", "ఓం శాంతిః శాంతిః శాంతిః" అను మంగళాశాసనములు వేదములయందు ప్రస్థానత్రయమునందు ఘోషించుచున్నను, ఏలాకో వర్ణభేదములు, పురాణములకాలమున పైకివచ్చి సంఘము యొక్క అనైక్యతకు, వర్ణద్వేషములకు, అస్పృశ్యత

మున్నగు ఘోర సాంఘిక దురాచారములకు మూలమయి తిష్టవేసికొని కూర్చున్నవి.

సత్యకామజాబాలి, అరుంధతి, శబరి, ధర్మవ్యాధుడు మొదలగు ఉదాహరణముల పరికించినయెడల, ఉపనిషత్కాలపు ఋషులును, పురాణకర్తవ్యాసుడును, ఆదికవి వాల్మీకియు వర్ణభేదములను, (జ్ఞానార్జనమునను, భక్తిమార్గమునను) స్త్రీపురుష భేదములను, నిరసించిరనియే తెలియుచున్నది. ఈ వర్ణద్వేషమహామారి దురదృష్టవశమున భారతసంఘమున ఏ కాలమున ఏ పరిస్థితులలో తలదూర్చెనోకదా! ఈ మహామారి తోకనుబట్టి ప్రవక్తలు ఎన్నిమార్లు ఏంత బలీయముగా లాగినను, తోక తెగివస్తున్నదేగాని, దాని శరీరము తల సంఘదేహమును వదలలేదు. బల్లికి తోకతెగినను, మరల యధాప్రకారము పెరిగి పెద్దదగునటులు ఈ మహామారి తోక మరల మరల అంకురించుచున్నది. ప్రజల మానసిక పరివర్తన మేనాటికయినను ఈ దోషమును నిర్మూలింపగలదేమో!

ఆధ్యాత్మిక విషయమున కడవటి నిబంధన అనదగు భగవద్గీతయందు గీతాచార్యుడు ఏచ్చటేని పలానిజాతి పురుషులు, పలానిజాతి స్త్రీలు ఆధ్యాత్మిక గ్రంథ పఠనమునకుగాని, అధ్యాత్మిక సత్యసాధనకుగాని, భక్తిభావమునకుగాని, అర్చనా ప్రార్థనలకుగాని నిషేదింపబడినవారని చెప్పలేదు!

మహామహుడును జగద్గురువును అయిన శంకరాచార్యులవారు మానవసంఘమును సమానపరచి, ద్వేషరహితము జేసి, వారిని ఉజ్జీవింప జేయుటకై వేదాంతము అద్వైతమును ప్రకటించుచున్నదని తనసిద్ధాంతమును వెల్లడించియున్నాడు, సర్వము సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తియే యనియు, ప్రతి మానవుడు ఆ పరాశక్తి అంశమేయనియు, ప్రతిది ఆ పరాశక్తి రూపమే యనియు తెల్పుతూ, "తత్త్వమసి" అను బ్రహ్మసూత్రమును తన అద్వైత సిద్ధాంతమునకు మూలముగా స్వీకరించినాడు. (తత్+త్వం+అసి)

"నీవు అదియే అగుచున్నావు). మానవుల యందు ఇట్టి అభేదమును, భ్రాతృభావమును పెంపొందింపజేసి, వారియందు అడకువ ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము, ఆత్మీయతలను పెంపొందింపజేయ నిశ్చయించిన అద్వైత సిద్ధాంతమును ఆచరించుచుండినవా రనబడు పండితులు అగ్రవర్ణజులు అనబడువారు శంకరాచార్యులు గతించిన కొంతకాలమునకు "అహంబ్రహ్మోస్మి" అను బ్రహ్మసూత్రమునకు వక్రభాష్యము నిచ్చి", నేను బ్రహ్మను, నేనే బ్రహ్మను" అని ప్రకటించు కొనుచు చదువరులుగాని అన్యులను, అన్యవర్ణములవారిని, హీనముగా చూచుట తటస్థించినది, అజ్ఞానమున అన్యులు శాశ్వతముగా పతితు లయిపోయినారు. అట్టియెడ సంఘమునకు ఉద్ధరణ యేమున్నది?

పదియవశతాబ్దిలో వెలసిన ఆదిశంకరునికి పూర్వము ఆరుమొదలు తొమ్మిది శతాబ్దములలో అప్పుడపుడు ద్రావిడదేశమున అవతరించిన ద్వాదశాళ్వారులు వివిధ వర్ణములకు జెందియున్నవారు. అందులో ఒకరు స్త్రీ, ఒకరు పంచమ వర్ణమునకు జెందినవాడు. వేదోపనిషత్తులను బ్రహ్మసూత్రములను వర్గీకరణజేసి, ఆ సూత్రముల వెదజల్లు జ్ఞాననిధి మహాభారతమును రచించియుకూడ, ఆత్మశాంతి తృప్తి ఆనందముల బొందనేరని వేదవ్యాసుడు భక్తిభావమును వెల్లడించుచు భాగవతుల కథలను శ్రీమన్మహాభాగవతమను గ్రంథముద్వారా వెల్లడించియున్నాడు కదా? అందువలన మానవునకు సుఖమును చేకూర్చు చరమోపాయము భక్తియోగమని ఆదిలోనే తెల్పబడినదిగదా! వ్యాసుడు, వర్ణించిన యీ భక్తి భావమును (తనుహృద్భాషల సఖ్యము, భాగవతకథాశ్రవణము, దాసత్వము, వందనము, అర్చన, సేవ, ఆత్మలో నెరుక, భగవత్సంకీర్తనము, ధ్యానము అను ఈ తొమ్మిది భక్తిమార్గములను) అళ్వారులు పాటించి, అనుభవించి, యెల్లెడల ఎల్లప్పుడు ఆనందసముద్రమున నోలలాడు చుండువారు. ఈ నవవిధ భక్తిమార్గములసూచించు ఒక్కపదమును వారు వచించి, చేతనుల నాభావమును పెంపొందించుకొండని వారి

రచనలయందు సూచించియున్నారు. అది వైష్ణవ సంశ్లేషభావము. సర్వాంతర్యామియగు వైష్ణవశక్తితో, ఈశ్వరశక్తితో, సంశ్లేషించి, విశ్వమునందలి శైవరౌద్ర శక్తులను సమముగా తిలకించి, అంగీకరించి, ఆమోదించి, సంస్మరించి, ప్రశంసించి, తాను ఆ వైష్ణవశక్తిలో నొక అణువునని గుర్తెరిగి, తాను వైష్ణవాంశము ననియే శేషశేషి భావమును నెరపుకొనగలుగుటయే వైష్ణవ సంశ్లేషభావము. ఈ భావము శాస్త్రీయ మైనది మనస్తత్వ, సంబంధ ఆనంద జనకమును అగుచున్నది. (Psychological, Emotional and Scientific).

దీనిని ఏ అన్యమతము కాదనగలదు? అన్యమతములయందు ఈ విశిష్ట భావము లేదని యెవ రనగలరు? ఎచ్చటనైనను ఎప్పుడయినను మతము స్వచ్ఛముగా మానవుని నడవడియందు పూర్తిగా ప్రతిబింబింప బడలేదు. మతము తప్పు ఎన్నడును లేదు, దానిని గ్రహింపలేకయో, దానిని పాటింపలేకపోవుటయో అను ఈ వ్యాధి ద్వయము అన్ని కాలములందు అన్నియెడలను మానవుల కొలదిగనో గొప్పగనో పీడించుచునే యున్నది! సత్యము! స్వార్థరహితునకే యీ సత్యము ఎఱుక! పక్షపాతి యీ సత్యమును తన జన్మలో నెరుగజాలడు!

ఆరు మొదలు తొమ్మిదవశతాబ్ది వరకు వెలసిన ద్వాదశాళ్వారుల యొక్క విష్ణుసంశ్లేషభావ ప్రాశస్త్యమును వారి రచనలు, పాశురములు, కీర్తనలద్వారా, పదియవ శతాబ్ది మధ్యకాలమునుండి పదునొకండవ శతాబ్ది మధ్యకాలము వరకు వెలసిన వైష్ణవభక్తులు శ్రీ నాథముని, వారితరువాత వెలసిన వారి మనుమడు శ్రీ యామునాచార్యుడు, గమనించినవారై భక్తి పూర్వకమయినట్టియు వైష్ణవ సంశ్లేషభావమును వర్ణించునట్టియు ద్వాదశాళ్వారుల రచనలనన్నిటిని సేకరించి సంకలన పరచిరి.

యామునాచార్య శిష్యరత్నము శ్రీ రామానుజుడు ద్వాదశాళ్వారుల రచనలయిన ద్రావిడ దివ్యవేదమును గ్రహించిన వాడై, తన

ఆచార్యుడు యామునుడు (ఆళువందార్) స్థూలముగా దెల్పిన విశిష్టాద్వైత సిద్ధాంతపు వెలుగున ఎంతో శ్రమపడి, పరిశోధనలు గావించి, కడకు విశిష్టాద్వైత సిద్ధాంత సత్యమును ప్రపంచమునకు ప్రకటించి, ప్రబోధించి, వ్యాపింపజేసి, స్థిరపరచి కృతకృత్యుడాయెను. ఎట్లు?

పరాశరుడు తన విష్ణుపురాణమున తత్త్వత్రయ జ్ఞానమును వెల్లడించెను. ఈ జ్ఞానమును మహాభారత కర్త వ్యాసుడు భీష్మపర్వమున, నారాయణోపాఖ్యానమున సూచించి యున్నాడు. బోధాయన ఋషిచే రచింపబడిన బోధాయనవృత్తి అను గ్రంథమున ఈ తత్త్వత్రయ జ్ఞానము విపులీకరింప బడినదని తెలిసికొన్న శ్రీరామానుజాచార్యులు (క్రీ.శ. 1017-1137) ఈ గ్రంథమును కాశ్మీరమున, రాజు సహకారముతో పొందెను. ఈ మూలముల నాధారముగా జేసికొని, పరిశీలించి, రామానుజుడు తత్త్వత్రయ జ్ఞానమును వశపరచుకొనెను.

అచిత్, చిత్, ఈశ్వర అనునవి తత్త్వత్రయము. ఈ మూడును కలిసి విశ్వము-విశ్వేశ్వరము అగుచున్నవి. ఈ మూటిని మించి అన్యము విశ్వమునలేదు. విశ్వములోని భౌతిక పదార్థములన్నియు, భౌతిక పదార్థ భాగములన్నియు అనగా పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశముఅను పంచభూతము లన్నియుకలిసి 'అచిత్" అగుచున్నది. ఈ అచిత్తునందున్న ప్రాణులన్నియు "చిత్" అగుచున్నది. ఈ రెంటి యందును, అనగా జడ పదార్థములయందును, ప్రాణులయందును వ్యాపించియున్న సర్వవ్యాపక శక్తి "ఈశ్వర" అనబడుచున్నది. ఇట్టి ఈశ్వరశక్తి యీకారణమున "చిదచిద్విష్ణు" అనబడుచున్నది. అనగా చిత్, అచిత్‌ల రెంటి యందును వ్యాపించిన శక్తి అనిభావము. ఇందుగలడు, అందులేడు (ఇందు గలదు - అందు లేదు) అను సందేహము వలదు. ఈశ్వరశక్తి సర్వవ్యాపియగుటచే విష్ణుః అని చెప్పబడినది. కేవలము వ్యుత్పత్తి అర్థమును బట్టివచ్చిన

మాటయిది. విష్ణుః అన్నమాట, ఒకదైవమూర్తి (Personified God) పేరుగాదు. కేవలము కారణయుక్తమై శాస్త్రీయమునూ అయి ఉన్నది.

సర్వము ఆ యీశ్వరశక్తియే - ఇతరమైన జడపదార్థము, జీవకోటి అసత్యము, మిథ్య (లేక) మాయ అని చెప్పునది అద్వైత సిద్ధాంతము. కాని చిత్, అచిత్, ఈశ్వర అను మూడు తత్త్వములు ఒకటికాదు, అద్వైతమైన ఈశ్వరశక్తి వానియన్నిటిలో ప్రవహించుచున్నను.... ఈ మూటికిని వానివాని ధర్మములున్నవి. ఈ మూడును వేర్వేరు. ఈ మూడును ఆది మధ్యాంతరహితములే - ఈ మూడును అనాదులే - దేని విశిష్టగుణము దానికి ఉన్నది - కాని అద్వితీయమ్మైన అద్వైతమయిన ఈశ్వరశక్తి చిత్, అచిత్ అను రెండు తత్త్వములయందును నిండియున్నది. దానికి రూపనామక్రియలను కలుగుజేయుచున్నది. ఇదియే తత్త్వత్రయం జ్ఞానము. "ఏకమేవాద్వితీయం" అను బ్రహ్మసూత్రము నిర్వచించు ఈశ్వర తత్త్వజ్ఞానము. ఏకం+ఏవ+అద్వితీయం = అది ఒక్కటే, అద్వితీయ మయినది. అది నీయందు ఉన్నది. కాని అది నీవుకాదు. అది సర్వము నందును ఉన్నది, కాని సర్వజడ పదార్థము అదికాదు... తత్త్వమసి="నీవే అది" కాదు. దాని అంశమునీవు; దాని అంశము నీలోనున్నది.... అని వివరించుటచే, తత్త్వత్రయ జ్ఞానమువలనను, ఏకమే వాద్వితీయం - అనుబ్రహ్మ సూత్రమువలనను, మానవుడు ఈశ్వరశక్తికి శరణాగతుడగుట తటస్థించుచున్నది - "అహంబ్రహ్మాస్మి" అను బ్రహ్మ సూత్రము యొక్క దివ్యమార్గము అపమార్గముగామారి, అహంభావమునకు దారిదీసి దివ్యఅద్వైత సిద్ధాంతమును కుంటుపరచినది. ఈ అపమార్గముల నుండి (అనగా ఆదిశంకరుడు భావించి, బోధించిన దానికి అన్యముగా తయారైన దానినుండి) తప్పించి, చేతనులను దివ్యమార్గమునకు త్రిప్పుటకు శ్రీరామానుజుడు శ్రమించెను.

శాస్త్రీయమయిన తత్త్వత్రయ సత్యజ్ఞానమును మూలముగాగొని శ్రీరామానుజుడు విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రబోధించెను. ఈ శాస్త్రీయ

జ్ఞానమును ప్రబోధించి, మానవులను మూఢవిశ్వాసముల నుండి తప్పించి, వారిని శాంతికాముకులుగా, ఆనందమయులుగా తయారుచేయుటకు మునిత్రయమువారు (శ్రీనాథముని, యామునాచార్యులు, రామానుజాచార్యులు) ఆళ్వారుల విష్ణుసంశ్లేషభావమును, భక్తిమార్గమును, ప్రబోధించిరి.

నిజమైన జ్ఞానము గలవానికే, ఆత్మజ్ఞానము గలవానికే, భక్తిమార్గము కలుగును - జ్ఞానము భక్తి వేర్వేరుగాదు. ఈ విషయము ఆదిశంకరుని లక్ష్మీనృసింహ స్తోత్రము, వారి భజగోవింద శ్లోకములందు కావించిన సంబోధనలలో వెల్లడియగును. జ్ఞానయోగము మేలా భక్తియోగము మేలా అనుప్రశ్న బాలునిది, అజ్ఞానిది. భక్తిభావము చాల ఉన్నత సోపానము, సోపానపరంపరలో.... "స్వధర్మజ్ఞానవైరాగ్య సాధ్యభక్త్యైక గోచరమ్ నారాయణపరబ్రహ్మ" అని పెరియాళ్వారు ఆనతిచ్చియున్నారు. మానవుని పరిపక్వస్థితికి తీసికొనిపోవు నాలుగు మెట్లుగల నిచ్చెనయందు స్వధర్మము మొదటిది; భక్తికడపటిది - మధ్యలో జ్ఞానమున్నది.

ఈ భక్తి అనబడునది ధ్యాననిష్ఠ, తపస్సుకాదు. ఇది విష్ణు సంశ్లేష భావము, విశ్వమానవసోదరత్వము అవుతుంది.

గీతాశ్లోకము (12-12)ను గమనింపుము:-

**శ్రేయోహిజ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే।**
**ధ్యానాత్కర్మఫల త్యాగస్త్యాగాచ్ఛాంతి రనంతరమ్॥**

మూఢ అభ్యాసమునకంటే జ్ఞానముగొప్పది. జ్ఞానముకంటే ధ్యానము (తపస్సు) గొప్పది. ధ్యానముకంటెను కర్మఫలత్యాగము గొప్పది. ఏలయనగా త్యాగబుద్ధి వలననే సంఘమునకు, ప్రపంచమునకు ఆనందము (శాంతి) చేకూరును - అని భావము.

కావున, జ్ఞానము మెట్టు, ఎక్కడనున్నదో పరికింపుము. కర్మఫల త్యాగము అన్నిటికంటె గొప్పదని వచించినాడు గీతాచార్యుడు.

త్యాగబుద్ధి యెట్టివానికి కలుగుతుంది? స్వార్థరహితునకు. స్వార్థరాహిత్యము ఎవరికి కలుగుతుంది? విశ్వమానవ సౌభ్రాత్ర భావముగలవానికి. ఇది యెట్టివానికి కలుగుతుంది? విష్ణు సంశ్లేషభావము, శరణాగతి, భక్తిభావములు గలవానికి. కావున నిజమైన భక్తి అనునది శరణాగతి భావము - స్వార్థరహితసేవ అవుతుంది.

కావున శ్రీమద్రామానజాచార్యులవారు తత్త్వత్రయ జ్ఞానముచే ప్రతిపాదింపబడిన తనవిశిష్టాద్వైత సిద్ధాంతముచే శరణాగతి - స్వార్థరాహిత్యము - సంఘసేవ భావములను ప్రబోధించెను.

ఈ భావములు విష్ణుసంశ్లేష భావమున ఉదయించును. విష్ణు సంశ్లేష భావము మీదు మిక్కిలి మానవునకు నిత్యానందమును చేకూర్చును.

భక్తులెల్లరు ఈ విష్ణు సంశ్లేషభావమున ఆనంద పరవశులైయుండి రనుటకు ప్రహ్లాదుడు, భీష్ముడు, విభీషణుడు మొదలగువారు తార్కాణము. భారత, భాగవత, రామాయణాది పురాణేతిహాసములం దెందరెందరో భక్తుల చరితములున్నవి గదా! వారెల్లరు స్తవనీయులే.

"ఈ విష్ణు సంశ్లేషభావమనునది శైవము కాదు" అనుట పొరపాటు. ఇదివరలో చెప్పబడిన విధమున శైవము, రౌద్రము అను అంశలు రెండును సర్వవ్యాపితమయిన వైష్ణవశక్తి యొక్క అంశలే. విశిష్టాద్వైత సిద్ధాంతమనునది తత్త్వత్రయ జ్ఞానమునకు సంబంధించినది. తత్త్వత్రయ జ్ఞానమును కాదనువారెవరు? తత్త్వత్రయ జ్ఞానసత్యముననుసరించి ఆలోచనాయుక్తుడగు మానవుడు విశ్వశక్తికి శరణాగతుడవుతాడు. శైవుడనబడువాడు విశ్వశక్తికి శరణాగతియగువాడే. సర్వవ్యాప్తమయిన ఈశ్వరశక్తిని శుభముగా భావించి, అధిదైవతము శివుడు అనుమూర్తిగా భావించి ఆరాధించువారు శైవులు. ఈ సర్వవ్యాప్తమయిన వైష్ణవశక్తి అనంతకళ్యాణ గుణప్రపూర్ణమూర్తిగా శ్రీమన్నారాయణమూర్తిగా భావించినవారు వైష్ణవులు. కాని యీ శైవముగాని, యీ వైష్ణవముగాని శరణాగతి భావమును

వెలయింపజేయు విశిష్టాద్వైత సిద్ధాంతమునకు సంబంధించినవే. సిద్ధాంతము ఒకటే - ఆయావ్యక్తులు ఊహించుకొనిన దేవతాస్వరూపములు వేరు. ఇందు భేదములకు, కలహమునకు తావులేదు. ఒకటి శైవవిశిష్టాద్వైతమయితే మరియొకటి వైష్ణవవిశిష్టాద్వైత మవుతుంది. అంతవరకే, తత్త్వత్రయ జ్ఞానముగలిగి, ఈశ్వరశక్తికి శరణాగతి యగుట ప్రధానముగాని, తానుదైవశక్తిని ఏ రూపమున ఊహించుకొని ధ్యానించుచున్నాడో అనునది ముఖ్యముకాదు, దైవశక్తిని శివుడుగా, శ్రీమన్నారాయణునిగా భావించుటకుతోడు, వివిధములయిన అసంఖ్యాక రూపములనాపాదించి దైవము నారాధించువారున్నారు. అందువలననే ఆదిశంకరాచార్యులవారు అద్వైత సిద్ధాంతమును ప్రబోధించిరేగాని, మానవులు ఊహించుకొని దైవారాధన చేయుక్రమములలో ప్రవేశించలేదు. అందువలన శాస్త్రీయముగా అద్వైత సిద్ధాంతము విగ్రహారాధనను ప్రోత్సహింపకున్నను, ఆదిశంకరుడు దానిని వ్యతిరేకించలేదు. ఏ మతమును కాదనలేదు; ఏ ఆచారమును కాదనలేదు - తన అద్వైత సిద్ధాంతమునే ప్రబోధించినాడు, షణ్మతస్థాపన కూడచేసినాడు. ఆదిశంకరుడట్టి వాడుకాగా, అన్యులు తరువాతకాలమున, వారిదివ్య సిద్ధాంతమును ప్రక్కకునెట్టి ఆదిశంకురుడు శైవుడు అనిప్రచారము చేసినారు. ఆయన మనమనుకొను విధమున శైవుడుకాడు, వైష్ణవుడుకాడు - అద్వైతి. మరణమునకు ముందు తల్లికోర్కెననుసరించి వైష్ణవుల తిరుమంత్రమనబడు అష్టాక్షరీ మంత్రమును ఆమె చెవులో వేసినాడట!

కాని శ్రీమద్రామానుజుడు విశిష్టాద్వైతి, వైష్ణవుడుకూడాను. వైష్ణవము శైవమునకు వ్యతిరేకమయినది కాదు. వైష్ణవములో ఒక అంశము శైవము, శుభస్కరమైనది. విష్ణుసహస్రనామ స్తోత్రమున శివ, శంకర పదములున్నవి గదా! సర్వాంతర్యామి యయిన ఈశ్వరశక్తిని అనంతకల్యాణ గుణపరిపూర్ణముగా (అనంతకల్యాణ గుణపరిపూర్ణునిగా) భావించి, సంశ్లేష పడవలసినదని నుడివిన

యామునాచార్య సూత్రమును రామానుజుడు తన గద్యత్రయమున విపులీకరించియున్నాడు. ఈ సంశ్లేష భావము, తదనుజనిత పరమానందము ఆళ్వార్లు పొందిన అనుభవ విశేషము.

కావున శ్రీరామానుజుడు ప్రబోధించిన విశిష్టాద్వైత సిద్ధాంతాంశముల నొకసారి పరిశోధించిన యీ సత్యానుభవములు మనస్సునకు రాగలవు: సర్వంతర్యామియగు ఈశ్వరశక్తికి (వైష్ణవశక్తికి - విష్ణువునకు - శ్రీమన్నారాయణమూర్తికి) శరణాగతి చేసినవాడు స్వార్థరహితుడగును - అట్టివాడు లోకకల్యాణార్థమై కర్మఫలత్యాగియై సతతము కర్మయోగి గానుండును. ఇందు నైతిక, సాంఘిక విలువలు (Ethical and Social) ఉన్నవి. అట్టి కర్మఫలత్యాగి అనంతకల్యాణ గుణప్రపూర్ణునితో (భగవంతునితో) సంశ్లేషించి జీవించుటచే, అతడు ఆనందమయుడుగా నుండును. ఇవి ఆధ్యాత్మిక ఆనందోద్రేక అనుభవములు (Spiritual and Psychological experience). ఇది విశిష్టాద్వైత సిద్ధాంతము యొక్క విశిష్టత.

వైష్ణవ సంశ్లేషభావమును సక్రమముగా గ్రహింపతగియున్నది. ఈ సంశ్లేషభావమనునది సర్వులకు ఉండునట్టిదే! ఇది మానవుని మనస్తత్త్వగుణము (Psychologial and emotional aspect). సామాన్యమయిన భాషయందు "ఊహించుట" (Imagination) అని అంటాము.

ఈ ఉదాహరణముల గమనింపుడు - 4, 8 సంవత్సరముల మధ్య వయస్కులయిన బాలబాలికలు కలిసిమెలసి, స్త్రీ పురుష భేదమునెరుగక కొన్ని ఆటలనాడు కొనుచుందురు. ఒక నాలుగు సంవత్సరముల అమ్మాయి తానుతల్లిగా భావించుకొని, ఒక చిన్న రబ్బరుబొమ్మనో, కొయ్యబొమ్మనో తనబిడ్డగా భావించుకొని, ఆబిడ్డకు స్నానము చేయించడం, ఇతరులు ఆకార్యక్రమమున సహకరించడము, ఆ బిడ్డకు తనకు ఇంకను ఏర్పడని స్తనములనుండి పాలు ఇచ్చినట్లు ఊహించి ఆటలాడుకొనుచుండడం, ఈ లోపల

నొకసారి బిడ్డకు ముద్దిడుట, ఒకచో లాలిపాట పాడుట, నిద్రపుచ్చుట, బిడ్డయేడ్చుచున్నదని కోపించి ఆ బిడ్డను తిట్టుట మొదలగు అనేక చేష్టలతో ఆడుకొనుచుండటము మనము చూచెదము. తటాలున ఎవరైనను పెద్దవారు సమీపించిన, ఆ బొమ్మను విసరి క్రిందవేసి సిగ్గున పరుగిడును. ఇట్టి ఆటలు ఎన్నో పసిబిడ్డలు ఆడుట మనము చూచియున్నాముగదా! ఆ నాలుగు సంవత్సరముల పసిబిడ్డ బొమ్మతో సంశ్లేషపడినపుడు దాని ఆనందమును, అనుభవమును గమనింపుడు. బిడ్డ బొమ్మను తనబిడ్డగానే చూచినది తాత్కాలికముగా - కాని తరువాత విసరివేసినది - అది బొమ్మేగదా అని - ఇది సంశ్లేషభావము. బిడ్డపిచ్చిగా ప్రవర్తించినదని అంటవా? కాదు.

అట్లే ఆళ్వారం, నిజమైన భక్తుడం, అనంతకల్యాణ గుణపరిపూర్ణునితో సంశ్లేషించి ఆనందిస్తాడు. భగవంతుని అతడు కోరేకోర్కెలేదు; భగవంతుడతని కోర్కె తీర్చేది లేదు. స్వార్థరహితునకు కోర్కెలు లేవుగదా! భక్తుడు కోర్కెలు లేనివాడని అన్నాము కదా! ఈ ఆత్మానందమే, భగవచ్ఛక్తి ప్రాపుకోరిన వానికి, లబ్ధమయ్యేది.

భక్తుడనబడే ఒకానొకడు తాను ఈశ్వరశక్తిని ఊహించిన విధముగా తన అధిదేవతను తాను కలలోనో, లేక మెలకువలోనో మతిభ్రమ వలననో, తన హృదయోద్రేక భావమున చూచినానని చెబుతాడు. "నీవెక్కడ దేవుని చూచావు? నాకు చూపు ఆ దేవుని" అని మనము అతనితో వాదులాడనవసరము లేదు. అతని మనః ప్రవృత్తి అట్టిది; అతని విశ్వాసము అట్టిది, అతని ఊహ అట్టిది ...... అతడు తనదైవమును చూచినది సత్యము (మానసిక తత్త్వసత్యము Psychological truth) ... కాని దైవము అతనికి ప్రత్యక్షముకాలేదు. ఇది సత్యము.

కుమారుడు, ఏకైకపుత్రుడు, యువకుడు దూరదేశమున విద్య నభ్యసించుచున్నాడు. తల్లి పలుమారు ఒంటరిగా, ఏకాంతముగా, నిశ్శబ్దముగా పరుండి కుమారుని తలచుకొని, తనమనో నేత్రములతో

వానిని చూస్తుంది. సంశ్లేషపడుతుంది. తనలోతాను చిరునగవు నవ్వుతుంది. దూరముగా నున్నాడే యెప్పుడు వస్తాడో అని మరల కన్నీరు కారుస్తుంది. ఇక్కడ తల్లి కుమారుని విగ్రహమును తనమనస్సున చూచినది. ఇది సత్యము. కాని కుమారునకు ఇది అంతయుతెలియదు. అతడు ఆమెకు ప్రత్యక్షముకాలేదు.

అట్టి కుమారుడు బహుకాలమునకు ఇల్లు చేరగా, తల్లి ఆనంద బాష్పములతో వానిని ఆలింగనము జేసికొని, "నాయనా - నీవు చాలమార్లు కలలో కన్పడ్డావురా - చాలాకులాసాగా ఉన్నట్లు అగపడ్డావురా... ఒరే, ఒకసారి, నీవువివాహము చేసికొన్నట్లు అగపడ్డావురా", అని తల్లిఅంటే, తల్లిప్రేమకు, ఆమె భ్రమకు ఆశ్చర్యపడిన విద్యావంతుడయిన కుమారుడు, "అట్లనా! అమ్మా! నేను కలలో కనపడ్డానా! నీ కోడలితో కలిసి అగపడ్డానా? ఎక్కడ నీకోడలు? పిచ్చి తల్లీ" అని అంటాడు.

ఇవియన్నియు సంశ్లేషభావములకు ఉదాహరణములు. కాని యిట్టి సంశ్లేషభావము వలన మానవుడు పొందు అనుభూతి, ఆనందము అనిర్వచనీయము.

ఒకతల్లి తన యేకైక కుమారుడు ఐదు సంవత్సరముల వానిని పోగొట్టుకొన్నది. ఆమె దుఃఖము అనిర్వచనీయము గదా - కాని యేకాంతముగా తన పడకపై పరుండి, ఆ బిడ్డ తన ప్రక్కనే పండుకొన్నట్లు సంశ్లేషించి, తన అనుభవములనన్నిటిని మానసికముగా అనుభవించుచూ, మరల తెలివికివచ్చి దుఃఖిస్తుంది. జ్ఞాపకము తెచ్చుకొనుచూ, గతించిన ఆనందమును, గతించిన దుఃఖమును మరల మరల ఈ తల్లి మానసికముగా అనుభవిస్తుంది. అనుభవింప ప్రయత్నిస్తుంది. ఈ అనుభవము ఆంగ్ల కవియెకడు "Sweet Sorrow" అన్నాడు - "మధురావేదన".

సంశ్లేష భావమట్టిదని చెప్పుచున్నాను. ఈ సంశ్లేష భావము కొన్నియెడల పరమానందము, కొన్ని యెడల తృప్తి, శాంతిని

కలుగుజేస్తుంది. ఇది మానసిక తత్త్వశాస్త్రము బాగుగా తెలిసికొన్న వానికి బాగుగా అవగాహనకు వస్తుంది.

అనంతకల్యాణ గుణపరిపూర్ణమును, త్రిభువన సుందరమును అయిన వైష్ణవ (సర్వవ్యాపిత) శక్తిని శ్రీమన్నారాయణమూర్తిగా భావించి, సంశ్లేషించి, ఆనందసముద్రమున స్నానమాచరించుచుండినవారు అళ్వారులు. కులశేఖరాళ్వారు తనయొక్క తిరుమొళిలో శ్రీరాముని కుమారునిగా భావించి, తాను దశరథునిగా భావించి, సంశ్లేషభావమున ప్రేమను పాశురములద్వారా వ్యక్తముచేసినారు. ఈ పాశురసంపుటి ద్రావిడ భక్తి సారస్వతమున నొకదివ్య ఖండము. పెరియాళ్వారు తాను యశోదాదేవిగాను, శ్రీకృష్ణుని తన కుమారునిగాను సంశ్లేషపడి, తల్లి బిడ్డకు స్నానము నుండి అలంకరణ నుండి, అన్నపానాదులనిడి నిద్రపుచ్చినంత వరకు గల కార్యక్రమమును, దివ్యపాశురములతో తిరువెుళిని ప్రకాశింపజేసినాడు. అండాళ్ (గోదాదేవి) తాను గొల్లభామగా భావించి, శ్రీకృష్ణుని తనప్రియునిగా భావించి, తన ప్రియదైవముగా భావించి, సంశ్లేషపడి, తిరుప్పావై ప్రబంధమును రచించియున్నారు గదా? ఇట్లు అళ్వారుల దివ్య సంశ్లేష భావములు, దివ్యానుభవములు, దివ్యానందముల గూర్చి, విపులముగా చదువరులు నాచే రచింపబడిన "అళ్వారుల దివ్య వైభవము" అను గ్రంథమును పఠించి తెలిసికొని ఆనందింపగలరు!

విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదకుడు శ్రీరామానుజునకు (క్రీ.శ. 1017 - 1137) పూర్వము (6 మొదలు 9వ శతాబ్దములవరకు) వెలసిన వైష్ణవ భక్తులు, ద్వాదశాళ్వారులచే రచింపబడిన కొన్ని సంశ్లేష భావ ప్రబంధములను, శ్రీరామానుజుని కాలముననే వారి శిష్యులు కొందరిచే రచింపబడిన భక్తిసార సారస్వత ఖండములను, శ్రీరామానుజుని తరువాత తనసిద్ధాంతావలంబకులగు భక్తులు కొందరు రచించిన భక్తిసార ప్రబంధములను, ఏరి, క్రోడీకరించి, "శ్రీ భక్తిసారము" అను పేర నేను వెలుగనకు దెచ్చుచున్నాను. ఇవియన్నియు ద్రావిడ

ప్రబంధములే. సంస్కృత భాష కొలదిమంది పండితులకే వశమైయున్నందునను, అదియు నేదోఒక కులమునకు సంబంధించియేయున్నందునను సంస్కృతమును అన్ని కులముల వారు పఠింపకూడదనియు, వేదములు అనగా సంస్కృత వేదములను అన్ని వర్ణములవారు పఠింపరాదనియు కొన్ని సంఘ దురాచారములు ప్రబలియున్న కాలమున, ఆ సంస్కృతము దెలిసిన కొలదిమందియు భావమునెరుగక సంస్కృత శ్లోకముల వల్లె వేయుచున్నందునను, దేవాలయములలో సైతము చదువు వానికిని, వినువానికిని అర్థముగాని సంస్కృత శ్లోకములు పఠింపబడుచున్నందునను అర్థముగాని చదువు వ్యర్థమని భావించిన మహాకోవిదులు, విజ్ఞానవంతులు, మేధావులు, దయాసముద్రులు, విశ్వమానవ సౌభ్రాత్రము నెరపు ఆళ్వారులు, వారు గొప్ప సంస్కృత పండితులయ్యును, సర్వులు గ్రహించుట కొరకు, వారు జన్మించి మసలిన ద్రావిడ దేశమున భాషింపబడు తమిళము, లేక, ద్రావిడము అను భాషయందు దివ్యభక్తి ప్రబంధముల వెలయింపజేసిరి. వారి విచక్షణా జ్ఞానము, వారి లోకకారుణ్యము అనిర్వచనీయములు!

ఈ ద్రావిడ భక్తిసార సారస్వత ఖండములను "నిత్యాను సంధానము" అను గ్రంథము నుండి గ్రహించిన నేను, ఆంధ్ర పాఠకులు గ్రహించుటకు గాను ప్రతి ద్రావిడ పాశురము యొక్క భావమును తెనుగున వ్రాసి, దాని క్రింద విశదమయిన వివరణమును ఒసంగి యున్నాను. ఈ వివరణము, సత్యము, విశిష్టాద్వైత సిద్ధాంత లక్షణములను ఆధారముగా జేసికొని, యివ్వబడినది. వైష్ణవ విశిష్టాద్వైత భక్తజనులుగానున్న ఆంధ్రులు ఈ గ్రంథమును జదివి, గ్రహించి, భక్తిభావమును పెంపొందించుకొని నాశ్రమను ధన్యముచేయుదురు గాక! ఒకమాట చెప్పాలంటే, సర్వులు దైవశక్తి సర్వవ్యాపితమని నమ్మువారు గాన, పదము యొక్క వ్యుత్పత్త్యర్థము ప్రకారము, అందరు అనగా ప్రపంచ ప్రజలందరు వైష్ణవులే - విశిష్టాద్వైతము విశిష్టముగా శాస్త్రీయమైనదిగావునను, అది భక్తిని సేవాతత్పరతగా నిర్వచించునదిగా

వునను, ఈ సిద్ధాంతమును స్వీకరింపని వారెవరుందరు? కావున ఆంధ్రమున రచింపబడిన యీ "శ్రీ భక్తి సారము" ఆంధ్రము నెరిగిన పాఠకులనందరిని ప్రభావిత మొనరింపగలదని విశ్వసిస్తూ ఉన్నాను. ప్రస్తుతము యీ గ్రంథము, "శ్రీ భక్తిసారము" - మొదటి భాగము, అయిదుగురు ఆళ్వార్లచే రచింపబడిన ప్రబంధముల భక్తిసారమును చదువరులకు రుచిచూపును.

శ్రీ వైష్ణవ విశిష్టాద్వైత సిద్ధాంతము గీతాచరమ శ్లోకమునందును, తిరుమంత్రమునందును ప్రతిబింబించుచున్నదిగావునను, శ్రీ తిరుమలేశుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి గీతాచరమ శ్లోకార్థ (తిరుమంత్రార్థ) ప్రదాతగా, తన ఉపాయ అభయస్తములతో సప్తగిరీశుడుగా వెలుగొందు చున్నాడుగావున్న, ఈ గ్రంథమును స్వామికి అంకితమొనరించుట తగునని తలంచితిని. భక్తిపూర్వకముగా ఈ గ్రంథమును తిరుమలేశుని పాదపద్మములకంకితముగావించి ఆనందించుచున్నాను.

సుమారు 34 సంవత్సరముల కాలము నిస్స్వార్థముగా ఉపాధ్యాయ వృత్తి సేవలందించి పాఠశాల, కళాశాలలయందు బిడ్డలకు విద్యాబోధన నల్పిన నేను, అనవరతము వారు సద్గుణవంతులగుటకే యెక్కువ కాలము వినియోగించినానుగాన, ఇపుడు "రిటయర్" అయిన తరువాత ప్రజానీకమునకు మతసత్యము, ప్రేమ, భక్తి అనునవి సేవాభావములని ప్రబోధించుటకే యీ గ్రంథముల రచియించితిని. నాగ్రంథముల సారమును సర్వులు గ్రహించుటయే నాయేకైక ధ్యేయము.

తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకవర్గము వారు నాచే రచింపబడిన విశిష్టాద్వైత సిద్ధాంత సౌరభముగల గ్రంథములను "స్వీడు ప్రచురణలు"గా స్వీకరించినందులకు వారికి నా ధన్యవాదములనర్పించు చున్నాను. విశిష్టాద్వైత సిద్ధాంత గ్రంథములను, వైష్ణవ భక్తిగ్రంథములను, అచ్చొత్తించి, ప్రచురించి ఆ

గ్రంథములను భక్తులకు, ప్రజలకు అందజేయుట నిజముగా దేవస్థాన పాలక వర్గము వారి విధ్యుక్త ధర్మము కూడా. విశిష్టాద్వైత సిద్ధాంతముచే ప్రతిపాదింపబడు తిరుమంత్రార్థ ప్రదాత తిరుమలేశుడుగాన, తిరుమలేశుడు దివ్యాచార్యుడు. తిరుమలేశుని ఆలయము ఒక దివ్య విశిష్టాద్వైత పీఠము. కావున తిరుమల తిరుపతి దేవస్థానములవారు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారకులుగానుండుట ధర్మము.

శైవము, వైష్ణవము అనునవి ఆధ్యాత్మిక సిద్ధాంతములుకావు. ప్రతిదియును ఒక నమ్మకము, ఒక ప్రార్థనా విధానమును, ఒక అర్చనావిధానమును కలిగియున్నది. ఇవి పరస్పర విభిన్నములుగానున్నను, పదముల అర్థమును బట్టి, ఏకేశ్వర సర్వవ్యాప్తము కల్యాణగుణములను బట్టి, వైష్ణవము, శైవము అనుపదములు పరస్పర సంబంధమునే కలిగియున్నది. అవి యెంత మాత్రమును పరస్పర విరోధములుగావు. అందువలన శైవభక్తి గ్రంథములను వైష్ణవ దేవాలయకర్తలు ప్రచురించినను తప్పులేదు. కాని వనరులు గలిగిన వైష్ణవాలయములు విశిష్టాద్వైత, వైష్ణవ సౌరభముల వెదజల్లు సారస్వతమును విరివిగా ప్రచురించకున్న, అదిలోపమే అగును. దేవాలయమున జరుగు సర్వదివ్య కార్యక్రమములను అర్థయుక్తముగా సంశ్లేషభావముతో భక్తులు ఆనందింపగలుగటకు శాస్త్రీయమత జ్ఞాన సౌరభము అవసరము, ఈ విషయమును గుర్తించిన తిరుమల తిరుపతి పాలకవర్గమువారు, ఈ విశిష్టాద్వైత, వైష్ణవ భక్తి గ్రంథములను విరివిగా ప్రచురింపబూనుట యెంతయో ప్రశంసింపతగిన విషయము. ఈ నూతన కార్యక్రమమున ఈ సిద్ధాంతము శాస్త్రీయముగా దేశమంతటను, విదేశములయందును ప్రబలి, మానవాభ్యుదయమునకు దోహదము చేయగలదు. నిజము చెప్పవలయునంటే, యిట్టి సారస్వత సేవను తగిన విధముగా మనదేశమున దేవాలయములు గాని, మతపీఠములుగాని చేయనందుననే అర్థయుక్తమైన సిద్ధాంతమునకు బహుళప్రచారము సన్నగిలినది. ప్రజల విశ్వాసమువలననే సిద్ధాంతము, అట్లా,

అతుకుకొనియున్నదని చెప్పాలి. ప్రచురణల ప్రచార ప్రభావమున సిద్ధాంతము ఉజ్జ్వలమగుగాక!

విషయ గ్రహణమే ప్రధానమని భావించినవాడనై యీ గ్రంథ రచనము నందు సాధ్యమైనంతవరకు సులభ పదజాలమునే వాడితిని; దార్శనిక విషయ రచనగావున కొన్నియెడల సాంకేతిక సంస్కృత పారిభాషిక పదముల నుపయోగించుట అనివార్యమయినది. మూలవిషయము ద్రావిడ భాషకు సంబంధించినదగుటచే కాలది తమిళపదములు అరుదుగా వ్యార్థములకొరకు ఉపయోగించితిని; కాని అట్టి పదముల ప్రక్కన బ్రాకెట్స్‌లో సమమగు ఆంధ్రపదముల జేర్చియున్నాను. పదసంధులను, శకట లఘురేఫ భేదములను పాటింపలేదు. పాఠకులు ఈ భాషా విషయముల గమనింతురు గాక.

ఈ గ్రంథమును బహుప్రజానీకోపయోగము కొరకు (దేశవిదేశ ప్రజానీకము కొరకు) ఆంగ్లమున రచించుటకు త్వరలో ప్రయత్నింప బోవుచున్నాను. ఇదివరలో రచించిన శ్రీరామానుజదివ్యవైభవము, వాస్తవము, ఆళ్వారుల దివ్యవైభవము అను గ్రంథములకు ఆంగ్లరచనల గావించియున్నాను. శాస్త్రీయమైన విశిష్టాద్వైత సిద్ధాంత సర్వజనా మోదమును కోరుచు ఆంగ్లమున రచింప సంకల్పించితిని.

ఈ గ్రంథములను బహుళ జనులు చదువు అవకాశములు, సదుపాయములు కలిగిన, అయ్యది ఈ గ్రంథకర్తకు తృప్తిని ఆనందమును చేకూర్చును.

భక్తాంఘ్రిరేణువు, భక్తజన విధేయుడు

**తిరువాయిప్పాటి రాఘవయ్య**

# 1. తిరుప్పళ్లి యెళుచ్చి
## (శ్రీరంగనాథుని మేలుకొలుపు)

“తిరుప్పళ్లి యెళుచ్చి” అను నామముగల పది తమిళపాశురముల ప్రబంధము శ్రీ తొండరడిప్పొడి ఆళ్వారుచే రచింపబడినది.

తిరు = శ్రేష్ఠమయిన, పవిత్రమైన; ప్పళ్లి = పడక; యెళుచ్చి = మేలుకొలుపు. పడుకనుండి అనగా నిద్రనుండి లేపుటకు గావింపబడిన మేలుకొలుపు పాటలు అని భావము. నిద్ర అనునది ఇక్కడ ధ్యానము. పడుక అనునది శేషశయనము.

“తిరుప్పళ్లి యెళుచ్చి” అను నీ దివ్య ప్రబంధమును “శ్రీరంగనాథ సుప్రభాతమ్” అని అనవచ్చును. శ్రీరంగమున స్వామి దైనిక కైంకర్యములు గర్భగుడియందు “తిరుప్పళ్లి యెళుచ్చి” పఠనముతో ప్రారంభమగును. ఈ ప్రబంధకర్త తొండరడిప్పొడి ఆళ్వారు. ఇట్లు అచంద్రార్కమగు కీర్తిని గడించిన వారైరి - మృతజీవులు, సతతస్మరణీయులు.

ఇది శ్రీవేంకటేశ్వర సుప్రభాతమును బోలినది. ప్రాచీనకాలమున రచింపబడిన యీప్రబంధము ననుసరించియే శ్రీవాదిభీకర మహా గురువర్యులు శ్రీవేంకటేశ్వర సుప్రభాతమును రచించినారు; ఇది సంస్కృతమున నున్నది, తిరుప్పళ్లి యెళుచ్చి తమిళమున రచింపబడినది. తిరుప్పళ్లియెళుచ్చి అనేక వైష్ణవ దేవాలయములందు సుప్రభాత స్తోత్రములో చదువబడుచున్నది.

ప్రబంధములోని భక్తిసారమును గ్రోలుటకు పూర్వము, ప్రబంధకర్త తొండరడిప్పొడి ఆళ్వారుల దివ్యచరిత్రమును ఇచట కొలదిగా సందర్భోచితముగా స్మరించుకొందము.

దివ్యప్రబంధమున దెల్పినవిధముగా వీరు ద్రావిడదేశమున (దక్షిణ పాండ్యదేశమున) కలియుగాది 298, ప్రభవనామ సంవత్సర, మార్గళి, జ్యేష్ఠానక్షత్రమందు శ్రీవిష్ణుమూర్తి యొక్క వైజయంతీ మాలాంశమున వైష్ణవ శోళియరులకు మండంగుడి యనుగ్రామమున జన్మించిరని వైష్ణవభక్తులు విశ్వసింతురు.

తల్లిదండ్రులు వీరికి గావించిన నామకరణము విప్రనారాయణుడు. ప్రారంభమున నామకరణ మహోత్సవ సందర్భమున నారాయణ అని పిలిచిరి. గ్రామమున వారిది యేకైక గౌరవ బ్రాహ్మణ కుటుంబముగాన, ఈ నారాయణ నామధేయము ఇతరులకును ఉండుట వలన ఈ బిడ్డయెడ గ్రామవాసులకున్న ప్రేమగౌరవముల కారణమున ఈ పిల్లవానిని అందరు విప్రనారాయణుడని పిలుచుచుండిరి.

విప్రనారాయణుడు బాల్యముననే వేదవేదాంగది సకల శాస్త్రములు సులువుగా నభ్యసించెను - ఏకసంధాగ్రాహిగావున... మరియు ఆళ్వారు లందరు స్వాచార్యులు గదా....

విప్రనారాయణుడు సమస్త శాస్త్రవిజ్ఞాన సంపన్నుడై, సర్వులు సంతోషించి, ప్రశంసింపఁదగిన సద్గుణరాశియై, ఉభయ కావేరీ మధ్య దివ్యప్రదేశ మయిన శ్రీరంగమున శేషశయనుడగు శ్రీరంగనాథుని సేవింప నపేక్షించి, యౌవన దశయందే శ్రీరంగక్షేత్రమునకు అరుదెంచి, శ్రీరంగనాయకుని కన్నులార, మనసార దర్శించి, సేవించి, పెరియపెరుమాళ్లను (దేవదేవుని) దివ్యరూప సౌందర్యాదులతో సంశ్లేషించి, మిగుల భక్తియుక్తులతోనుండిరి. (పెరియ=పెద్ద, గొప్ప; పెరుమాళ్లు = స్వామి, దేవుడు; పెరియపెరుమాళ్లు= దేవదేవుడు - శ్రీరంగనాథుడు)

విప్రనారాయణుని నివాసస్థలము దేవాలయపు పుష్పతులసీ వనమే. ఆయన శ్రీరంగనాథునకు దాస్యంబొనర్ప వలయునని తలచి, స్వామియర్చనకు తులసిని ప్రేమించినవాడై, అనుదినము స్వామికి తులసి మాలలను సమర్పించుచుండెను.

ఇట్లు దివ్యజీవితమును గడుపునట్టి వీరు దురదృష్టవశమున దైవభక్తురాలుగా శ్రీరంగము వచ్చియు తొట్రుపాటున మరల ప్రాపంచిక సుఖములు గోరిన దేవదేవియను వేశ్యకన్యా సౌందర్యముచే ఆకర్షింపబడినాడు. మానసికముగా చెడినను, శారీరకముగా చెడలేదు. ఈ లోపల ఆమెపైనున్న ప్రేమవ్యసనమున భగవత్కైంకర్యమును విడనాడి, కొంతకాలము మానసవ్యసనమున మునిగియుండెను. కొలది దినములలోనే విషయాంతరమందలి రుచిని అతినీచమని యెరిగి వ్యసనము నుండి గట్టునపడి, జరిగనదానికి యెంతో చింతించి, తాను మైలపడ్డానని భావించి, (అవశ్యమను భోక్తవ్యం కృతంకర్మ శుభాశుభమ్= చేసిన కర్మఫలితము మంచిదైనను, చెడ్డదైనను అనుభవించి తీరవలసినదేగదా అని భావించి) తనగుణమునకును, తనపేరునకును తన ఆత్మకును కళంకము గలిగినందులకు ఎంతయో పరితపించి, దుఃఖించి, సర్వపాపప్రాయశ్చిత్తార్థము భగవత్ భాగవత శ్రీపాదతీర్థమును స్వీకరించి, పరిశుద్ధుడై, తొండరడిప్పొడి (భక్తాంఘ్రిరేణువు) బిరుదాంకితుడై, పెరియపెరుమాళ్ళే తనకు సర్వమని, తనకు సర్వవిధబంధువని, తిరుమంత్రానుసంధానముచే ధ్యానించి, ఆ మంత్రవైభవమును చర్చచేసి, ఆనందించి, తిరుమంత్రార్థనిష్ఠుడై, తనకు పెరుమాళ్లు అనుగ్రహించిన తదీయ శేషత్వమును ప్రార్థించి, అట్టి అర్థవిశేషములను సకలచేతనులు తెలిసికొని ఉజ్జీవించునట్లు, పెరియపెరుమాళ్లు శ్రోతగను, తాను వక్తయునై, "తిరుమాలై", "తిరుప్పళ్లి యెళుచ్చి" అను రెండు ప్రబంధములను అనతిచ్చినవారై, కరుణచే లోకమును ఉద్ధరించి, సుఖింప జేసిరి. ఆళ్వారులందరు సర్వసంగపరిత్యాగులే.

(తొండ = భక్తునియొక్క, రడి = పాదములయొక్క, ప్పొడి = ధూళి. తొండరడిప్పొడి = భక్తులపాదధూళి - దీనికి సమానార్థకమైన సంస్కృత సమాసము "భక్తాంఘ్రిరేణువు". భక్త = భక్తునియొక్క, అంఘ్రి = పాదముల యొక్క, రేణు = దుమ్ము, రజము. ఈ బిరుదములను

తనకై తానే స్వీకరించిన విప్రనారాయణుని శరణాగతిభావమును, దాసానుదాసత్వ భావమును ఏమని పొగడగలము?

ఇట్లు విప్రనారాయణుడు, తరువాత భక్తులచే తొండరడిప్పొడి ఆళ్వారు అని ప్రశంసింపబడెను. ఆళ్వారు అనగా భక్తియొక్కలోతు నెరిగిన వాడు అని భావము. భక్తి అను సముద్రమున నెల్లప్పుడూ పరమా నందమున ఈదువాడు అని అర్థము.

వైష్ణవభక్తులు వీరిదివ్య చరితమును. వీరు గావించిన లోకసేవను, ఈ విధముగా కీర్తింతురు :-

శ్లో॥ కోదండే జ్యేష్ఠనక్షత్రే।
మండంగుడి పురోద్భవం।
చోళోర్వ్యాం వనమాలాంశం।
భక్త పద్రేణు మాశ్రయే॥

శ్లో॥ త మేవ మత్వా పరవాసుదేవం
రంగేశయం రాజవదర్హ ణీయమ్।
ప్రాబోధకీం యో కృతసూక్తిమాలాం।
భక్తాంఘ్రిరేణుం భగవంత మీడే॥

ప్రస్తుత మిచట "తిరుప్పళ్లి యెళుచ్చి" అను ప్రబంధముయొక్క భావమును, భక్తిని, విష్ణుసంశ్లేషభావమును గమనించి తరింతముగాక!

తిరుప్పళ్ళి యెళుచ్చిలో భక్తుడు ప్రభాతవేళ స్వామిని పడుకనుండి మేలుకొలుపుతాడు.

శ్రీరంగనాథులయందు కేవలము అర్చాప్రపత్తియే చేయక, సాక్షాత్ పరమపదనాథుడే యని భావించి, (personified diving god before him) సంశ్లేషించి, మేలుకొలుపుటయను ఈ ప్రబంధము, ద్రావిడ దివ్య ప్రబంధమున (నాలాయిర ప్రబంధమున - 4000 శ్లోకసముదాయ మయినది) ఒక భవ్య భక్తి సారస్వతమణి.

ప్రతి ద్రావిడ పాశురము యొక్క తాత్పర్యమును మొదట బేర్కొని, తరువాత వివరణముల నొసంగుచున్నాడను. భక్తు లతిశ్రద్ధతో పఠించి, భావమును గమనింపవలయును. ప్రతి ఆళ్వారును తన దివ్య ప్రబంధములకు కడపట ఫలశ్రుతిని బేర్కొను చంద మేమన - ఈ ప్రబంధమును భావయుక్తముగా పఠించి, భావమును జీవితమున పాటించినయెడల - అని యుండును. పూర్వపు సంస్కృత ప్రబంధముల వెనుక పరిపాటిగా ఫలశ్రుతిని దెల్పునపుడు - దీనిని పూర్తిగా ఒకసారి చదివిన, సగము చదివిన - పాతిక చదివిన - ఒక్క శ్లోకము చదివిన, శ్లోకపాదము చదివిన - పాదార్థము చదివిన - అయాఫలము లభించును - అని సామాన్యంగా తెలుపబడియున్నది. ఆలోచించి చూడ హాస్యాస్పదమేకదా! ఈ మార్గమున బడి, భావమును లెక్కింపక, కొన్ని శ్లోకములు కంఠస్థముజేసి కొన్ని వర్గములవారు పండితులుగా గర్వులుగా మనుచుండి, సంఘనాశనమునకు కారకు లయిరి అందువలననే, ఆ దౌర్భాగ్యస్థితి నెరిగిన ఆళ్వార్లు సంస్కృతపండితు లయ్యును, అందరు గ్రహింపగలుగటకు వేదార్థమును తమిళపాశుర - కీర్తనలలో వ్రాసిరి. మరియు పఠించి అర్థము చేసికొమ్మని హెచ్చరించి యున్నారు. సర్వులకు జ్ఞానజ్యోతిని జూపుటకు మొట్టమొదటిసారిగా నమ్మాళ్వారు నాల్గు వేదములను తమిళములోనికి తర్జుమా చేసినాడు. సంస్కృత వేదములను అన్యభాషలోనికి తర్జుమా చేయుటకు ఇదియే ప్రథమము ఇది 8వ శతాబ్ద్యాంతమున జరిగినది.

ఈ హెచ్చరికతో తిరుప్పళ్లియెళుచ్చి ప్రబంధమును పాఠకులు పఠింతురు గాక!

**1. మొదటిపాశురము :**

"ఓ శ్రీరంగనాథా! తూర్పున సూర్యుడు ఉదయించెను. దట్టములగు చీకటులు అంత మొందినవి. భగవదారాధనకు అనుకూలమగు మంచి ఉదయకాల మిది: పుష్పములు విరివిగా

వికసించినవి. పుష్పించిన పూలు మకరందమును స్రవించుచున్నవి. దేవతలు, రాజులు గుంపులు గుంపులుగా, వారి వాహనములగు గజతుర గాదులయొక్కయు వాద్యముల యొక్కయు ధ్వనులు సముద్రఘోషమువలె శబ్దింపగా, సేవార్థులై వచ్చి యెదురుగా ద్వారమున నిండియున్నారు, స్వామీ! కావున దేవరవారు మేల్కాంచి, వీరలకు సేవచేసి, కైంకర్యమును అంగీకరింపుము - ఓ రంగనాయకా!"

వివరణము: సూర్యుడు తనస్వరూప సిద్ధికొరకు దీపమై వచ్చి, తూర్పున ఉదయించినాడు. తన విధ్యుక్త ధర్మమును నెరవేర్చుకొన్నాడు. తన స్వరూపసిద్ధిని పొంది కృతకృత్యు డయినాడు.

వెలుపలి చీకటిని పోగొట్టుటకు సూర్యుడుదయింపగా, లోపలి చీకటియగు అజ్ఞానమును పోగొట్టుటకు, స్వామీ! మీరు మేల్కొనగూడదా!

స్వామీ! మిమ్ముల దర్శించి పూజించుట కొరకు దేవతలు, రాజులు వచ్చియున్నారు. వీరలకు కృపచేయుము - అన్నప్పుడు వక్త, ఆళ్వారుకుడా వారిలో కలిసియున్నారు. వీరలు అన్నపుడు సామీప్యము, కలయిక వెల్లడి యగుచున్నది. ఆళ్వారు తాను దాసానుదాసునిగా భావించుకొంటాడు, తనకంటె తక్కువ వ్యక్తి యింకొకడున్నాడని ఆళ్వారు భావింపజాలడు ఏలన వాడి సౌభ్రాత్రమట్టిది.

దేవతలు ఉత్తమోత్తములు. రాజులు మానవనాయకులు. వీరుగాక తనతోగూడా కలిపి అనేకానేక భక్తులు అరుదెంచియున్నారని ఆళ్వారు వచించుచున్నాడు.

దేవతలను వారు ఊర్ధ్వలోకవాసులని, మానవులనువారు భూలోకవాసులని, రాక్షసలనువారు పాతాళలోకవాసులని పురాణములు కొన్ని తెల్పుచుండును. రాక్షసుడయిన కంసుడు, మానవుడయిన శ్రీకృష్ణుడు, రాక్షసుడయినా రావణుడు, మానవుడయిన శ్రీరాముడు ఒకే కాలమున ఒకే ప్రాంతమున ఒకే భూమిపై ప్రవర్తిల్లిరని

అవే పురాణములు వచించుచున్నవిగాన, వేరే పాతాళలోకమున్నదని చదువరులు ఊహింపగలరా? ఇక దేవతల విషయమును కూడా మీరే ఊహింపుడు. దేవతలు శ్రీరంగనాథుని అర్చావతారమును సేవింప వచ్చినా రన్నప్పుడు అసలు - స్వామి విషయ మేమైనట్లు? సజీవుడుగా నీ యెదుట నిలబడిన నీ తండ్రిని లెక్కింతువా లేక అదే సమయమున ఆయన ఛాయాచిత్రమును లెక్కింతువా? ఆయన గతించి పోయిననో, లేక ఆయన దూరదేశమున నున్ననో, అపుడు అతని ఛాయాచిత్రమును వాస్తవముగా లెక్కింపవలసినదే! కావున ఇచట శ్రీరంగనాథుని ద్వారమున దేవతలు నిలిచియున్నారంటే భావమేమి? నీ సందులో పుష్కల జలపూరితమైన బావి యుంటే, నీవు నీటికొరకు బిందె తీసికొని ప్రక్కయింటి కరుగుదువా? ఆలోచింపుము. ఎవరైనను దేవతలుగాని, మానవులుగాని, రాక్షసులుగాని అవాఙ్మానసగోచరమగు సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తిని చూడజాలరు. ఆ శక్తి యొక్క అనంతకల్యాణ గుణములతో సంశ్లేషించి ఆనందింప వలసినదే - శ్రీరంగనాథుని అర్చావతారము సర్వవ్యాపిత ఈశ్వరశక్తికి, దాని అనంతకల్యాణ గుణములకు ప్రతీకముగావున అది సర్వులకు సేవ్యముగదా!

దేవ, మానవ, రాక్షసు లనువారిని ఉత్తమ మధ్యమ అధములని వరుసగా భావింప వలసియున్నది. స్వర్గ, మర్త్య, పాతాళము లనునవి మానవుని యొక్క ఉన్నత, సామాన్య, అధమ మనః ప్రవృత్తులను వరుసగా సూచించుచున్నవి. ఈ పదములకు భర్తృహరి యిట్టి భావముల నిచ్చియున్నారు. గీతయందును గుణత్రయ విభాగయోగమునను, దైవాసుర సంపద్విభాగయోగమునను, శ్రద్ధాత్రయ విభాగయోగమునను, ఇట్టి భావములే వ్యక్తము చేయబడినవి.

సూర్యోదయము, ఉదయకాలము, వికసించిన పుష్పములు మనోహరముగా వర్ణింపబడి ప్రకృతిశోభను రమణీయముగా ప్రదర్శించుచున్నవి. వాహనముల నడకలోని శబ్దములు, భజనకీర్తనల

మేళతాళముల దివ్యశబ్దములు తెరపిలేని సముద్రఘోషమువలె నున్నవని చెప్పుట యెంత యుచితమో గమనింపగలరు. ఇది యొక సారస్వత ఖండము. చదువునపుడు ప్రకృతి సౌందర్యముల చూచినట్లును, దివ్యఘోషముల వినినట్లును భక్తుడయిన పాఠకుడు సంశ్లేషపడవలసినదే!

అనేకులు ద్వారమునందు నిలువబడి యున్నారు; వారి వెనుక నేనును నిలువబడియున్నా నను భావము వ్యక్తమగుటకు వారియెడ సానుభూతిని వెల్లిడించు విధమున "స్వామీ, రమ్ము, సేవల గొనుము" అని ఆళ్వారు వచించుటచే, వచ్చినవా రందరు అతిక్రమశిక్షణలో నిలువబడి యున్నారని వెల్లడి అగుచున్నది. ఆళ్వారు శేషశేషి భావమున, స్వామితో సాన్నిహిత్యము నేర్పరచు కొనగలిగి, తనప్రార్థనలతో స్వామిని తట్టి లేపుచున్నాడా!

ఎంత రమణీయము! మొత్తము మీద తొండరడిప్పొడి ఆళ్వారుని యొక్క విష్ణుసంశ్లేష భావము, వారి దివ్యానందము వెల్లడియగుచున్నవి. ఈ భక్తిభావములను పాఠకులు అలవరచుకొనవలయును. ఇది దైవార్చన, దైవసేవ, దైవారాధన, దైవప్రార్థనలయొక్క ముఖ్య ఫలితమైయుండ వలయును!

ఈ రమణీయత, భక్తిరమణీయత, ప్రకృతి రమణీయతలు, ఆళ్వారు యొక్క ప్రతిపాశురమున వ్యక్తమగును. కావున మొదటి పాశురభావమును సమగ్రముముగా గ్రహింపగలుగుదురేని, ఇతర పాశురము లన్నియు సులభగ్రాహ్యములగును.

**2. రెండవ పాశురము :**

"ఓ శ్రీరంగధామా! మొల్లల దివ్యపరిమళముతో, ప్రాభాత ప్రాచ్యమందమారుతము వీచుచున్నది. పద్మపుష్పచయమునందు నిద్రించు చుండిన హంసమిథునములు రెక్కలలోనిమంచును విదిలించుకొనుచు నిద్రలేచినవి, హాయిగా మందమందవీచికల

యందు మెల్లమెల్లగా సంచరించుచున్నవి; పరస్పరము సుప్రభాతమును భాషించుచున్నవి. మొసిలియొక్క బిలమువంటి - నోటదగిలి శ్రమపడుచున్న గజేంద్రాళ్వాను యొక్క మహా దుఃఖమును బాపిన, ఓ స్వామీ! మేల్కొనుము".

వివరణము : శ్రీరంగనాథ దేవాలయమునకు తూర్పుదిక్కున బ్రహ్మాండమయిన నందనవనమున్నది. పూలమొక్కలకు తోడు తులసీ వృక్షరాజములున్నవి. ఉదయకాలమున ఈ నందనవనశోభ, సౌరభములు వర్ణనాతీతముగదా! తూర్పుగాలి అన్నపుడు ఈ నందనవనము నుండి వీచు మందమారుత మని గ్రహింపవలయును. ఇక అట్టి తూర్పు గాలి యొక్క సువాసనలనేమని చెప్పగలము? ఆళ్వారుల వర్ణనాకౌశలము నేమందుము? మరియొక రమణీయ రహస్యము. ఈ నందనవనమే మన తొండరడిప్పొడి ఆళ్వారుల నివాససదనము. అచ్చటి పూలమొక్కలకు నీరుపోయుట, మొక్కలకు పాదులు చేయుట, పుష్పములను తులసిని గోసి స్వామికి సమర్పించుట ఆళ్వారుల నిత్య దివ్యకృత్యము.

హంసమిథునముల నిద్రాస్థలములు, అవి నిద్రమేల్కొను విధము, వాని సుప్రభాత భాషణములు ఎంత రమణీయముగా వర్ణింపబడినవో గమనింతురుగాక- చదువర లొకక్షణము నందనవనమున తిరుగుచు పరిమళవాయువుల గ్రోలినట్లును, మరుక్షణమున సరోవరము గట్టున నిలువబడి హంసల తిలకించునట్లును సంశ్లేషపడకుందురా! (సర్వేంద్రియములకు గగుర్పాటు గలిగించెడి తమిళపద్యకావ్యమిది - Sensuous Poetry).

అళ్వారు, గజేంద్ర మోక్షకథను, తగువిధమున మనజ్ఞప్తికి దెచ్చుచున్నాడు. భగవంతుడు భక్తవత్సలుడు, భక్తులకు సులభుడు అని గుర్తుకు తెస్తూ ఉన్నాడు, ఆళ్వారు, భక్తులుగా నుండుడని ప్రోత్సహించుచున్నాడు. గజేంద్రాళ్వానుని విరోధిని నిరసించుటకు, వస్త్రాదులు వీడుటయు గమనింపక, అతిత్వరగా స్వామి గజప్రాణావనోత్సాహియై వచ్చెగదా, అని మనకు గుర్తుకుదెస్తాడు ఆళ్వారు:

ఇచ్చట ఇంద్రియము లనబడు మొసళ్లనోట బడియుండు, సంసారులను గజేంద్రులను రక్షించుటకు స్వామి రావలయునని ఆళ్వారు కోరుచున్నాడు.

ఇక్కడ గొప్పవిషయ మేమన తన్ను రక్షింపుమని ఆళ్వారు స్వామిని వేడుటలేదు; తోటిమానవుల నుద్ధరింపుమని ప్రార్థించుచున్నాడు. ఆళ్వారుల స్వార్థరాహిత్యము, విశ్వసౌభ్రాత్రము, దయసానుభూతులు అనిర్వచనీయములు నిజమైన వైష్ణవుని ప్రార్థనలిట్లేయుండును. గీతయందు, తెల్పబడిన మోక్ష సన్న్యాసయోగము యొక్క తాత్పర్య మిదే. ఈ భావముతోనే శ్రీరామానుజుడు తిరుమంత్రార్థమును సర్వులకు బహిరంగపరచినారు. ఎంతటి ఆధ్యాత్మిక భావము, ఆధ్యాత్మిక సేవలను ఆళ్వారు వ్యక్తము చేసినాడో భక్తులు గమనింతురుగాక!

నిజమైన భక్తుడు, తన సంశ్లేషభావమున, బాహ్యస్మృతిని గోల్పోయినవాడై, ప్రకృతితో నిచట కలిసిపోతాడు; మొల్లలవాసనల గ్రోలును; నందనవనమున మానసికముగా సంచరించును; మందమారుతమును అనుభవించును; తెల్లనితామరల చూచును; హంసగమనముల గాంచును, హంసధ్వనుల వినును; భయంకరమైన మకరమును జూచును; భక్తుడయిన గజేంద్రుని విపత్తును జూచును; గజేంద్రుని యొక్క - "నీవే తప్ప నితఃపరం బెఱుగ, మన్నింపందగుఁ దీనునిఁ, రావే ఈశ్వర" - అనుమాటలు వినును; సిరికింజెప్పక, శంఖచక్ర యుగమును చేదోయి సంధింపక ఏ పరివారములేక, యొంటరిగా, శ్రీకుచోపరిచేలాంచనమును కూడా వీడక, గజేంద్రుని రక్షించు ఉత్సాహముతో వచ్చుచున్న హరిని జూచును ... ఇది సంశ్లేషభావము - ఆళ్వారుల కుండునది - భక్తులు కలిగియుండ వలయునని ఆళ్వారు కోరునదియు నిదియే.

ఆళ్వాఁర్ అనగా భక్తుడు అని అర్థము. ఆళ్వార్ అనగా భక్తియొక్క లోతునెరిగినవాడు.

### 3. మూడవ పాశురము :

"ఓ శ్రీరంగధామా! సూర్యప్రకాశము అంతటను వ్యాపించినది. నక్షత్ర ప్రకాశము సంకుచితమైనది. చంద్రుని వెలుగు తగ్గినది. చీకటి అంతరించిపోయినది. తోపులలో పోకచెట్ల యొక్క మొగ్గలు వికసింపగా, ఆ సువాసనలతో గూడి ప్రాతఃకాల మందమారుతములు వీచుచున్నవి. అత్యంత ప్రకాశమానంబగు సుదర్శన చక్రమును ధరించుటకు తగిన విశాలహస్తములు గల స్వామీ! మేల్కొనుము."

వివరణము: మొదటి పాశురమున సూర్యుడుదయించె నని తెలుపబడినది. ఈ పాశురమున సూర్యప్రకాశ మంతటను వ్యాపించినదని ఆళ్వారు వచించుచున్నాడు. కాలగతిని చూపుచున్నాడు. వాస్తవముగా ఉదయకాలమున మొదట అరుణకాంతు లగపడడము, తరువాత సూర్యబింబము తొంగిచూడడము, వెంటనే సూర్యుని వెలుగులు నలుదెసల అలముకొనడము అను ఈ మూడు అంశములు అతిత్వరగా సంభవించినట్లుండును. ఉదయకాల కర్తవ్యముల చక్కగా నెరవేర్చువాడు ఈ శీఘ్రకాలగతిని మిక్కిలి చురుకుగా గమనిస్తాడు. ఇచ్చట స్వామి మేల్కొన వలయునని, అనగా ద్వారకవాటములు త్వరగా తెరువబడవలయునని ఆళ్వారు ఆతురత పడుచున్నాడు. దర్శకుల యొక్క, భక్తులయొక్క ఆతురతను వ్యక్తము జేయుచున్నాడు. నిజముగా స్వామి సుప్రభాతసేవకు వేకువనే అరుదెంచి, మూయబడిన ద్వారముల వెలుపల నిలువబడియుండు భక్తులు "ఇంకను ద్వారములు తెరువబడలేదే, సమయమయినదే" అని ఆతురత పడుచుందురు.

నక్షత్ర ప్రకాశము సంకుచిత మయినది చంద్రుని వెలుగు తగ్గినది. చీకటిపోయినది అని మరల మరల పేర్కొనుటచే, సూర్యుని వెలుగు పూర్తిగా ప్రాకిన దని దృఢపరచుచున్నాడు, ఆళ్వారు, పోకమొగ్గల వాసనలను ఆస్వాదించుచున్నాడు, ఆళ్వారు. ఉదయకాలపు చిరువాయువులలో, ప్రకృతిసౌందర్యాంశముల నెల్లనుచూచి,

ఆనందించి, అనుభవించి, ఆస్వాదించి, కడకు ప్రకృతితో సంశ్లేషపడి, పరమానందమును పొందగల దివ్యరసికుడు ఆళ్వారు.

సుదర్శనచక్రము కాలమునకు సంకేతము - కాలచక్రము ఎల్లప్పుడు దొర్లుచుండునుగదా! కాలము ఆదిమధ్యాంత రహితము, కాలమను ఆయుధమున ఈశ్వరశక్తి తనలీలలను సాగిస్తూ ఉంటుంది. ఇట్టి కాలతత్త్వము నెరిగిన ఆళ్వారు, జరుగుచున్న అన్ని సంఘటనలను దైవమాయయే అని స్వీకరించును. భక్తునకు కాలము సుదర్శనమే. అతడు సర్వమును మంచిగా చూస్తాడు, మంచిగా గమనిస్తాడు, మంచిదిగానే కోరుతాడు - Optimist - క్షేమకాంక్షి, వైష్ణవశక్తిని అనంత కల్యాణగుణ పరిపూర్ణముగా దలచు ఆళ్వారునకు కాలము సుదర్శనమే. మందమారుతమును స్వీకరించి ఆనందిస్తాడు; ప్రచండచక్రవాతమును జూచి అది భగవల్లీల అని అద్భుతపడతాడు. సరోవరమును తిలకించి ఆనందిస్తాడు. తుపాను కాలమున ఘోరముగా ఘోషించుచున్న సముద్రమును జూచి దైవశక్తి యిట్టిదని అద్భుతపడి ఆనందిస్తాడు. ఇది ఆళ్వారుల తత్త్వము వైష్ణవ అనంతకల్యాణగుణములతో సంశ్లేషపడి పరమానందమున నుండుట.

### 4. నాల్గవ పాశురము :

"ఉన్నతములును, వసివియును అగు ఎనుములను, మేయుటకు విడుచునట్టి గోపబాలికలు గావించు వేణునాదములును, పచ్చిగరిక మేయు వృషభముల కంఠహారములలోని గంటల ధ్వనులును అన్ని దెసలకు వ్యాపించినవి. మధుపానము జేయుచున్నటి తుమ్మెదలు చెదరిపోయినవి, స్వామీ! సజ్జన బాధక మగునట్టి రావణాసురుని వంశమును నశింపజేసినవాడును, దర్శనీయమగు కోదండమును ధరించినవాడును, బ్రహ్మాది దేవగణ నియామకుడును, విశ్వామిత్ర యాగ సంరక్షణంబొనర్చి, అవబృథస్నానము చేయించిన వాడును, శత్రు నిరసన మందు అధికబలము గలట్టివాడును అయిన

రామా! పురుషోత్తమా! సాకేత నిలయా! శ్రీరంగశాయీ! శయ్యనుండి లేచి కటాక్షింపుము".

వివరణము : ఎనుములు మంచుగడ్డిని మేయుట, గోపబాలుర వేణునాదములు, వృషభములు గడ్డిమేయునెడ ఉల్లాసముగా మెడలు త్రిప్పుట, పరుగిడుట, వాటిమెడ పట్టెడలలోని గంటలు మ్రోగుట అనునవి శ్రీకృష్ణుని జన్మస్థలమగు, లేక బాల్యనివాసమగు గోకులము యొక్క ప్రాతఃకాల దృశ్యములు, ధ్వనులు. ఆ పవిత్ర తిరువ్వాయప్పాడు (పవిత్రమయిన గొల్లపల్లె, తిరు = పవిత్రమయిన; వ్వాయప్పాడు = గొల్లపల్లె) గ్రామవాసిగా తా నొక గోపబాలకునిగా ఆళ్వారు సంశ్లేషించి ఆనందించుచున్నాడు!

మరల, వెంటనే, అయోధ్యారాముని అనగా, రావణాసుర వధాంతమున సీతాసమేతముగా పట్టాభిషిక్తుడయిన అయోధ్యరాముని తలచి, శ్రీరాముడు గావించిన మహాకార్యము లన్నిటిని ఒకసారి తలచి, పురుషోత్తము డయిన శ్రీరామునితో సంశ్లేషించి ఆనందిస్తాడు మన ఆళ్వారు!

వైష్ణవ సంశ్లేషమున నున్న ఆళ్వారునకు, పురుషోత్తముడయిన శ్రీరాముడును, గీతాచార్యుడయిన శ్రీకృష్ణుడును, ఇంకెందులకు? దశావతారములన్నియు, వెయ్యేల? సర్వంతర్యామి ఈశ్వరశక్తి యొక్క అనంతకల్యాణగుణరూపము లన్నిటికిని, అర్చావతారమయిన శ్రీ రంగధాముడు సంకేతమై యున్నాడు. అందువలన ద్వాదశాళ్వారులు శ్రీరంగనాథుని అన్ని దివ్యనామముల సంబోధించి యున్నారు. అదే విధమున శ్రీ తిరుమలేశుని దర్శించి కీర్తించిన నల్వురు ఆళ్వార్లుగాని, ఆచార్యులుగాని, నంబులుగాని తిరుమలేశుని సర్వదివ్యనామములతో సంబోధించి, కీర్తించియున్నారు. అర్చావతారము యొక్క విశేష మిట్టిది. అర్చావతారమును అవాఙ్మానసగోచరమగు వైష్ణవ శక్తికి సంకేతముగా భక్తుడు భావించి సంశ్లేషించును. విగ్రహ ప్రబోధము ఎంతమహనీయమో, యెంతటి సత్యమో, శాస్త్రీయమో,వాస్తవమో

గ్రహించునది. (అన్యమతస్థులు సైతము అంగీకరింపవలసినదే! విగ్రహ సంకేతమును గ్రహింపని పామరుల వలనను, సహనములేని పరమతస్థులవలనను సత్యము క్రిందికి పోతుంది - ఉద్ధరించుటకు ఇట్టి రచనలు అవసరమని గ్రంథకర్త మనవి చేయుచున్నాడు.

సూర్యోదయకాలమున తుమ్మెదలు పుష్పములపై బడి, పుష్పాడి మకరందముల గ్రోలును. కొంచెము ఎండ పడగానే ఝుంకార నాదములు చేయుచూ చెల్లాచెదరవుతవి. ఇచ్చట మధుపానము చేయుచుండిన తుమ్మెదలు చెదరి పోయినవని వర్ణించుటలో, సమయము నిర్వచింపబడినది. ఆళ్వారు యొక్క ప్రకృతి పరిశీలనము, వారి వర్ణనాకౌశలము, వారి భాషలోని సాంకేతిక లక్షణములు అద్వితీయములు గదా! ఇక ప్రకృతితో, గోపబాలకులతో, అయోధ్యా రామునితో వారి సంశ్లేషభావము నేమని వర్ణింపగలము?

### 5. ఐదవ పాశురము :

"సర్వస్వామియును, శ్రీవిభీషణాళ్వాను యొక్క కైంకర్యము నంగీకరించుచూ, శ్రీరంగస్థలమందు నివసించునట్టి అస్మత్స్వామీ! పూదోటలలోని పక్షులు మేల్కాంచి, శబ్దించుచున్నవి. రాత్రి గడిచిపోయినది. దైవారాధన సమయ మయినది. సముద్రఘోషము అంతటను వ్యాపించినది. తుమ్మెదలు ఝుంకార మొనర్చుచున్నవి. నానా విధపుష్పమాలికలను మీపాదారవిందముల యందు సమర్పించుట కొరకు దేవతలు వచ్చియున్నారు. కావున కరుణించి, మేల్కొనుము స్వామీ!"

వివరణము: శ్రీరంగనాథుని అర్చావతారమును సర్వస్వామికి (universal Lording force) పురుషోత్తము డయిన శ్రీరామునకు సాంకేతికముగా భావిస్తాడు ఇచట ఆళ్వారు. విభీషణాళ్వాౕ అనగా భక్తుడయిన విభీషణుడు. దైవారాధన సమయమును, దైవారాధన క్రమమును నిర్ణయించునది భక్తుడే. భక్తుడు కోరిన విధమున

కటాక్షించవలసినది స్వామివారు! ప్రేమపాత్రునితో స్నానకాల మయినది, స్నానము చేయుము; ఇక భోజనమునకు రమ్ము, ..." అని చెప్పినట్లుగా ఉన్నవి యీ ప్రియోక్తులు. మన యీ ఆళ్వారు యొక్క నిత్యకృత్యము స్వామికి తులసిమాలల సమర్పించుట; ఇదివారి నిత్యదైవకైంకర్యము; తాను తులసిమాలల బట్టుకొని ద్వారము వద్ద నిలువబడి స్వామి దర్శనమును నిరీక్షించుచున్నాడు; ఇతర భక్తులనేకులు పుష్పమాలల బట్టుకొని నిలుచుండి యుండుటయును కూడ ఆళ్వారులు అవలోకించియున్నాడు. అందువలన పుష్పహార సమర్పణకు దేవతలు వచ్చియున్నారని ఆళ్వారు అంటాడు. పురాణములలో వర్ణింపబడినట్లు ఉన్న వైకుంఠమున శ్రీమన్నారాయణుని మ్రోల నిలువబడి పుష్పహారములతో నున్న ఇంద్రాది దేవతలను జూచినట్లు ఆళ్వారు సంశ్లేషించుచున్నాడా, లేక శ్రీరంగమే కదా వైకుంఠము, ఇచ్చటనేగదా వైష్ణవ ఈశ్వరశక్తి సాంకేతిక రూపముగా, విగ్రహరూపముగా అవతరించి యుండేది, అందువలననే గదా ఉత్తమోత్తములును దైవ సమానులును అగు భక్తులు పుష్పమాలికలతో నిలువబడియున్నారని చూచి ఆనందిస్తూన్నాడా ఆళ్వార్లు యోచింపుడు. రెండును దివ్యాను భవములే.

తెల్లవారుజాము, సూర్యోదయపూర్వ, ఉత్తరసమయములను ఆళ్వారు ఊహించుకొని ప్రకృతి రమణీయ దృశ్యములు, శబ్దములతో సంశ్లేషపడి ఆనందించుట దివ్యానుభూతి. భక్తున కత్యంతము ఆనందమును గొలుపునది సంశ్లేషభావమే. సామాన్య మానవునకును తనపూర్వ సంతోషానుభవములతో మరియొకసారి సంశ్లేషపడినపుడు కలుగు ఆనందము కూడా దివ్య మయినది.

అందువలన జ్ఞానము నుండి మనము బడయగల త్రివిధానందా నుభూతు లిట్లుండును:-

1) అర్థమెరుగని భగవన్నామముల నుచ్చరించుట, (2) అర్థమెరిగి భగవన్నామ సంకీర్తన చేయుట, (3) అర్థమెరిగిన భగవన్నామములతో తదనుగుణ భావపరంపరలతో, ప్రకృతి సౌందర్యముతో సంశ్లేషించుట.

వీనియందు పరమానందము నొసగునది మూడవది. ఇట్టి అనుభవమునకు నోచుకున్నవారు ఆళ్వారులు. పరమభక్తులు, ఈ కారణమున ఇట్టి ప్రబంధముల చదివి, భావములతో దృశ్యములతో సంశ్లేషపడుట పాఠకుల కెంత ఆనందదాయకమో గమనింపుడు.

కైంకర్యము సేవ. కైంకర్యము కింకరుని ధర్మము. విష్ణుకింకరుడు, విష్ణుకైంకర్య మను పదముల నిట్లే గమనింపవలయను. విష్ణుకైంకర్య మనగా విష్ణువుకు చేయు సేవ.

విష్ణువు సర్వాంతర్యామి, ప్రాణుల అంతరాళముల వెలయు ఈశ్వరశక్తి కావున, వైష్ణ కైంకర్యమన్నపుడు సర్వజీవులయెడ చూపదగిన సేవాభావము అని గమనింపవలయును. విశిష్టాద్వైత సిద్ధాంతమున భక్తి అనేది సేవ అవుతుంది. అందువలన ఆళ్వారు తన్ను దాసానుదాసునిగా భావించుకొంటాడు. తన్ను తాను భక్తాంఘ్రిరేణువు అని పిలుచుకుంటాడు గాని, దైవాంఘ్రిరేణువని పిలుచుకొనడు. కావున విశిష్టాద్వైత సిద్ధాంతము సేవాభావమును ప్రేరేపించునని గమనింపవలసినది. "అహం బ్రహ్మాస్మి" అను సూత్రమునకు పెడర్థము నాపాదించి, గర్వమును జెందడు, నిజమైన భక్తుడు; తన దాసానుదాసత్వమునే వెల్లడించుకొంటాడు.

**6. ఆరవపాశురము :**

"శ్రీ రంగధామా! మహేంద్రధికులగు ద్వాదశాదిత్యులును, ఏకాదశ రుద్రులును, మయూర వాహనుడగు సుబ్రహ్మణ్యుడును, మరుద్గణములును, అష్టవసువులును, వారి వారి రథములు, వాహనములతోను, గాననాట్యములతోను, వచ్చి, మహామేరు పర్వత సంకాశంబగు

కోవెలయందు దేవరవారి కటాక్షమును నిరీక్షించుచున్నారు. వీరల నందరిని అనుగ్రహించుటకు మేల్కొనుము స్వామీ!"

వివరణము: విశ్వమంతయు వచ్చియున్నదని అంటాడు ఆళ్వారు, విశ్వములోని సర్వమునకు స్వామిగదా సర్వంతర్యామి శక్తి? ఈ శక్తి అవాఙ్మనసగోచరము; దీనిని వర్ణించుటకు వీలులేదు. విశ్వశక్తులు, విశ్వాంశములను కొంతవరకు బేర్కొన్నాడు ఆళ్వారు ఇచట.

నిరీక్షించుచున్న వీరందరికి ముందు దర్శన మిమ్మని ఆళ్వారు కోరుతాడు, తాను ముందు దర్శింపవలయునని పట్టుపట్టుట లేదే! మోక్ష సన్న్యాసి యోగిగదా ఆళ్వారు; ఇతరు లందరి మోక్షమును కాంక్షిస్తాడు నిజమైన భక్తుడు.

ఆళ్వారు అందరికంటే ముందుగనే ప్రథముడుగా స్వామి ద్వారముకడ జేరినను, తనతరువాత వచ్చిన ప్రతిభక్తునకు ముందు స్థలమిచ్చి, తాను వెనుకకు జరిగినట్లున్నది! "వీరందరికి ముందు దర్శనమివ్వు, స్వామీ!" అన్నప్పుడు ఆళ్వారు అందరికంటె వెనుక నిలువబడియున్నా డన్నమాట! తనముందున్నవారి కందరికి దర్శనభాగ్య మయిన తరువాత గదా తనకు దర్శనభాగ్యము కలిగేది? అందువలన అందరికి, ముందు దర్శన మిమ్మని స్వామిని కోరుచున్నాడు.

మరియు ఆళ్వారు లోకహితమును కోరువాడు కదా! సర్వులు దైవభక్తులుగా నుండవలయునని కోరువాడు గదా! బోధకుడు, దర్శకుడు అతడు! సంశ్లేషభావి గావున దైవశక్తి తనకు వశమైయున్నది గదా! తనకు వశమైయున్నదానిని సర్వులు సేవింపవలయునని కోరు బోధకుడయిన ఆళ్వారు సర్వులకు ముందుగానే దైవదర్శన భాగ్యము కలుగవలయునని కాంక్షించుచున్నాడు. ఇచ్చట ఆళ్వారు యొక్క అడకువ, స్వార్థరాహిత్యము వెల్లడియగుచున్నవి.

**7. ఏడవ పాశురము :**

"మమ్మేలువాడవగు ఓ రంగనాయకా! దేవరవారి సన్నిధి ద్వారమున ఐరావతముతో దేవేంద్రుడును, సకల దేవతలును, మహాతపోనిష్ఠులగు సనకాది మహర్షులును, మరుద్గణములును, గంధర్వులును, యక్షకిన్నర కింపురుష విద్యాధరులును, క్రిక్కిరిసి త్రోసికొనుచు నీ పాదారవిందములను సేవించుటకొరకు వ్యామోహమును జెంది, భూమ్యాకాశములు తెలియక నిండి యున్నారు. కాబట్టి శయ్య నుండి లేచిరమ్ము; కటాక్షింపుము".

**వివరణము:** దీని యంతరార్థము అద్భుతము. రంగనాథుని ద్వారము వద్ద సర్వులును నిలిచియున్నారనియు, రంగనాథుని కటాక్షింపుమనియు ఉన్నది.

విశ్వము చిదచిద్విష్టం అన్నపుడు, వైష్ణవ శక్తిని ఆత్మభవుడని తెలిసికొన్నపుడు, తనలో తన ముందున్న విశ్వములో లేని దేమున్నది? ఇదియే తత్త్వత్రయ జ్ఞానము. విశ్వము మనముందున్నది. విశ్వములో మన మున్నాము. విశ్వమును సర్వమును చూచుచున్నావు, విశ్వాత్మ కత్వమును గమనించుచున్నావు గదా! ఇక నీకు స్వాధీనములో లేనిదే మున్నది? నీవు మసకలో నున్నావు. సర్వవిశ్వలీలలను చూచుచూ నీవు విశ్వమును గూర్చి, విశ్వాత్మను గూర్చి ఆలోచించుట లేదు. నీవు సర్వమును చూస్తూనే సర్వమును గమనిస్తూనే, అజ్ఞాన దోషమున ఏమియు తెలియని వాడవై యున్నావు. నీవు ఎరుకలో లేవు. నీవు చచ్చినవానితో సమానము. నీవు శ్వాసించుచున్నావేగాని, జీవించుట లేదు. (The soul is dead that slumbers అంటాడు ఒక కవి - Having eyes you see not; having ears, you hear not, having mind you think not అంటుంది ఒకదార్శనిక గ్రంథము.)

ఆళ్వారు దైవసన్నిధి చేరగనే విశ్వమును మనోనేత్రమున చూస్తాడు. విశ్వమునంతటిని ఒకసారి భౌతిక నేత్రమున చూచుటెట్లు? భౌతికములగు ఇంద్రియములు, వాని శక్తి అల్పములుగదా! మనస్సుననే

ఆదిమధ్యాంత రహితుని కూడా ఊహించుకొనుచున్నావు; ఊహింపగలవు.

శ్రీ కృష్ణుడు అర్జునునకు విశ్వరూపమును చూపడమంటే యేమిటి? అర్జునుని మనోనేత్రము విప్పబడినదన్నమాట! అర్జునుని విశ్వము యొక్క స్థితిని గమనింపుమని చెప్పినాడు గీతాచార్యుడు. ఈ స్థితికి దెచ్చునది చరమశ్లోకార్థము.

సంశ్లేషభావముగలవాడే శరణాగతి భావముగలవాడే, విశ్వమును అర్థంచేసికుంటాడు, విశ్వమును చూచి అద్భుతపడతాడు, భయపడడు, తానును విశ్వములోనివాడే గదా! చిన్నగుంటలోని చేపను సముద్రమున వేసిన అది భయపడునా? విశ్వరూపమును చూడని మానవుడే లేడు. కాని దానిని గమనింపక తాను చూడలేదని అనుకొనుచున్నాడు. "మరుగేలరా - ఓ రాఘవా! మరుగేల? చరాచరరూప!" అంటాడు త్యాగరాజు.

అదేవిధమున సర్వవిశ్వము విశ్వాత్మకుని తెలిసుకొనుటకు ఉవ్విళ్ళూరుచున్నది! ఆ జ్ఞానమును మానవు లెల్లరు బడయుదురుగాక! అని ఆళ్వారు ఒక విధముగా మంగలాశాసనము గావించుచున్నాడన్న మాట. సర్వంతర్యామికి చిహ్నమగు రంగనాథ అర్చావతారమును చూచిన ఆళ్వారు వెంటనే విశ్వముతో సంశ్లేషిస్తాడు. స్వామిని "కటాక్షింపుము" అన్నపుడు "ఈ సంశ్లేష దివ్యానుభూతి అందరును పొందుదురు గాక! ఇక మరుగున నుండున దేమున్నది?" అని ఆళ్వారు భావిస్తున్నాడు.

**8. ఎనిమిదవ పాశురము :**

**"శ్రీ రంగనాథా! మీకు సమర్పించుటకుగాను, పరిమళముగల దవనము మొదలగు గరిక జాతులను, మేలైన శంఖము మున్నగు నవనిధులను తీసికొని వచ్చిన దేవతలును, కపిలధేనువును, మహర్షులును వచ్చియున్నారు. నీ శృంగారాక్షము ముకురము**

మొదలగు సాధనములను గూడ సమకూర్చియున్నారు. మంగళార్థము గానము చేయుటకు తుంబురు నారదాదులు వచ్చియున్నవారు. వీరందరును గాక దినకరుడు తన అధిక తేజస్సుతో ఉదయించు చున్నాడు. అంధకారము నిశ్శేషముగా నివర్తించినది. ఇక దేవరవారు శయనము నుండి లేచి, అజ్ఞానమను అంధకారమును పోగొట్టి కటాక్షింపవలయును."

**వివరణము** : 7వ పాశురమును గమనించు విధమున దీనిని గూడా పాఠకులు గమనింపవలసినది.

**9. తొమ్మిదవ పాశురము :**

"ఓ శ్రీరంగ శాయీ! మేలైన మృదంగము, తాళములు, మద్దెల, వీణ పిల్లనగ్రోవి, మొదలగు వాద్యములయొక్క సునాదమునకు అనుగుణముగా గానము చేయుటకు సమర్థులగు యక్ష, కిన్నర, గరుడ, గంధర్వచారణ సిద్ధాదులును, మహాతపోనిష్ఠులగు మహర్షులును, బహుదేవతలును దేవరవారి శ్రీపాదారవింద సేవయందలి ఆతురత అతిశయముచే నెగ్గుచూ, నిల్చొనియున్నారు. కనుక వారందరికి సేవాభాగ్యము నొసంగుటకై కరుణతో మేల్కొనుము, స్వామీ!"

**వివరణము**: సంగీతము విద్యలకెల్ల రాజమేలైన గానము వాద్య సమ్మేళనము భజనకీర్తనను గానము చేయువారిని సమ్మోహపరచును. వినువారిని గూడా సమ్మోహపరచును. అర్థయుక్తముగా చేయబడు గానము వాద్యమేళవమున సంశ్లేషభావమును పెంపొందించును. భక్తిపాశురగానమున ఆరితేరిన ఆళ్వారు, మేళతాళవముల సంయోగమును కూడా కోరుచున్నాడు.

ఆళ్వారు కాలమున సుమారు ఇప్పటికి యే 14 శతాబ్దముల కాలమున, వైష్ణవాలయములందు భక్తికీర్తనల భజనలు జరుగుచుండెడి వని తెలియనగును. ఆ కాలమున అమలులోనున్న వివిధ వాద్య విశేషములను గూడా గమనింపగలము.

తపోనిష్ఠలగు మహర్షులు భజనలు చేయుటకై వచ్చియున్నారని చెప్పబడినది - అనగా ఉపవాసములు, తపస్సులు, హఠయోగములు మొదలగునట్టి శరీరమును తపింపజేయు కార్యములను ఆళ్వారు నిరసించును. తత్త్వత్రయ జ్ఞానము ప్రకారము శరీరము ఈశ్వరశక్తికి ఆధారమయియున్నది. కావున ఈశ్వరశక్తిని ఉజ్జ్వలముగా శరీరస్థముగా నుంచుకొనుటకు శరీరము ఆరోగ్యముగా తేజోవంతముగా నుండ వలయును. మితాహారము, నియమితాహార పద్ధతులు, శుచియైన ఆహారము, కావలసినంతవరకే విశ్రాంతి, నిద్ర, శరీర వ్యాయామము శరీరమును మంచిస్థితియం దుంచునని గీతా సాంఖ్యయోగమున కూడా చెప్పబడియున్నది. హఠయోగులుమున్నగువారు ఈ సత్యమును క్రమముగా తెలిసికొనిరి! అందువలననే తపోనిష్ఠలయిన మహర్షులు భజన సంకీర్తనగానములకు వచ్చియున్నారని చెప్పబడినది. ఏకాంత తపస్సుకంటే, తోటి మానవులతో గూడి సంశ్లేషబావమున భజన గానములు చేయుట ఆనందదాయకము.

**10. పదియవ పాశురము :**

"ఉభయకావేరీ మధ్యప్రదేశమున శయనించి యుండు శ్రీరంగనాథా! తామరలు వికసించినవి. సూర్యుడు ఉదయించెను సింహేంద్ర మధ్యలగు యువతులు స్నానంబొనర్చి తీరమును ఆరోహించిరి. దేవరవారు ధరింపదగిన తిరుత్తుళాయి (పవిత్రమయిన తులసి) పుష్పమాలలను తీసికొని, సన్నిధికి వచ్చియుండు తొండరడిప్పొడి అను దాసు డయిన నన్ను ప్రేమతో కృపయుంచి, దేవరవారి దాసవర్గమునకు దాసునిగా చేయుటకు శయ్య నుండి లేచి, కటాక్షింపుము, స్వామీ!"

**వివరణము:** తాను గావించిన తిరప్పళ్లి యెళుచ్చి ప్రబంధమును పూర్తి చేయుచూ ఒకసారి సింహావలోకనమును గావించుచున్నాడు ఆళ్వారు.

ఉదయకాలపు దృశ్యముల నొకసారి పాఠకుల, భక్తుల మనస్సునకు తెచ్చుచున్నాడు ఆళ్వారు. భక్తులెల్లరు తిరుకావేరియందు స్నానముగావించి, వచ్చియున్నారని చెప్పుటలో - అందరు స్నానములు చేయుట పూర్తియయిన దని చెప్పుటకు, యువతులు స్నానముచేసి తీరమును జేరిరి అని అంటాడు ఆళ్వారు. సహజముగా స్త్రీలు స్నానమును చేయుటలో పురుషుల కంటే ఆలస్యము చేస్తూ ఉంటారు. అందులో యువతులు సంతోషముగా, ఒకరినొకరితో సంభాషించు కొనుచూ, కేళీభావమున జలకము లాడుచు, స్నానము పూర్తి అయిన తరువాత కూడా వస్త్రములను ధరించుట యందు, తలవెండ్రుకల నార్చుకొనుట యందు ఎక్కువ ఆలస్యము చేస్తూ ఉంటారు. గట్టుననున్న వారివారి పురుషులు, స్త్రీలను త్వరితగతి సన్నిధికి రమ్మని త్వరచేస్తూ ఉంటారు. అందువలన ఇచట యువతులు కూడా స్నానమాచరించుట పూర్తి అయినదని చెప్పుటలో భక్తులెల్లరు సంసిద్ధులై దర్శనమునకు వేచియున్నారని ఆళ్వారు సూచించుచున్నాడు. సింహేంద్ర మధ్య యువతులనుటలో సత్యము శృంగారము పెనవేసికొని యున్నది!

కడపటిదిగా తన విషయమును మనవి చేసికొనుచున్నాడు ఆళ్వారు. తాను అనుదినము ఉదయకాలమున స్వామికి తులసిమాలల సమర్పించు భక్తుడనని వెల్లడించుచున్నాడు ఆళ్వారు. తొండరడిప్పొడి (భక్తాంఘ్రిరేణువు) అనునామమును భక్తితో విధేయతతో ప్రపత్తి భావముతో తనకై తాను స్వీకరించి నానని ఆళ్వారు మనవిచేసికొనుచున్నాడు. తాను దాసానుదాసునిగా, జీవితమును గడప వలయునని నిర్ణయించుకొన్నట్లు తెల్పుచున్నాడు ఆళ్వారు. తన యీ నిర్ణయమును అచంచలముగా జేయమని స్వామిని ప్రార్థిస్తూ ఉన్నాడు ఆళ్వారు. ఆళ్వారు యొక్క ప్రపత్తి భావమట్టిది!

పురాణములలో వర్ణింపబడిన మహర్షులకును, వారి తపోగర్వమునకు వారి నమ్రతా లోపమునకును, వా రొసగు వరములు

శాపములకును అట్టివారి వైఖరులకును - ఆళ్వారుల వైఖరులకును భేదమును పాఠకులు గమనింపదగియున్నది. ఆళ్వారు యొక్క శరణాగతి భావము, స్వార్థరహితభావము, సేవాభావము, విష్ణుసంశ్లేష భావము, ఆనందము మొదలగునవి విశిష్టాద్వైత సిద్ధాంతమునకు మూలసూత్రము లయినవి. శ్రీరామానుజుని సిద్ధాంతమునకు సేవాభావమునకు ప్రోత్సాహము నిచ్చినది ఆళ్వారుల జీవిత సౌరభము.

"తిరుప్పళ్లి యెళుచ్చి" ఈ విధముగా శ్రేష్ఠమయిన సుప్రభాత పాశురములు. వీనిని గ్రహించి చదువరులు సంశ్లేషభావమున ఆనందింతురుగాక.

తిరువడిగళి=పవిత్రమైన పాదద్వయము - సేవా భావమును సూచించును -

శ్రీ పెరియపెరుమాళ్ తిరువడిగళే శరణం
శ్రీ తొండరడిప్పొడి ఆళ్వార్ తిరవడిగళే శరణం
శ్రీ రామానుజాచార్య తిరువడిగళే శరణం.

# 2. అమలనాది పిరా౯

## (శ్రీరంగనాథుని పాదాది కేశాంతానుభవము)

"అమలనాదిపిరా౯" అను పదిపాశురముల దివ్యప్రబంధము తిరుప్పాణి ఆళ్వారుచే రచింపబడినది. దివ్యసూరి చరిత్ర వచన ప్రకారము ఈయన కలి 842 దుర్మతి నామసంవత్సర వృశ్చికమాసము రోహిణీ నక్షత్రమున ఉఱైయూరు అనుగ్రామమున పంచము లనబడు కులమున జన్మించిరి.

తిరుప్పాణి ఆళ్వారు శ్రీ విష్ణుమూర్తి యొక్క శ్రీవత్సాంశమున జన్మించినవా రని వైష్ణవభక్తుల విశ్వాసము. వీరు బాల్యముననే భక్తుడుగా నుండి, సర్వసంగపరిత్యాగియై యిల్లువదలి 108 దివ్య తిరుపతులను దర్శించి కడపట శ్రీరంగముజేరి, అచ్చనే తన జీవితాంతము జీవించినాడు. శ్రీరంగము చేరుటకు పూర్వము తిరుమలేశుని దర్శించియున్నాడు. తన ప్రబంధమున తిరమలేశుని, శ్రీరంగనాథుని వర్ణించియున్నాడు. అనగా 108 దివ్య తిరుపతులలో ఈ రెండు సుప్రసిద్ధములు.

ఈయన హస్తమునందు వీణను ధరించి, ఎల్లప్పుడు కావేరీనదీ తీరమున భగవత్సంకీర్తనము గావించుచుండువాడు. పంచమ కులజుడుగాన వీనికి "శ్రీరంగ దేవాలయమునగాని, శ్రీరంగపట్టణము లోనికిగాని ప్రవేశము లేదు. నదీతీరపుటిసుకతిన్నెలపై నాట్యము చేయుచూ, శ్రీరంగనాథుని బంగారు గోపుర శిఖరములను తిలకించుచు, బాహ్యస్మృతిని గూడా అప్పుడుప్పుడు గోల్పోయి తన్మయత్వమున హరినామ సంకీర్తన చేయుచుండువాడు.

శ్రీరంగనాథ దేవాలయమున ప్రధానార్చకుడును, పండితుడును, భక్తుడును అయిన లోకసారంగముని, భగవత్కటాక్షమున సత్యము నెరిగినవాడై, తిరుప్పాణి గొప్పభక్తు డనియు, ఆళ్వారనియు గమనించినవాడై, ఒకనాడు భక్త్యావేశమున తిరుప్పాణిని జనిరి, తన

భుజముపై నెక్కించుకొని, మోసి, కడకు శ్రీరంగనాథుని గర్భగుడి ద్వారమున చేర్చినాడు. అందువలన తిరుప్పాణి ఆళ్వారునకు యోగివాహనుడు, మునివాహనుడను పేర్లు వచ్చినవి.

తిరుప్పాణి ఆళ్వార్ల పూర్తిచరిత్రమును పాఠకులు నాచే ఇదివరలో రచింపబడిన ఆళ్వారుల దివ్యవైభవము, శ్రీరామానుజ దివ్యవైభవము అను దివ్యగ్రంథముల నుండి సవిస్తరముగా తెలిసుకొనగలరు. (ఈ రెండు గ్రంథములు నాచే ఆంగ్లమునకు కూడా అనువదింపబడి యున్నవి).

తిరునక్షత్ర తనియనులయందు భక్తులు శ్రీ తిరుప్పాణి ఆళ్వారును ఈ విధముగా స్మరించిరి:

శ్లో॥ వృశ్చికే రోహిణీ జాతం
శ్రీపాణం నిచుళా పురే।
శ్రీవత్సాంశం గాయకేంద్రం
మునివాహన మాశ్రయే॥

శ్లో॥ శ్రీలోకసారంగ మహామునీంద్ర
స్కంధాది రూఢం కలయామి నిత్యమ్।
కళంకహీనం కమనీయ భక్తిం
కవీశ్వరం గాయక సార్వ భౌమమ్॥

యామునాచార్యుల వారి మొదటి శిష్యు డయినట్టియు, శ్రీరామానుజుని యొక్క అయిదుమంది ఆచార్యులలో నొకడును, మహాభక్తుడును అయిన పెరియనంబి తిరుప్పాణి ఆళ్వార్ల రచనమగు "అమలనాదిపిరాౙ" అను ప్రబంధమును ఇట్లు శ్లాఘించియున్నాడు:-

శ్లో॥ ఆపాదచూడ మనుభూయ హరిం శయానం
మధ్యేక వేర దుహితుర్ముది తాన్త రాత్మా।
అద్రష్టతాం నయనయోర్విష యాంతరాణాం।
యోనిశ్చికాయమనవై మునివాహనంతమ్॥

"ఏ తిరుప్పాణి ఆళ్వార్లు, తాము ఉభయకావేరీ మధ్యమందు శయనించియుండు శ్రీరంగధాముని యొక్క పాదారవిందములు మొదలుకొని శిరమువరకు దివ్యమంగళ విగ్రహమును అనుభవించి, సంతుష్టులై, ఇతర విషయములందు దృష్టియుంచకుండునట్లు నిశ్చయించుకొనెనో, ఏ తిరుప్పాణి ఆళ్వారు శ్రీలోకసారంగ మహామునిని వాహనముగా పొందెనో అట్టి తిరుప్పాణి ఆళ్వారును త్రికరణశుద్ధిగా సేవించుచున్నాను".

"అడియేఙ్, అడియేఙ్, పాణఙ్ (నేను దాసుడను, నేను దాసుడను, పాణఙ్ అనువాడను) అని వెనుకాడగా, వదలక భుజముపై నెత్తికొని లోకసారంగముని కొనిపోవుచుండగా, మార్గమందు తొమ్మిది పాశురములను గానముచేసి, కడపట భగవత్సాన్నిధానమందు పదియవ పాశురమును విజ్ఞాపనము జేసి, తిరుప్పాణి ఆళ్వారు తన "అమలనాది పిరాఙ్" అను ప్రబంధమును పూర్తిజేసెను. ఈ ప్రబంధమున వ్యక్తము చేయబడిన శ్రీ భక్తిసారమును ఈ అధ్యాయమున పాఠకులు చదివెదరు.

"అమలనాదిపిరాఙ్" అను ప్రబంధము అతివిలక్షణమయినది. ఇది ప్రణవము (ఓం) వలె అతిమిక్కిలి సంగ్రహముగా నుండక, వేదము వేదోపబృంహణమయిన మహాభారతము వలె రామాయణమువలె మహాభాగవతము వలె అతి విస్తారముగా నుండక, కేవలము పదిపాశురములు గలదై, సంగ్రహముగను, సర్వాధికారమునై, సులభముగా గ్రహింపదగియున్నది. శ్రీరామాయణ భారత భాగవతము లందు భగవద్భాగవత కథలేగాక భగవత్కాధావ్యతిరిక్త విషయక కథలుసైతము చెప్పబడియున్నవి; పాఠకులు సత్యాసత్య విషయములను తరచి చూడవలసిన అవసర ముండును. మరియు భక్తుల దివ్యత్వమును బోధించుటకు భక్తులుగాని వారి యొక్క నీచత్వము కూడా వర్ణింపబడి యుండుటచే, పాఠకులురెంటిని చదివి అనుభవింపవలసి యున్నది. ద్రావిడ దివ్యప్రబంధము ఇట్టి

లోపములు లేనిదైనను, అన్యాపదేశ, స్వాపదేశములు, సామానాధి కరణ్య నిర్ణాయకము త్రిమూర్తి సామ్యము, తన్నిషేద నిర్ణయము మొదలగు శ్రమలు గలిగియుండును. ఇతర దివ్యప్రబంధముల యందు, తిరుమాలై మొదలగు వానియందు, భక్తు డయిన ప్రబంధకర్త తన లాభాలాభ ప్రియాప్రియములను ప్రతిపాదించి యున్నాడు. తిరుప్పల్లాండు నందు ఇట్టి యే లోపములు లేకున్నను, త్రివిధాధికారి యొక్క గుణాగుణములు ప్రతిపాదింపబడి తరువాత ముఖ్యాంశములు చూపబడినవి. కాని యీ ప్రబంధము, అమలనాది పిరాశ్, అట్లుకాదు - విశ్వస్వరూపుని పరత్వ, వ్యూహ విభవములను ప్రతిపాదింపక, అర్చావతారముగా, నవతరించిన శ్రీరంగశాయియగు పెరియపెరుమాళ్లను (దేవదేవుని) గర్భగుడి యందలి సువర్ణ స్తంభము యొద్ద నిలిచి, నోరారా స్తోత్రము చేసినది. ఈ ప్రబంధము వలన నగుటచే ఇది సకల ప్రబంధములలో నెల్ల విలక్షణమునై యున్నది.

ఈ విలక్షణ ప్రబంధము తిరుప్పాణి ఆళ్వార్ల విలక్షణ భక్తి భావమును నిర్ణయించి చెప్పును.

తిరుప్పాణి చాతుర్వర్ణములకు వెలుపలివాడు (పంచముడుగాన) అని ఆదిలో మూఢవిశ్వాసముగల పండితులు భావించినను, కడకు శ్రీరంగనాథుని దివ్యప్రేరణమున లోకసారంగముని యిట్లు వక్కాణించి యున్నాడు "ప్రహ్లాదుడు, నారదుడు మున్నగువారు నిత్యసూరులుగాన వారు చాతుర్వర్ణముల పరిధిలోనికి రానట్లే, తిరుప్పాణి ఆళ్వారు చాతుర్వర్ణముల పరిధిలోనికి రాక మిన్నయయినాడు".

ఆళ్వారాదులు రెండుగట్లను ఆశ్రయించినవారని శ్రీతొండరడిప్పొడి ఆళ్వారు ఆనతిచ్చియున్నాడు - దుష్టత్వమును నిందించి, శిష్టత్వమును కీర్తించుట - కాని తిరుప్పాణి అట్టిది అనుభవ విరోధమని తలచినవాడై, కేవలము శ్రీరంగనాథునే శరణుజొచ్చి, వారిని వర్ణించి, కీర్తించి, అనుభవించి సంశ్లేషించినాడు. (Only positive aspect - No negative aspect).

"శ్రీరామావతారము పై తప్ప అన్యముపై నా మనస్సు పడదు" అని ఆంజనేయుడు అన్నవిధమున తిరుప్పాణి శ్రీరంగధామునితోనే సంశ్లేషించి జీవించినాడు.

"శ్రీ వైంకుఠము క్షీరాబ్ధి - వీనితో నాకు పనిలేదు. శ్రీరంగధాముని సన్నిధియే నాకు సర్వము" అన్నాడు తిరుప్పాణి ఆళ్వారు. వారి సంశ్లేషభావ మట్టిది!

"నూట యెనిమిది దివ్యతిరుపతులలో నుండు సౌందర్యము, వైభవము కలిసి మొత్తము శ్రీరంగనాథుని సన్నిధి యందుగలదు. సర్వ వైభవానందమును ఇచ్చట అనుభవింపదగును" అంటాడు ఆళ్వారు.

"సర్వేశ్వరుడనిన ఇష్టము లేనివారు సైతము ఒక్కసారి శ్రీరంగనాథుని దర్శించిన యెడల, వారు తన్మయులై సర్వేశ్వరునకు శరణాగతు లగుట తథ్యము - అట్టి సౌలభ్యమహిమాతిశయము శ్రీరంగనాథుని అర్చావ తారమున నున్నదని" తిరుప్పాణి సెలవిచ్చినాడు, అర్చావతారము నెడ తన మురిపె మట్టిది.

"నాకు ప్రాప్యులును, ప్రాపకులును, రుచిని (మంచిది - భక్తి అన్నమాట) జనింపజేసిన వారును, అరుచినుండి (చెడ్డనుండి) నిరోధించిన వారును, సర్వమును, పెరియ పెరుమాళ్లే. భగవద్విషయము దప్ప అన్య మెరుగని నాకు శ్రీరంగనాథుడు స్వరూప రూపగుణ విభూతులను చూపగా, అనుభవించి, సంశ్లేషించి ఆనందించువాడను", అని తిరుప్పాణి ఆళ్వారు వచిస్తాడు.

ఇట్టి మహామహుని గూర్చిన యీకొలది ఉపోద్ఘాత దర్శనముతో ఇక తిరుప్పాణి ఆళ్వార్ల రచితమగు అమలనాదిపిరాణ్ అను దివ్యప్రబంధ భావమును భక్తి ప్రీత్యానందములతో గ్రహింతుముగాక!

### 1. మొదటి పాశురము :

పెరియపెరుమాళ్ల యొక్క (దేవదేవుని యొక్క) తిరువడిగళు (పవిత్రపాదద్వయము) సౌందర్యము తమపైబడి, తమ్ముమను దాసునిగా చేసికొన్నదని అంటాడు ఆళ్వారు:

"కళంక రహితుడును, నిత్యకల్యాణ గుణభరితుడును, జగత్కారణ భూతుడును, నాకు ఉపకారకుడును అయి, ప్రకృతి మాయలోబడి ప్రకృతికి వశుడైయున్న నన్ను, తన దాసానుదాసునిగా జేసిన పరిశుద్ధుడును, నిత్యసూరి నిర్వాహకుడును అగుస్వామి, ఈ చేతనుల నేలుకొనుటకు సుగంధ పరిపూర్ణమగు వనములు గల తిరుమలయందు వైభవోపేతుడుగా వెలసియుండు వాడును, అకళంకుడును, దివ్యమంగళ గుణ సంహితుడును, స్వరూప జ్ఞానముగల పరమపదము నందుండు వాడును, దీర్ఘప్రాకారములు గల శ్రీరంగము నందు శయనించి యుండు సర్వేశ్వరుని యొక్క, శ్రీమహాలక్ష్మి సైతము భయముతో స్పృశించి, పట్టదగిన పాదారవిందములు వచ్చి నాకండ్లకు విషయమై ప్రత్యక్ష సమానాకారముగ నున్నవి."

వివరణము: పాదములు సేవకు సంకేతములు. పాదములు పట్టువాడు సేవాతత్పరుడు. పరమపదమనగా నిర్మల జ్ఞానపదము అని భావము. ఇట్టి సంపూర్ణ జ్ఞానము భగవంతున కొక్కనికే (సర్వజ్ఞుడు) యున్నందున, భగవత్ సన్నిధానమును పరమపద మనుట తగియున్నది. పునర్జన్మ సిద్ధాంతమును నమ్మినవారు, భక్తులయినవారు చేతనుడు మరణానంతరము జీవాత్మ రూపమున భగవత్ సన్నిధానమును చేరవలయును అనుకోర్కెను వెల్లడించుట పరిపాటి - కాని, పరమపదము అనగా చావు అను అర్థము తప్పు.

పరమపద మనగా స్వరూపజ్ఞానమును కలిగియుండుట - ఆత్మ జ్ఞానము కలిగియుండుట - అనగా తత్త్వత్రయ జ్ఞానమును పొందియుండుట, అనుభవ జ్ఞాన భక్తులచే చేతనుడు ఈ పరమపద

జ్ఞానమును పొందుతాడు ఎప్పుడు? తన జీవిత కాలములోనే! చచ్చిన తరువాత కాదు! ఇట్లు తత్త్వత్రయ ప్రతిపాదితమగు విశిష్టాద్వైత సిద్ధాంతము మంగళకరమైనది, యోగ్యమయినది, అనుభవ భోగ్యమైనది.

ఈ భావముతోనే అర్చావతార సన్నిధానము నాకు సర్వమని అంటాడు తిరుప్పాణ ఆళ్వారు. సర్వాంతర్యామికి చిహ్నముగానున్న అర్చావతార వైభము లన్నియు శ్రీరంగనాథునియందు చూచినాడు ఆళ్వారు.

## 2. రెండవ పాశురము :

"నన్నేలుకొనుటచే సంతోష సంభ్రమములు గలవాడై, త్రిలోకము లను కొలిచి బ్రహ్మలోకము వరకు పెరిగిన రాజాధిరాజ సూచకమగు కిరీటము గలవాడై, దండకారణ్యముననున్నపుడు ఖరదూషణాదులను సంహరించి కోదండపాణియగు శ్రీరాముడును, సుగంధ పరిపూర్ణమగు వనములచే పరివృతమయిన శ్రీరంగమందు శయనించియుండు సర్వస్వామి యయిన నారాయణుడును అయిన స్వామి మొలయందు ధరించియుండు పట్టుపీతాంబరముపై నా మనస్సు ప్రవేశించినదై యున్నది. ఎంతటి ఆనందముతో గూడిన ఆశ్చర్యమిది!"

వివరణము: దశావాతరాములని వర్ణింపబడిన ఈశ్వరశక్తికి శ్రీరంగనాథుడు సూచకమని భావిస్తాడు ఆళ్వారు.

మొదటి పాశరమున భగవత్పాదపద్మములు తనకు ఎదురైనట్లు వర్ణింపగా, రెండవ పాశురమున తాను భగవత్ చరణములపై పడ్డట్లు తెలుపుచున్నాడు ఆళ్వారు.

## 3. మూడవ పాశురము :

పాదకమలములు, పట్టుపీతాంబరములసేవ తదుపరి, భగవంతుని నాభికమలమును గూర్చి ఈ విధముగా అనతిచ్చుచున్నాడు ఆళ్వారు:

"పనస వృక్షములు అడుగునుండి పైవరకు పండియుండుటచే, కపిరాజములు కొమ్మలనుండి కొమ్మలకు దుముకుచుండునట్టి యీ రమణీయ మయినట్టియు, ఉత్తరపు టెల్లయగు (ద్రవిడ దేశమునకు) తిరువేంగడమను (తిరుమలయను) గొప్పపర్వతము నందు, నిత్యసూరులు పుష్పములను గొనితెచ్చి అరాధించునట్లు, నిలువు రూపమున వేంచేసి యుండువాడును, శ్రీరంగధామమున అనంతుడగు శేషుని శయ్యపై పవ్వళించియుండు స్వామియొక్క, సాయంసంధ్యలోని ఎర్రని రంగుగల పీతాంబరమును, దానికి పైభాగమున బ్రహ్మను జనింపజేసిన అందమయిన నాభీకములము మీదగదా యీ దాసుని హృదయాంతర్వర్తియగు జీవు డున్నాడు? ఎంతటి ఆశ్చర్యము!"

వివరణము: తిరుమలసానువులు పనసాది ఫలవృక్షములతో వివిధ పుష్పజాతులతో నలరారుచున్నదని ఆళ్వారు వచించుచున్నారు. తిరుమల ద్రావిడ దేశమునకు ఉత్తరపుటెల్ల అనుటలో ఆళ్వారులు తిరమలవరకే పుణ్యయాత్రలు జేసినట్లున్నది. ఇతర ఆళ్వారులు కూడా కన్యాకుమారి అగ్రము మొదలు తిరుమలవరకే సంచరించినట్లున్నది. తిరుమలకు ఉత్తర ప్రాంతము ఆంధ్రదేశముగా పాటింపబడినట్లున్నది పూర్వము.

తిరుమలపై నిలుచున్నట్టి శ్రీనివాసుని విగ్రహమును సేవించిన విధముననే, శేషశాయియగు రంగనాథుని విగ్రహమును సేవించినాడు ఆళ్వారు.

ఈశ్వరశక్తి సర్వజీవుల ఉత్పత్తికి కారణమని భావించి, ఈశ్వరశక్తితో సంశ్లేషించి ఆనందించుచున్నాడు ఆళ్వారు.

సృష్టికార్యము అందమైన కార్యమని ఆళ్వారు వర్ణించినాడు. గమనార్హము.

**4. నాల్గవ పాశురము :**

ఈ పాశురమునందు తిరునాభీకమలముతో చేరిన ఉదరబంధనమును అనుభవించుచున్నాడు ఆళ్వారు.

"నలుచదరములగు ఉన్నత ప్రాకారావృతమయిన లంకానగర రాజగు రావణుని తరిమి, వానిదశ కంఠములను క్రింద దొర్లునట్లు ఒక ప్రచండ తమ బ్రహ్మాస్త్రమును ప్రయోగించినవాడైనట్టియు, సముద్రచ్ఛాయ గలవాడును, తుమ్మెదలు మధురముగా గానముచేయగా గొప్ప నెమళ్లు నాట్యము చేయుచుండు శ్రీరంగమున శేషశాయిగా నున్నట్టియు, సర్వశేషియైన సుందరకల్యాణ పురుషుని యొక్క బ్రహ్మోద్భవయగు ఉదరమునకు కట్టబడిన దట్టి నా హృదయమునందు లగ్నమై యున్నది".

వివరణము: సర్వావతారముల యొక్క త్రిభువనసుందరత్వముతో ఆళ్వారు సంశ్లేషించుచున్నాడు. బ్రహ్మనుగన్న గర్భముగావున గర్భము చుట్టును బిగువుగా దట్టి కట్టబడియున్నది. తుమ్మెదల ఝుంకార రవములతో, మయూరనాట్యములతో శోభిల్లునందన వనములుగలది శ్రీరంగ ద్వీపము.

**5. ఐదవ పాశురము:**

"మిగుల భారమయిన బహుకాలార్జితములైన యీ దాసుని పాపములను నిశ్శేషముగా పోగొట్టి, పాపాత్ముడగు ఈ దాసానుదాసుని తన దివ్య విషయమందు అంకితునిగా జేసికొన్నాడు స్వామి. అంతేగాక యీ దాసునియందు స్వామి సంపూర్ణముగా ప్రవేశించి, నిలువు ఏర్పరచుకొనియున్నాడు. నా ఆత్మభవుడైయున్నాడు. దీనికి కారణము నా పూర్వపు ఉగ్రతపమా? నాకు తెలియదు. శ్రీరంగశాయియగు స్వామియొక్క, శ్రీలక్ష్మీ వైజయంతీమాలలను, ధరించియుండు, వక్షః స్థలమే గదా యీ దాసుని శేషపరచుచున్నది!"

వివరణము: నాకు ఆశ్రయణీయురాలగు శ్రీమహాలక్ష్మి వసించెడు స్వామి వక్షఃస్థలము నన్ను స్వరూపానురూపమగు నిత్యకైంకర్యము నందు ఆసక్తి గలవానినిగా చేసినది.

తత్త్వత్రయములోని చిత్, అచిత్, ఈశ్వర అను మూడు అంశములలో చిత్, అచిత్‌లు కలిసి శ్రీలక్ష్మి అనబడును. లక్ష్మి విశ్వములోని సర్వ సంపదలకు, ఆ సంపదలవలన గలుగు అనుభవములకు సంకేతము. ఈ చిత్, అచిత్తులు సర్వంతర్యామిచే నిండియుండుటచేతను, సర్వంతర్యామి శక్తి లేనిది యీ చిత్ అచిత్ అనునవి ఉండనేరవు గావున వైష్ణవశక్తికి సంకేతముగానున్న శ్రీరంగనాథుని వక్షఃస్థలమున లక్ష్మి యుండుట అర్థయుక్తముగా నున్నది. లక్ష్మితోకూడిన సంపద, అనుభవములు గలిగిన ఈశ్వరశక్తి సర్వము అగుచున్నది - సర్వము అనగా విశ్వము, విశ్వేశ్వరము.

భక్తుడు ఎల్లపుడు తాను పాపములజేసిన వానినిగా భావించి, పాపవిముక్తుడగుటకు ప్రయత్నించుచుండుట ప్రతి ఆస్తిక మతమునందును గమనింతము. ఇయ్యది భక్తుని యొక్క విధేయతను తెలుపుటయేగాక, తనకు తెలియని వయస్సునను, తనకు తెలియకయు కొన్ని తప్పులు మానవుడు చేయునని భక్తుడు భావిస్తాడు. మరియు భవిష్యత్తులో కూడా యెట్టి పరిస్థితియందును తాను పాపముల చేయరాదను ముందుజాగ్రత్తలో వుంటాడు. గాయత్రీ మంత్రమునందును "ధియోయోనః ప్రచోదయాత్" అన్నపుడు "నీవు నాయందుండి నాచే సత్కార్యముల ప్రేరేపింపుము" అన్నపుడు "భవిష్యత్ వర్తమాన కాలములందు నేను ఏ పాపమును చేయకుందును గాక" అనునిశ్చయము వ్యక్తమగుచున్నది.

"స్వామినా ఆత్మభవుడైయున్నాడు" అన్నపుడు తన నిశ్చయము స్వామిని స్వీకరించి యున్నదని భావము. ఇంద్రియములకు దాసుడుగాక, మనోనిశ్చయము గలవాడు తనయందున్న ఈశ్వరశక్తి విషయమై యెరుక గలవాడగుచున్నాడు. అట్టివాడే ఆత్మజ్ఞాని.

"తన దివ్యస్థితికి తనపూర్వజన్మ ఉగ్రతపమా కారణము?" అని ప్రశ్నించుకుంటాడు ఆళ్వారు. "కాదు" అని వారి భావము. ఉగ్రతపములు (పురాణముల మూలమున) ఏదో కాంక్షతో జరిపినవే. తత్త్వత్ర యజ్ఞానమే మానవుని దివ్యస్థితికి కారణభూతమవుతుంది. ఉగ్రతపములుగావు, వాటి యోగములుగావు, ఉపవాసములుగావు, శరీరమును తపింపజేయు నేకార్యములు గావు.

వైజయంతీమాల అనునది యెప్పటికి గాని వాడక తాజాగా నుండునది. ఇది ప్రకృతికి సంకేతము. ప్రకృతిలో ఏదో ఒక భాగము ఎల్లవేళల సతత హరితముగా నుండును, పుష్పించుచుండును. ప్రకృతి యెల్లప్పుడు అభివృద్ధి జెందుచునేయున్నది. ఈ ప్రకృతి ఈశ్వరశక్తి సహాయమున నున్నది. ఈశ్వరశక్తి సర్వంతర్యామి కావున ప్రకృతిని నిండియున్నది. అందువలన ఈశ్వరశక్తికి సంకేతమయిన విష్ణుమూర్తి ప్రకృతికి సాంకేతికమయిన వైజయంతీమాలను ధరించి యుండుట యనుదానిలోని దివ్యసత్యము తత్త్వత్రయ జ్ఞానము.

తత్త్వత్రయము నందు, ఒక అంశము ఏవ్యక్తియును అయినందున, ఆళ్వారు తాను సర్వంతర్యామితో శేష పరచుకొనుచున్నాడు. తానును సర్వంతర్యామి యొక్క ఒక అంశమని భావించి ఆనందిస్తాడు.

ఆళ్వారు యొక్క దివ్యజ్ఞానము సత్యము, స్తవనీయము.

**6. ఆరవ పాశురము :**

"చంద్రశేఖరుడగు రుద్రుని యొక్క భిక్షాటన రూపమగు దుఃఖమును పోగొట్టినవాడును, మంచిరెక్కలుగల తుమ్మెదలు వసించెడు తోటలచే చుట్టబడిన శ్రీరంగధామమందు శయనించి యుండు జగజ్జనకుడైన వాని యొక్క బ్రహ్మాండములోనుండు చేతనులుగల అండమును, ఇతరాండములను, మహాభూమిని, సప్తకుల పర్వతములను, మరియు సమస్తమును భుజించిన స్వామి శ్రీకంఠము, దాసుని ఉజ్జీవింపజేయు చున్నది".

**వివరణము:** "స్వామియొక్క కంఠసౌందర్యము నన్ను ఉజ్జీవింప జేయుచున్నది; వక్షఃస్థల సౌందర్యము కంఠమందు ఆరోపితమై కనుపించుచున్నది" అని ఆళ్వారు అంటాడు.

విశ్వము బ్రహ్మాండ మనియు, విశ్వములోని గ్రహనక్షత్రము లన్నియు అండములని ఆళ్వారు తన ఖగోళశాస్త్ర జ్ఞానమును సూచించుచున్నాడు.

ఈశ్వరశక్తి వాసుదేవముగాన (వాసుదేవుడుగాన) సర్వమును తన యందుగలది - సర్వము నందును తాను గలవాడు అనియు అర్థమున్నది. మొదటిది అగణిత విశ్వరూపము - రెండవది అగణిత పరమాణువులోని పరమాణు రూపము. సర్వము తనయందుగలవాడు వాసుదేవుడని భావించిన ఆళ్వారు శ్రీరంగనాథుని శ్రీకంఠమును వర్ణించి, దానితో సంశ్లేషపడుచున్నాడు, తానును వాసుదేవునియం దున్నానని తలచుచు ఆనందిస్తాడు.

"రుద్రుని భిక్షాటన రూపమును, దుఃఖమును పోగొట్టినవాడు" అన్నపుడు - సర్వంతర్యామి భగవచ్ఛక్తి అని భావించినవాడు దైవము భిక్షాటనము చేయువాడను హీనభావమును పొందడు. దైవము ఇచ్చువాడు; మరియు దైవమును అనంతకల్యాణ గుణపరిపూర్ణునిగా భావించి, సంశ్లేషపడి ఆనందించమంటాడు ఆళ్వారు. రౌద్రాకారుడు, భిక్షుకుడు అయిన దైవమును ప్రార్థించి యేమిపొందుటకు? సంశ్లేషించి యేమి అనుభవించుటకు? వైష్ణవశక్తి మంగళకరమును, రౌద్రమును రెండును అయి ఉన్నది. మంగళకరమునే ఊహించుకొని ఆనందించుము అని ఆళ్వారు బోధిస్తాడు. (Be an optimist and be ever happy; Don't be a pessimist to feel unhappy about each and everything). జీవితమున కష్టసుఖములు రెండునూ కలుగు చుండును; కష్టముల మరచిపోవలయును, అది ఆరోగ్యదాయకము, ఆనందదాయకము. జరిగిపోయిన ఆనందానుభవములతో సంశ్లేషించిన మరి, మరి ఆనందము కలుగుచుండును. ఆధ్యాత్మిక శాస్త్రగతిని

చూడగా, మానవుడు మొదట దైవశక్తిని రౌద్రునిగా భిక్షువుగా భావించినపుడు దైవభీతి ఉండియుండవచ్చును. తరువాత దైవశక్తి అనంతకల్యాణ గుణపరిపూర్ణ మని భావించినపుడు మానవునకు ప్రీతి భక్తిమార్గములు, వీనికి మించి సంశ్లేషభావములు అభివృద్ధి జెందియుంటవి. కావున "భగవంతుడు రౌద్రుడు, భిక్షుకుడు, శ్మశాన సంచారి" అను భావములనుండి మానవుడు "భగవంతుడు మంగళకరుడు, సర్వమును ఇచ్చునట్టి శ్రీనివాసుడు, సర్వంతర్యామి యయిన విష్ణువు" అను భావములకు వచ్చినాడు - ఇది యొకమార్పు భగవత్ శక్తిని ఊహించుటలో, భగవచ్ఛక్తికి చిహ్నముగా, లింగముగా పెట్టుకున్న వ్యక్తి క్రమముగా సర్వాంగసుందరమయిన విగ్రహమును చిహ్నముగా పెట్టుకున్నాడు. అట్టి విగ్రహములలో శ్రేష్ఠమయినది శ్రీరంగనాథ విగ్రహము. లింగమునకంటే చాలాకాలము తరువాత ఈ విగ్రహము వచ్చినట్లున్నది. లింగమును పూజించువాడు లింగముతో సంశ్లేషపడడుగదా! ఈ లింగము ఏ దైవశక్తికి చిహ్నమో, ఆశక్తితో సంశ్లేషపడుతాడు భక్తుడు. అట్లే శ్రీరంగనాథ విగ్రహమును సేవించు భక్తుడు ఏ సర్వంతర్యామియగు ఈశ్వరశక్తికి ఇది చిహ్నమో, ఆశక్తితో సంశ్లేషిస్తాడు. కావున వాస్తవముగా జూచిన యే చిహ్నమైనను ఒకటే తగిన సంశ్లేషభావమును పొందగలిగిన. లేనియెడ మూఢవిశ్వాసమున నున్నవాడై రాతిని పూజించినవా డవుతాడు. లింగముగాని, విగ్రహముగాని రాళ్లు కాదు, కేవలము అవి ఉన్నతభావములకు సంకేతములు. నాచే రచింపబడిన శ్రీరామానుజ దివ్యవైభవము అను గ్రంథమున "గోవిందుని వృత్తాంతము" అను అశ్వాసమును చదివి, యీ సందర్భమున ప్రభావితులు కండు అని గ్రంథకర్తనయిన నేను మనవి చేయుచున్నాను) లింగముగాని, విగ్రహముగాని పరస్పర విరోధములుగావు. ఒక్కొక్కటి ఒక్కొక్క దివ్య విషయమును సూచించును. ఆ విషయమును గమనించి ప్రవర్తించిన వాడు వివేకి అవుతాడు.

## 7. ఏడవ పాశురము :

"శ్రీ హస్తములందు సుందరమగు దక్షిణావర్త శంఖమును, శత్రువుల దహింపజేయు సుదర్శన చక్రమును ధరించినవాడును, మిగుల పరిమళించుచున్న తిరుత్తుళాయి (తులసి) మాలికచే అలంకృతుడగు ఉన్నతుడగు స్వామియును, నా తండ్రియును, శ్రీ రంగక్షేత్ర మను, భూమికి ఆభరణమగు ద్వీపమందు, ఆదిశేషుని పై శయనించి యుండువాడును, అయిన ఆశ్చర్య భూతుడగు పెరియపెరుమాళ్ల యొక్క (దేవదేవుడు - శ్రీరంగనాథుడు) దొండపండు వంటి అరుణకాంతి యుతమగు అధరము - స్త్రీల అధరమునందు ఆసక్తి గలిగి యుండి అజ్ఞానినైయున్న - నా మనస్సును తమ విషయమందు చేర్చుకొన్నది".

వివరణము: తిరుప్పాణి ఆళ్వారు మహాభక్తుడుగా వీణను మీటుచు, భజనకీర్తనల గానము చేయుచూ, తిరుకావేరి తీరపుటిసుక తిన్నెలపై అవతరించి యున్నపుడు లోకము వారిని చూచినది, గుర్తుకుదెచ్చుకున్నది. ఉరయూరిలో వారు జన్మించి, గ్రామమును బాల్యముననే వదలి, సర్వసంగ పరిత్యాగియై 108 దివ్యతిరుపతులను సేవించి, కడపట శ్రీరంగమును జేరి తన శేష జీవితమును శ్రీరంగముననందే గడపినాడు. కాని శ్రీరంగముచేరుటకు పూర్వము తన చరిత్ర వివరములు లోకమున కందలేదు.

శ్రీరంగనాథుని అరుణకాంతియుక్తమగు అధరము ఆళ్వారును ఆకర్షించినది. ఆ యొక్క దివ్యాధరమును చూచిన వెంటనే శ్రీకృష్ణుని అధరము తనకు జ్ఞప్తికి వచ్చి యుండునుగదా! శ్రీకృష్ణుని అధరము జ్ఞప్తికి వచ్చినపుడు శ్రీకృష్ణుని అధరామృతమగు భగవద్గీత జ్ఞప్తికి వచ్చియుండ వలయును. గీతను పలికి, లోకమును ప్రభావితము జేసిన అధరమును అరుణకాంతి యుక్తమని వర్ణించుట తగియున్నది. సూర్యడు చీకటిని తోలి ప్రపంచమును ప్రభావితము చేయును గదా! అట్లే గీత అజ్ఞానమును పారదోలి లోకమును ప్రభావితముజేసెను.

గోపికలు, గోపకులు శ్రీకృష్ణుని అధరామృతమయిన గీతామృతమును గ్రోలినవారు. "శ్రీకృష్ణుని అధరామృత"మను సమాసమున కుండు అర్థమిదే - అన్యముకాదు!

సామాన్యమానవుడు శ్రీలోలుడై అజ్ఞానమున జీవించు తరుణమున గీతాజ్ఞానము అతనిని ప్రభావపరచును. ఇచ్చట అజ్ఞాని ఆళ్వారు కాదు; బాల్యదశలోని ఆళ్వారు కూడా కాదు - సామాన్య మానవుని పక్షమున ఆళ్వారు సోదరభావమున చెప్పిన మాట యిది.

స్వరరూపమయిన శంఖమును, కాలమునకు సంకేతమయిన సుదర్శన చక్రమును, సర్వంతర్యామియు ఆదిమధ్యాంత రహితమును అగు ఈశ్వరశక్తికి సంకేతములు.

తిరుత్తుళాయి (తులసి) ఓషధులలో శ్రేష్ఠమయినది. ఏ కారణమున మృత్యు వాసన్నమయినను, మరణమునకు పూర్వము గొంతునకు కఫము ఆవరించి మరణ సమయమును ఆసన్నము జేయును. తులసి జలము గొంతునవేసిన అది కఫహరముగా పనిచేయును. ఒక్కొక్కప్పుడు మరణము తప్పవచ్చును. ఒక్కొక్కప్పుడు ముందుగా తులసి జలమును గొంతున వేస్తూరాగా మరణ బాధ (ఆయాసము) ఉపసంహరింప బడవచ్చును. తులసి సువాసన గలది. ఈ వాసనకు సర్పములు చెడ్డపురుగులు, దోమలు రావు. ఈ అనేక కారణముల వలన తులసిని అతి పవిత్రముగా హిందువులు పరిగణింతురు. ఈ కారణమున తులసి భగవంతున కిష్టమని పురాణముల యందు పేర్కొనబడినది. తులసి మానవులకు బంధువు వంటిది గాన, లోకబాంధవుడయిన భగవంతుడు తులసియందు ఉన్నాడని పురాణముల వర్ణింపబడి యున్నది.

శ్రీరంగ దీపసౌందర్యము (స్వామి దేవాలయ ప్రాంగణములు, శిఖరములు, పూదోటలు, కైంకర్యములు, భక్తులతో కూడిన సౌందర్య వైభవము)ను వర్ణించుటకు "అది భూమికి ఆభరణ ప్రాయమని చెప్పినాడు ఆళ్వారు. చాల మనోహరముగా నున్నది.

"స్వామీ నీయధరము నన్ను తమవిషయమున చేర్చుకొన్నది" అనగా "గీతను స్మరించుచున్నాను, చరమ శ్లోకార్థమును గ్రహించినాను, నీకు శరణాగతుడనైతిని" అని భావము.

చరమశ్లోకార్థ ప్రదాతయగు శ్రీ తిరుమల వేంకటేశ్వరుడును వెంటనే ఆళ్వారు మనస్సునకు తగిలియుండు, అందువలన ఈ పాశురములందు అక్కడక్కడ వేంకటేశ్వర స్మృతియున్నది. శ్రీరంగనాథుని ఉద్దేశించి యీ ప్రబంధమును పలికినను, ఆళ్వారునకు ఆ రెండు విగ్రహములు అభేదములు, దివ్యములు.

## 8. ఎనిమిదవ పాశురము:

వరముల బలముచే బలిష్ఠుడై ప్రహ్లాదుని హింసింపవచ్చిన హిరణ్యకశ్యపుని దేహమును, భేదించి, బ్రహ్మాది దేవతలును సమీపింపరాని వాడును. ఆది పురుషుడును, ముందుండి ఉపకరించువాడును అగు శ్రీరంగశాయి యొక్క తిరుముఖమందు విశాలమై కర్ణాంతము వరకు వృద్ధినొంది ప్రకాశించు విశాలమైన ఎర్రని గీరలు గల నేత్రములు - కఠిన చిత్తుడనగునన్ను - తన యందు ప్రేమగలవానినిగా చేసికొనినవి".

**వివరణము:** భగవచ్ఛక్తిని ప్రేమించి, దానితో సంశ్లేషింపదగినవాడు ఒక్క ప్రహ్లాదుడే. ప్రహ్లాదుడనగా ఆనందభరితుడు; తాను ఆనందముగా నుండగలిగి, యితరుల ఆనందమును కోరి, వారి ఆనందమును కూర్చువాడు ప్రహ్లాదు డనబడును. వ్యుత్పత్త్యర్థమిట్లు గలిగిన "ప్రహ్లాద" శబ్దము "ఆళ్వారు" అను పదమునుకు పర్యాయపదము కాగలదు.

పురాణమందలి ప్రహ్లాద చరిత్ర అందరికి తెలిసినదేగదా - కాని యిచట ప్రహ్లాద చరిత్రయొక్క అంతరార్థమును తెల్పుచున్నాను. హిరణ్యాక్షుడనగా బంగారుమునే చూచువాడని భావము; సంపదనే కోరువాడు; సర్వము సంపదమీదనే ఆధారపడియున్నది అని భావించి బంగారమునే ఆరాధించువాడు. ఇతడు ప్రపంచములో ఏ యితర

విషయములకును విలువ నియ్యడు. హిరణ్యకశ్యపు డనగా హిరణ్యాక్షుడుగా నుండి యెల్లప్పుడును మహాబలపరాక్రములతో హద్దులేని, మితిలేని, తృప్తిలేని సంపదనుపొందుట యందే సతతము నిమగ్నుడై యుండువాడు; సంపదను జయించుచున్నట్టివాడని అర్థము. వీరిద్దరికిని తృప్తిలేదు. శాంతి లేదు, దయలేదు; దీనికి వ్యతిరేకముగా ఆశ, అశాంతి, అన్యాయం, గర్వము, బలము, క్రూరత్వము మొదలగునవి వీరి గుణములు. వీరికి జీవితమున సుఖము లేదు. తృప్తిగల వానికే సుఖమున్నది! దయ సానుభూతి గలవానికే ఆనందమున్నది. కావున హిరణ్యాక్షుడుగానున్న మానవుడుగాని, హిరణ్యకశ్యపుడుగా నున్న మానవుడుగాని శోకతప్తులేగాని, వారు ప్రహ్లాదులు కానేరరు. దయ, ప్రేమ, భక్తి, శరణాగతి భావము గలవారే ప్రహ్లాదులు కాగలరు. బ్రహ్మాది దేవతలవంటి జ్ఞానవృద్ధులుగావచ్చు, అధికులుగావచ్చు, కాని అట్టివారు ఈశ్వరశక్తితో సంశ్లేషపడి ఆనందింపజాలరు. తత్త్వత్రయజ్ఞాన సత్యము నెరిగి శరణాగతి పొందినవాడే ప్రహ్లాదుడు కాగలడు; పరమానంద భరితుడు కాగలడు.

ఇచ్చట హిరణ్యాక్షుడు, హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుడు అను ముగ్గురు వ్యక్తులను సూచించినాను. కాని యీ మువ్వురు వ్యక్తులను ఒకే జీవితమున మూడు దశలుగా భావింపవచ్చును. ఒక వ్యక్తి తన యౌవనమున హిరణ్యమునే కాంక్షించి, దానినిమించినది మరియొకటి లేదని భావించి హిరణ్యాక్షుడుగా నుండెను. ఈ ఉద్దేశముతో తన గర్వధనబలములతో అనేకానేక సంపదలను అపరిమిత కనకమును సంపాదించుచు, హిరణ్యకశ్యపు డయినాడు. కాని తనకు తృప్తి రాలేదు; ఆనందము రాలేదు - కడపట నేదో అదృష్టవశాత్తు ఆచార్యుని వలన తిరుమంత్ర జ్ఞానమును పొందిన వాడై, సత్యమును గమనించి, తనలోపములను గ్రహించినవాడై, సవరించుకొన్న మనస్సుగలవాడై, తృప్తిని ప్రేమను ప్రదర్శించి ప్రహ్లాదుడయినాడు అనగా దైవము యొక్క కల్యాణ గుణములతో సంశ్లేషించినవాడై ప్రహ్లాదు డయినాడు;

పరిపక్వదశకు వచ్చినాడు. ఈ విషయమును భక్తులు ఇట్లు గ్రహింతురు. ఈ సత్యమును ఎవ్వరుగాని, యేమతస్థులుగాని కాదనగలరా? విశ్వజనీనమయిన సత్యమిది!

కాబట్టి దైవశక్తితో సంశ్లేషింపదగినవాడు ప్రహ్లాదుడే. ఆళ్వారు కూడా ఒక ప్రహ్లాదుడు. విశాలనేత్రములు జ్ఞానసూచకములు, "బాగుగా కన్ను విప్పిచూడుము - సత్యమును తెలిసికొందువు" అని వాడుకగా అంటాము - గమనించి, పరిశీలించి జ్ఞానమును, సత్యమును పొందుము - అని భావము.

సత్యమును ఎరుగని వాడు కఠినచిత్తుడుగా నుండును. ఆత్మజ్ఞానము గలవాడు ప్రేమహృదయుడగును. సామాన్య మానవుడు కఠిన చిత్తుడుగా నున్నను, సత్యమున గ్రహించి ప్రేమాస్పదుడు కావలయునని ఆళ్వారుల భావము.

దేవుని యందు ప్రేమ గలిగియుండుట అనగా సర్వులయెడ ప్రేమ గలిగి యుండుట అని భావము. భగవత్ శక్తి సర్వంతర్యామి కదా!

### 9. తొమ్మిదవ పాశురము:

"వటపత్రశాయియై ప్రళయమందు జగత్తునంతటిని తన హృదయమునం దుంచుకొన్నట్టి వాడును, శ్రీరంగమున అనంత శయనుడుగా నున్నట్టివాడును, అయిన స్వామియొక్క తిరుమేను (పవిత్ర శరీరము) రమ్యమై, మహారత్నఖచిత ముక్తాల హారములతో శోభిల్లుచు, అసమాన సౌందర్యముతో నీలమేఘవర్ణము గలిగి, నాకు దర్శనీయమై, నా హృదయమందలి అహంభావమును నశింపజేసినది.

**వివరణము:** వాసుదేవుడనగా సర్వమును తనయందు గలవాడని భావముగాన, క్షేమకరకాలమునందును, ప్రళయమునను విశ్వమంతయు స్వామిహృదయమున నున్నట్లే కదా?

నశించిన సృష్టి, నశించిన ప్రకృతి, పశుపక్ష్యాతి జీవులు, మానవకోటి మరల ప్రళయము తరువాత ఎట్లు వృద్ధిజెందినదా అను ఆశ్చర్యము ఎవ్వరికైనను ఉండునుగదా!

ఆకురాలు కాలమున మహావృక్షమున ఒక్క ఆకు లేకుండా రాలిపోయి, కొమ్మలు మాత్ర మగపడును. దిగంబరముగానున్న యీ వృక్షము వసంతఋతువున అత్యద్భుతముగా పత్రపుష్పశోభితమై యుండును గదా. ఇదంతయు ఎక్కడదాగి యుండెను? అనునది వృక్షశాస్త్ర మెరుగనివానికి అద్భుతమేగదా! అట్లు పునస్సృష్టిని గూర్చి ప్రళయము తరువాత) ఆళ్వారు అద్భుత పడుతాడు. అది యొక అనుభూతి.

జలప్రళయము వచ్చినపుడు సర్వము జలమయమై నీటిపైన ఏమియులేక శూన్యముగా నుండునుగదా - ప్రళయము తగ్గి భూమిపై క్రమముగా నిమ్నోన్నతములు కానుపించి, తరువాత సృష్టిసూచనలు అగపడును. ఈ సృష్టించు శక్తి యెవరిది? ఎందు దాగియుండెను? మరల ఎట్లు ప్రదర్శింపబడుచున్నది అను విషయమంతయు అగమ్యగోచరము, అద్భుతము ఎవ్వారికైనను. ఆళ్వారునకు గూడా అంతే.

ప్రపంచము జలమయుమయినదిగాన, జీవము అనునది నీటిలోపల లేదనియు, అది నీటిపైననే సూక్ష్మరూపమున క్రోడీకరింపబడి యుండవచ్చు ననియు ఏదో తేలియాడుతున్నా యేదో ఒక యెండు టాకును నెలవుచేసి కోనియుండే నేమో నని పురాణకవి తలచియుంటాడు. మూర్తిగా భావించి (personifaction) ఆ శక్తిని వటప్రతశాయిగా వర్ణించియుంటాడు.

అన్ని చెట్లలో వటవృక్షము విశాలమయినది బలిష్ఠమయినది. అందువలన దానియాకు ఒకటి తప్పిపోయి నీటిపై తేలియాడుచుండెనేమో అని పురాణకవి ఊహించి వర్ణించి యుంటాడు. సత్యమేదైనను, ఇట్లు ఊహించినందున

సత్యదూరముకాదది. జీవశక్తి నీటిపై ప్రసరించి యుండుట సత్యమేకదా - నీటియందే, నీటిని ఆధారముగా జేసికొని యేగదా సృష్టి ప్రారంభించేది - అందువలననే మానవాభ్యుదయమును అభివృద్ధిని దశవాతారముల ద్వారా వర్ణించినపుడు మత్స్యావతారము ప్రథమముగా చెప్పబడియున్నది - నీటి జంతువు.

సృష్టి ప్రారంభమును గూర్చి అద్భుతపడిన ఆళ్వారు, ఎటూతోయక, పుర్రాణగాథను వెలిపుచ్చినాడు. (సృష్టి ప్రారంభము - ఆయా ప్రాంతములలో ఆయా పూరణములలో ఆయా తెరగుల, అనగా విభిన్నరీతుల, సృష్టి ప్రారంభము వర్ణింపబడి యున్నది). తత్త్వత్రయ జ్ఞానము నెరిగిన వాడే సక్రమముగా ఊహింపగలిగి తనశేషత్వమును అర్థముచేసి కొనగలడు. ఇది యొక అద్భుతానుభూతి అవుతుంది.

ఆకాశము నీలమేఘవర్ణముగాన, ఆకాశము అనంతముగాన, సర్వంతర్యామిని మూర్తిగా భావించి, నీలమేఘుడని చెప్పుట సారస్వత విశిష్టత; సారస్వతపు చెణుకు! అంతవరకే, సృష్టి అనమాన సౌందర్యమేగదా. సృష్టిని ఆవరించియున్న ఈశ్వరశక్తి అనమాన సౌందర్యమే ఆళ్వారునకు. విశాల విగ్రహ నీలమేఘవర్ణ శరీరమును చూడగనే, విశ్వమునకు ఇది సంకేతమని యెరిగిన ఆళ్వారు, ఒక్కసారిగా విశ్వమును ఊహించుకొని విశ్వేశ్వరునకు శరణాగతిని తెల్పినాడు. శరణాగతి యగుటయే అహంభావమును వీడుట. అహంభావమును వీడుటయే స్వార్థరాహిత్య భావము. స్వార్థరాహిత్య భావము విశ్వమానవ సౌభ్రాతృత్వమునకును సేవా భావమునకును దారిజూపుతుంది. ఇది ప్రపంచమునకు శాంతి సౌఖ్యముల నిచ్చును.

**10. పదియవ పాశురము:**

"నీలమేఘ నిభశ్యాముడును, యదుకుల సంభవుడై నవనీతము నారగించిన తిరుప్పవళము (పగడమువంటి నోరు) గలవాడును, బ్రహ్మాండ నిర్వాహకుడును, నన్ను సామర్థ్య యౌవనకాంతల నుండి

తప్పించి నాహృదయము నపహరించి తన దివ్య మంగళ విగ్రహముపై లగ్నపరచిన వాడును, సంసారమునకు ఆభరణమైన శ్రీరంగక్షేత్రమందు శయనించి యుండునట్టివాడును, నాకు అమృత తుల్యుడును, అగునట్టి స్వామిని సేవించిన నా నేత్రములు ఇక మీదట తక్కిన యితరమును చూడవు".

వివరణము: పైన చెప్పబడిన తొమ్మిది పాశురముల భావన జ్ఞానసాక్షాత్కార మవుతుంది. లోకసారంగ మహామునుల భుజస్కంధముల నధిరోహించి, వచ్చి, శ్రీరంగనాథుని గర్భగుడిని ప్రవేశించి, తిరుప్పాణి ఆళ్వారు తొమ్మిది పాశురముల విజ్ఞాపనము చేసినారు. ఈ ప్రబంధ సమాప్తి యందు, అనగా పదియవ పాశురమున, పెరియపెరుమాళ్ల యొక్క సౌందర్యమును సేవించిన తననేత్రములు ఇక మీద వేరొకటి చూడవు అని ప్రతిజ్ఞా పూర్వకముగా తన నిశ్చయమును ఆళ్వారు వచించినారు.

కడపటిసారిగా, సింహావలోకనము చేయుపగిది, ఆళ్వారు ఈశ్వరశక్తిని సర్వంతర్యామియనియు, సర్వశక్తియుత మనియు, శ్రీరామ శ్రీకృష్ణేత్యాది పురుషోత్తముల రూపమున మిక్కిలిగా వ్యక్తమయినట్టిదనియు, లోకోద్ధారక మనియు, మానవుల హృదయము లను సత్కార్యములకు ప్రేరేపించు నట్టిదనియు, వర్ణించి, తన విషయమున అమృత తుల్యమని వక్కాణించుచున్నాడు.

శ్రీరంగక్షేత్రమును సంసారమునకు ఆభరణమని ఆళ్వారు వర్ణిస్తాడు. సారవంతమును, వాసయోగ్యమును ఉభయకావేరీ మధ్య ద్వీపమయిన శ్రీరంగము సుఖసంసారమునకు, జీవనోపాధికి, జీవయాత్రకు తగిన ప్రదేశము. మానవ ఫలప్రద జీవితము కేవలము ఈ సుఖజీవితపు వనరుల మీదనే ఆధారపడదు. (Man does not live by Bread alone). ఆధ్యాత్మిక చింతనము మనస్సునకు సుఖము, తృప్తిని, శాంతిని కలుగజేయును - (He lives fuller by an ideal). ఆధ్యాత్మిక చింతన అనుటలో తత్త్వత్రయ జ్ఞానము గలిగి అనంత కల్యాణ

గుణయుతమగు ఈశ్వరశక్తితో సంశ్లేషించి ఆనందించుటయని ఆళ్వారు భావము. కావున శ్రీరంగనాథ దేవాలయము ముండుటంజేసి, శ్రీరంగద్వీపము సంసారమున కాభరణము అని చెప్పబడినది. ప్రతి పుణ్యక్షేత్రము కూడా యిట్టిదే - ప్రాపంచిక జీవితమునకును ఆధ్యాత్మిక జీవితమునకును కలిసి ఉపకరిస్తవి పుణ్యక్షేత్రములన్నియు.

"శ్రీరంగనాథుని సేవించిన యీనేత్రములు ఇతరమును చూడవు" అని ఆళ్వారు అంటాడు. సహజముగా మిన్నయైన వస్తువును అనుభవించినవాడు దానికంటే తక్కువ దానిని ఒల్లడు గదా! ఈ సందర్భమున విశిష్టాద్వైతి బమ్మెర పోతన ప్రహ్లాద చరిత్రమున వ్రాసిన ఒక పద్యము మనస్సునకు రాగలదు - "మందార మకరంద మాధుర్యమును గ్రోలు మధుపంబువోవునే మదనములకు..." ఈ పద్యమున కొన్ని ఉపమానము లీవిధముగ నిచ్చుచు, ఉపమేయమును ఈ విధముగా వెల్లడించినాడు - "అంబుజోదరు దివ్య పాదారవింద చింతనామృతపాన విశేషమత్తచిత్త మేరీతిని తరంబుఁ జేరనేర్చు?" కూరత్తాళ్వార్ తన ఆచార్యుడయిన శ్రీమద్రామానుజుని సంస్మరించుచు, "యో నిత్య మచ్యుత పదాంబుజయుగ్మరుక్మ వ్యామోహత స్తదిత రాణి తృణాయ మేనే అస్మద్గురోః" అంటాడు. భగవత్ పాదయుగళము అనుబంగారమును తప్ప తక్కిన సర్వమును గడ్డిపరకగా చూచునట్టి నా ఆచార్యుడు శ్రీరామానుజుడు - అని భావము.

వెన్ననారగించిన శ్రీకృష్ణుని ముద్దుముఖమును (నోటిని) తిరప్పవళమని (యెర్రని పగడము వంటి నోరు అని) మనోహరముగా వర్ణిస్తాడు ఆళ్వారు.

ద్రావిడ దివ్యవేదమున తిరుప్పాణి ఆళ్వారు విరచితమగు అమలనాదిపిరాళ్ అను దివ్య ప్రబంధము ఒకగొప్ప కళాఖండము, భక్తిరసమయము. ఆళ్వారుల విష్ణు సంశ్లేషభావము అనిర్వచనీయము. వారిచ్చిన ఉదాహరణములఁ బట్టి వారు వేదశాస్త్ర పురాణేతిహాసముల

దిట్ట యని తెలియుచున్నది - చదువరియేగాక తత్త్వత్రయ జ్ఞానమున ఆత్మజ్ఞానియై విరాజిల్లినవాడని తెలియుచున్నది. ఆళ్వారులందరును మీదు మిక్కిలి ఏకసంధాగ్రాహులే గాక, స్వాచార్యులు గదా!

పంచమ కులజుడనబడిన తిరుప్పాణి ఆళ్వారుగా నెన్నబడుట, బ్రాహ్మణోత్తముడయిన లోకసారంగ ముని తిరుప్పాణి ఆళ్వారును తనభుజ స్కంధములపై నెక్కించుకొని రంగనాథాలయమునకు గొంపోవుట, ... తదుపరి ముఖ్యముగా శ్రీరామానుజుని కాలమున ఆళ్వారు విగ్రహములను సేవార్చనల కొరకు శ్రీ వైష్ణవ దేవాలయము లందు నెలకొల్పుట అను నీ సంఘటనలన్నియు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రాశస్త్యమును వెల్లడించును. పంచముడనబడినవాడే ఆళ్వారయి, దైవసముడయి, దేవాలయమున పూజా విగ్రహరూపము దాల్చినవాడని తెలసియు ఇప్పటికి కొందరు అర్చకులు, ఆచార్యులు, మరికొందరు హిందూ సవర్ణులనబడువారు పంచములనబడువారిని అస్పృశ్యులుగా చూచుచున్నారంటే కరుడుగట్టిన మూఢ విశ్వాసముల బలిమి నేమని చెప్పవలె? సంఘ దురాచారములను బాపి, మానవుని సంఘసేవా తత్పరునిగా తయారు చేయ ప్రయత్నించినది విశిష్టాద్వైత సిద్ధాంతము. ఈ సిద్ధాంతముచే ప్రభావితులయిన వారే అనేక సంఘ సంస్కర్తలు, కారుణ్య రచయితలు!

ఓం

శ్రీ పెరియపెరుమాళ్ తిరువడిగళే శరణమ్
శ్రీ తిరుప్పాణి ఆళ్వార్ తిరువడిగళే శరణమ్
శ్రీ రామానుజాచార్య తిరువడిగళే శరణమ్.

# 3. వాడినేఱ్ - వాడి

## (తిరుమంత్ర వైభవము)

వాడినేఱ్-వాడి అను దివ్యప్రబంధము తిరుమంగై ఆళ్వారు రచించిన అనేక దివ్యప్రబంధములలో నొకటి.

వీరి జన్మస్థానము తిరువాలి తిరునగరికి సమీపముననున్న తిరుక్కురైయలూరు. వీరి ప్రథమ నామధేయము నీలఱ్ (నీలఱ్ అనగా కృష్ణుడు అని భావము). తిరుక్కురైయలూరును తిరుమంగై అని కూడ పిలుచుచుండిరి. ఆ గ్రామమునకు జెందిన ప్రసిద్ధి పురుషుడుగాన నీలఱ్ తిరుమంగై వారని పిలువబడుచుండిరి. తరువాత జీవితమున మహాభక్తుడు గామారిన తిరుమంగైవారిని భక్తులు తిరుమంగైఆళ్వారనిరి. వీరికి పరకాల, నీలఱ్, కవిబ్రహ్మ అను పేర్లు గలవు.

తిరుమంగై ఆళ్వారుల తిరునక్షత్ర శ్లోకతనియఱలుగా భక్తులిట్లుచెప్పి ప్రబంధమున వారిని స్మరించియున్నారు:

శ్లో॥ వృశ్చికే కృత్తికాజాతం
చతుష్కవి శిఖామణీ ।
షట్ప్రబంధకృతం శాఙ్ఱ్
మూర్తిం కలిహ మాశ్రయే ॥

శ్లో॥ పరకాల హరింవందే
హరిపాద గుహాశయం ।
ఉన్నత ప్రతికూలేభ
కుంభ సంభేద విభ్రమమ్ ॥

"కలి, నళనామ సంవత్సర కార్తీకమాస కృత్తికానక్షత్రమందు శ్రీ విష్ణుమూర్తి శాఙ్గము యొక్క అంశమున జన్మించి, కవిరాజై షట్ప్రబంధ కృతమున ఈ యుగచేతనులను జ్జీవింపజేసిన తిరుమంగై ఆళ్వారునకు నమస్కరించుచున్నాను"

"శ్రీమన్నారాయణుని పాదారవిందములనెడి గుహయందు, శయనించియుండునదియు, శత్రువులు అను (అర్థరహితములయిన భిన్నమతములను) గొప్పయేనుగుల యొక్క కుంభస్థలములను వేడుకగా భేదించునట్టి పరకాలుడు (తిరుమంగై ఆళ్వారు) అను సింహామునకు నమస్కరించుచున్నాను''. ఈ విషయంవము దివ్యసూరిచరితమున మనోహరముగా పేర్కొనబడినది.

వీరు మ్లేచ్ఛ వంశమున జన్మించిరి. ఈ వంశము, లేక తెగ ఒక విధమయిన అనాగరక పర్వత వన్యజాతి. కాని బాల్యము నుండి తెలివిగలిగిన చురుకుదనముగల యువకుడుగాన, తనతెగకు నాయకుడై తరువాత చోళరాజ సైన్యదళాధిపతిగా పేరొంది, కడకు చిన్న సామంతరాజయ్యెను. ఇతడు యౌవనమున అతిరసికుడై ఆనందమున స్వేచ్ఛగా కాలము గడపుచు, కుముదవల్లియను వైష్ణవకన్యను వరించి, వివాహమునకు ఆమెపెట్టిన షరత్తు ప్రకారము దినమునకు 1008 మందివంతున ఒక సంవత్సర కాలము వైష్ణవ భక్తులకు తదీయారాధన సలుపనెంచి, తన ధనాగారము వట్టిపోగా తన అనుచరులగు చోరుల చౌర్యాదులచే తదీయారాధన సలుపుచు, కడపట శ్రీరంగమునకు ప్రయాణించుచున్న నూతన వధూవరులనుండి (తిరుమంగై ఆళ్వారు తన సంశ్లేషభావమున వారిని లక్ష్మీనారాయణు లనియే భావించినాడు) తిరుమంత్ర రహస్యమును గ్రహించినవాడై, తాను శ్రీ వైష్ణవుడయి, సర్వసంగ పరిత్యాగియై, శ్రీరంగమహానగరమును జొచ్చి, శ్రీరంగనాథాలయ గోపుర ప్రాకార మణి మంటపాది కైంకర్యము లొనర్చుచు, శ్రీరంగమున 65 సంవత్సరకాలము శ్రీరంగనాథుని సేవించుచు, అనేక ద్రావిడ ప్రబంధముల రచియించి, ఆళ్వారయిన మహాత్ముడు. వీరి జీవితము విచిత్రమునై, ఉజ్జ్వలమునై, దక్షతగలగినదై, ఫలప్రదమై సూరిచరిత్రము నందు వెలుగొందుచున్నది.

తిరుమంగై ఆళ్వారును గూర్చి తిరుక్కోట్టి యూర్‌నంబి (శ్రీ రామానుజునకు యామునాచార్యుల ఆజ్ఞ ప్రకారము తిరుమంత్రార్థ

రహస్యమును అందజేసిన గురువు) ఒక తనియన్ (పాశురము) దెల్పియున్నాడు :

శ్లో॥ కలయామి కలిధ్వంసం కవిం లోకదివాకరమ్
యస్య గోభిః ప్రకాశాభి రావిద్యం నిహతం తమః

"ఏ ఆళ్వారు తమ శ్రీసూక్తులచే లోకుల అజ్ఞానమును పొగొట్టిరో కలిదోషములను పారదోలిరో, జనుల అజ్ఞానాంధకారమును అంతరింప జేయుటకు సూర్యుని వంటివారైరో, అట్టి మహాకవీశ్వరులగు తిరుమంగై ఆళ్వారును ప్రణమిల్లి సేవించుచున్నాను".

శ్రీమద్రామానుజాచార్యులవారు తిరుమంగై ఆళ్వారును గూర్చి చెప్పిన తమిళ పాశురము యొక్క భావమును గమనింపుడు - "సప్తవ్యసనము లను శత్రువులకు మృత్యువయినవాడును, కలిదోషముల నివారించినవాడును, తిరుక్కురైయలూరిలోని ప్రజల సుఖింపజేయ నవతరించిన వాడును, సర్వేశ్వరుని యొద్దతన నందకమనెడి ఆయుధమును జూపి తిరుమంత్రమును బడసిన వాడును, అంతర్బహి శ్శౌచము గలవారును, కవిరాజును, ఆళ్వారును అయిన తిరుమంగై ఆళ్వారు యొక్క ప్రకాశించు వేలాయుధము వర్ధిల్లుగాక!"

(వాస్తవముగా నీతిమంతుడయిన సంస్కర్త యొక్క అయుధము కంటే శక్తియుక్తమైన దేమున్నది? ఏ ఆయుధము గాని, ఆ అయుధము గల వానిచేతిలోనే ప్రకాశించును - సన్మార్గబోధనము అట్లుగాదు - ఆచార్యుడు పోయినను బోధామృతము ఆచంద్రతారార్కముగదా - గీతాచార్యునకుమించిన ఉదాహరణ మేమున్నది? సత్పురుషుడగు నే ఆచార్యుడైనను, ప్రపంచమున ఏ భాగమున ఏ కాలమున వర్ధిల్లినను, ఆయన గీతాచార్యునికోవవాడేయని భావింపవలయును.)

శ్రీరామానుజుని ప్రథమ శిష్యరత్నము కూరత్తాళ్వాన్ తిరుమంగై ఆళ్వారును గూర్చి చెప్పిన ఒక తమిళ పాశుర భావమిచట నీయబడినది. గమనింపుడు:

"అజ్ఞాన శత్రువునకు మృత్యువయిన తిరుమంగై ఆళ్వారు ఆనతిచ్చిన అనేకానేక పాశురములు అజ్ఞానాంధకారమునకు దీపముగను, నశింపని దీర్ఘమయిన జన్మమనెడి విషమును పోగొట్టుటకు అమృతముగను, ద్రావిడ వేదమార్గమయిన పంచలక్షణములకు లక్ష్యముగను, వేదాంత సారముగను, అన్యక్షుద్ర అసత్య మతములు బహుదేవతారాధనములకు అగ్నికణముగను విరాజిల్లుచున్నవి".

(వారి సూక్తులు అంత సత్యమయినవని భావము)

శ్రీరామానుజుని సన్నిహిత శిష్యులలో నొకరగు ఎంబారు (గోవింద మిశ్రుడు) తిరుమంగై ఆళ్వార్ల విషయమై చెప్పిన రెండు ద్రావిడ పాశురముల భావము క్రింద నొసగబడినది, గమనింపుడు:

"అగతికులను రక్షించువాడా! రామానుజాచార్య! ఆత్మరక్షణను మననము చేయు మహాత్మా! శాస్త్ర సంశయములను పోగొట్టి అందరిని మేల్కొలిపిన ఓ యతిరాజా! మిగుల యశోవంతులగు తిరుమంగై యాళ్వార్ల ప్రతిపాదించిన వేదరూపమగు "పెరియ తిరుమొళి" ప్రబంధమును ధరింపగల హృదయమును దేవరవారు దాసునికి కృప చేయవలసినది."

(తిరుమంగై ఆళ్వార్ విరచితమగు తిరుమొళిని బోధింపుమని ఆచార్యుని వేడుకొనుచున్నాడు ఎంబారు. దానిపై ఎంబారుకున్న గౌరవము అనిర్వచనీయము, అని వారిమాటలలోనే తెలియును గదా!రామానుజుడు తన శిష్యవర్గమునకు ఆళ్వారుల తిరుమొళులను అతిశ్రద్ధగా బోధించి నట్లును మనము ఊహింపగలము).

"శ్రియఃపతి యెుద్ద దారిలో దోచుకొనవలయునని పొంచియుండిన తిరుమంగై ఆళ్వార్లూ! వేలాయుధమును పట్టియుండు శ్రీహస్తముతో ఈ దాసుని పాపమును ఖండింపుము".

ఇట్టి స్తవనీయుడును, మహానుభావుడును అయిన తిరుమంగై ఆళ్వారు భగవదంగీకారము కలిగిన తరువాత తన పూర్వజీవితమును ఒకసారి స్మరించుకొని, పశ్చాత్తాపబుద్ధితో ఆనతిచ్చిన "వాడినేన్‌వాడి" అను పదిపాశురముల ద్రావిడ ప్రబంధమును గూర్చి యీ అధ్యాయమున నేర్చుకొందము.

"వాడినేన్‌వాడి" అను పది తమిళపాశురములుగల యీ ప్రబంధములోని మొదటి పాశురము "వాడినేన్-వాడి" అను మాటతో ప్రారంభమగును. కాని ప్రతి పాశురమున్ను "కణ్డుకొణ్డేన్ నారాయణా వెన్నుమ్ నామమ్" అను మాటలతో అంతమగును.

"వాడినేన్-వాడి" "వాడినేన్"=కృశించి పోయినాడను. (అనాదిగా భగవత్ ప్రాప్తిని పోగొట్టుకొని కృశించితిని) "వాడి" = కృశించినను (ఆ విధముగా కృశించిన వాడనయినను - కడకు ఇప్పటికి) "కణ్డుకొణ్డేన్ నారాయణా వెన్నుమ్ నామమ్" = "నారాయణా అను తిరునామమును కనుగొంటిని".

కాబట్టి యీ ప్రబంధములోని పదిపాశురముల తాత్పర్యము ఈ మాటలలోనే గుప్తముగా ఇమిడి యున్నది:

"వాడినేన్, వాడిన్, కణ్డుకొణ్డేన్ నారాయణా వెన్నుమ్ నామమ్"= నేను కృశించితిని, (అయినను ఇప్పుడు) నారాయణా అను తిరునామమును కనుగొంటిని.

అనగా "బాల్యమున, యౌవనమున అజ్ఞానముచే విచ్చలవిడిగా సుఖార్థినై విహరించి, చెడితిని - నాఆత్మ అను తిరునామమును (శ్రేష్ఠమయిన దైవనామమును) పొందితిని. కృతార్థుడ నయితిని - గట్టున బడ్డాను" అని భావము.

అనగా "ఓం నమో నారాయణాయ - అను తిరుమంత్ర రహస్యము నెరిగితిని - అష్టాక్షరీ మంత్ర రహస్యము నెరిగితిని-" అని భావము.

"తిరుమంత్రమును నేను నేరుగా శ్రీమన్నారాయణుని నుండే పొందితిని" అని ఆళ్వారు అంటాడు. ఇది సత్యము. ఎట్లు? నారాయణు డెక్కడనున్నాడు? సర్వంతర్యామి కదా ఈశ్వరశక్తి! తనయందే ఉన్నది! తన స్ఫురణకు వచ్చినది! తానే తన ఆలోచనయందు గమనించినాడు! ఆళ్వారు స్వాచార్యుడుగదా! ఏమని గ్రహించినాడు! సర్వాంతర్యామి శక్తి అద్వితీయము అని ఉపనిషద్వాక్యము - ఇది అవాఙ్మానస గోచరము అని వేదవాక్కు - ఈ అవాఙ్మానసగోచరమగు శక్తి "నారాయణ" అను పదమున సూచింపబడినది, ఇది నారాయణో పనిషద్వాక్యము - దీనిని "నారాయణః" అనవచ్చును లేక "నారాయణమ్" అనవచ్చును. "నారాయణమ్" అనగా సర్వంతర్యామి శక్తి అని భావము. ఈ శక్తికి "నమః", నమస్కరించుచున్నాను. శరణాగతి వేడుచున్నాను. ఈ రెండు పదముల అర్థము (నమో నారాయణాయ) మొదటి పద మయిన "ఓం' లోనే యిమిడియున్నది గదా! ఇది వేదమంత్రము ఇట్లు ఆలోచించిన ఆళ్వారు గమనించిన తిరుమంత్రము, శ్రేష్ఠమయిన మంత్రము ఏది? జ్ఞానమువలనను, బలము వలనను, ఇక దేనిచేతనైనను తత్త్వమును గమనింపజాలము. శరణాగతి భావముననే, సర్వంతర్యామికి శరణాగతి యగుటవలననే ..... కావున ... 'ఓం నమో నారాయణాయ" కనుగొంటిని - నారాయణ అను తిరునామమును కనుగొంటిని. విష్ణు సహస్రనామములలో, "నారాయణ" అను పదమున కున్నంత అర్థపరిధి (భావపరిధి) మరియొక నామమునకు లేదు. (వ్యాకరణ తర్క శాస్త్ర సమన్వయముతో ద్వైత సిద్ధాంతమును బోధించిన మధ్వాచార్యులవారు "నారాయణ" అను శబ్దమున విష్ణు సహస్రనామములలోని తక్కిన 999 నామముల అర్థమును చూపగలనని తన పరాక్రమమును వెల్లడించి యున్నాడు).

ఈ క్రమముగా తిరుమంత్రమును స్వాచార్యుడయిన ఆళ్వారు కనుగొనుటలో "నా ఆత్మభవుని వలన కనుగొంటిని" అని చెప్పవచ్చును లేక ఆత్మభవుడు సర్వంతర్యామియగు ఈశ్వరుడేగాన "నేను సాక్షాత్తు

శ్రీమన్నారాయణమూర్తి నుండియే పొందినానని చెప్పవచ్చును - అంతయు సత్యమే - భావనాపరంపరమీద, భాషాలంకారములపై ఆధారపడియుండు ప్రవచనము లట్టివి. భక్తులు శ్రద్ధగా భావింపదగియున్నది.

(ఈ ఉద్దేశముతోనే అనేక ప్రవక్తలు, అనేక కాలములందు అనేక ప్రాంతములలో "నేను చెప్పునది దైవవాక్యము - నేను మనస్సున విన్నాను - ఇది శృతి నామనస్సుకు వచ్చినది - ఇది స్మృతి అని అన్నారు". ఇదే వాక్యమును ఆ మతస్థులు చెప్పుకొనుచు, ఇతర మత ప్రవక్త అన్న అదే వాక్యమును ఆక్షేపించుచున్నారు! తప్పు - "ఈయనకు దేవుడు అగపడ్డాడట! వీరితో మాట్లాడినాడట" అని యితరులను ఆక్షేపించుచుందురు. సంశ్లేషభావము నెరిగినవాడు ఈ ఆక్షేపణ చేయడు. అట్టివాడు తన ఉన్నతిని తాను చెప్పుకొననేరక, చెప్పుకొన నొల్లక, దైవకృప అని వినయముతో అనేమాట! వివాదాస్పదము కాకూడదు.

"వేదములు దైవకృతములు అని కొందరంటారు - పాత నిబంధన సర్వము దైవవాక్కు అని కొందరంటారు - భగవద్వాక్యమును విని, విన్నదానినే ప్రవక్త చెప్పినాడని కొందరంటారు - పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట అని యిటీవలి ఆంధ్ర భక్త కవుడన్నాడు, భాగవత ప్రారంభమున - ఇందులో అన్నియు సరియైనవే - నీది సరియైనదని భావించి, యితరులది సరికాదని యేల అంటావు? తత్త్వత్రయ జ్ఞానము నెరిగి, సంశ్లేషభావమును పొందగల వ్యక్తి యీ విషయమున వివాదపడడు. మరియొక చోట నేను వచించిన విధమున - ఒక వ్యక్తి తాను తన దేవుని చూచినానని చెప్పినా డనుకో - అతడు అతని దేవుని చూచినది నిజము. అది అతని అనుభూతి - అతని భ్రమ - అతని సంశ్లేషభావము! కాని దేవుడు అతనికి అగపడలేదు - రెండును సత్యములే "నేను నా దేవుని చూచినాను" అన్నమాట సత్యము. "కాని దేవుడు అతనికి అగపడలేదు" అన్నది కూడా సత్యము!

దూరదేశమున విద్యనభ్యసించుచున్న యువకుడైన కుమారుని యెడబాటుకు సహింపలేక తల్లిమేల్కాంచి భ్రమలోనో, నిద్రించి కలలోనో కుమారునిచూచి సంశ్లేషపడుతుంది. ఇది సత్యము. కుమారుడు ఆమెకు కనబడలేదు - ఇదియును సత్యము. ఇది మనస్తత్త్వ విషయము (Psychological point). దీనిని సంశ్లేషభావ మంటారు. భక్తులలో ముఖ్యముగా ఆళ్వార్లు విష్ణు సంశ్లేష భావమున పరమానంద భరితులుగానుండువారు).

ఇంతకు, ఇంతదూరము ఈ విషయమును పరిశీలించిన దెందుల కనగా - ఆళ్వారు స్వాచార్యుడు - వీరికి మరియొక గురువు, ఆచార్యుడు లేడు. వారి జ్ఞానమంతయు ఆత్మభవమే. ప్రబంధమున ఆళ్వారు తిరుమంత్రమును స్వామి నుండే పొందెను అనుటలో విశ్వసింపరానిది యెంతమాత్రము లేదు. ఇది కేవలము శాస్త్రీయమైన అనుభవము (Scientific, realistic and psychological).

"వాడినేఁ - వాడి .......... కణ్డుకొణ్డేఁ నారాయణా వెన్నుమ్ నామమ్" అనిన తిరుమంగైయాళ్వారు పడిన పశ్చాత్తాపము, తిరుమంత్రమును పొందిన తరువాత తాను అనుభవించిన పరమానందము వెల్లడియగు చున్నది.

కావున తిరుమంగై ఆళ్వారు పొందిన యీ భావద్వయమును (పశ్చాత్తాపము, పరమానందము) తిరుమంత్ర జ్ఞానమును బడసినవాడు ప్రతిచేతనుడును పొందునట్టిదే! ప్రారంభమున, బాల్యమునుండియు ప్రతివాడు జ్ఞానికాడుకదా! తరువాత జీవితమున నిజమైన జ్ఞానమును పొందినపుడు, పూర్వ జీవితమును సింహావలోకనమును చేసికొన్నపుడు, చేతనుడు పొందు తత్త్వమిదే! (ఈ జ్ఞానమును చరమ దశవరకు కూడా పొందక మరణించువాడు పశుతుల్యుడు. ఒక నానుడి ఉన్నది గమనింపుడు -ఆ ముదుసలికి మరణ సమయము వచ్చినది - కుమారుడో ఆచార్యుడో వానిచెవిలో తిరుమంత్రము చెప్పినాడు - "అదిగో నాకు వెలుఁగు అగపడుచున్నది - నేను పోవుచున్నా"నంటూ

అసువుల బాసినాడు - అని - సూక్ష్మముగా గ్రహించిన సత్యము నెరుగుదురు) అంతయు సంశ్లేష భావమే!

ఈ క్షణమున పాఠకుడు ఎట్టి అనుభూతిని పొందగలుగుచున్నాడో వానికే తెలియవలయును!

రసికుడుగా, యౌవన సుఖముల ననుభవించిన తిరుమంగై కడపట తిరుమంత్ర వైభవమున ఆళ్వారయినాడు. కావున "వాడినేఁ -వాడి" అను ప్రబంధమును చదువునపుడు, పాఠకుడు తన్నుతానే తిరుమంగై యాళ్వారుగా భావించుకొని, భగవత్ సంశ్లేషమును పొంది ఆనందింప గలడు. లేక యీ పాశురములను మనమే మనపరముగా చదువుకొని (మనపరముగా తప్పక అన్వయమగును సందేహములేదు) భగవత్ సంశ్లేషమును పొంది ఆనందమును పొందగలము.

"ఓం నమోనారాయణాయ"

**1. మొదటి పాశురము:**

"భగవద్దాస్య స్వరూప స్వభావముల నెరుగక, దుఃఖరూపమగు ఈ జన్మనెత్తి, యౌవనవతులగు స్త్రీలతో సంభోగ సుఖముల గోరి, వారితో సంబంధపడి, మనో దుఃఖములను అనుభవించుచు వచ్చి, నేటికి ఉజ్జీవనోపాయముగా నుండు అరుదైన జ్ఞానమను గొప్ప స్థానమును (పరమ పదమును) గని, ఈ తిరుజ్ఞాన సారముచే, భగవత్ కైంకర్య మెరుగని సంసారము నిస్సారమనియు, భగవద్విషయమే సారమైన దనియు ఈనాటికి విచారింపగలిగిన హీనుడను (అజ్ఞానిని) నేను - ఇప్పుడు శ్రీమన్నారాయణ నామమును కనుగొంటిని".

**వివరణము:** ఇప్పటివరకు పాశురముల భావములకు ఇవ్వబడిన వివరణముల గమనింపగలిగిన, ఇక ప్రతిపాశురమునకు వివరణము అవసరము లేదు. ఆళ్వారుల అందరి భావములు - విష్ణు సంశ్లేషణము,

శరణాగతి, ప్రపత్తి, స్వార్థరాహిత్యము, సేవ అను అంశములకు సంబంధించినవే - అందువలన కొన్నియెడల వివరణము చర్విత చర్వణమవుతుంది. అవసరమైనచో, సూచనలగావించెదను).

**2. రెండవ పాశురము:**

(రెండవ పాశురమున - చాలకాలము వరకు ఈశ్వరశక్తి యొకటున్నదని తెలియక అనగా తత్త్వత్రయ జ్ఞానము లేక - విషయలోలుడనై కృశించితిని. ఇట్లు గడచిన కాలము వ్యర్థము గాకుండునట్లు తిరునామమును కనుగొంటిని - అంటాడు ఆళ్వారు.

"పాపాత్ముడనైన నేను తెలివిలేక, స్త్రీ భోగాది లోలుడనై, బహుకాలమును వ్యర్థము చేసితిని. విరాజిల్లు హంసమిథునములతో గూడిన తిరుకావేరీనదిచే చుట్టబడి యుండు శ్రీరంగద్వీప స్వామిని సేవించి, ఉజ్జీవించుటకే శ్రీమన్నారాయణ నామమును జిహ్వచే స్తుతించుచున్నాను."

**3. మూడవ పాశురము:**

"ఇతరుల నుండి లాభములను సేవలను కోరి, పాపకార్యములను అనాలోచితముగా నొనర్చి, స్త్రీల రూపములను మననము చేయుచు, భోగముల నపేక్షించి, కాలమునంతటిని స్వప్నమువలె వ్యర్థముగా గడపితిని. మన్మథుని తండ్రియైనట్టియు మనకు స్వామి అయినట్టియు, చేతనుల హృదయముల యందు నివసించు నట్టియు సర్వేశ్వరుని యొక్క తిరునామమును నాయొక్క ఉజ్జీవనము కొరకు కనుగొంటిని".

వివరణము: మొదటి వాక్యమున వ్యక్తముచేయబడిన జీవిత విధానము సామాన్యముగా పెక్కుమందికి సంబంధించినదే - తప్పును గమనించి సన్మార్గమునబడు ముక్తులు కొందరు. తక్కినవారు బద్ధులుగానే నిలిచిపోతారు.

సర్వేశ్వరుని మన్మథుని తండ్రి అంటారు. మన్మథుడు శృంగారమునకు సంకేతము. భగవచ్ఛక్తిని త్రిభువన సుందరము అని అన్నాముకదా?

తిరునామము = శ్రేష్ఠమైన పేరు - నారాయణ (అనగా - ఓం నమో నారాయణాయ అను అష్టాక్షరీమంత్రము - శరణాగతిని ప్రేరేపించు దివ్యమంత్రము - దీనివలన చేతనుడు స్వార్థరహితుడై లోకసంగ్రహము కొరకు సేవచేస్తాడు.

### 4. నాల్గవ పాశురము:

"తండ్రిని, ఆచార్యుని మొదలగు పెద్దలను సరకుసేయక, అస్థిరమయిన ద్రవ్యమును భోగమును దేహాదులను స్థిరమని భ్రమపడి, భోగముల యొక్కయు స్త్రీల యొక్కయు సంశ్లేషమును గోరి, చపలచిత్తుడనయిన నేను ఏమి చేయగలను? ఆకాశమును తాకునట్లు పెరిగి, వరాహస్వరూపియై, ప్రళయార్ణవసమయమందు భూమిని భేదించిన బలమును చక్రమును గల సర్వేశ్వరుని యొక్క కృపచేతనే, నా ఉజ్జీవము కొరకు, నారాయణ నామమును కనుగొంటిని".

వివరణము: భగవచ్ఛక్తిని తత్త్వత్రయ జ్ఞానముతో గ్రహించుట, వర్ణించుట శాస్త్రీయము (Scientific). కాని అలంకారయుతముగా పురాణముల యందు వర్ణింపబడిన దశావతారతత్త్వములు భక్తులను ఉద్రేకపరచును (Emotional appeal). రెండును అవసరమే కారణ యుక్తముగా అర్థముచేసికొనుట యందే విశిష్టతయున్నది.

### 5. ఐదవ పాశురము:

"సర్వేశ్వరుని సొత్తు అయిన ఆత్మను అపహరించుటచే నేను దొంగ నయితిని. మిగుల దుష్కార్యములు జేయుచు విషయాంతరముల యందు తిరుగుచుంటిని. కడకు స్వామివారి

యనుగ్రహమున స్వరూప జ్ఞానమును పొంది ప్రాప్యస్థానమగు పరమ పదమునకు అర్హుడనయితిని. త్వరలో విశేష కటాక్షము లభించినది. అంతఃకరణము లన్నియు కరిగి దగ్గుత్తిక తీరినది. ఆనంద బాష్పములు దేహమంతయు స్రవింపగా అహోరాత్రములు "శ్రీమన్నారాయణా" అని పిలుచుచున్నాను".

వివరణము: స్వార్థపరులు ఆత్మజ్ఞానము లేనివారు. స్వార్థపరులు దొంగలు, దోపిడి గాండ్రు అవుతారు. కుమార్గములనున్నవాడు ఆత్మవంచకుడు; ఏలయనగా వాడు కుమార్గమున నుండు విషయము అతనికి తెలియనిది కాదు; భోగలాలసుడై కుమార్గముననే ఉంటాడు; ఇది అతని ఆత్మను చెరచును; వాడు ఇతరుల శాంతి జీవనమునకు భంగ కారిగా నుంటాడు. ఆత్మ వంచకుడు, అనగా, అజ్ఞాని ప్రపంచమును వంచిస్తూనే వుంటాడు.

స్వామి అనుగ్రహమున స్వరూప జ్ఞానమును పెంపొందితిని అంటాడు. గీతావిభూతి యోగమున "ఆలోచనాపరుల యొక్క ఆలోచనను నేను" - అని "స్మృతిర్మేధాధ్వతిఃక్షమా". కావున తనమనస్సున గలిగిన మార్పు భగవత్ శక్తివలన లభించినదని భక్తుడు భావిస్తాడు. అ శక్తి తనలో లోపించినపుడే తనకు హీనత్వము సంభవిస్తుంది. ఆ శక్తి తనలో ఎక్కువగా నుండు కొలది తాను యెక్కువగా ఉజ్జీవించును - అందుననే భగవచ్ఛక్తి అనంతకల్యాణ పరిపూర్ణమనబడేది. ఇందు మూఢవిశ్వాసమునకు తావులేదు - మనస్తత్త్వ శాస్త్రీయమే.

ప్రాప్యస్థానమగు పరమపదము చేతనుడు పొందదగిన దివ్యస్థానము. ఏది? ఆ నిర్మల పథము? శరణాగతి భావము. ఈ భావమే పరమ పదము - పరమ పదము మానసికము - పరమానంద అనుభూతి. ఆత్మజ్ఞానమును పొందుటయే పరమపదమును పొందుట. పరమ పదము అనగా చావుకాదు, మరణము తరువాత పొందు మరియొక లోకము కాదు.

ఆళ్వారు యౌవనకాలమున విషయలోలుడుగానుండి, తరువాత ఆత్మజ్ఞానమును పొందినవాడై తక్కిన జీవితమునంతను దివ్యపదమున అనగా మహానందపదమున, అనగా, పరమపదమున గడిపెను - అని భావింపవలయును.

కడపటి వాక్యమున (పాశురభావము నందు) సూచింపబడినదే పరమపదము.

"మరణానంతరము పరమ పదమును పొందెను" అన్నపుడు ఒక భావమున్నది. మంచివాడని జీవతమున అనిపించుకొన్నవాడు గాన మంచివారి శ్రేణిలో పడ్డాడు చరిత్రయందు అని భావము. స్వర్గమును చేరెను సు+వర్గము = మంచివారి శ్రేణిలో చేరెను అని భావము.

అదే విధముగా "పెరుమాళ్ తిరువడిగళు చేరెను" అన్నపుడు రెండు అర్థములు దివ్యమైనవి ఉన్నవి - జీవించియుండగా - స్వామి పాదములకు అంకితుడయి, స్వార్థరహితుడై సేవాభావమున నున్నాడు అని భావము.

మరణించిన తరువాత - స్వామి పాదముల కంకితు లయిన వారు భక్తులు; ఇప్పటికి యెందరో భక్తులు ఈ ప్రపంచమున నుండిపోయిరి కదా - వారి శ్రేణిలో లెక్కింపబడినవాడు - అని భావము.

కావున ఈ విషయములను, అనగా పరమపదము, వైకుంఠము, కైవల్యము, కైలాసము, బ్రహ్మపదము, స్వర్గము, ఆచార్య తిరువడిగళు మొదలగు పదములను, దివ్యార్థములతో గమనించి ఆనందించునది. ఇవి యన్నియు కల్యాణ పదములు.

**6. ఆరవ పాశురము:**

"నాకు ఉపకారకుడును, తండ్రి మొదలగు సకలవిధ బంధువును, ప్రభువును, నా జీవమును, శిష్టరక్షణార్థము దుష్టులసంహరించిన వాడును, అయిన మాస్వామి నిత్యవాసము

చేయు ఉద్యాన వనములును, గొప్ప ప్రాకారములును గల శ్రీరంగ దివ్యద్వీప ప్రదేశమును సేవించినవాడనై, నేను ఉజ్జీవించునట్లు "నారాయణ" నామమును కనుగొంటిని".

వివరణము: ఇందు ప్రపత్తి భావము మెండుగా వర్ణింపబడినది.

ఉద్యానవనములు, గొప్ప ప్రాకారములు గల శ్రీరంగము అన్నపుడు ఆ రెండు మాటలు శ్రీరంగ సౌందర్య గాంభీర్యములను సువ్యక్తము చేయుచున్నవి.

శరణాగతి, ప్రపత్తి భావములు విష్ణు సంశ్లేష భావమును పెంపొందింపజేయును. సంశ్లేష భావమనునది చేతనుని యొక్క మనస్సును సున్నితపరచును; మనస్సునకు చురుకుదనము నిచ్చును, సానుభూతిపరునిగా జేయును, చేతనుడు దయార్ద్ర హృదయు డగును.

సంశ్లేషభావము లేనివానికి దయ, సానుభూతులు లేవు, అతడు కఠినచిత్తుడుగా నుండును, పశ్చాత్తాపగుణము అట్టివానిలో శూన్యము. సంశ్లేషభావము యొక్క ఉజ్జ్వలత్వము, ప్రభావితత్వము ఇవియే.

అర్థమును గమనించి, "నారాయణ" అని స్మరించువాడు విష్ణు సంశ్లేషియగును. అర్థము నెరుగక నోటితో "నారాయణ" అని శబ్దము చేసినవాడు జపమాలపట్టుకొనియున్నను కపట సన్యాసితో సమానము.

సంశ్లేష భావమును పొందుటకు నిర్ణీత కాలముగాని, కట్టు జుట్టు బొట్టు గాని, నియమములుగాని లేవు. మనస్సును నిర్మలముగా ప్రకృతి శోభను ఆనందించుదానినిగా నుంచుకొనుటకు నియమములేదు, సమయము లేదు!

## 7. ఏడవ పాశురము:

"ధనాధికారయుతులారా! మీరు వివాహితులై సంసార జీవితమును గడపుచున్నారేగాని, వాస్తవముగా మీరు గృహస్థ ధర్మము నెరుగరు..... మీరు పూర్వపు దరిద్ర దశను మరచి, ప్రస్తుతపు నూతన

నంపదచే త్రుళ్లుచున్నారు. పండితులు, కవులు మిమ్ముల రక్షకులనియు దాతలనియు ఇష్టానుసారముగ్గా చేయు పొగడ్తల యొక్క శబ్దార్థముల గమనింపరైరి. మీరు వితరణ గుణహీనులుగా నున్నవారలు! నేను చెప్పునది వినుడు, మననము చేసికొనుడు; పుణ్యతీర్థములుగల తిరుక్కొడందను (కుంభకోణమును) సేవింపుడు. శ్రీమన్నారాయణ పదము యొక్క మేలైన అర్థమును తెలిసికొని శ్రీనామ సంకీర్తనగావించుచు ఉజ్జీవింపుడు".

**వివరణము:** ధనాధికార, బలాంధులగు వారికి తగిన బోధన చేయుచున్నాడు ఆళ్వారు.

వివాహము చేసికొని ఆలితో గూడియున్నంత మాత్రమున నీవు సంసారి వవుతావా? గృహస్థుడవవుతావా? ఆ మాటల దివ్యార్థములకు సరిపోయిన జీవితమును గడుపుచున్నావా? ఆలోచింపుము, మూఢసోదరా!

సం+సారము= అధికసారము నిచ్చు సంస్థ. శృంగారివై యుక్తా యుక్తముల నెరిగి అర్ధాంగితో సుఖింపుము. అర్ధాంగిని సుఖపెట్టుము. వంశాంకురము కొరకు సంసారివైతివని మరువకుము - విషయ లోలత్వమునకు పవిత్ర సంసారవ్యవస్థను ఎరవేయకుము - మీ తలిదండ్రుల సంసార వృక్షఫలము నీవు. ఇపుడు నీవు భార్యా సమేతుడవై తల్లిదండ్రులను సుఖపెట్టి నీ సంతానమునకు, లోకమునకు ఆదర్శముగ నిలువుము. ధర్మమార్గమున ఆర్జించి, నీ బిడ్డల ధర్మమార్గమున పెంచి, ధర్మమార్గమునకు వారిని అంకితులను జేయుము. సంసారమును ఆరోగ్యానంద పథముల నడపింపుము. సంసార జీవితమనునది ఒక మనోజ్ఞమయిన కళ. ఇందుత్తీర్ణుడవై, కళాపూర్ణుడవయి, కష్టసుఖముల సమముగా నెంచి, అర్థయుక్తముగా, ఫలప్రదముగా జీవితమును సాగింపుము. అట్టి నీవు సంసారి వనబడగలవు. లేనియెడల నేతి బీరకాయవే!

అదేవిధముగ గృహస్థుడు అను పదము పవిత్రమయినది. ఒక భార్యను కలిగియున్నంత మాత్రమున మగవాడు గృహస్థుడు కానేరడు! గృహము అనబడుదానికి అనేక అంగము లున్నవి - నివాస, యోగ్యమగు కట్టడము, శుచియైన పరిసరములు, వృద్ధులైన తల్లిదండ్రులు, భార్య, ఇతర రక్తబంధువులు, ఉపకారులు, అతిథి అభ్యాగతులు, బిడ్డలు, ఆస్తి, వృత్తి, సంపాదన, వినియోగము మరియు అనేక బాధ్యతలు. ఈ బాధ్యతలలో అతి ముఖ్యమయినవి భార్యను సంతోషపెట్టుట, తల్లిదండ్రులసేవ, బిడ్డల పోషకత్వము, సన్మార్గమున ఆర్జనము, అతిథి ఆచార్య సత్కారములు. ఇందులో కడపటిది అతి ముఖ్యమయినది. అప్పుడే నీవు లోకకల్యాణార్థము జీవించినవాడ వగుదువు..... ఈ మార్గముల యందు సంసారి, గృహస్థు అను పదములకు అర్హుడ వగుము. కాదేని అజాగళస్తనము అవుతావు.

సంసారి, గృహస్థుడు అనబడువాడు ముఖ్యముగా విసర్జింప వలసినవి - దుర్వృత్తి, కోపము, అనాలోచితత్వర, మూర్ఖపు పట్టుదల, పిసినారిత్వము ఆత్మవంచనము.

ప్రతివాడును శ్రమపడి ఆర్థికముగా అభివృద్ధి జెందవలసినదే! జరయు మృతియులేని జనునట్లు ప్రాజ్ఞుండు ధనము విద్య గూర్ప దలప వలయు - అని నీతిశాస్త్రము చెప్పుచున్నది. కాని నీవార్జించినది సద్వినియోగము కొరకు, పరోపకారము కొరకు అనునది మరవవద్దు - ఈ విషయమున ఇక గర్వమునకు తావులేదు - గర్వించిన, పూర్వపుస్థితిని మరచినవాడ వగుదువు - పూర్వపు స్థితిని మరచినవాడు గర్వి, క్రూరుడు, కృతఘ్నుడు అగుటకు అవకాశము లున్నవి. వాడు సంస్కారి అనిపించుకొనడు. కావున చేతనుడు సింహావలోకమును చేసికొనుచు, పూర్వపరముల గమనించుచు ఆలోచనాయుక్తముగా సంఘసేవా తత్పరుడయి జీవింపవలయును.

**"ఏనరునకు విత్తముగల**
**దానరుడు కులీను డధికు డార్యు డతండే।**

**ధీనిధి ధన్యుడు నేర్పరి**
**నానా గుణ గణము కాంచనంబున నిలుచుఁ" ॥**

అని వ్యంగ్యముగా చెప్పబడినది భర్తృహరి సుభాషితమున వాస్తవమే! యాచకులయిన కవిపండితులు యాచన కొరకు నీతిమాలి, హేయమనస్కులై, కుక్కబుద్ధితో కబళమును నిరీక్షించుచు నిన్ను ఇంద్రుడు, చంద్రుడు అని (అనుచితముగా) ప్రశంసించుచున్నారు. వారు పలుకు ప్రశంసావాక్యముల అర్థమును గమనించిన నీవు హేళన చేయబడినట్లు గ్రహింప గలవు. అట్లు కాదేని ఆ పండితులవలె నీవును అవివేకివి, మూఢుడవు!

వితరణగుణమున జీవింపుమని చేతనులకు ఆళ్వారు సూచించు చున్నాడు.

108 దివ్యతిరుపతులలో శ్రీరంగము గొప్పదని ఆళ్వారు లనేకులు వచించినను, అందరు దూరముననున్న శ్రీరంగమును దర్శింపగలరా? దర్శించినను అచ్చట దీర్ఘవాసము, స్థిరవాసము చేయగలరా? భగవంతుడు సర్వాంతర్యామి గావున నీవు ఎక్కడైనను ఈశ్వరశక్తితో సంశ్లేషపడి పవిత్ర జీవితమును గడుపవచ్చును. అట్టి పరిస్థితులలో సర్వ నిధులు నీ చోటుననే యున్నవని నీవు భావింపగలవు. "కోటి నిధులు ధనుష్కోటిలో నుండగ ఏటికి తిరిగెదవే, ఓ మనసా!" అంటాడు త్యాగరాజు ఒక కీర్తనలో -

అట్లే ఉదాహరణకు - తిరుక్కొడంద (కుంభకోణము) నందును పుణ్యతీర్థము లున్నవని అంటాడు ఆళ్వారు.

నారాయణమ్ = నీటిపై విస్తరించిన ప్రాణశక్తి, ఈశ్వరశక్తి (ప్రళయము తరువాత పునస్సృష్టి సందర్భముగా అర్థము)

నారాయణమ్ = జీవములతో, ప్రాణులతో, కూడినది. సర్వాత్మకము. మూర్తిగా భావించినపుడు సర్వాత్మకుడు, నారాయణుడు - అని భావము వస్తుంది. ఈ భావముతో తిరుమంత్రమును ఉచ్చరింపుము.

ఈ పాశురమున ఆళ్వారు అతి విశిష్టముగా చేతనుని నీతి జీవితమునకు, భక్తి జీవితమునకు ప్రేరేపించుచున్నాడు. నీతి జీవితమునకు ప్రథమ స్థానము నిచ్చుచున్నాడు. ఏలాటి ముఢ విశ్వాసములేని భక్తి జీవితమును సూచించుచున్నాడు.

**8. ఎనిమిదవ పాశురము:**

"జ్ఞాన శూన్యుడ నగునేను శాస్త్రాభ్యాసము లేక విషయాసక్తుడ నగుటచే సత్కృత్యముల నెరుగకుంటిని. అనేక ప్రాణుల హింసించితిని. అజ్ఞానమున నున్ననేను దయారహితుడుగా నుంటిని. అట్టి నేను ఇపుడు అకృత్యములనన్నిటిని వదలి, మోక్షాపేక్ష గలిగి, ఉజ్జీవింప వలయునని తలచి, శ్రీమన్నారాయణ నామమును గొప్ప సహాయముగా నాశ్రయించితిని".

**వివరణము:** ప్రాణుల హింసించుట అనగా ప్రాణుల చంపుటయే గాదు - తోటి మానవుని అగౌరవపరచుటయు, అనాదరించుటయు, వంచించుటయు, కృతఘ్నుడుగా ప్రవర్తించుటయు హింసయగును.

"అజ్ఞానమున నుండి దయారహితునిగా నుంటిని" అని చెప్పబడినది కదా! మానవుని లోపభూయిష్టమైన నడతకు అతని అజ్ఞానమే కారణము. తన క్రూరత్వమునకు, తన బాధ్యతా రాహిత్యమునకును, తన గర్వమునకు, అజ్ఞానమే మూల కారణము. సాంఘిక అన్యాయములకు, అసమానత్వములకు, వర్ణద్వేషములకు, అస్పృశ్యత మున్నగు కుమార్గములకు, మానవుని అజ్ఞానమే కారణము. సాంఘిక సేవా తత్పరత కొరకు మానవుడు ఆత్మజ్ఞానమును పొందవలయుననియు, ఈ ఆత్మజ్ఞానము తత్త్వత్రయ జ్ఞానమున లభ్యమగుననియు, అట్టి జ్ఞానమున చేతనుడు స్వార్థరహితుడై లోకకల్యాణార్థము జీవయాత్ర చేయునని శ్రీమద్రామానుజుడు తనవిశిష్టాద్వైత సిద్ధాంతమున బోధించియున్నాడు!

"ఇప్పటి వరకు అపమార్గముల యందు జీవించిన నేను ఇపుడు ఉజ్జీవించుటకు శ్రీమన్నారాయణ నామమును గొప్ప సహాయముగా ఆశ్రయించితిని" - అని యున్నది. కావుననే అది తిరుమంత్రమయినది - మంత్ర రాజమయినది. తిరుమంత్రము శరణాగతి స్వార్థరాహిత్యమును సేవను ప్రేరేపించును గావున.

శ్రీరామానుజ దివ్యవైభవము అను గ్రంథమున ఒక విషయమును గమనిస్తారు. దక్షిణ దేశయాత్ర, అను అధ్యాయమున - ఒక శ్రీవైష్ణవుడు రామానుజునికి ఒక ప్రశ్నవేసినాడు, "స్వామీ నీవు మానవ సౌభ్రాత్రమును బోధించుచున్నావు. కులతత్త్వమను మురికిగుంటలో బడియున్న యీ సంఘమును, అస్పృశ్యత అను దురాచారమును పాటించు ఈ సంఘమును ఉద్ధరించుటకు మీకు ఏమి సాధనము గలదు? మీ ఉద్యమమున మీరు జయము పొందగలమని మీకైన నమ్మకమున్నదా? మీది వృథాప్రయాస, అవుతుందేమో! మీసాధనమేది "అని మరలా అడుగుచున్నాను". శ్రీరామానుజుడు ఇచ్చిన జవాబిది-

"నాసాధనము తిరుమంత్రము. నాతరువాత కూడా ఆచంద్రార్కముగా చేతనులకు వెలుగునిచ్చు మంత్రమది - తిరుమంత్రము ప్రతిపాదించునది శరణాగతి, స్వార్థరాహిత్యము, సేవ కదా! తిరుమంత్రము జపము కొరకు కాదు! దాని భావము ననుసరించి నడచుకొనుటకు! సంఘాభ్యుదయ మునకు దీనిని మించిన మంత్రము లేదు".

శ్రీ వైష్ణవుడు తృప్తిచెందినాడు.

కావున మన జీవితమును ఉజ్జీవింపజేయుటకు తిరుమంత్రము గొప్ప సహాయకారిగదా?

"ఆచార్యుడుగా నున్నవాడు తన శిష్యునకు తిరుమంత్రార్థమును బోధింపవలయును, శిష్యుడు ఆ మంత్రార్థమును తన నిత్య జీవితమున పాటింపవలయును".

కాని మన సంఘమున సామాన్యముగా జరుగునది యిదిగాదు - గురువు శిష్యుని చెవిలో తిరుమంత్రము ఊదుతాడు! కొంతపణము పుచ్చుకొని - దక్షిణ తాంబూలయుక్త భూరిదానము లనుకోండి! తరువాత తిరుమంత్రమును పొందిన శిష్యుడు ఉదయం ఎప్పుడో ఒకసారి పూజ చేయునెపమున ఎవ్వరికి వినబడకుండా ఆ మంత్రమును ఉచ్ఛరిస్తాడు. మరణించు ముసలివాని చెవిలో వేస్తాడు ఇదీ జరిగేది! ఎంత దిగజారుడు! ఎంత అర్థరాహిత్యము! ఎంత అనుచితము! హాస్యాస్పదము!

తారకమంత్రముల జపమనే దంతా యిట్లు తయారైనది కడకు! "కానని వాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువుల్ కానని భంగి" - అయినది! అతి జుగుప్సాకరము! శోచనీయము!

ఇదే విధమున ఏకాక్షరీమంత్రము (ఓం) పంచాక్షరీమంత్రము (నమశ్శివాయ) గురుశిష్యులలో అమలులో నున్నవి. ఎక్కువగా! అర్థము గమనించి నడచుకొనేవారు లేకపోలేదు - అసంఖ్యాకములైన చుక్కలలో చంద్రుడు ప్రత్యేకంగా అగపడినట్లు!

'నమః శివాయ" శివునకు నమస్కరించుచున్నాను - శుభమునకు నమస్కరించుచున్నాను - శుభస్కరునకు నమస్కరించుచున్నాను - శుభము చేయుట అను దృక్పథమునకు నమస్కారము చేయుచున్నాను - శుభమును చేసెదగాక అని యీ భావపరంపర .......

పంచాక్షరీ జపముకొరకు గాదు - నడవడి కొరకు - ఇతరుల శుభమునుకోరి. యితరులకు శుభము చేయుము - నీవును శుభముగా నుందువు, ఆనందముగా నుందువు - "నమఃశివాయ" అను శుభమంత్రమునకు దాసోహము సమర్పింపుము - అని భావము.

ఇది పోయి, పంచాక్షరి గొప్పదా! అష్టాక్షరి గొప్పదా అని పండితులు వితర్కించడం వ్యాకరణ యుక్తముగా అర్థములను దీసి గ్రంథములు వ్రాసి వానికి వేదాంతగ్రంథములని పేరిడడం; శైవులని, వైష్ణవులని సంఘమున వర్గములను సృష్టించడం జరుగుచున్నది. ఒక

మంత్రమును అవలంబించేవారు అనగా మూఢముగా జపము చేయువారు రెండవ మంత్రమును వినకుండా చెవులలో దూది పెట్టుకోవడం జరుగుచున్నది. ఈ అజ్ఞానమును గూర్చి యేమనుకొనవలయును?

అర్థమున ఈ రెండు మంత్రములు ఒకటే కదా!

వైష్ణవుడును, విశిష్టాద్వైతి అనబడు గాయకశిఖామణి, భక్తుడు శ్రీ త్యాగరాజు ఒక కీర్తనను ఇట్లు రచించెను - "శివ శివ యనరాదా! భవభయ బాధల నణచుకోరాదా" అని.

ఋషి వాక్యములు, ఆళ్వారుల వాక్యములు నిజమైన భక్తుల వాక్యములు ఎట్లున్నదో, మనముచూచు అసంఖ్యాక గురువులు, వారి శిష్యులు పరిస్థితి యెట్లున్నదో శాంతముగా సానుభూతితో గమనింపుడు!

తిరుమంగై ఆళ్వారుయొక్క యీ ప్రబంధము (వాడినేఁ -వాడి) చేతనులను ఉద్ధరించుగాక!

## 9. తొమ్మదివ పాశురము:

"శ్రీమన్నారాయణ నామమును అను సంధించువారికి శ్లాఘ్యమగు వంశమును, ఆనందశోభితమగు సంపదయు కలుగును. మరియొకనికి బానిసగానుండు దుఃస్థితులను నశింపజేయును. మహత్తైన పరమ పదమును, దైవకైంకర్యరూప పురుషార్థమును ఇచ్చును. దేహబల, మనోబలములను, మరియు నితర హితము లన్నింటిని ఒసగును. తిరుమంత్రము, కన్నతల్లికంటెను, నిన్నెక్కువగా అభివృద్ధిజేయును. ఇట్టి ఆనందరూపమగు కైంకర్యాదులు నొసగునట్టి శ్రీమన్నారాయణ అను తిరునామము నాకు లభించినది".

**వివరణము:** తిరుమంత్ర ఫలితము ఇచట చెప్పబడినది - తిరుమంత్ర జపఫలితముగాదు - తిరుమంత్రానుసంధాన ఫలము - వీని భేదములను నిశితముగా విమర్శించుకొనుము.

తిరుమంత్ర జపమనగా ఆ మంత్రమును నోటితో జపించుట అని భావము. ఈ జపించువాడు అర్థరహితముగా కూడా జపించువాడుగా నుండవచ్చును. లేదా మనస్సెక్కడనో ఉండగా, పెదవులు ఉచ్చరిస్తూ వుండవచ్చును; అనగా త్రికరణశుద్ధిగా జరుగకుండా ఉండవచ్చును. ఇట్టి మంత్ర జపము నిష్ప్రయోజనము. ఇట్టిదానిని చేయువాడు అజ్ఞాని, మూఢుడు, మూఢభావముల మునిగియున్నవాడు. త్రికరణశుద్ధిగా జరుగనిదే ఏదియు ఫలమునీయదని అందరికిని తెలియును గదా!

ఇచ్చట చెప్పబడినది తిరుమంత్ర అనుసంధానము అనగా తిరుమంత్రమును పలికి, దాని అర్థమును గమనించి, ఆ భావమును క్రియారూపము చేయుట - ఇదియే యిచ్చట చెప్పబడిన అనుసంధానము - జోడింపు - అనుసంధానమనునది కేవలము పెదవులతో ఉచ్చరించుట కాదు.

వేద విషయములు, ప్రస్థానత్రయ విషయములు కేవలము జపరూపమునకు వచ్చియున్న దుఃస్థితి నుండి తప్పించుటకే విశిష్టాద్వైత సిద్ధాంతము వెలువడినది. అందువలన ఆళ్వారాచార్య రచనలన్నింటి కడపట - "దీనిని చదివి అర్థము చేసికొనుము" అను సూచన యివ్వబడి యున్నది.

ఇక తిరుమంత్రమును అనుసంధించుట అనగానేమి? తిరుమంత్రమును దేనితో అనుసంధింపవలయును?

మొదట తిరుమంత్రార్థమును గమనించుట - అనగా "సర్వాంతర్యామి అయిన ఈశ్వరశక్తికి శరణాగతుడనగుచున్నాను" అను భావమును తెలిసికొనుట. తరువాత ఆ భావమునకు యుక్తముగా నీవు శరణాగతి భావమును అవలంబించుట దీనిని క్రియారూపమున పాటించుట - అనగా విశ్వసౌభ్రాత్రము గలిగి, స్వార్థరహితముగా లోకసేవచేయుట - ఇది తిరుమంత్రానుసంధాన మవుతుంది.

ఇట్లు తిరుమంత్రమును అనుసంధించి జీవించువాడు శ్లాఘనీయుడు; ఇతని నాయకత్వముననున్న కుటుంబీకులు శ్లాఘనీయులు; వీరివలన వీరి వంశమును శ్లాఘనీయము అవుతుంది. (అంతేగాని నీవు తిరుమంత్రమును జీవితమున జపిస్తే పైజన్మలో మంచి వంశమున పుట్టుదువు అను భావము తప్పు). ప్రపంచమున ఏ మహనీయుని జీవితమును పరికించినను, ఆయనకు పూర్వము అనామధేయముగా నున్నవంశము, అతని నుండి తరువాత శ్లాఘనీయమయినది.

లోకకల్యాణార్థమైన జీవితమును తిరుమంత్రము ప్రేరేపించును గదా! కావున అట్టివాని సంపద, సేవ, అనుభవములు - ఆనంద దాయకములు సుశోభితములు అగును. సత్కార్యము చేయువానికే గాక ఇతరులకును సంతోషమును కలిగించును. సూర్యుడు తనదివ్య తేజమున ప్రకాశించి శ్లాఘనీయు డగుచున్నాడు. అతని వెలుగును పొంది ప్రపంచము ఉజ్జీవించుచున్నది.

సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తికి శరణాగతుడయినవాడు ఇతర మును గడ్డిపరకగా జూచును, తాను దైవమునకు, భాగవతోత్తములకు దాసుడేగాని, అన్యధన అధికారమదాంధులకు దాసుడగునా? కాడు; అతడు విశ్వమున సర్వస్వతంత్రుడు. ఇతరులకు బానిసయగు దుఃస్థితి అతని మనస్సునకు ఉండదు. కావున తిరుమంత్రమును అనుసంధించు వాడు సర్వస్వతంత్రుడు. తిరుమంత్రమునను సంధించిన పోతనా మాత్యుడు భాగవతమును శ్రీరామున కంకితము జేసెను - "ఇమ్మనుజేశ్వ రాధములకిచ్చి, పురంబులు వాహనంబులుఁ సొమ్ములు కొన్ని పుచ్చుకొని, సొక్కి, శరీరము వాసి, కాలుచే, సమ్మెట ప్రేటులం బడక, సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె, నీ బమ్మెరపోతరాజొకడు, భాగవతమ్ము జగద్ధితంబుగఁ" అట్టి, తిరుమంత్రాను సంధానము చేయునట్టి కవికి దాస్య భావము, లేక బానిసతనము లేదు గదా!

తిరుమంత్రాను సంధానము పరమ పదము నిచ్చును. అనగా, ఆనందస్థితిని కలుగజేయును, అని భావము.

తిరుమంత్రాను సంధానము దైవకైంకర్యరూపమగు పురుషార్థమును ఇచ్చును. తిరుమంత్రగమ్య స్థానము సేవకావున లోకసంగ్రహము కొరకు చేయబడిన సేవయే దైవకైంకర్యమగుచున్నది - దైవమునకు స్థానము ఘటములుగావున. దైవమునకు నైవేద్యమను పేర ఆ నైవేద్యమును భూతరాసులకే కదా యొసంగుచున్నావు - తోటి మానవులకు, పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాదులకు - ఈ ఉద్దేశముతోనే వైష్ణవాలయము లందు వివిధ దైవకైంకర్యములు ప్రవేశపెట్టబడినవి. ఈ దైవకైంకర్య ములన్నియు తోటి మానవుల పోషణ, తృప్తి సంతోషముల కొరకేయని గమనింపుము.

అదనముగా పాఠకులు గమనింపవలసిన విషయము మరియొక టున్నది - ధర్మార్థకామమోక్షములను పురుషార్థములను మానవుడు పాటించుటయు లోకసంగ్రహము కొరకే. అందువలననే మోక్ష విషయము నందును, మోక్ష సన్యాసయోగమును బోధించినాడు గీతాచార్యుడు. శ్రీరామానుజుడు తిరుమంత్రార్థమును బహిరంగముగా ప్రకటించుట మోక్ష సన్న్యాస భావమున గదా! కావున తిరుమంత్రాను సంధానము. చేతనునికి, పురుషార్థమునిచ్చును, అని చెప్పుట సమంజసమయినది.

తిరుమంత్రానుసంధానము మానవునకు మనోనైర్మల్యము నొసంగునుగాన, అతనికి మనోబలము చేకూరును. మనోబలము గలవానికి శరీరబల మబ్బును. ఇక నితరహితములు కూడ చేకూర్చుననుటలో లోకకల్యాణార్థము జీవించువానికి హితమును బోధించుట, హితకార్యములు చేయుటయేగదా తన ఆసక్తి!

తల్లి నీకు శరీరమునే యొసగినది - నీకు రెక్కలువచ్చి నంతవరకు పోషించినది - తరువాత నిన్ను ఉజ్జీవింప జేసినది తిరుమంత్రముగావున తిరుమంత్రము తల్లితో సమానము, తల్లి కంటె మిన్న, తండ్రికి, జగజ్జనకునకున్న తారతమ్యము వంటిదిది.

"ఇట్టి ఆనందకరమై నట్టిదియు, ఫలప్రదమైనట్టియు, నన్ను సత్కార్యములకు అనగా దైవకైంకర్యములకు ప్రోత్సహించు తిరుమంత్రము నాకు అబ్బినది" అని ఆళ్వారు సంతోషమున తన్నుతాను అభినందించుకొనుచున్నాడు!

## 10. పదియవ పాశురము:

"మేఘసంచారముగల ఉన్నతమయిన తోపులును, తుమ్మెదల ఝుంకారమును, జలసమృద్ధి గల తిరుమంగై వాసులయిన దాసులు గమనింప వలసినదేమనగా - "తనకు రక్షకముగా నున్న నందకమును ధరించి యున్న తిరుమంగై ఆళ్వారు దివ్యముగా సాధించినట్టియు, నిత్యసూరి యోగ్యమగు తిరుమొళి ప్రబంధమును అవసాన కాలమందును, దుఃఖ సమయములందును స్మరించిన వారు శోక విముక్తులగుదురు. ఉచ్చరించిన క్షేమము కలుగును. శ్రీమన్నారాయణ నామస్మరణము మన పాపమును సకల విధముల హరింప జేయును సుమా".

**వివరణము:** తన జన్మస్థలమైన తిరుమంగైని ఒకసారి స్మరించు కుంటాడు ఆళ్వారు. వారు శ్రీరంగవాసులై చాల కాలమయినది గదా! 24, 25 సంవత్సరముల వయస్సులో తిరుమంగైను వదలి, శ్రీరంగము చేరి, అచ్చట తన తొంబది సంవత్సరముల వయస్సు వరకు జీవించెను. ప్రబంధాంతమున స్వీయ స్థలము, స్వీయప్రజలు స్మరణకు వచ్చినారు! వారికి మంగళాశాసము పలికినాడు! వారు తిరుమంత్రమును పాటించ వలయునని ఆళ్వారు కోరుతాడు! మధురదివ్య స్మృతి!

అవసాన కాలముననను, దుఃఖ సమయములందును నీవు కార్యోన్ముఖడవు కాకున్నను, తిరుమంత్ర జ్ఞానము నీ మనస్సునకు ధైర్యమును శాంతిని కలుగజేయును - నీకు ఆత్మ జ్ఞానము నొసంగును. ఇక ఆత్మజ్ఞాని దేనికి దుఃఖపడడు, సుఖదుఃఖములు, జీవన్మరణ ములు సమానమతనికి; అవి భక్తునకు ప్రకృతి లక్షణములు.

ఆత్మ జ్ఞానము జరిగిన పాపముల విషయమున నిన్ను పశ్చాతప్తుని జేయును, ఇక పాపముల నుండి దూరము చేయును. అది తిరమంత్ర విశిష్టత!

తిరుమంగై ఆళ్వారు రచించిన "వాడినేౕ వాడి" అను పది పాశురముల దివ్య ప్రబంధము యొక్క వివరణము పూర్తి అయినది. భక్తులు దీనిని పఠించి నూతన దివ్యోద్దేశములను గూడా బడయగలరు!

"ఓం నమో నారాయణాయ".

శ్రీ పెరియపెరుమాళ్ శరణం ప్రపద్యే
శ్రీ తిరుమంగై ఆళ్వార్ తిరువడి గళే శరణమ్

శ్రీమతే రామానుజాయ నమః

# 4. తిరుప్పల్లాండు

## (మంగళాశాసనము)

"తిరుప్పల్లాండు" ప్రబంధము పెరియాళ్వారు వచించిన మంగళా శాసనము. ఎవరికి? సర్వాంతర్యామి ఈశ్వరశక్తి యయిన శ్రీమన్నారాయణునకే! ఇది అతి విచిత్రమునై యున్నది కదా? ఈ అధ్యాయమున ఈ విచిత్ర సంఘటనను గూర్చి, అనగా పెరియాళ్వారు శ్రీమహా విష్ణువును సంబోధించి, తిరుప్పల్లాండు పలికిన విధమును గూర్చి; మరియు తిరుప్పల్లాండు భావమును పాఠకులు విశదముగా తెలిసికొనగలరు.

పెరియాళ్వారు యొక్క బాల్యనామము తెలియదు, అసలు వారి జన్మస్థలము, వారి తల్లిదండ్రుల వివరములు కూడా తెలియవు. ఒక్క విషయము నిర్ధారణమయినది - అతడు బ్రాహ్మణ కులజుడు. బాల్యముననే 12 సంవత్సరముల వయస్సుననే శ్రీ విల్లిపుత్తూరు చేరి, అచ్చటి శ్రీకృష్ణాలయమును, దానికి సంబంధించిన ఉద్యానవనమును తన నివాసస్థానముగా జేసికొని, యెల్లప్పుడు భగవన్నామ సంకీర్తనము గావించుకొనుచు, ఆనందమయుడుగా నుండువాడు.

ప్రజలు అతడు మహాభక్తుడని భావించి, ఆయనతో ఎట్టి సంభాషణలు జరుపక, ఆయన నెంతో గౌరవించెడువారు. ఆయన యెల్లప్పుడు ఏకాంతముగా కాలము గడపువాడు.

ఈతని మనస్సు బాల్యము నుండియు విష్ణువుపై నెల్లప్పుడు లగ్నమైయున్నందున, ఇతనికి విష్ణుచిత్తుడని పేరు వచ్చెను. బ్రాహ్మణ కులజులలో అట్టి భక్తుడు కానరామిం జేసి, అతనిని అందరు ద్విజకుల తిలకం అనుచుండిరి. తర్వాత అనన్యమయినట్టి ఆయన భక్తి భావమున అతనికి పెరియాళ్వారు అను పేరు అబ్బినది. వీనికి సంబంధించిన వివరములను ఈ అధ్యాయమునందే పాఠకులు చదువగలరు.

పెరియాళ్వారు విష్ణురథాంశమున అవతరించిన వారని భక్తులు భావింతురు. ఇతడు క్రీ.శ. 8వ శతాబ్ది ప్రారంభమున జన్మించిన వారని భావింపబడుచున్నది.

పూర్వము 8వ శతాబ్ది ప్రారంభమున దక్షిణ ద్రావిడ దేశమున మధురానగరము ముఖ్యపట్టణముగా జేసికొని శ్రీవల్లభదేవుడు అనురాజు పాలించుచుండెను. అతడు మహాధార్మికుడు, దైవభక్తుడు.

ఒకనాటి రాత్రి తన గూఢచారులతో గూడి రహస్య వేషమున పరిపాలనా వ్యవహారములను ప్రజల స్థితిగతులను రహస్యముగా తెలిసికొనుటకు గాను, రాజు పట్టణ వీధులందు పోవుచుండెను. వీధి ప్రక్క ఒక సత్రపు టరుగుపై నొక సన్యాసి పరుండి యుండెను.

"నీవెడవు" అని రాజు ప్రశ్నించెను.

"అయ్యా నేనొక బ్రాహ్మణ పండితుడను. కాశీయాత్రకుపోయి గంగాస్నానమొనర్చి, తిరిగి దక్షిణముగా ప్రయాణించుచున్నాను. రామేశ్వరమున సముద్ర స్నానము చేసి తరువాత నా స్వగృహము చేరగలను", అను ఆళ్వార్ జవాబిచ్చెను.

"అట్లయిన నీకులమునకు, నీ పాండిత్యమునకు దోడు విపుల దేశయాత్రలు జేసిన నీవు, మహాజ్ఞానివిగా నుందువని భావించెద. ఒక్కశ్లోక రత్నమును వినిపించెదవా?" అని రాజు కోరెను.

"అట్లనా? ప్రత్యేకించి ఒక శ్లోకరత్నమును వినిపించుటకే యీ పట్టణమున ఆగితిని. ఈ పట్టణము నేలు ప్రభువు ధార్మికుడని, జ్ఞాని అని, పండితుడని వినియున్నాను. వారిసభలో ఒక వేదాంత చర్చను చేయించుటకు ప్రత్యేకించి ఒక శ్లోకరత్నమును తెచ్చియున్నాను. నా మనస్సున పదిలముగా నుంచుకొని యున్నాడ. రేపో మాపో రాజాస్థానమున జరుగబోవు వేదాంత గోష్ఠికిరండు వినుడు" అని ఆ పండితుడు పలికెను.

"ఆర్యా, మంచిది - దయతో ఆ శ్లోకమును ముందుగానే నా చెవిన వేయకూడదా? రహస్యమా?" అని రాజనెను.

"అయ్యో, రహస్యమేమున్నది, బహిరంగసభలో చర్చింప బడునని చెప్పినాను గదా! నీకు అంత ఆసక్తియున్న చెప్పెదను, వినుము" అని అనుచు ఆ ఉద్దండ సంస్కృత పండితుడు శ్లోకమును ఈ విధమున చెప్పెను.

**శ్లో॥ వర్షార్థమష్టౌ ప్రయతేత మాసా౯**
**నిశార్థమర్థం దివసంయతేత।**
**వార్థక్య హేతో ర్వయసానవేన**
**పరత్ర హేతో రిహ జన్మ నాచ॥**

*(తా॥ వర్షాకాలమునకు కావలసిన వస్తువులను ఎండకాలమందును, రాత్రికి కావలసిన వానిని పగటిపూటను ముసలితనమునకు కావలసిన వానిని ఇహమందును సేకరించు కొనవలయును.)*

శ్రీవల్లభదేవ మహారాజు శ్లోకార్థమునకు మిక్కిలి సంతసించి, కడపటి పంక్తికి వ్యాఖ్యానము చేయించవలయును కదా అని భావించి, గొప్ప ఆసక్తిని పొందెను.

'ఓ పండితవర్యా - ఇచ్చటి ప్రభువునకు వేదాంతార్థములనిన అతి శ్రద్ధ. సహజముగా వారు మిమ్ముల గౌరవించి ఆదరింతురు. మంచిది, అట్లే చేయుడు. రాజదర్శనము గావింపుడు," అని చెప్పి రాజు వెడలిపోయెను.

మరునాడు సంస్కృత పండితుని రాజు గౌరవించడం, పండితుడు శ్లోకమును వచించి, రాజాస్థానమున గల పండితులచే వ్యాఖ్యానింప జేయించవలయునని కోరడం, రాజు సమ్మతించడం, నాల్గవ దినమున సభయేర్పాటుగునని నిర్ణయింపబడడము జరిగిపోయినది.

ఈ విషయమును రాజు ఆస్థాన గౌరవ విషయముగా తలంచెను. తన ఆస్థానపండితులచే చర్చింపజేసి, వచ్చిన ఉద్దండ పండితుని మెప్పింపవలయునని రాజు సంకల్పించెను. మరియు శ్లోకము యొక్క నాల్గవ పాదార్థ రహస్యమును కనుగొన వలయుననియు రాజు మిక్కిలిగా కుతూహలపడెను.

రాజాస్థాన పురోహితుడును, గొప్ప పండితుడును అయిన శెల్వనంబిని రాజు పిలిపించి, "పురుషార్థ నిర్ణయోపాయంబెట్లు?" అని రాజు ప్రశ్నించెను.

"ధర్మజ్ఞ సమయం ప్రమాణం - అన్నట్లు ధర్మజ్ఞులయిన పెద్దల సమావేశపరచి, వేదార్థ నిర్ణయంబొనర్చి, దానివలన పురుషార్థ నిర్ణయమును జరుపవలసియుండును", అని శెల్వనంబి విన్నవించెను.

పురోహితుని సలహా ననుసరించి, రాజు గొప్పధనమును విద్యా శుల్కముగా నిర్ణయించి, విద్యాంసుల నెల్లర పిలిపించి, పురుషార్థ నిర్ణయమును చేసినవారు విద్యాశుల్కమును స్వీకరించవచ్చునని నిర్ణయించెను.

నిర్ణీతకాలమున రాజుదర్బారునందు పండితులెల్లరు సమావేశమై యుండిరి. ఉద్దండ సంస్కృత పండితుడును, రాజదంపతులును కుతూహలముతో నాసీనులైయుండిరి.

అంతకు పూర్వము ఒక ముఖ్యఘట్టము జరిగినది. ఆలోచనా పరుడైన పురోహితుడు శెల్వనంబి, రాజునకొక మనవి జేసియుండెను - "రాజా, సత్యార్థ నిర్ణయమునకు కేవలము విద్యా నిపుణత, తర్కకౌశలము చాలవు. మహానుభావుడైన భక్తునకే సత్యము వశమైయుండగలదు. నాకు జూడ ఈ విషయమును నిర్ణయింపగలిగినవారు మన ఆస్థానమునకు అరుగుదెంచు వారలలో నెవ్వరు ఉండరని నా భావము. నేనును చాలనని వినయపూర్వకముగా నుడివెదను - మన శ్రీ విల్లిపుత్తూరు శ్రీకృష్ణాలయ ప్రాంగణమున

నివసించుచున్న ఆ యువ భక్త శిఖామణి యీ సత్య నిర్ణయమునకు తగినవాడని నా అంతర్వాణి పలుకుచున్నది". అని. రాజు యువ భక్తుని రావింప, నతడు రాజుతో, "ప్రభూ, నేను పండితుడగాను, తర్కవేత్తను గాను. ఏదో భక్తి భావమున దైవనామసంకీర్తన చేయువాడను", అని అనెను. అందులకు రాజదంపతులు ఏక కంఠమున, "భక్త శిఖామణి! సత్య నిర్ణయము నీవలననే జరుగగలదని మా నమ్మకము. నీ సహకారమున రాజాస్థాన గౌరవము నిల్చునని మా విశ్వాసము. తప్పక ఈ పండిత గోష్ఠియందు పాల్గొనుడు" అని అభ్యర్థించిరి. బాలభక్తుడు సవినయముగా ఆసీనుడైయుండెను. శెల్వనంబి ప్రోత్సాహమున, రాజు తన్నాహ్వానించెననియు, ఇక జరుగవలసినదెల్ల శ్రీకృష్ణుని భారమని బాలభక్తుడు నిర్ణయించుకొనెను.

చర్చ ప్రారంభించు సమయమాసన్నమయినది. సంస్కృత ఉద్దండ పండితుడు రాజునాజ్ఞను బడసి, తన శ్లోకరత్నమును బిగ్గరగా చదివెను.

పండితులెల్లరు ఒకరి ముఖమునొకరు చూచుచుండిరే గాని, కొంతతడవు ఎవ్వరును భాషింప ప్రారంభించలేదు. బాలభక్తుడు మాత్రము భక్త్యావేశమున కూర్చొని యుండెను. అతని ముఖము భక్తి ప్రభావమున దేదీప్యమానముగా వెలుగుచుండెను.

దర్బారు నిశ్శబ్దముగా నున్నది, నిశ్శబ్దమునకును కొంత తడవు, కొంత గడువు అనునవి యున్నవి గదా! నిశ్శబ్దము ఇట్టి విద్యాగోష్ఠులందు ఓటమినే సూచించును. ఇప్పట్లో ఏ పండితునైనను రాజు వేలెత్తిచూపి, చర్చింపుడని అడుగుట చచ్చిన పామును మరల కర్రతో మోదినట్లగును, సానుభూతియు సంస్కారముగల రాజు అట్లు చేయునా?

ఎటూ దోచక, రాజు పురోహితుడు శెల్వనంబి వైపు చూడగా, శెల్వనంబి బాలభక్తుని వైపు చూచెను. వెంటనే ప్రభువు బిగ్గరగా, ప్రేమ యుక్తముగా "బాల భక్త శిఖామణి - ఇక తమరు ఈ విషయమును చర్చించి, పురషార్థమును నిర్ణయింపుడ"ని పలికెను.

భక్తియుక్తముగా బాలభక్తుడు నిలువబడెను. అతడు ప్రభాత సూర్యుని వలె వెలుగొందుచున్నాడు. మాట్లాడనుపక్రమించుచున్నాడు. భగవానుల అనుగ్రహమున వాల్మీకి రామాయణమును వచించిన విధముననను, శ్రీ విష్ణుమూర్తి పాంచజన్యస్పర్శచే ధ్రువుడు సర్వజ్ఞుడయిన విధముననను, శ్రీనృసింహుని కరుణా కటాక్షమున ప్రహ్లాదుడు ఉత్సాహముతో నారాయణుని స్తుతించినట్లును, వటపత్రశాయి శ్రీకృష్ణుని అనుగ్రహమున విష్ణుచిత్తుడు అయిన ఆ బాల పండితుడు, పవిత్రమయిన తన పెదవిని విప్పి, ఉపన్యసింప దొడగెను. అతడు పరమార్థమును గూర్చి, పురుషార్థ ప్రాప్తిని గూర్చి, సకల వేదాంతతాత్పర్యమును సాక్షాత్కరింపజేసి, ప్రతిపాదింపగా అందరును ఆశ్చర్య చకితులయిరి.

ఉద్దండ పండితుడు రాజుతో, "ఈ భక్తశిఖామణి అపర సరస్వతి. స్వాచార్యుడు, సర్వజ్ఞుడుగా కన్పడుచున్నాడు. వీరి సమక్షమున నేను, సముద్రమున నొక నీటి బొట్టును", అని పలుకుచు బాలభక్తుని పాదములపై బడెను. రాజుపరమానందముతో శుల్కధనమును బాలభక్తునకివ్వబోగా, "రాజా! నేను సర్వసంగపరిత్యాగిని, శ్రీమన్నారాయణ పాదయుగ్మ రుక్మము నావశమైయున్న, ఈ నాణెముల మూట నాకేల?" అని బాలభక్తుడనెనను, "నేను నీకు ప్రత్యుత్తరమివ్వజాలను, నాకోర్కెను మన్నింపుము. నిన్ను గజారోహణుని గావించి ఉత్సవము జరిపి నా కన్నులకు పర్వము చేయ సంకల్పించితిని. సమ్మతింపుడు" అని రాజు ప్రార్థించెను.

బాలభక్త శిఖామణి యొక్క గజారోహణ మహోత్సవము గంభీరముగా వైభవోపేతముగా అసంఖ్యాక ప్రజాబృందము సందర్శించుచుండగా రాజు వీథులందు సాగిపోవుచుండగా, రాజ దంపతులును, పండితులును, మంత్రులును ఉన్నతోద్యోగులును గజమున కిరువైపుల నడచుచుండిరి.

మహా భక్తుడయిన బాలభక్త శిఖామణి యిది అంతయు దైవమాయ అని తలచుచూ, విష్ణుసంశ్లేషభావమున, తన కెదురుగా ఆకాశమున, కుమారుని వైభవమును తల్లిదండ్రులు చూచి ఆనందించు తెరగున, లక్ష్మీ నారాయణులు, అనంతాది నూరిజనులతోను, బ్రహ్మాది నమస్త దేవబృందముతోను, వేంచేసియున్నట్లు భావించుకొని, పరమానందముతో, అతడు భక్తి పారవశ్యమున "తిరుప్పల్లాండు" గానము చేయదొడగెను. తన స్వయం నమృద్ధికి ఉప్పొంగక, భగవదనుగ్రహముచే తనకు గల్గిన గౌరవానందములకు శరణాగతి భావమును పూని, భగవంతుని సర్వశక్తిత్వ సర్వరక్షకత్వాను సంధానము చేయుటకు ముందు, తనకు ప్రత్యక్షమయిన త్రిభువన సౌందర్యమును చూచి, ఆనందించుచూ, కాలాతీతమైనట్టియు అవాఙ్మానస గోచరమైనట్టియు, భగవంతుని అనంతకల్యాణగుణ విభవ సౌందర్య సౌకుమార్యములు కొదువ పడక, శాశ్వతముగా వర్థిల్ల వలయునని మంగళాశాసన పూర్వకముగా "తిరుప్పల్లాండు" ను గానము చేసినాడు ఆ బాలభక్త శిరోమణి.

అతని విష్ణు సంశ్లేష భావమునకు ఆనందించిన శ్రీవల్లభదేవ మహారాజు బాలభక్తశిరోమణిని ఆలింగనము చేసికొని, నీవు "విష్ణు చిత్తుడవు" అని పలికెను. ఆనాటి నుండి అతడు విష్ణుచిత్తుడు, ద్విజకుల తిలకమను నామధేయముల ఆ భక్త శిరోమణి పిలువ బడుచుండెను.

తరువాత చాల కాలమునకు, విష్ణుచిత్తునకు అయోనిజ అయిన బాలిక తులసివనమున దొరకుటయు, ఆమెకు గోదాదేవి అను నామకరణము చేయుటయు జరిగినది. గోదాదేవి విష్ణుసంశ్లేష భావమున పెరిగి పెద్దదై, మహా భక్తురాలును, పండితురాలును అగుటయు, ఆమె శ్రీరంగనాథునే వలచి, పరిణయమాడి, స్వామిలో ఐక్యమగుటయు, గోదాదేవి ఆండాళ్ అను నామధేయమున ఒక ఆళ్వారుగా ప్రబంధములలో వెలుగొందుటయు జరిగినది. తిరుప్పావై ప్రబంధమును రచించినది ఆండాళ్ కదా!

ఈ సందర్భమున తన కుమార్తె ఆండాళ్, వలచి స్వామియం దైక్యమయినందున విష్ణుచిత్తుడు స్వామికే మాయ యగుటం జేసి, వల్లభదేవ మహారాజు ఇతర భక్తులు విష్ణుచిత్తుని పెరియాళ్వార్ అని పిలిచిరి. పెరియాళ్వారు అనగా ఆళ్వారులందరిలో పెద్దవాడు - అని భావము.

పెరియాళ్వారును, వైష్ణవభక్తులు ఈ విధముగా స్తుతించెదరు:

**శ్లో॥ మిథునే స్వాతిజం విష్ణో**
**రథాంశం ధన్వినః పురే॥**
**ప్రపద్యే శ్వశురం విష్ణో**
**ర్విష్ణు చిత్తం పురశ్శిఖం॥**

**శ్లో॥ గురుముఖ మనధీత్య ప్రాహ వేదా న శేషాః**
**నరపతి పరిక్లృప్తం శుల్క మదాతుకామః**
**శ్వశుర మమర వంద్యం రంగనాథస్య సాక్షాత్**
**ద్విజకుల తిలకం తం విష్ణుచిత్తం నమామి॥**

(ఈ శ్లోకము శ్రీ నాథమునుల వారిది)

**తాత్పర్యము:** ఏ పెరియాళ్వారు - శ్రీ వల్లభదేవుడను రాజుచేత ఏర్పరుపబడిన శుల్కమును గ్రహించుటకై, ఆచార్య సన్నిధిని అభ్యసింపకయే కొరతలేని వేదజ్ఞానమును ఉపన్యసించిరో, శ్రీరంగ నాయకులకు ప్రత్యక్షముగా మామగారయిరో, దేవతలచేత సైతము సేవింపదగినవాడో, ద్విజోత్తముడో - ఆ పెరియాళ్వారులకు నమస్కారము సమర్పించుచున్నాను.

పెరియాళ్వారు వచించిన తిరుప్పల్లాండు ప్రబంధమున 12 తమిళ పాశురములున్నవి. వాని భావమును గమనింతము గాక. మచ్చునకు మొదటి పాశురమును వ్రాసి తాత్పర్యమును నొసగెద. తరువాత 11 పాశురములకు భావమును మాత్రమే యిచ్చెదను. తమిళభాష తెలియనివారు కూడ వారికున్న భక్తిభావమున మొదటి పాశురమును

వల్లించుచుందురు. వైష్ణవాలయములందు మంగళహారతి యివ్వబడగానే తిరుప్పల్లాండు చదువబడుట భక్తు లెరుగుదురు.

**1. మొదటి పాశురము:**

**"పల్లాండు పల్లాండు పల్లాయి రత్తాండు।**
**పలకోడి నూరాయిరం**
**మల్లాణ్డ తిణ్డోళ్ మణి వణ్ణావు౹౹**
**శేవడి శెవ్వి తిరుక్కాప్పు॥"**

**భావము:**

"మల్లుల జయించిన శ్యామసుందరా! అనేక సంవత్సరములు, అనేక వేల సంవత్సరములు, అనేక కోటి సంవత్సరముల కాలము వరకు, అనగా, శాశ్వతముగా, నీయొక్క ఎర్రతామరల వంటి పాదయుగ్మ సౌందర్యమునకు రక్ష కలుగుగాక!"

వివరణము: "శాశ్వతముగా స్వామి పాదయుగ్మ సౌందర్యమునకు రక్ష కలుగుగాక" అని చెప్పుట చేత, "పల్లాండు" అను పాశురప్రథమ శబ్దము "తిరప్పల్లాండు" అనబడి, మంగళాశాసనము అగుచున్నది.

భగవంతునకా? భక్తుడు మంగళాశాసనము పలుకునది? అని కొందరు అచ్చెరు వందుదురు. అవును, భగవంతునకే, వారి అనంత కల్యాణ గుణములకు. కల్యాణగుణములు చేతనులలో నుండవలయును, శాశ్వతముగా ఉండవలయును అని ఆళ్వారుల భావము. సర్వాత్మకుని అనంత కల్యాణగుణములకు మంగళా శాసనము చేయుట అనగా, సర్వజీవులు మంగళకర గుణములు కలిగి యుండవలయు నను కోరిక వెల్లడించుట. కావున భగవంతునకు మంగళా శాసనము చేయుట విశ్వమునకు, విశ్వగతికి, విశ్వములోని ప్రాణులందరుకు మంగళా శాసనము పలికిన ట్లగును. ఇది తిరుప్పల్లాండు యొక్క విశిష్టత. (ఇంతకు పూర్వము ఈ గ్రంథమున

త్యాగరాజ కీర్తనను గూర్చి తెలుపు సందర్భమున - "శివ శివ అనరాదా" అను ఉదాహరణమిచ్చినాను.

ప్రపంచమునకు మంగళా శాసనము చేయుము అని భావము.

తిరుప్పల్లాండు శబ్దమున తత్త్వత్రయ జ్ఞానము, విశిష్టాద్వైత సిద్ధాంత సారము ఇమిడియున్నది.

భగవద్విషయముగా కృష్ణావతార విషయమును ఆళ్వారు స్మరించినాడు. అని అవతారములు వారికి అభేదములు. సర్వంతర్యామియగు ఈశ్వరశక్తి యొక్క లీలలు అవి అన్నియును, అని వారి భావము. బాల్యము నుండి శ్రీవిల్లిపుత్తూరునందలి శ్రీకృష్ణాలయమున నున్నవాడు గావున, దైవశక్తికి సంకేతము కృష్ణుడే అవుతాడు ఆళ్వారుకు. జ్ఞాని యయిన ఆళ్వారుకు బహుశః గీతాచార్యుని అవతారమే ఎక్కువ మురిపెమును గూర్చినదేమో!

శాశ్వతముగా - అను కాలనిర్ణయమును దెల్పుటకు - అనగా కాల నిర్ణయమే లేదుగదా - ఆళ్వారు, తిక్కమక్కా, పడి, మొదటి రెండు చరణముల పలికినట్లున్నారు. భగవచ్ఛక్తి ముందు తానొక అమాయకుడయిన బాలుడుగా భావించుకొని, ఈ శాశ్వత కాలగతిని తెల్పుటకు, వచ్చిరాని మాటలతో, తొట్రుపాటు పడుతూ - ఆళ్వారు మంగళా శాసనమును గావించుచున్నాడు.

స్వామి పాదములు సేవకు, సేవాభావమునకు సంకేతములు. సేవా భావము ఉజ్జ్వలమయినది. సేవ సంఘమును ఉజ్జీవింప జేయును; సేవాతత్పరత చేతనుని ఉజ్జీవింపజేయును; ప్రకాశింప జేయును. అందువలన స్వామి పదములు ఎఱ్ఱతామరల ప్రకాశమునకు పోల్పబడినవి.

సేవ సౌందర్య గుణము, సేవాతత్పరతయే చేతనునకు భూషణము. అందువలన సేవకు సంకేతమయిన పాదముల సౌందర్యము తెలుపబడినది.

సేవాతత్పరులు కానివారి యొక్క సంఘమునకు సౌందర్యము లేదు, సుఖములేదు, సద్గతియు లేదు.

ఒక్క వాక్యములో చెప్పవలయునంటే "చేతనులు సేవాతత్పరత్వ దివ్య గుణమును శాశ్వతముగా కలిగి యుందురుగాక" - అనునది యీ పాశుర భావము.

కావున సర్వేశ్వరునకు మంగళాశాసనమనగా నేమో భక్తులు ఇపుడు గుర్తించుకొనగలరు!

ఇదే విధమున రాబోవు పాశురములందు వర్ణింపబడు దైవకల్యాణ గుణములన్నియు మానవులు కలిగియుందురుగాక - అను భావమును వెల్లడిచేస్తాడు ఆళ్వారు.

**2. రెండవ పాశురము:**

"మనము ఉభయులము విశ్లేషము లేక, శత సహస్రాద్య సంఖ్యాక మగు కాలతత్త్వముండు పర్యంతము నిత్యమై యుండునట్లును, నీ కుడి వక్షఃస్థలమున వాసము చేయుచున్న లక్ష్మియు, చక్కదనముచే సంపూర్ణ ప్రకాశముగలట్టి నీ దక్షిణ హస్తమున ప్రకాశించు సుదర్శన చక్రమును, యుద్ధ మందు ధ్వనించెడి పాంచజన్య శంఖమును, నిన్నెడ బాయక శతసహస్రాద్య సంఖ్యాకంబగు కాలతత్త్వ ముండువరకు నిత్యమై యుండునట్లును కోరి మంగళా శాసనము చేయుచున్నాను".

**వివరణము:** తత్త్వత్రయ జ్ఞానము ప్రకారము చిత్, అచిత్, ఈశ్వర అను తత్త్వత్రయము ఎల్లప్పుడును సంశ్లేషమున నున్నవి. చిత్ అయిన చేతనుడు ఎల్లపుడు ఈశ్వరశక్తితో తనకున్న సంశ్లేషమును మరువరాదు. ఇదియే ఆత్మజ్ఞానము. చేతనులు ఎల్లప్పటికి ఆత్మజ్ఞానమున జీవింప వలయునని ఆళ్వారు కోరుచున్నాడు. ఎంతటి మంగళా శాసనము లోకకల్యాణము కొరకు?

ఈశ్వరశక్తితో సంశ్లేషించు చేతనుడు ఆత్మజ్ఞానమును కలిగియుండుటకు తోడు, ఈ ప్రపంచమునందలి సర్వసంపదయు ఈశ్వరశక్తిచే నిలిచి యున్నదనియు, కాలము శబ్దము ఆదిమధ్యాంత రహితములుగాన ఈశ్వరశక్తికి సంకేతము లనియు మానవు డెల్లప్పుడును గమనించుగాక!

కాల ప్రవాహమున జరుగుయేం విషయమును గాని సమమనస్సున గ్రహించి, కాలము శుభమునే కలుగజేయునని భావించు ఆళ్వారునకు, మారుచున్న కాలము, మారుచున్న సర్వము సుదర్శనముగానే యుండును. అన్నిటి యందును అందమును, ఆనందమును చూస్తాడు ఆళ్వారు. మార్పును మిథ్య అనడు.

విశ్వమున జరుగు ప్రతి సంఘర్షణ శబ్దముతో గూడినది గదా? శబ్దము జీవమునకు సంకేతము! శబ్దము సర్వంతర్యామి.

చేతనుడు తత్త్వత్రయ జ్ఞానము నెరిగి, ఆత్మజ్ఞానమున, అనగా ఈశ్వర శక్తితో సంశ్లేషపడి, జీవించుగాక అని ఆళ్వారు మంగళా శాసనమును (తిరుప్పల్లాండును) పలుకుచున్నాడు. ఆళ్వారు ఐశ్వర్యమునను, ఆత్మజ్ఞానమునను, ఆనందమునను లోకకల్యాణమే కోరుచున్నాడు! ఇదియే తిరుప్పల్లాండు యొక్క విశిష్టత! ఇందువలననే విష్ణ్వాలయమందు స్వామికి కర్పూర నీరాజనము జరుగగానే తిరుప్పల్లాండు పఠింప బడుచున్నది!

**3. మూడవ పాశురము:**

"అత్యంత సుఖానురూపమగు దాస్యమును (సేవా భావమును) పొంది దృఢముగా నున్నట్టి వారే, ప్రపత్తిపరులమగు మా గోష్ఠిలో చేరగలరు.

ప్రయోజనాంతరపరులు, అన్నమునకు దాస్యమును పొందువారు మాలో చేరజాలరు.

ప్రపత్తిపరులమగు మేము దేవాంతర, మంత్రాంతర, సాధనాంతర, ప్రయోజనాంతర (లాభసాటి) దోషములు లేనివారము.

మేము మోక్షసన్న్యాస యోగులము. ఇతరుల క్షేమమును కోరి, లోకకల్యాణము కొరకు - దైవమునకు మేము ప్రపన్నులమైనట్టి వారము.

లంకాపురిలోని రాక్షసుల నందరను దునుమాడిన పురుషోత్తము నకు మంగళాశాసనమును (తిరుప్పల్లాండును) పలుకుచున్నాను".

**వివరణము:** పైని ఉదాహరింపబడిన 3,4 వాక్యములందు ప్రపత్తి పరులగు భక్తులెట్టివారో క్లుప్తముగా సూటిగా వర్ణిపబడినది. ఇదే విపులముగా గీతా భక్తియోగమున వర్ణింపబడియున్నది.

ప్రపత్తి పరులగు వారు దోషచతుష్టయమునకు దూరముగా నున్నారు - ఈ దోషచతుష్టయమును పరిశీలింతము: కొందరు అనేక దేవతల గూర్చి యేదేదో చెప్పుదోషము గలవారు. కొందరు ఏవేవో మంత్రములని, వాని జపములని, వాని ఫలితములని ప్రగల్భము లాడుచు, లోకమును వంచించు దోషమున గలవారు. కొందరు ఆ యోగము, ఈ యోగము, యోగసాధన మున్నగు, వారికి తెలియని, వారు పాటింపలేని విషయముల జెప్పుచు, మానవులను వంచించు దోషము గలవారు. కొందరు వారి స్వలాభము కొరకు ఏమయినను చెప్పుట, యేమయినను చేయుట అను దోషము గలవారు. ఇవి దోషచతుష్టయము; వీరు దోషిచతుష్టయమున బడువారు నాల్గువిధములయిన దోషులు. వీరు, అల్ప సంస్కృత పదజ్ఞానముతో, వాని అర్థమెరుగక, అజ్ఞానులగు సోదరమానవులను, వారి మూఢ విశ్వాసములవలననో, లేక, స్వలాభము కొరకో, భక్తులమని, పండితులమని, జ్ఞానులమని ప్రకటించుకొనుచు, సంఘమున చలామణి యగుచున్నారు.

ప్రపత్తి పరులకు ఈ దోషములు లేవు. వారు దాసానుదాసులుగా భావించుకొంటారు. సంఘమున ఏ అంశముననూ వారికంటె తక్కువ వారు లేరను సానుభూతి, దయ, ప్రేమ గుణములు గల పవిత్రులు వీరు. కావున, లేని గొప్పగుణముల నాపాదింపజేసికొను దుర్గణమునకు వీరు చాల దూరముగా నుందురు.

లోకకల్యాణము కొరకే వీరు దైవమునకు ప్రపన్నులగుచున్నారు. వీరు మోక్షసన్న్యాస యోగులు. సర్వులు మోక్షమును, ఆనందమును పొందవలయుననెడు కాంక్ష వీరిది. వారి లాభము, వారి సుఖము, వారి మోక్షము కొరకు కాదు.

తమ గోష్ఠిలో చేరుడని చేతనులనందరిని ఆహ్వానించుచున్నారు, ప్రపన్నులయిన యీ భక్తులు. ఇందులకు అర్హతలెట్టివి? సేవాభావము దృఢముగానున్న వారు, సేవానుభవమే ఆనందమని తలచు సత్పురుషులు. ఇందులకు అన్యులయిన హీనులెవరు? స్వలాభపరులు, కబళమునకు ఏ నీచకార్యమైనను చేయుటకును సంసిద్ధులుగా నున్న దుర్జనులు.

ఆళ్వారు హెచ్చరించుచున్నాడు చేతనులను ఏమని? హేయ భావమును వదలుడు, సేవాభావమును స్వీకరింపుడు, ప్రపత్తిపరుల గోష్ఠిలో చేరుడు అని.

ప్రపత్తి పరులయిన భక్తులు స్వార్థరహిత సేవాపరులు! సోమరులైన సన్న్యాసులుకాదు సుమా! లోకకల్యాణము కొరకు మంచిని చెప్పి, మంచిని ఆలోచించి, మంచిని చేయుటయో, చేయించుటయో అను కార్యక్రమమున సతతము ఎరుక యందున్నవారు ప్రపన్నులయిన భక్తులు. విశిష్టాద్వైత సిద్ధాంతము సోమరితనమును ఖండించును.

కావున చేతనులను దోషరహితులుగండని సేవాతత్పరులు కండని ఆహ్వానించుచు మంగళా శాసనమును (తిరుప్పల్లాండును) వచించు

చున్నాడు ఆళ్వారు. ఎంతటి నిర్మల మంగళా శాసనము! (సామాన్యులు చేయు మంగళా శాసనము, ఆశీర్వాదము లెట్టివి? ఆయురారోగ్యాభివృద్ధి రస్తు! ధనకనక వాహన సిద్ధిరస్తు! పుత్రపౌత్రాభివృద్ధి రస్తు! చిరంజీవ చిరంజీవ చిరంజీవ సుఖీభవ! ఇదివరస, ప్రతివాడు చేస్తూనే వుంటాడు. ఈ అసత్య ప్రియవాక్కులచే వీరంతా చార్వాకులే! మనోహరమైన మాటలు చెప్పి బ్రతుకువారు! సర్వులు జ్ఞానవంతులై, సేవాతత్పరులై సజ్జనులుగా నుందురుగాక! అనునది ఆళ్వారుల మంగళా శాసనము! విశిష్టాద్వైత సిద్ధాంతపర మంగళా శాసనము) అందువలననే పెరియాళ్వారు గావించిన మంగళాశాసనము (తిరుప్పల్లాండును) విశిష్టముగా భావించుచున్నారు.

ఇచ్చట పురుషోత్తముడయిన శ్రీరామునికి మంగళాశాసనము చేసినట్లు ఉన్నది! మంచిదే! శ్రీరాముడు మానవనాథుడుగా సత్పరిపాలన చేసినాడు. ఆదర్శప్రాయుడు అందువలన పురుషోత్తముడు. వీరిని చూచి తలచి యితరులు సద్గుణవంతులై పురుషోత్తములు కావలయును. అందువలన పురుషోత్తముడయిన శ్రీరామునకు మంగళాశాసనము పలుకుట, అందరికిని (అనగా శ్రీరాముని ఆదర్శముగా పెట్టుకున్న వారందరిని) మంగళాశాసనము పలికినట్లే అవుతుంది.

ప్రత్యేకించి, యిచ్చట మనోహరమయిన ఒక అంతరార్థ మున్నది! లంక అనునది నీయొక్క చిన్న సంసార గృహమునకు సంకేతము. నీవు ఆ లంకలో చిక్కుకొనిపోయి ఉన్నావు. చుట్టు సముద్ర మున్నదిగదా! చుట్టు పలు చిక్కులతో గూడిన ముండ్లప్రాకారము నీ గృహమున కున్నది. ఇక నీ గృహములోనా? అనేక రాక్షసులు ఉన్నారు! ఎవరు వారందరు? సప్త వ్యసనములు, అరిషడ్వర్గము, స్వార్థము మొదలగువారు. ఈ రాక్షసుల నందరిని జయించిన నీవు పురుషోత్తముడ వగుదువు! ఇచ్చట లంకలోని రక్కసులను దునిమిన పురుషోత్తముడనగా సంసారములో దుష్టశక్తులకు వశముగాక,

జయించిన ప్రజ్ఞగలిగిన పురుషోత్తముడని భావము - పురుషులందరు ఇట్టి పురుషోత్తములు కావలయునని ఆళ్వారు కోరుచున్నారు. అట్టి సంస్కారమును, ఉద్ధరణనుపొందిన పురుషోత్తము లయిన చేతనులకు ఆళ్వారు మంగళాశాసనము (తిరుప్పల్లాండు) పలుకుచున్నాడు! ఎంత ఉన్నత భావము! ఎంత సంస్కారయుతము! ఎంత వాంఛనీయము!!! ఆళ్వారు తాను మంగళాశాసనము చెప్పుటచే తృప్తినందక, అనన్యప్రయోజకులగు భగవత్ప్రాప్తికాములను కూడ ఆహ్వానించు చున్నాడు.

## 4. నాల్గవ పాశురము:

"స్థూల సూక్ష్మమైన శరీరమును జీవునకు కారణభూతమగు మూల ప్రకృతియందు ఇడుటకు ముందుగనే, శీఘ్రముగా వచ్చి మా గోష్ఠియందు చేరనిష్టపడువా రైతిరేని, స్వానుభవ మాత్రమును విడిచి, సత్వరముగ మా గోష్ఠిలో చేరుడు. సర్వులును బాగుగా ఎరుగనట్లు - 'ఓం నమో నారాయణాయ' అని మంగళా శాసనము చేయు మనస్సుగలవా రైతిరేని ఇప్పుడే వచ్చి మంగళాశాసనము చేయుడు".

వివరణము: శరీరమునకు స్థూలరూపము, సూక్ష్మ రూపము అనునవి రెండున్నవి. కాని ఈ రూపములు వేర్వేరు గాదు; కలిసియున్నవి - పట్టు వస్త్రమునకు మెరుగు ఆవరించియున్నట్లు.

స్థూలశరీరము మన కగపడు రూపము. దీనికి బరువు, రంగు, ఆకారము వాసన మొదలగునవి యున్నవి. ఈ రూపమున చేతనుని శరీరము కన్పట్టుచున్నది, తిరుగుచున్నది.

ఇట్టి స్థూలశరీరము యొక్క ఛాయాచిత్రము(Photograph)ను అదే పరిమాణములో తయారు చేసినామనుకో. ఛాయాచిత్రము స్థూల శరీరము యొక్క బహిర్గత రూపమును తెల్పుచున్నది. అదే శరీరాకారములో అస్థిపంజర ఛాయాచిత్రమును తీయుచున్నారు గదా- అదే ఆకారములో రక్తనాళములు, హృదయము, నగములు మాత్రము

చూపు ఛాయా పటమును యంత్రసహాయమున తీయగలము (మొదటిదానిని గాని, రెండవ దానినిగాని ఎక్స్-రే పటము అనుచున్నాము). ఈ విధముగా శరీరము లోని యేభాగమునైనను ఎక్స్-రే ఛాయారూపట రూపమున, యంత్ర సహాయమున, చూపగలుగుతున్నారు గదా! ఇట్లే నిలువబడియున్న మానవుని శరీరమును యంత్ర సహాయమున ఒకవిధముగా ఛాయాచిత్రమును తీసిన - ఒక విధముగా అనగా మాంసముగాని, ఎముకలుగాని, రక్తనాళములుగాని నరములుగాని, అనగా ఏ స్థూల భాగము గాని(Physical malter) పడకుండా ఆ ఛాయాచిత్రము చాలకొద్ది మసకగా, తెలుపుగా సంపూర్ణ మానవకారముగా, అదే పరిమాణములో, తయారగును. ఈ ఛాయ యేమిటి? శరీరములో ప్రతి అణువునందు నిండియున్న జీవశక్తి, ఈశ్వరశక్తి. ఇట్టి ఛాయాచిత్రమును తీయగల యంత్రము సహాయముతో మానవ మృతకళేబరము యొక్క ఛాయా చిత్రమును తీయదలచిన, ఏ విధమయిన ఛాయయు పడదు. ఏలయనగా ఈ మృత కళేబరములోని అణువులలో ప్రాణశక్తి లేదుగదా - ప్రకాశించుచున్న ఆ జీవశక్తి లేదుగదా - ఇట్లు జీవించియున్న యేప్రాణి యొక్క శరీరములో సంపూర్ణముగా ఆవరించియున్న జీవశక్తి ఛాయాచిత్రమును తీసి, పరిశోధించి యున్నారు. శాస్త్రజ్ఞానాభివృద్ధిని బడసిన కొన్ని దేశములలో (Countries of Advanced Scientific Development). ఇదంతయు విన్నవించుట యెందులకనగా మానవ శరీరమునకు స్థూలరూప మున్నది, సూక్ష్మ రూపమున్నది అని చెప్పుటకు. అగపడునది స్థూలరూపము; అగపడక శరీరాకృతిలోనే శరీరములో ప్రత్యణువు నందును నిండియున్న జీవశక్తియే ! సూక్ష్మ రూపము! సజీవముగానున్న శరీరమునకే యీ రెండు రూపము లుండేది. మృతకళేబరమునకు ఉండేది ఒకటే రూపము, సూక్ష్మరూపము. మరణించిన వెంటనే అంతమొందుతుంది. సూక్ష్మ రూపము ఎక్కడకి పోయినది? ఎక్కడికి పోలేదు. దీపము మండుచున్నది - ఆరిపోయినది. మంట ఎక్కడికి పోయినది? ఎక్కడికి పోలేదు.

ఈ సూక్ష్మ శరీర విషయమును అపార్థము చేసికొని, యిది ఎక్కడికో పోతుందని కొందరు, ఈ సూక్ష్మశరీరము తక్కువ పరిమాణములో, బొటన వ్రేలి పరిమాణములో, శరీరములోపలనే యెక్కడనో ఉండునని కొందరు, మరణించుట అనగా ఈ సూక్ష్మరూపము శరీరమును వదలుట అనికొందరు, ఈ సూక్ష్మరూపము జీవు డనికొందరు. ఈ జీవుడు శరీరము నుంచి పయనించి, మరి యొకలోకమునకు పోవునని కొందరు, మరియొక శరీరమును జొచ్చునని కొందరు రకరకములుగా చెప్పి మానవలోకమును భ్రమపెట్టుచున్నారు.

మానవ శరీరము నందు సంపూర్ణముగా ఆవరించియున్న జీవమును (Energy - Life Energy) ఛాయాచిత్రముగా శాస్త్రజ్ఞులు చూపగా, ఈ శాస్త్రజ్ఞానమును ప్రక్కకునెట్టి, జీవాత్మ శరీరమును వదలి వేరులోకమునకు పోవుచున్న దను మూఢ విశ్వాసమును మరింత దృఢపరచుచున్నారు సనాతనులనబడు కొందరు! ఇది శోచనీయమయిన విషయము! జీవాత్మ శరీరమును వదలి పరలోకమున పోవుచున్నదని శాస్త్రజ్ఞులే వారి అధునాతన ప్రయోగములవలన కనుగొన్నారని మూఢవిశ్వాసజీవులు మరి మరి ప్రచారము జేసి మూఢనమ్మకములను ధ్రువపరచుటకు ప్రయత్నించు చున్నారు!

తత్త్వత్రయ జ్ఞానము ప్రకారము అచిత్తులో చిత్తు ఉద్భవించు చున్నది. ఈశ్వరశక్తి అచిత్తు, చిత్తు అను రెండు తత్త్వములను ఆవరించు యున్నది.

ఆళ్వారులందరిలో ఘనుడైన నమ్మాళ్వారికిని వారి శిష్యుడయిన మధురకవి ఆళ్వారునకును "శరీరము - ఆత్మ" అను విషయమున జరిగిన సంభాషణమును గమనింపుడు:

నమ్మాళ్వార్ - "ఆత్మ అనేది శరీరమను భౌతిక పదార్థము నుండే ఉత్తన్న మగును".

మధురకవి ఆళ్వారు — "ఆత్మ అనేది శరీరమను భౌతిక పదార్థము నుండే ఉత్పన్నమగునని చెప్పినపుడు, ఆ యాత్మ యేమి తినును? ఎందుండును?"

నమ్మాళ్వారు — "ఆత్మ ఆత్మను భక్షించును. ఆత్మయందుండును".

మధురకవి — "అచిత్తుతో జీవాత్మ సంబంధపడి యున్నపుడు అది దేనిని అనుభవించును? ఎక్కడ పడియుండును?"

నమ్మాళ్వార్ — 'ఆత్మ శరీరగతమగు సుఖ దుఃఖాదులను అనుభవించుచూ, శరీరమునే ఆశ్రయించుకొని యుండును".

నమ్మాళ్వారి యొక్క యీ ఆత్మజ్ఞానమునకు ముగ్ధుడై మధురకవి నమ్మాళ్వారి శిష్యుడై, తనకు నమ్మాళ్వారి కంటెను వేరుదైవము లేదని ప్రకటించుకున్నాడు. శ్రీరామానుజుని దివ్య జ్ఞానమును పొందిన శ్రీమణవాళ మాములు శ్రీరామానుజుని కంటె వేరుదైవము తనకు లేదని ప్రకటించుకున్నాడు.

భగవద్గీతలో నెక్కడను, జీవాత్మ శరీరము నఅంగుష్ఠరూపమున లేక అంగుష్ఠ పరిమాణమున సూక్ష్మ రూపమున ఉన్నదని, మరణానంతరము అది మరియొకతావుకు పయనించునని చెప్పబడలేదు - "మానవుడు చినిగిన వస్త్రమును వదలి నూతన వస్త్రమును ధరించు విధమున, ఆత్మయు జీర్ణమయిన శరీరమును వదలి నూతన శరీరమును జొచ్చును" అని గీత యందు చెప్పబడినది (శ్లో॥ 2వ అధ్యాయము 22వ శ్లోకము) గీతాచార్యుని యుద్దేశముకాదు - అప్పట్లో ఆత్మను గూర్చి ప్రబలియున్న అనేక భావములలో అదియొకటిగా గీతాచార్యుడు పేర్కొనియున్నాడు. (ఈ విషయము సవిస్తరముగా నాచే రచింప బడిన" వాస్తవము - వ్యాస పంచకము" నందు పాఠకులు చదువుదురుగాక)

(జడ పదార్థ శరీరములోని వివిధ అణువుల సంపర్కము, సంయోగము, ఘర్షణ మున్నగు ప్రక్రియల ఫలితముగా ఉత్పత్తి యయిన శక్తి జీవశక్తి (life). జీవశక్తి మానవుని యందు ముఖ్యముగా, పొందు ఎరుక అను జ్ఞానము ఆత్మ (soul). ఈ విషయమును పాఠకులు "వాస్తవము - వ్యాసపంచకము" నందు అతి విపులముగా గ్రహింపగలరు. ఆదిచార్వాకుడు వేదవ్యాసుని కాలపువాడుగా నున్నాడు; అయన పంచభూతములు కాదనియు, భూతములు నాలుగేననియు చతుర్భూతములని, ఆకాశం గగనం శూన్యము కావున ఆకాశము ఒక భూతము కాదనియు చెప్పియున్నాడు. చతుర్భూతాత్మకమైన మానవ శరీరమందే ఆత్మ ఉత్పన్నమగు ననియు, శరీర నాశనముతో ఆత్మయు నాశనమగుననియు చార్వాకుడు చెప్పెను. పరలోకము, నరకము అను భీతివలదు. జీవితమును ఆనందపరచుకొనుడు అని బోధించెను. ఈ శాస్త్రీయ దృక్పథమునకు సనాతనులనువారు కాలక్రమమున వక్రభాష్యములు కల్పించినారు, మరియు ఆదిచార్వాకుని తరువాత వచ్చిన యితర చార్వాక గురువులు వైదికమతమును ఎదుర్కొనుట యే ప్రధానోద్దేశముగా పెట్టుకొని సనాతనమును ద్వేషించి, ఆదిచార్వాకుడు బోధించిన సత్యమునకును వక్రభాష్యములు సృష్టించిరి - అంతయు శోచనీయము! ఋషిగానున్నవాడు ఏ దేశమందైనను ఏ కాలమునందైనను సత్యమునే వచించెను. తరువాతి వారు అజ్ఞానమున, స్వార్థమున, పరమత ద్వేషమున అతివాదములు జేసి మానవుని అజ్ఞాన కూపములోనికి నెట్టుచు వచ్చినారు. మూఢ విశ్వాసములు(Superstitions) అంత బలిష్ఠమయినవి. వాని వేళ్ళు భూమిలో మిళితమయి జీర్ణించి పోయినవి. వానిని వేరు పరచి తీసివేయుట అశక్యముగా నున్నట్లే చరిత్ర వెల్లడించుచున్నది. కాని మూఢ విశ్వాసములు త్వరగా అంతరించకున్నను, రాను రాను మాసిపోగలవనియో నమ్మవలెను; (శాస్త్రీయ దృక్పథ వాంఛతో).

ఈ పాశురమున పెరియాళ్వారు సైతము శరీరము ఆత్మను గూర్చి శాస్త్రీయమయిన ఉద్దేశములనే వెల్లడించియున్నాడు. గమనింపుడు:

"మరణము"ను ఏమని అంటాడు పెరియాళ్వారు? "స్థూల సూక్ష్మమైన శరీరమును జీవునకు కారణభూతమగు మూల ప్రకృతియందు నిడుట" అని అంటాడు. శరీరము యొక్క స్థూల సూక్ష్మాంశములు రెండును ప్రకృతి నుండి ఉత్పన్నమయినవి, కావున అవి ప్రకృతిలో మరల చేరిపోవుటయే మరణము అనబడుచున్నది. ప్రకృతిని "మూలప్రకృతి" అని అంటాడు. సర్వమునకును ప్రకృతి మూలాధారము. ఈ ప్రకృతిని చిత్+అచిత్‌గా భావిస్తూ వున్నాము. ఈ రెంటిని నిండియున్న అనిర్వచనీయుమయిన ఈశ్వరశక్తి అవాఙ్మానసగోచరమునై యున్నది.

మరణానంతర విషయమును గూర్చి ఆళ్వారు పట్టించుకొనుట లేదు. మరణమునకు పూర్వమే జీవితమును సుఖపరచుకొనుము, ఆనందమయము చేసికొనుము, పరోపకారముచే ఫలప్రదము చేసికొనుము అని ఆళ్వారు లందరి సుబోధ; విశిష్టాద్వైత సిద్ధాంత సారము. "మరణానంతర విషయమును పట్టించుకొన నవసరములేదు అన్న విషయములో భౌద్ధము, చార్వాకము, విశిష్టాద్వైతము ఒకటే. ఆ వాక్యముతో నిలిపివేసింది చార్వాకము - జీవితమును నీతివంతము చేసికొమ్మని చెప్పినది బౌద్ధము - జీవితమును నీతివంతమును ఆనంద దాయకమును చేసికొమ్మని విశిష్టాద్వైతము ప్రతిపాదించుటలో నీతివంతమయిన జీవితమే ఆనందదాయకము - ఆ నీతి శరణాగతి భావము, స్వార్థరాహిత్య భావము, సేవాతత్పరతయై యున్నదని చెప్పుచున్నది. ఇదియే విశిష్టాద్వైత సిద్ధాంతము యొక్క విశిష్టత. కాని శరణాగతి, సేవాతత్పరతలు ఇతర మతములలో లేకపోలేదు. కాని వీనిని గలిగి విష్ణు సంశ్లేషమున జీవితమునకు ఆనందమును బడయు తత్త్వమును (Emotional Happy state of mind) ప్రత్యేకించి విశిష్టాద్వైతము సూచించుచున్నది. ఇప్పుడు పెరియాళ్వారు తిరుప్పల్లాండు వచించుటయు తన సంశ్లేషభావమున అని ప్రారంభమున తెల్పియున్నాను.

ప్రకృతి రెండు విధములు - స్థూలప్రకృతి, సూక్ష్మప్రకృతి. మనము చూచునట్టిదియు, త్వగింద్రియముచే ననుభవించునదియు అయిన యీ భౌతిక భాగమంతయు నస్థూలప్రకృతి. సర్వాంతర్యామి యగునట్టియు, అవాఙ్మానసగోచరమైనట్టిదియు అయిన ప్రకృతి సూక్ష్మప్రకృతి...... అదే విధముగా మన శరీరము (భౌతిక శరీరము) స్థూల ప్రకృతికి జెందినది. శరీరమున విస్తరించియున్న జీవశక్తి లేక ఆత్మశక్తి అనునది సూక్ష్మప్రకృతి. మానవుడు మరణించినపుడు శరీరములోనున్న సూక్ష్మశక్తి వెలుపల సర్వవ్యాప్తమయినట్టి సూక్ష్మప్రకృతిలో మిళితమగును, లేక ఐక్యమగును. భౌతిక శరీరము పాతియుంచుట చేతనో దహనక్రియచేతనో, మరియొక విధముగానో నశించి స్థూలప్రకృతిలో మిళితమై లేక ఐక్యమై పోవుచున్నది. ఇది కేవలము సత్యము, శాస్త్రీయమునైయున్నది. ఈ సత్యమునే పెరియాళ్ వారు ఈ పాశుర ప్రారంభమున ఈ విధముగా వెల్లడిస్తాడు:

"స్థూల సూక్ష్మమయిన శరీరమునకు జీవునకు కారణభూతమగు మూలప్రకృతియందు ఇడుటకుముందు", అని తెల్పుచున్నాడు "అనగా మరణించుటకు ముందు" అని భావము.

"స్థూల సూక్ష్మప్రకృతులకు సంబంధించిన నీ శరీరము విశ్వము యొక్క స్థూల సూక్ష్మప్రకృతిలో (మూలప్రకృతిలో) ఐక్యమగుట" - అను విషయమును ఆధ్యాత్మిక భాషయందు "నీవు దేవునిలో ఐక్యమగుదువు" అని చెప్పబడినది. ఈ విషయం అనగా "దేవునిలో ఐక్యమగుట" సామాన్య శాస్త్రీయ విషయమును ఏదో యేదో భాషలో, యేదో యేదో విధముగా పలువురు వ్యాఖ్యానించి, కడకు చేతనుని అజ్ఞాన కూపమున త్రొక్కుచు వచ్చిరి. ఈ సత్యమును బాగుగా సులువుగా ప్రబోధము గావింప ప్రయత్నించినవారు ఆళ్వారులు; వీరి జాడను విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్తలయిన మునిత్రయమువారు, అనగా శ్రీనాథమునులు, యామునాచార్యులు, శ్రీరామానుజులు, ఈ సత్యమును చేతనులకు వెల్లడింప ఎంతో ప్రయత్నములు గావించి,

యెంతో సారస్వతము నొసంగియున్నారు. అయినను వర్ణభేదముల వలన, ఈ సారస్వతము దేవాలయ కార్యక్రమములు ఏదో ఒక వర్గమువారి ఆధీనమున నున్నందున సత్యమునకు ప్రచారము తగ్గినది. అయినను అడ్డుగోడలు కొంతవరకైనను తొలగింపజేసినది శ్రీరామానుజుల వారి ప్రయత్నముననే. అందువలననే విశిష్టాద్వైత సిద్ధాంతము రామానుజ మతమను పేరట సర్వజనామోదమును బడసినది. అందువలననే ఈ సిద్ధాంతము వైష్ణవదేవాలయములకు, వైష్ణమతములకే అతుకుకొని యుండక, సముద్రము పొంగివచ్చిన ఉప్పెనవలె, పంచముల నబడువారికిని, శూద్రులకును, వైశ్యులకును, క్షత్రియులకును, స్త్రీలకును ప్రాకినది. దక్షిణ హిందూదేశమున పంచములనబడు అనేక కులములవారు, జాతులవారు, తాము రామానుజ మతనస్థులమనియు, వైష్ణవులమనియు, నామధారులమనియు సగర్వముగా చెప్పుకొనగలుగుట వలననే, తాము హిందువులుమను విశ్వాసము నిలిచి యుండినది. లేని యెడల, వారు తరతరాలుగా సవర్ణ హిందువులనబడువారిచేత అనాదరింప బడిన ఫలితముగా వారెప్పుడో యే విదేశమతములనో స్వీకరించి యుండెడివారు. అయినను అన్యమతావలంబనము సాగినను, అది అరికట్టబడడము శ్రీరామానుజ సిద్ధాంతము వలననే.

"జీవన్మరణముల సత్యమును ఎరిగిన వారై, మీరు వెంటనే వచ్చి మాగోష్ఠిలో చేరుడు" అని ఆళ్వారు వచించుచున్నాడు. మా గోష్ఠి అనగా - శ్రీ వైష్ణవగోష్ఠి - అనగా శరణాగతి, స్వార్థరహిత, సేవాతత్పరత్వముల కంకితులై లోకకల్యాణమును గోరువారి గోష్ఠి అని భావము.

"స్వానుభవమును వదలి సత్వరమే మా గోష్ఠిలో చేరుడు" అని ఆళ్వారు ఆహ్వానించుచున్నాడు, చేతనులను. "జరిగిన పొరపాట్లను మరిచిపొండు, అనుభవించిన శారీరక సుఖములను మరచిపొండు. వానిపైనున్న వ్యామోహమును పూర్తిగా అంతరింపజేసి కొనుడు. వైష్ణవుల గోష్ఠిలో చేరి లోకకల్యాణార్థము కృషి చేయుడు" అని ఆళ్వారు చేతనులను ఆహ్వానించి, ప్రబోధించుచున్నాడు.

"ఓం నమో నారాయణాయ" అనునది తిరుమంత్రము. ఇది గొప్ప మంగళా శాసనము సర్వులకును. ఇందు రహస్యము లేదు. వచ్చి బహిరంగముగా అష్టాక్షరీమంత్రమును ఉచ్చరింపుడు - అర్థమును గ్రహించుకొనుడు దానిని ప్రబోధము చేయుడు - ప్రపంచమునకు సుఖశాంతులు కలుగజేయుడు" అని ఆళ్వారు చేతనుల నందరిని ఆహ్వానించుచున్నాడు - కుల, జాతి, మత వివక్షత లేకుండా!

పెరియాళ్వార్ యొక్క యీ ప్రబోధ ఫలితమే, తరువాత కొన్ని శతాబ్దాల తరువాత, శ్రీరామానుజుడు తిరుమంత్రమును అందరికి వెల్లడి చేయుట జరిగినది. ఇందు మూలమున ఆళ్వారు లెంతటి భక్తులో యెంతటి దయార్ద్ర హృదయులో, యెంతటి సమభావము గలవారో వెల్లడి యుగుచున్నది.

ఈ కారణముననే, అనగా తిరుమంత్రార్థము, దాని ప్రభావము వలననే, అనగా తిరుమంత్రాను సంధానము నిజముగా సంఘమును సుఖపరచునను దివ్య విశ్వాసమున శ్రీమద్రామానుజుడు - గీతాచరమ శ్లోకమును, అష్టాక్షరీ మంత్రమును - మంగళా శాసన వాక్యములుగా నిర్ణయించినాడు. పెద్దలను పిన్నలు ఆశ్రయించినపుడు గాని, గురువుల శిష్యులు ఆశ్రయించినపుడు గాని, వైష్ణవాలయమున అర్చకాచార్యులు భగవద్దాస్యము చేయ నరుగుదెంచిన భక్త జనమునకు గాని, పై పెద్దలు ఈ విధముగా మంగళా శాసనము చేయునట్లు శ్రీ రామానుజుడు నిర్ణయించెను:

**"సర్వధర్మా౯ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥"**
**"ఓం నమో నారాయణాయ"**

పై నిర్ణయమే శ్రీరామానుజుని దివ్య సందేశము: వైష్ణవు లెల్లరకు వారి అజ్ఞయు అయినది! అందువలన శ్రీరామానుజుని తరువాత వచ్చిన విశిష్టాద్వైత సిద్ధాంతాచార్యులు, అందులో ప్రముఖముగా

మణవాళమాామునులు, మంగళాశాసనమును ఈ విధముగా నిర్ణయించిరి:

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥"
"ఓం నమో నారాయణాయ"
"శ్రీమానుజార్య దివ్యాజ్ఞా వర్ధతా మభివర్ధతామ్॥"

లోక కల్యాణము కొరకు మంగళా శాసన మిట్లు తయారయినది: గీతాచార్యుని చరమశ్లోకముతో, ఆళ్వారాచార్యుల సూచనలతో, మణవాళమామునుల తుదిమెరుగులతో!!!

ఈ పాశురమున మంగళాశాసనము పలుకుమని ఆత్మప్రాప్తి కాములను ఆళ్వారు ఆహ్వానించుచున్నాడు.

## 5. ఐదవ పాశురము:

"అనేక బ్రహ్మాండములకు నిర్వాహకుడై అసుర రాక్షస సమూహములను నిర్మూలించిన హృషీకేశునకు దాస్య కులస్థులగు మీరు వచ్చి, వారి శ్రీ పాదముల సేవించి, సహస్రనామానుసంధానము గావించి, అహంకారముతో గూడిన పూర్వపుటైశ్వర్య కులమును వదలి, పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు - అని మంగళా శాసనమును జేయుడు - శాశ్వతముగా భగవంతుని సహస్రనామ మంగళ గుణగణము నిత్యముగా వర్ధిల్లగలందులకు మంగళాశాసనము చేయుడు".

వివరణము: పారంపర్యముగా ఐశ్వర్యకాములు హృషీకేశుని ప్రార్థించు కొరకు యజ్ఞయాగాదులు చేయువారు. హృషీకేశునకు దాసులు అన్నపుడు ధనమునకు దాసులు అని భావము. ఆళ్వారు ఈ పాశురమున ధనమదాంధులను హెచ్చరించుచున్నాడు. ధనము పరమానందము నివ్వదు, సద్గుణముల నడవడియే నిజమైన

ఆనందమును తృప్తిని ఇచ్చునని తెల్పుతూ, భగవంతుని కల్యాణగుణముల నుచ్చరింపుమని ఆళ్వారు తెల్పుచున్నాడు. దివ్యమంగళ నామముల నుచ్చరింపు మనుటలో, ఆ నామములు సూచించు మంగళ గుణములు కలిగి యుండుడని ఆళ్వారు సూచించుచున్నారు. విశ్వము మంగళకరముగా నుండుటకు మంగళాశాసనము గావింపవలసియున్నది. ధనగర్వమున ధనవంతులు సద్గుణములకు దూరముగా నుండు అవకాశమున్నందున, వారిని ప్రత్యేకముగా అనంతకల్యాణగుణముల స్మరింపుమని ఆళ్వారు కోరుతాడు.

## 6. ఆరవ పాశురము:

"తమ తండ్రి తాత ముత్తాత మొదలు ఏడు తరముల నుండి వరునగా యుక్త సమయములయందు మంగళాశాసన రూపదాస్యమును చేయుచున్నారము. శ్రవణ తిరునక్షత్రోత్సవమునందు సాయంకాలమందు నరసింహావతారం బొనర్చి హిరణ్యకశిపుని వధించిన నృసింహస్వామి యొక్క బడలిక తీరునట్లు అనేక సంవత్సరములును కాలతత్వముండు వరకును నిత్యముగా నుండవలయునని మంగళా శాసనము చేసెదము. ఇదే మనకు

**వివరణము:** అజ్ఞానులు, అవివేకులు, ఆలోచనారహితులు ఇత్యాది సత్యమెరుగని వారి సంగతి అటుంచుము. ఋషియైనవాడు, ఋషి తుల్యుడు, స్వార్థరహితుడయిన భక్తుడు, నాగరికతాభివృద్ధి ప్రారంభమయినది మొదలు, సంఘక్షేమము కొరకే మంగళాశాసనము చేయుచు వచ్చెను. ఇంకను ఎల్లప్పటికిని అట్టి నిజమైన భక్తుడు లోకసంగ్రహము కొరకే జీవించుచు, కల్యాణగుణములకు మంగళా శాసనము చేయుచునే వుంటాడు. సర్వేజనాః సుఖినో భవంతు అని అంటూనే ఉంటాడు. శివ శివ (శుభము, శుభము) అని అంటూనే ఉంటాడు. హరి, హరి (దోషము హరించు గాక, పాపము హరించుగాక) అని అంటూనే ఉంటాడు. గీతలో చెప్పబడినట్లు-

శ్లో॥ సక్తాః కర్మణ్య విద్వాంసో యథాకుర్వంతి భారత
కుర్యా ద్విద్వాం స్తథా సక్త శ్చికీర్షు ర్లోక సంగ్రహమ్॥

"అజ్ఞానులు స్వలాభాపేక్షతోనే కార్యములు చేయుదురు. జ్ఞానులు ఫలాసక్తి రహితులై లోకకల్యాణ నిమిత్తము కార్యముల నాచరింతురు".

"లోకము యొక్క మంచికొరకు పాటుపడుట, మంగళాశాసనము చేయుట, సజ్జనులగు భక్తుల వృత్తి" అని పెరియాళ్వారు అంటాడు.

జంతు సముడుగానున్న మానవుడు ఆలోచనాయుక్తుడుగా మారి, నిజమైన మానవుడుగా రూపొందు పరిణామ దశను నృసింహావతారము సూచించును.

మరియు కేవలము సంపద, సుఖము అను దృక్పథము నుండి ఆధ్యాత్మికచింతనకు మానవుడు పరిణామము జెందుదశను నృసింహావతారము సూచించును. ఇది మానవాభ్యుదయములో ఒక మెట్టు.

ప్రాణి సృష్టి, మానవాభివృద్ధి, మానవాభ్యుదయమునకు సంబంధించిన వివిధములైన మార్పులు, పరిణామములను దశావతారములు సూచించు ననియు, ఇది శాస్త్రీయమయిన విషయ మనియు "వాస్తవము - వ్యాసపంచకము" అను గ్రంథమున విపులముగా బేర్కొని యున్నాను. పాఠకులు గమనింతురుగాక!

హిరణ్యాపేక్ష, హిరణ్య సంపాదనము మానవునికి శాంతిని కలుగజేయ వనియు, శరణాగతి స్వార్థరాహిత్యము మానవునకు ప్రహ్లాదమును చేకూర్చునని ప్రహ్లాద చరిత్రయొక్క అంతరార్థము.

"మానవుని వాని సహజ ప్రకృతి నుండి, దివ్య ప్రకృతికి మార్చుట అనునది ఆచార్యులకు గొప్పబడలికను చేకూర్చు కార్యక్రమమే. వారి బడలిక తీరకముందే, అనగా వారు కోరిన సత్ఫలితములను వారు చూడకముందే వారు గతించినారు గదా! కావున వారి బడలిక

(ఆధ్యాత్మికముగా) తీరుటకు, వారుకోరిన ఫలితములు ప్రాప్తించు వరకు, మనము మానవోన్నతి కొరకు కృషి చేయవలసినదే! వారి అభ్యుదయమునకు మంగళా శాసనము పలుకవలసినదే". ఈ శాశ్వత సత్యమును ఈ పాశురము వెల్లడించును. నీతి శాస్త్రవేత్తలు నీతి శాస్త్రములేల రచించిరి? స్వార్థమునకా? ఆళ్వారు ఈ పాశురమున ప్రయోజకులు, వారి ప్రయోజనములను సూచించుచున్నాడు. సంఘాభ్యుదయమునకు మానవుని కర్తవ్యము ఎరుక పరుపబడినది. ఆహా! తిరుప్పల్లాండు ఎంతటి దివ్యమయిన మంగళా శాసనము!!

**7. ఏడవ పాశురము:**

"సూర్యచంద్రాగ్నుల తిరస్కరించిన అరుణ ప్రకాశయుత శ్రీ సుదర్శనాళ్వార్ వేంచేసి యుండు గుండ్రమయిన చిహ్నములను ధరించుకొని మావంశస్థుల మందరము ప్రపత్తి భావమున దాస్యము చేయుచున్నాము.... కృత్రిమ యుద్ధము చేయు బాణాసురుని వేయి భుజముల నుండి రక్తము ప్రవహింపజేయునట్టి, సుదర్శన చక్రముచే, ఛేదించిన సమర్థుడగు స్వామినిగూర్చి తిరుప్పల్లాండు పాడుచున్నాము".

వివరణము: బాణములను ధరించియున్న బాణాసురుని సహస్రహస్తములు సంఘమునందున్న వివిధములైన దుర్మార్గములకు సాంకేతికములు.

దుర్మార్గులు, దుర్మార్గము, కడకు ఎంత బలీయములైనను కాలగతిలో అంతమొందును, కావున కాలచక్రము సుదర్శనమే. ఇది సర్వాంతర్యామియు, శాశ్వతమును అయిన ఈశ్వరశక్తికి చిహ్నము ఈ కాలచక్రమగు సుదర్శనమునకు ఆళ్వారు మంగళాశాసనమును పలుకుచున్నాడు.

సూర్యుడు, చంద్రుడు, అగ్ని అనునవి తేజోమయములు కదా! కాని యివియు శాశ్వతములు కావే! అందువలన సుదర్శన చక్రము శాశ్వత మగుటంజేసి, అన్నిటికంటె మిన్నయైనది గదా! అన్నింటికంటే

పరాక్రమము కలది గదా! కాలమునకు ఏయ్యదియు లొంగవలసినదే గదా! కావున సుదర్శనము దక్షతకు చిహ్నము భగవద్దాస్యము చేయుట యందు దక్షతను చూపవలయును" అని ఆళ్వారు సూచించుచున్నాడు.

నిస్స్వార్థసేవాతత్పరుడయిన భక్తుడు, సంఘ సంస్కరణ కొరకు పాటుబడు భక్తుడు, దక్షుడుగా నుండవలయును. ఆళ్వారాదులు వారి ప్రబోధములు, రచనలచేత, ఆచార్యులు వారి బోధనాకౌశలమున ఎంతటి దక్షతను జూపియున్నారు! సంఘమున నీతిప్రమాణములు ఉన్నవంటే వారి దక్షతయేగదా కారణము!

గీతలో భక్తుని వర్ణించుచు, గీతాచార్యుడు - "అనపేక్షః శుచిః దక్ష ఉదసీనోగత వ్యథః "12-16 శ్లో అని చెప్పియున్నాడు గదా. కావున దక్షతతో భక్తుడు మంగళాశాసనముచేసి, మంగళాశాసనము కార్యరూపము దాల్చు కొరకు నిరంతరమును పాటుపడవలయునని ఆళ్వారు సూచించు చున్నాడు. ఇది ప్రతివాడు చేయవలసినపని.

భక్తుడు సోమరిగాదు. శ్రీవైష్ణవుడు తాను దక్షతతో తన జీవితకాల మంతయు మంగళాశాసనము గావించెదనని ప్రతిజ్ఞ పూని తన భుజమున చక్ర చిహ్నమును ధరించియున్నాడు. ఆళ్వారాచార్యుల దివ్యాజ్ఞను ప్రచారము చేసెద నను ప్రతిజ్ఞ సూచకముగా మరియొక భుజముపై పాంచజన్య శంఖము యొక్క చిహ్నమును ధరించి యున్నాడు, శంఖము స్వర్గమునకు, శబ్దమునకు వాక్కునకు సంకేతము.

ఆళ్వారుల కాలమునందే భక్తులు ఈ దివ్యోద్దేశములతో వారి భుజములను శంఖచక్ర చిహ్నములతో అలంకరించుకొన్నట్లున్నది - కాని కాలక్రమమున దివ్యప్రబంధములు ఒక వర్గమువారి అధీనములై నందునను, వారు సోదర భావమును, దయ, సానుభూతులను ప్రదర్శింపని దోషముననను, నామములు శంఖ చక్రచిహ్నములు వైష్ణవులనుతెగవారు ధరించు గుర్తులుగా పరిణమించి, యితర వర్ణములపై వారి ఆధిక్యమును నెరపుకొనుటకు ఉపయోగపడుచున్నవేమో!

ఆళ్వారాచార్యులు తలంచిన దేది? ఈ నామమాత్ర వైష్ణవులు చేయున దేమిటి? ఋషులు పల్కినదేమిటి? ఇపుడు గురువులమని సంపాదన కొరకు సంచరించు వక్తలు చేయునదేమిటి? అంతయు శోచనీయమే!

కావున పెరియాళ్వారి ఆదేశమే మనకు శరణ్యము - లోకశాంతికి కూడా - "మంగళా శాసనమును పాటించుట" అనునది.

''మా వంశనష్థలము'' అన్నపుడం ''వైష్ణవమునకును తిరుమంత్రము నకును అంకితుల మైనట్టివారము" అని భావము. ఇది కులమునకు ఒక వంశమునకును సంబంధించినది కాదు.

## 8. ఎనిమిదవ పాశురము:

"సరితూనికగల నేతితోడ మేలగు ప్రసాదమును, ఎడతెగని దైవకైంకర్యమును, చేత విడియమును, కర్ణాభరణములును, దేహమునకు మేలైన చందనమును ఇచ్చి, దాసుని అజ్ఞానము నుండి తొలగించి పరిశుద్ధ స్వభావునిగా జేయువాడును, గరుత్మంతుని ధ్వజముగా గలవాడును, అయిన స్వామికి పల్లాండు కూరువ౯", (పల్లాండు కూరువ౯ = మంగళా శాసనము చేయుచున్నాను).

వివరణము: స్వామికి భక్తుడు ఏద్రవ్యముల నిచ్చుటలేదు. స్వామియే దాసునికి కావలసినవానిని సంప్రాప్తింప జేయుచున్నాడు. వైష్ణవాలయములలో ఏర్పాటు చేయబడిన దైవకైంకర్య పరంపర దాసులను సుఖపెట్టి, సంతోషపెట్టుచున్నవి. శ్రీమంతులగు దాసులు స్వామికైంకర్య రూపమున తోటిమానవులను ప్రసాదములతో తృప్తిపరచు చున్నారు. ఈ విషయ మెంతముచ్చటగా వర్ణింపబడినది!

విశిష్టాద్వైతము, వైష్ణవము - సన్యాసమును, హఠయోగమును, ఉపవాసమును, ప్రోత్సహించదు. దైవము యొక్క అనంత కల్యాణ గుణములతో సంశ్లేషపడి, ప్రకృతిలో లభ్యమగు సుఖానందములను, ఇతురల యెడ సోదర భావముతో, ఇతరులకు హాని జరుగని స్థితిలో అనుభవించ తగును. ఇవియే యిహపరసుఖములు. సుఖ జీవితము

అనునది ఇహలోక సుఖము; విష్ణు సంశ్లేష భావమనేది పరసుఖము. ఈ రెండును వ్యక్తికి గలిగిననాడు ఈ ప్రపంచమే, వైకుంఠ మవుతుంది. మానవులందరు దేవతలవుతారు. సర్వాంతర్యామి యగు ఈశ్వరశక్తియే దేవదేవుడు. ఇది ఉండనే ఉన్నది.. గరుత్మంతుడు వేగమునకు సంకేతము. నీ మనస్సులోనికి దైవచింతనను తెప్పించుకొనుటకు ఎంతకాలము పట్టును? ఎంతకాలము పట్టను. ఆ క్షణములోనే జరిగి పోతుంది, నీ సంకల్పమే తడవు!

## 9. తొమ్మిదవ పాశురము:

"స్వామి ధరించి విడిచిన పీతాంబరమును ధరించి, ఆరగింపయిన ప్రసాదమును స్వీకరించి, అలంకరించి త్యజించిన తులసీ పుష్పమాలికలను ధరించుకొని, యున్న దాసులమున్ను, స్వామి కైంకర్యముల నన్నిటిని యొనర్చి, శ్రవణ నక్షత్రోత్సవము నందు పవ్వళించి విప్పబడిన పడగలు గల ఆదిశేషునిపై దృష్టిదోషము కలుగకుండా యుండుటకు, అనన్య ప్రయోజకులమున్ను అయిన మేము భక్తులతో గూడి స్వామికి పల్లాండు కూరువ౯". (పల్లాండు కూరువ౯ = మంగళా శాసనము చేయుచున్నాము).

వివరణము: 8వ పాశురమునకువలె. దైవకైంకర్యములు ఇహపర సుఖములను కల్గించునను విషయమును వాస్తవముగా గ్రహించునది. (సర్వ సుఖమును వదలి హఠ యోగమను తపస్సును గావించుచు చచ్చిన పరలోక సుఖము గలుగు నను వాక్యములు అసత్యములని గ్రహింప నగును ---- వైష్ణవ అనంత కల్యాణ గుణములతో సంశ్లేషపడి, ఆనందించి, పరుల కపకారములుగాని, సుఖములతో జీవితమును ప్రభావితము చేసికొన వలయుననెడి సత్యమును ఆళ్వారు చూపుతున్నారు.

"శేషశాయి" అను పదమునకు సర్వంతర్యామి అని భావము. వాఙ్మానస్సులను దాటిన శేషమునందును ఉన్న శక్తి ఈశ్వరశక్తి.

## 10. పదియవ పాశురము:

"ఓ, ఎంబెరుమానార్! దేవరవారికి శేషభూతులమను అర్థముగల ప్రణవార్థము లభించన దినమే దాసభూతుల మగు మేమును, మా పుత్ర పౌత్రాదులును, అహంకారమును, తత్కార్యమగు ఐశ్వర్యాదులను విడుచునట్టి మనస్సు గలిగి, ఉజ్జీవింప గలిగితిమి. మనోజ్ఞమగు శ్రవణ తిరునక్షత్రమున అవతరించి, ఉత్తరమధురయందు కంసుని వింటిని ఖండించి, కాళియ నాదమును మర్దనము చేసిన ఓ దేవా! ఇట్టి నిన్ను గూర్చి మంగళాశాసనము చేయుచున్నాము." (పల్లాండు కూరుదుమే).

వివరణము: ఎంబెరుమాన్ (ఎంబెరుమానార్) దాసులకు స్వామియయినవాడు, దాసుల నుద్ధరించువాడు.

చేతనుడు స్వామియొక్క శేషభూతుడు, సర్వాంతర్యామి ఈశ్వరశక్తి అణువు తనను వెలిగింపజేయుచున్నది గాన, తనలోనున్న ఆదివ్యాణువు స్వామి యొక్క శేషమే. అందువలన చేతనుడు స్వామికి శేషభూతు డగుచున్నాడు, అన్యుడు కాదు (ఇదియే తత్త్వమసి యను బ్రహ్మసూత్రము యొక్క సూటి భావము).

"ఓం" - అనునది ప్రణవము. ఇది ఏకాక్షరీ మంత్రము. అష్టాక్షరీ మంత్రార్థమునంతటిని గలిగినది. ప్రణవము విశ్వము+విశ్వేశ్వరమును అగుచున్నది. విశ్వము అన్నపుడు చిత్+అచిత్ అగుచున్నది. విశ్వము + విశ్వేశ్వరు డనుటయే చిత్ + అచిత్ + ఈశ్వర అను తత్త్వత్రయము. వీనిని మించి, మిగిలియున్నది లేదుగదా. ఈ తత్త్వత్రయము "ఓం" అను ప్రణవాక్షరమున నున్నది. ఓం = అ + ఉ + మ్

"అ" కారము ఈశ్వరశక్తిని సూచించును

"మ" కారము జీవాత్మలను సూచించును

"ఉ" కారము ఆచార్యుని సూచించును. ఏ ఆచార్యుడు? ఈశ్వరశక్తి, జీవాత్మలయొక్క సంబంధమును తెలిసి బోధించువాడు.

(ఈ విషయము రానున్న అధ్యాయము, ప్రమేయసార మందు విపులముగా నివ్వబడియున్నది. గమనింపుడు)

ఓం - అను ప్రణవము యొక్క భావమును కనుగొన్న దినము మానవ లోకమునకు పర్వదినము.

నిజమైన జ్ఞానమునకు అంకురార్పణ దినమది - వేల సంవత్సరములకు పూర్వము - అది మొదలు ఇప్పటివరకును నిజమైన భక్తులు తత్త్వత్రయ జ్ఞాన సత్యము నెరిగి దైవకైంకర్యముల జేయుచునే యున్నారు. ఈ భక్తుల వంశపరంపర అట్లనే ప్రళయమువరకును సాగిస్తుంది - అని ఆళ్వారు అంటాడు.

'ఓం" కార జ్ఞాన మనగా జ్ఞానము. ఈ జ్ఞానము కలిగియుండుట అనగా అహంకారమును వదలి సేవా జీవించుట అని భావము. నిజమైన జ్ఞానికి స్వార్థభావము లేదు గదా!

ఇచ్చట భక్తుల యొక్క పుత్రపౌత్రాదు లన్నపుడు శిష్యపరంపర అని భావించుకొనవలయును.

వ్యాసుడు భాగవతమున శ్రీ కృష్ణుని కళంక రహితునిగా, దివ్య మానవునిగా, పురుషోత్తమునిగా వర్ణించి, వారిని గీతాచార్యుని జేసినాడు. (గీత మానవునకు తత్త్వత్రయ జ్ఞానము నిచ్చి, మానవునకు నీతిపథమును చూపుతుంది). అందువలన ఆళ్వారునకు గీతాచార్యుడు అతి విశిష్టముగా తోచును.

పంచ శిరస్సులుగల కాళియ సర్పమును మర్దనజేయుట అనగా పంచేంద్రియములను వశపరచుకొనుట అని భావము; ఈ పంచేంద్రియముల వశపరచుకొను విధానమును బోధించుట అనియు భావము. ఈ విషయము పలుమారు గీతయం దుదాహరింపబడియున్నది గదా. జితేంద్రియుడని, స్థితప్రజ్ఞయోగి అని - "కంసారి' అనగా "శఠారి" అని భావము - పాపమునకు భయంకరుడు. కంసుని హరించినవాడు అనగా దుర్మార్గమును అంతరింప జేయువాడు అని అర్థము దైవగుణ సంకీర్తనము కంసహారమే గదా!

గీతాచార్యునకు, గీతాజ్ఞానమునకు, ప్రణవమునకు మంగళా శాసనము పలుకుచున్నాడు పెరియాళ్వారు.

### 11. పదునొకండవ పాశురము:

"ఓ శ్రీ యఃపతీ! ఆత్మబుద్ధి అహంభావము, స్వార్థము మొదలగు భావములు లేనట్టియు, తిరుక్కోటియూరు పురోహితుడును అగు శెల్వనంబి వలె దాసుడైనట్టివాడును, నీకు అనాదికాల శేషభూతుడ నను భావమున విలక్షణముగా తిరుమంత్రాది తిరునామము నను సంధించుచూ, అహంకార మమకారాది దోషములను పోగొట్టుకొన్న వాడను, అయిన నేను సత్య సౌందర్య సుగుణయుక్తుడవగు నీకు పల్లాండు కూరువ౯ (మంగళా శాసనమును గావించుచున్నాను).

వివరణము: తాను తత్త్వత్రయ జ్ఞానముతో, స్వార్థరహితుడుగా తిరుమంత్రమును జపించుచూ స్వామికి మంగళా శాసనమును గావించు దాసానుదాసుడనని తెల్పుకొనుచున్నాడు పెరియాళ్వారు. ఆ కాలమున భక్తాగ్రేసరుడుగా ఎన్నబడినట్టి శెల్వనంబి యను పురోహితుని ప్రశంసించుచు, ఆయన అడుగుజాడల ననుసరించిన వాడనని చెప్పుకొను చున్నాడు ఆళ్వారు. ఎంత అణకువ! పెద్దలయెడ నెంతటి గౌరవము! వాస్తవముగా దాసానుదాసుడేగదా! ఆ కాలమున తిరుక్కోటియూర్, శ్రీ విల్లిపుత్తూరు, శ్రీరంగము ఆదిగాగల పుణ్యక్షేత్రముల యందు భక్తుడుగా, పురోహితుడుగా పేరుగాంచినట్టి వాడు శెల్వనంబి. సార్థకనామధేయుడు "శెల్వమ్" అనగా జ్ఞాన భక్తి వైరాగ్యాది స్వరూపగుణము అని భావము. "నంబి" అనగా భక్తుడు, పురోహితుడు, అర్చకు డని భావము. శెల్వనంబి - అట్టి స్వధర్మ జ్ఞానవైరాగ్య సాధ్య భక్తినిధి, తనకంటె వయస్సున పెద్దయయిన శెల్వనంబియెడ పెరియాళ్వారు జూపిన భక్తి విధేయతలు వైష్ణవా దర్శములు.

భగవంతుని త్రిభువన సుందరుడని వర్ణించుచు మంగళా శాసనమును గావించుచున్నాడు ఆళ్వారు.

12. పంద్రెండవ పాశురము:

"పరిశుద్ధుడును, పరమపదనివాసుడును, శార్ఙ్గమను వంటిని అధీన వరచుకొన్న వాడును అయిన స్వామికి శుభము కలుగవలయునని యెంచి, శ్రీవిల్లి పుత్తూరు నివాసి విష్ణుచిత్తుడు అయిన నేను సంస్కృత వేదములను ద్రావిడ రూపముగా సాధించి ఈ ద్వాదశ పాశురముల రచించితిని. దీనిని అనుసంధింప మంచి సమయమని తలచి, యెల్లపుడు అనుసంధించు భక్తులు, 'ఓం నమో నారాయణాయ" అని శాశ్వత చేతనా చేతన శరీరియగు స్వామి వయిననిన్ను సమీపించి యుండి, మంగళాశాసనము చేయుదురుగాక! (పల్లాండు ఏత్తువర్=మంగళమును పాడుదురుగాక).

వివరణము: భగవచ్ఛక్తి పరిశుద్ధము. దాని నెరిగిన చేతనుడు పరిశుద్ధుడు; అట్టివాని మనస్సు పరమపదము, భగవన్నివాసముగాన; అట్టివాని జీవితము పరమపదము.

శార్ఙ్గము బలమునకు పరాక్రమమునకు సంకేతము. ఈశ్వరశక్తి బలపరాక్రమములు వర్ణనాతీతములు! ఈశ్వరశక్తి నెరిగిన చేతునుడును ఈశ్వర కైంకర్యముల యందు దక్షుడు.

"పరిశుద్ధాత్మతో, పరమపదనివాసమున నుండి (పరమా నందమున నుండి) భగవత్కల్యాణ గుణములకు మంగళా శాసనమును పలుకుచున్నా" నని ఆళ్వారు వచించుచున్నారు. ఎంతటి దివ్యవాక్కు! ఎంతటి దివ్యోద్దేశము! ఎంతటి లోకకల్యాణ వాంఛ!

"వేదములు, ప్రస్థానత్రయ సారమయిన యీ దివ్య విషయమును సర్వులు తెలిసికొనుటకు ద్రావిడ భాషయందు చెప్పుచున్నా"నని విష్ణు చిత్తుడు వచించుచున్నాడు. ఎంతటి విజ్ఞానము! ఎంతటి ప్రతిభ! ఎంతటి దయ! ఎంతటి సోదరభావము!

తాను మంగళాశాసనము గావించిన తెరగున, సర్వులును దైవశక్తి యొక్క అనంత కల్యాణ గుణముల నను సంధించుచు, అనంత

కల్యాణ గుణనామకీర్తన గావించుచు, తిరుమంత్రమును అర్థయుక్తముగా వచించుచు మంగళమును పాడుదురుగాక, అని విశ్వసించుచు ఆశీర్వచనము పలుకుచున్నాడు పెరియాళ్ వారు.

"తిరుప్పల్లాండు" ఎంత దివ్యమైనదో, దానిని దేవాలయముల, గృహముల, ఎల్లయెడల గానము చేయుట యెంత యుచితమో చదువరులు గ్రహింతురు గాక!

ఓం

*శ్రీ పెరియపెరుమాళ్ తిరువడిగళే శరణమ్.*

*శ్రీ పెరియాళ్వార్ తిరువడిగళే శరణమ్.*

*శ్రీ రామానుజాచార్య తిరువడిగళే శరణమ్.*

# 5. తిరుప్పావై

## (ప్రార్థనము)

"తిరుప్పావై" అను ప్రార్థన ప్రబంధము తమిళమున ద్వాదశాళ్వారు లలో నొకరగు ఆండాళ్‌చే రచింపబడినది. ఈమెచే రచింపబడిన మరియొక తమిళ ప్రబంధము "నాంచియార్ తిరుమొళి". సామాన్యమైన అక్షర జ్ఞానము గలయే వైష్ణవుడును "తిరుప్పావై" అను పేరు వినియుండును. అందునను తమిళ భాషాపాండిత్యముగల వ్యక్తులను గూర్చి వేరుగా చెప్ప నవసర ముండదు.

తిరుప్పావై ముప్పది మనోజ్ఞ సుందరోజ్జ్వల పాశురములతో గూడిన ప్రబంధరాజము. భక్తి ప్రధానమేగాక యిది ప్రకృతి వర్ణనాశోభితమై, తమిళ సారస్వతమున నొక అగణిత కావ్య కళాఖండముగా రాజిల్లుచున్నది. ఆండాళ్ రచించిన యీ ప్రబంధ ద్వయము వలన ఆమెకు భక్తి సామ్రాజ్యమునను, సారస్వత సామ్రాజ్యమునను దివ్యస్థానము లభించినది. ఆమె ఋషి - పండితకవిగా (Saint-Poet) తమిళసారస్వతమున అభివర్ణింప బడియున్నది. తిరుప్పావై దివ్యప్రబంధమును గూర్చి తెలిసికొనుటకు ఆండాళ్ వైభవోపేత జీవితచరిత్ర కొంత స్మృతికి దెచ్చుకొనవలసిన యవసర మెంతేనియు గలదు.

ఆండాళ్ జన్మవృత్తాంతము అద్భుతము, ఆమె జీవిత వైభవము దివ్యము.

పెరియాళ్వార్ బిరుదాంకితుడు విష్ణుచిత్తుడు శ్రీ విల్లిపుత్తూరు దేవాలయ నందనవనమున అనుదినము మల్లెలు, మొల్లలు, చేమంతులు, పారిజాతములు మున్నగు కుసుమ విసరమును, దవనము, మరువము, తులసి మొదలుగాగల పరిమళ పత్ర సముదాయములను గ్రహించి, హారములగట్టి, అచటి కోవెల

పెరుమాళ్లు శ్రీవటపత్ర శాయి యగు శ్రీమన్నారాయణునకు భక్తితో సమర్పించువాడు. ఇట్లుండ నొకనాటి ప్రభాతవేళ నానాసూన వితాన వాసనల విరజిమ్ముచున్న నందన వనమున అల్లనల్లన నడయాడు చుండిన విష్ణుచిత్తుడు తటాలున నొక తిరుత్తుళాయి వృక్షమూలమున సువర్ణకాంతులీను అప్సరశ్శిశువా అనిపించు త్రిభువన సుందరియగు నొకపసికందును చూచెను. ప్రాభాత నీరజ బంధు ప్రభలచే వికసితమైనట్టియు, మందమారుతముచే కదల్పబడిన పత్రరాజ శోభితమగు కమలము మాడ్కి, ఆ పసికందు పాదహస్తముల కదిలించుచు చిరునగవు లొలికించుచు నుండెను. శుకపిక మనోహర రవములు, సువర్ణ సుమరాజములపై నుండి వెడలు సుగంధ మందమారుతములు, సుప్రభాత అరుణోదయ కాంతులు మున్నగు ప్రకృతి శోభా పుంజములు ఆ మరువంపు మొలకకు సుస్వాగతము పల్కున ట్లుండినవి. ప్రకృతితోను వైష్ణవ శక్తితోను సంశ్లేషించు విష్ణుచిత్తుడును తన దివ్య హస్తములతో నా బిడ్డను స్వీకరించి, భగవత్ప్రసాదముగా భావించి, ఆ బిడ్డకు గోదాదేవియను తిరునామ ముంచి, ఆమెను తనకుమార్తెగా స్వీకరించి పరమానందమున అల్లారుముద్దుగా పెంచుచుండెను. ఆయోనిజ యనబడిన యీ బిడ్డను, జనకుడు సీతను పెంచిన విధమున, విష్ణుచిత్తుడు ఆదరమున పెంచెను. ఇయ్యది గోదాదేవి యొక్క అద్భుత జన్మవృత్తాంతము. భక్తులు గోదాదేవి కీవిధమున ప్రపత్తిని వెల్లడించెదరు:

**శ్లో॥ కర్కటే పూర్వఫల్గున్యాం, తులసీ కాననోద్భవాం।**
**పాండ్యే విశ్వమ్భరాం గోదాం వందే శ్రీరంగనాయకీం॥**

ఈమెను భూదేవి అవతారముగా భావింతురు.

శుక్లపక్ష చంద్రునివలె పెరిగిన తులసీ కాననోద్భవ గోదాదేవికి ద్వాదశ వర్షములు నిండెను. ఆమె బాల్యము నుండియు ఆధ్యాత్మిక చింత నలవరచుకొనినదై, వైష్ణవసంశ్లేషమున ఎల్లవేళల పరమానంద భరితురాలుగా నుండెడిది.

విష్ణుచిత్తుడు అనుదిన సాయంసమయమున సర్వసుమనస్సౌరభ్య సంహితములైన మాలికలనల్లి బుట్టలోపెట్టి యుంచి, సాయంసమయ నిత్యానుష్ఠానముల గావించుకొని, పుష్పహారముల దేవాలయమునకు గొంపోయి, పెరుమాళ్లు వటపత్రశాయికి సమర్పించి, తీర్థ శ్రీ శఠకోప ప్రసాదముల స్వీకరించి, నిజసదనమున కరుగువాడు.

పుష్పమాలికల బుట్టయందుంచి, తండ్రి పర్ణశాల వెలుపల తన నిత్యానుష్ఠాన కార్యక్రమమున మనిగియుండుతరి, గోదాదేవి ఆ మాలికల తాను ధరించి, ముకురమున తన ముఖకమలమును గాంచి, మురిసిపోయెడిది. ఇట్లు కొలది దినములు జరుగగా, ఒకనాటి సాయం సమయమున గోదాదేవి పుష్పమాలాలంకృతయై తన ప్రతిబింబము నద్దమున చుచుకొనుచుండు సమయమున విష్ణుచిత్తుడు ఇంటికి తిరిగివచ్చుట, ఆమెను చూచుట తటస్థించెను, భయభ్రాంతులు ముప్పిరిగొన విష్ణుచిత్తుడు, "కుమారి గోదా! ఏల యీ దైవాపచారము?" అని కినుకపడి, ఆనాడు స్వామికి పుష్పహారముల సమర్పింపలేమికి శోకించి, విచారమున పరుండెను. గాఢధ్యానముననున్న విష్ణుచిత్తుడు ఇట్లు ఆలోచింప దొడగెను - "నా కుమారి గోదాదేవి జ్ఞాని, దైవభక్తురాలు, ఆమె స్వామికి అపచారము తలంచుట అసంభవము..... ఆమె శ్రీకృష్ణునితో సంశ్లేషించి, గొల్లభామవలె నటించుచు, గానము చేయుచు పరమానందము నుండుట నేను పలుమారు గమనించి యున్నాను. శ్రీకృష్ణ సంశ్లేషియయిన గోదాదేవి, శేషశేషి భావము నెరిగినదై, అద్వైతభావమున అట్లు చేసియుండవచ్చును. ఇపుడు ఆమెగావించిన అపరాధము నాకు కాన్పించుటలేదు". తెల్లవారి కొక్కెమునకు వ్రేలాడ గట్టియున్న పుష్పహారములను చూడగా, అవి వాడక తాజాగా ప్రకాశవంతముగా నుండినవి. ఆ రాత్రి స్వామియును తన కగపడి, తన ఆలోచనాక్రమమున కనుగుణముగా "గోదాధరించిన హారము మైలపడదు. ఆమె విష్ణు సంశ్లేష భావకదా", అని అన్నట్లు తన సంశ్లేషభావమున విష్ణుచిత్తుడు భావించెను.

తెల్లవారగనే స్నానసంధ్యాదు లొనరించి, దేవాలయమందు ఉదయార్చనా కైంకర్యమునకై కొక్కెమున తగిలింపబడియున్న తిరుత్తుళాయి (పవిత్ర తులసి) మాలల దీసికొని, విష్ణుచిత్తుడు దేవాలయార్చకుని కివ్వగా, వారు వానిని స్వామి కలంకరింపజేయగా, నవి ద్విగుణీకృతముగా ప్రకాశించినట్లును, వానిని ధరించిన స్వామి అంగీకార సూచకముగా చిరునగవు లొలికినట్లు తన సంశ్లేషభావమున విష్ణుచిత్తుడు తిలకించి పరమానంద భరితుడాయెను. ఇట్లు తాను ధరించి, వదలిన హారమును స్వామికి సమర్పింప గలిగిన గోదాదేవికి "ఆముక్తమాల్యద" అను తిరునామము, సార్థక మాయెను. (ఆముక్త+ మాల్య +ద = ధరించి విడిచిన + మాలను + ఇచ్చినది)

ఇందువలననే విష్ణు సంశ్లేషియయిన గోదాదేవిని గూర్చి శ్రీపరాశర భట్టరు (శ్రీమద్రామానుజుని శిష్యుడు, విశిష్టాద్వైత పీఠమునకు వారసు డయినవాడు) ఇట్లు స్మరించెను:

**శ్లో॥ నీళాతుఙ్గ స్తనగిరి తటీ సుప్తముద్బో ధ్యకృష్ణమ్**
**పారార్థ్యం స్వంశ్రుతి శతశిరస్సిద్ధమధ్యాప యంతీ।**
**స్వోచ్ఛిష్టాయాం స్రజినిగళితం యాబలాత్కృత్యభుఙ్క్తే**
**గోదా తస్యై నమ ఇద మిదం భూయ ఏవాస్తు భూయః॥**

శృంగార భక్తిరస యుక్తమును, అలంకార శోభితమైన యీ శ్లోక రత్నముయొక్క పిండితార్థమిది:

"భగవచ్ఛక్తి సత్యసానువులపై నున్నది. అనగా సత్యాన్వేషణమే భగవచ్ఛక్తిని తెలిసికొనుటయగును. శేషశేషి భావము నెరిగినట్టియు, వైష్ణవ సంశ్లేష భావమున నున్నట్టియు గోదాదేవి భగవచ్ఛక్తిని తనదిగా స్వీకరించి ఆనందింపగలుగుట సహజమేయగును."

అద్భుత జన్మగలిగిన గోదాదేవి జీవితమున, తాను ఆముక్త మాల్యద యగుట ఒక దివ్యాద్భుతము గదా!

ఆత్మదేహాభిమానులకును, ఆత్మస్వరూప జ్ఞానులగు ఋషులకును పర్వత పరమాణువులకు గలట్టి తారతమ్యమున్నది. అలాగే జ్ఞానులగు ఋషులకును పరమానందభరితులగు ఆళ్వారులకును అంతటి బేధ మున్నది. అనగా అద్వైతులగు జ్ఞానులకును, విశిష్టాద్వైతులగు ప్రసన్నులకును అట్టి వాసియున్నది. బ్రహ్మజిజ్ఞాస తపములు పరిపూర్ణశాంతిని కలుగుజేయగలవా? భక్తి ప్రపత్తులు స్వార్థరాహిత్యమును పెంపొందించునుగాన అవి తప్పక ఆనందదాయకము లగును. (నిస్వార్థ భావమే సేవాభావమునకు మూలము కావున, అది సంఘము యొక్క శాంతి సుఖములకు పునాదియగును). దివ్యములగు విష్ణుసంశ్లేష స్వార్థ రాహిత్యముల యందు తండ్రి విష్ణుచిత్తుని మించిన కుమార్తె గోదాదేవి! అతి సంపూర్ణ ప్రపత్తి భావమున నుండుటచే దైవముతో ఐక్యమగు భావమే గోదాదేవి గారిది. గోదాదేవి తానే పోయి, సర్వేశ్వరుని లేపి తమ కొదువను విన్నవించుకొన్నవా రగుటంజేసి, తండ్రికంటెను కుమార్తెయే మిక్కిలి విలక్షణురా లయ్యెను.

పసితనమున నుండియు ఆండాళ్ భగవద్గుణాను భవము నందు ప్రవేశము గలవారై యుండిరి. ఇదియే ఆమె రచించిన నాచ్చియార్ తిరుమొళి, తిరుప్పావై గ్రంథములకు అవతారిక యగుచున్నది.

పురుషుని పురుషుడు స్నేహించుటకంటే, పురుషుని స్త్రీ స్నేహించుట అతి సులభము గదా! ఈశ్వరునియందు పరమ భక్తిగల ఆండాళ్ రచించిన తిరుప్పావై ప్రబంధమునకు అభిప్రాయము ఇయ్యది:

"ధనుర్మాస నీరాట్టవ్రత వ్యాజముతో (మార్గశిమాస ప్రాతః కాలస్నానము నెపమున) ఆండాళ్ ఈశ్వర సన్నిధికిపోయి, - 'నీకు శేషంబగు ఈయాత్మ అనర్థపడకుండునట్లు స్వరూపాను రూపమగు కైంకర్యమును (సేవను) కృపజేసి, ఇది యీ యాత్మ ఉన్నంతవరకు శాశ్వతముగా జరుగునట్లు అనుగ్రహింపుము'' అని అండాళ్ అపేక్షించుచున్నారు".

ఇదే విధమున ప్రతిమానవుడు అపేక్షింపవలయును". ఇదియే తిరుప్పావైద్వారా ఆండాళ్ ఒసంగు సందేశము.

వివాహమునకు యుక్తవయ్సురాగా, వరాన్వేషణమునకై తండ్రి ఉపక్రమించుచున్నాడని గమనించిన ఆండాళ్ తండ్రితో, "నాయనా! మానవవరుడు నాకు సరిపోడు, నేను దైవమునే వరించియున్నాను. నా ఆత్మ పరమాత్మతోనే దివ్యసంబంధము గావించియున్నది". అని తర్కరహితముగా ఖండితముగా విన్నవించెను. జ్ఞాన భక్తులకు నిధియయిన కుమార్తెకు తండ్రి యెట్టి ప్రత్యుత్తరమును యివ్వలేక పోయెను.

ఆండాళ్ మిక్కిలి అభినివేశముతో, భక్తిపారవశ్యమున శ్రీ విల్లిపుత్తూరు నను్న వటపత్రశాయి అయిన స్వామితో సంశ్లేషించి, ఉత్సాహమున నొంటరిగా దేవాలయమును ప్రవేశించెను. వారును అర్చావిగ్రహమగుటం జేసి, ఆమె యభిప్రాయమునకు ముఖము నివ్వనందును, ఆమె కరము వ్యసనపడి, యిట్టి అర్చావతారమైన ఈశ్వరునితో సంశ్లేషంబునొందినవారు మరెవరియినను కలరో, లేరో, అని విచారపడెను.

శ్రీకృష్ణావతారమున గోపికలు శ్రీకృష్ణుని విశ్లేషించినపుడు విరహంబు సహింపలేక, కాళియ మర్దనాది కృష్ణచేష్టితములను అనుకరించి, మనస్సును దృఢపరచుకొనిరని కొందరు ధార్మికులు వచింపగా వినిన ఆండాళ్, తానును వారల అనుకరణం బొనర్చి మనస్థిమితము చెందవలయునని ఊహించి, యెచించి, అదియును కాలాంతరంబున జరిగిన దగుటచేతను, కృష్ణుడును గోపికలును సంచరించిన పాదస్పర్శ గల ప్రదేశమును, స్నానం బొనర్చిన యమునయు, కృష్ణుడెత్తిన గోవర్ధనమును సమీపమునం దున్నయెడల సేవించి, తరింప వచ్చునని ఆండాళ్ యోచించెను. కాని అదియును తనకు సాధ్యముకానందున ఆమె వ్యసన పడెను. సీతాదేవికి శివధనువ్సువలె, నీళాదేవికి వృషభములు వలె తనకేదియు

నిష్కర్షగానక, ధైర్యములేనివారై ఆండాళ్‌వారు చివరి కొక నిర్ణయమునకు వచ్చిరి. తాను గోపికలయనుకారం బొనర్చియైనను తరింప జూతమని తలంచిరి. నాటకముల యందలి పాత్రలు శ్రీరామ, శ్రీకృష్ణ రూపములగునట్లు, ఆండాళ్ బ్రాహ్మణ కులబాలికయయినను, గోపికారూపమును వహించి, అనుకారంబు హెచ్చింప, తన భక్తి ప్రేమ పరవశత్వమున - శ్రీ విల్లిపుత్తూరును వ్రేపల్లెగాను, అచటి కన్యకలే గోపికలుగాను, అచ్చటి దేవాలయ ప్రాంగణమును శ్రీకృష్ణుని సదనముగాను, అందుశయనించి యున్న వటపత్రశాయియే శ్రీకృష్ణునిగా భావించి, భావనాతిశయముచే గొల్లభామ నడకయు, గొల్లభామ క్రొమ్ముడియు, గొల్లభామల సంభాషణమును, గొల్లభామల సంస్కారమును, కలిగినదై యుండెను - ఆండాళ్.

శ్రీవిల్లిపుత్తూరును వ్రేపల్లెగా భావించుటచే, ఆండాళ్ ఆ గ్రామమునకు తన ప్రబంధమున తిరువాయప్పాడు అను పేరిడెను. (తిరు=పవిత్రమయిన, వాయప్పాడు = గొల్లపల్లి)

ఆండాళ్ విరచితంబగు "తిరుప్పావై" ప్రబంధమునకు కథా సందర్భమును ఈ విధముగా ఏర్పరచిరి:

శ్రియఃపతియు, అవాప్తసమస్తకాముడును అయిన సర్వేశ్వరుడు సకల జగదుజ్జీవన శాస్త్రంబుల నొసగియు, మానవులు తదర్థం బెరుగక, అనర్థపడు సమయములందు తాను మానవలోకమున నవతరించి, తమ కల్యాణ గుణములచే మానవులను జ్ఞానసంపన్నులుగా నొనర్చి, అనుగ్రహించువా డగుటచే, తదర్థమై తిరువాయిప్పాడి యందు శ్రీకృష్ణావతారం బొనర్చి, తమ సౌందర్యము చేతను, తమ అతి మానుషగుణ చేష్టితముల చేతను, జన్మాంతర భాగ్య సంపన్న సౌజన్యలగు గోపకన్యకలు లీలారసంబుల శ్రీకృష్ణునికి స్వాధీనలై పెరుగుచుండిరి.

ఆ సమయమున తానును (ఆండాళ్) ఇతరగోపికలును ప్రాప్తయౌవనలు కాగా, గోపవృద్ధులు సమావేశపడి యిట్లు తలంచిరి

- "ఇంత వరకు బాల్యముననున్నందున మన గోపికాకన్యకలు, శ్రీకృష్ణుడును కలిసి మెలసి యిష్టానుసారము స్వేచ్ఛగా మెలగుచూ, విహరించుచు వచ్చిరి. కాని యిపుడు మనగోపకన్యలు యౌవనవతులయిరిగదా! శ్రీ కృష్ణుడును యువకుడయినాడు, కావున ఇక మన కన్యలను విచ్చలవిడిగా శ్రీకృష్ణునితో విహరింపనీయరాదు. యువకుడయిన కృష్ణుని వలన ఏమి ముప్పువాటిల్లునో! కాన మన కన్యలను మన యిండ్ల ద్వారములదాట నివ్వరాదు సుమా!" ఈ నిర్ణయమున గోపవృద్ధులు వారివారి కన్యలను గృహబద్ధురాండ్రనుగా జేసిరి. గోపికా కన్యలలో నొకతెయగు ఆండాళ్ కూడ అట్లే గృహమున బంది యాయెను!

ఇట్లు కొంతకాలము జరుగగా, తిరువాయిప్పాడులో వర్షాభావముచే క్షామ మేర్పడెను. వాతావరణము అతివేండ్రముగా, దారుణముగా నుండెను. వరుణుని కృపతో వర్షమును పొందుటకు అనాటి యాచార ప్రకారము బాలికలు, బాలురు అందులోను ప్రాప్తయౌవనలయినవారు, కలిసి నోమునోచుట వర్షాగమమునకు యుక్తమని గోపవృద్ధులు తలంచిరి. తదనుగుణముగా తిరువాయిప్పాడులోని పెద్దలెల్లరు గోపకన్యలను, శ్రీకృష్ణుని, అతని సహచరులను రావించి, "గోపికా గోపకులారా! మీరు వర్షార్థమై నోము నోమవలయును. ఓ కృష్ణా! వీరి నోమునకు నీవు ఘటకుడవు గావలయును", అని కోరిరి. అందులకు శ్రీకృష్ణుడు అదినాకు అశక్యము అని చెప్పెను. "కాదు, కాదు, నీవా పనిని చేసి తీరవలయును. ఈ కార్యము ప్రజాక్షేమము కొరకును, గోక్షేమము కొరకును నిర్దేశింపబడినది సుమా!" అని గోపవృద్ధులు శ్రీకృష్ణుని ప్రార్థించి నిర్బంధించిరి, కడకు కృష్ణుడు సమ్మతించెను. పిదప శ్రీకృష్ణుని వశమున గోపికల నప్పగించి, గోపవృద్ధులు తమతమ పనులకు బోయిరి.

గోపికలును శ్రీకృష్ణుడును అనాటి రాత్రియే యొక శుభసమయముగా భావించి, సమావేశపడి, వారి యానందమును

ప్రదర్శించుటకు పాటలబాడి, నృత్యములజేసి, బహుకేళీవిహారముల సలిపిరి. రాత్రి ప్రొద్దుపోగా ఇక నిజసదనమున కరుగుట యుక్తమని భావించిన శ్రీకృష్ణుడు వారందరితో, "మన మిక మన గృహములజేరి నిద్రింతము, రేపటి తెల్లవారుజాముననే మన వరుణవ్రతము ప్రారంభము కావలయును కదా! ధనుర్మాస ప్రారంభము రేపేగదా! మనము తెల్లవారు జాముననే పవిత్ర (యమునా) నదిలో స్నామాడవలయును గదా! మీరు వేకువనేలేచి, వచ్చి, నన్ను లేపవలయును సుమా!" అని చెప్పి, శ్రీకృష్ణుడు నప్పిన్నపిరాట్టి గృహమును ప్రవేశించెను. (నప్పిన పిరాట్టి = నీళాదేవి)

ఆనాటి రాత్రి గోపకన్యకలు తమతమ గృహములకు జని, శయనించినను, శ్రీకృష్ణుని జగన్మోహనాకారమునకు పరవశులై యున్నందున, నిదుర పట్టనందున, ఆయన గుణచేష్టితములను స్మరించుచు, రాత్రికాలమంతయును గడపగా, అనుకొనిన విధమున తెల్లవారుజామునకు అనగా బ్రాహ్మ ముహూర్తమునకు, వారికి మెలకువ రాలేదు. మార్గళిమాసము (ధనుర్మాసము) తెల్లవారినతోడనే ప్రారంభమగును గదా! మరికొందరు గోపికలు నిదురనుండి మేల్కాంచియు, లేవజాలక అట్లనే పరుండియుండిరి. వారిని ముందుగా లేచిన గోపికలు (ఇందులో ఆండాళ్ తానొకరుగా భావించుకొన్నది) నిద్రనుండి లేపుకొని, శ్రీనందకుమారుని భవనంబున కేతెంచి, వారిని మేల్కొలిపి, తమ వాస్తవమయిన ప్రార్థనను విన్నవించుకొందురు. ఈ గోపికలలో నొకరగు ఆండాళ్ - అర్జునుడు పదునెనిమిది అధ్యాయములతో గూడిన భగవద్గీతను వినియు, ఇంకను సంశయంబులో నుండి, కడపట చరమ శ్లోకమును విని, తన సందియమును నివర్తించుకొని, ధన్యుడయిన తెరగున నోమునోచుట యనుపేర భగవత్ సంశ్లేషానందాను భవమును కోరి, కామ భజనాదుల నొనర్చి, ఆనందించుచుండిరి. ధనుర్మాసమున దినమున కొక దివ్య పాశురము వంతున ఆండాళ్ గోపకన్యకలతో గూడి తెల్లవారుజామున శ్రీకృష్ణ నిలయము ముందు పాడి, శ్రీకృష్ణుని

నిద్రనుండి లేవుదురు. ఇట్లు గానము చేయబడిన ముప్పదిపాశురములతో గూడిన ప్రబంధమును "తిరుప్పావై" అని అందురు. తిరుప్పావై అనగా మేలుకొలుపు ప్రార్థన అని భావము - సుప్రభాత దైవ సంకీర్తనము. ఇట్టిది తిరుప్పావై యొక్క అవతారిక.

(ఈ సంప్రదాయమును బట్టియే హిందూ గ్రామములలో హరిదాసులు తెల్లవారుజామున హరినామ సంకీర్తనల గానము చేయుచూ, ధనుర్మాసకాలమున మేలుకొలుపులు చేస్తూ యుంటారు)

ఈ తిరుప్పావై ప్రబంధము - భక్తి ప్రపత్తులు, జగన్నాథుని యెడ జీవునకున్న దివ్యదాంపత్యము, సృష్టి స్థితిలయముల విషయములు, ప్రకృతి వర్ణనములు ఇత్యాదులతో అలరారుచున్నది. ఇది భక్తిరస భరితమే గాక తమిళసారస్వతమున నొక కళాఖండము. ప్రబంధ కల్పన మనోజ్ఞము.

ఈ ప్రకరణమున తిరుప్పావైలోని ఒక్కొక్క తమిళ దివ్య పాశురము యొక్క భావమును తెలిసికొని, అందున్న అధ్యాత్మిక, సారస్వత శోభను తిలకింతము గాక.

కాని మొత్తము మీద ఈ తిరుప్పావై అను ప్రబంధమునెరపు అధ్యాత్మిక జ్ఞానమేది? గమనింపుడు:

1. "ఆండాళ్ గోపికాకన్యక లందరిని మేల్కొలిపి, శ్రీకృష్ణుని సదనము చేరి, వారి ప్రార్థనములను వ్యక్తము చేయుదురు. ఈ కథా సందర్భము వారి ప్రార్థన యేమిటి? శ్రీకృష్ణుడు వారినందరిని అనుగ్రహించి దివ్య యమునా నదీస్నానమునకు ఏగుదెంచ వలసినదని.

ఇచట ఆండాళ్ జీవాత్మకు సంకేతము. ఆత్మ జ్ఞానము గలిగిన యే చేతనునికైనను సంకేతము. శ్రీకృష్ణుడు సర్వాంతర్యామియగు వైష్ణవశక్తికి సంకేతము. యమునా నదీస్నానము జీవాత్మ పరమాత్మల ఐక్యభావము; చేతనుడు (అనగా ఆత్మజ్ఞాని) సర్వాంతర్యామియగు

పరమాత్మతో సంశ్లేషపడి దివ్యానుభవమును పొందుట. ఇదియే ఆలంకారికముగా చెప్పబడిన యెడల జీవాత్మ పరమాత్మల దివ్య దాంపత్యమగును.

ఆండాళ్ శేషశేషి భావమున, అనగా భగవచ్ఛక్తి సర్వశేషియనియు, తాను అందులోని యొక అణువనియు అను భావమున, అట్టి యెరుకతో, భగవచ్ఛక్తితో సంశ్లేషపడుచున్నది. ఆమె వైష్ణవశక్తితో సంశ్లేషపడడ మనగా, ఆమె సంపూర్ణ ఆత్మ జ్ఞానమున నున్నదని భావము. అట్టి సంపూర్ణ ఆత్మజ్ఞానికి దేహాభిమానము లేదు. ఇదియే పరమానంద స్థితి.

ఆండాళ్ భగవచ్ఛక్తితో ఈడు పడుచున్నది; సామ్యభావమును పొందుచున్నది. ఇదియే ఆమెకు గలట్టియు, ఆమెవ్యక్తము జేయునట్టియు దివ్యదాంపత్య భావము.

మానవ యువతీయువకులు పరస్పరము ప్రేమించుకొని, వరించుకొని, వివాహమాడుటను మనము దాంపత్యమనుచున్నాము. ఇది శారీరక, లేక భౌతిక దాంపత్యము. ఇది రెండు వ్యక్తుల మధ్య గలట్టి బాంధవ్యము, దాంపత్యము. ఇది పరిమిత దాంపత్యము. కాని, ఆత్మజ్ఞాని యగు భక్తుడు తన సంశ్లేషభావమున సర్వాంతర్యామి యగు వైష్ణవశక్తితోడి తన నంబంధమును గ్రహింపగలుగుట దివ్య దాంపత్యము. ప్రపంచములోని ప్రతి జీవికిని విశ్వజీవశక్తికిని ఈ దాంపత్యమున్నది. కాదనువా డెవడు? కాని యీ సంబంధమును తన జ్ఞానమును బట్టి తెలిసికొనినవాడు పరశక్తితో దాంపత్యమును ఎరిగినవాడై, తన సంశ్లేష భావమున పరమానంద స్థితిని అనుభవిస్తాడు. కాబట్టి భక్తి అనగా వైష్ణవ సంశ్లేషభావమే. ఇదియే పరమానంద స్థితి. ఇదియే భగవచ్ఛక్తితోడి దివ్య దాంపత్యము.

తిరుప్పావై ప్రబంధమున ఆండాళ్ వ్యక్తము జేయు దివ్య భక్తిభావము వైష్ణవ సంశ్లేష భావము. ఆళ్వార్లందరును ఇట్టి వైష్ణవ సంశ్లేష భావమున నున్నవారే. ఈ సంశ్లేష భావమును ఆండాళ్

వైష్ణవశక్తితోడి దివ్య దాంపత్యమని తిరుప్పావై ప్రబంధమును సూచించుటచే, ఈ భక్తి భావము మనోహరమును, అలంకార యుతమును అగుచున్నది.

ఇట్టి దివ్యదాంపత్యము, నమ్మాళ్వారు రచించిన "కోయిల్ తిరువాయ్ మొళి యొక్క (సహస్ర పాశురపుంజము) రెండవ అధ్యాయము నందును కూడా "ఆళ్వార్ నాయక్" విషయముగా, అతి మనోహరముగా వర్ణింపబడి యున్నది. అలంకార యుతమగు ఈ భాగమును సారస్వతులు చదివి ఆనందింతురు; భక్తులు చదివి పరమానందము నందుదురు.

ఆళ్వార్లు వారి జీవితమున వారు ప్రదర్శించిన వైష్ణవ సంశ్లేష భావమును గ్రహించుట చేతనే, భవిష్యత్కాలమున ఈ భావమునకు శ్రీరామానుజాచార్యులు ప్రచారము కల్గించినారు - ఇదియే నిజమైన భక్తిగా, శరణాగతి భావముగా స్వార్థరహిత భావముగా అభివర్ణింపబడినది. ఇట్లు విశిష్టాద్వైత సిద్ధాంతానుభవయోగ్యతను శ్రీరామానుజుడు చేతనులకు జూపినారు. ఇది ఒక ప్రధాన విషయము:

ఇక రెండవది: ఆండాళ్ జీవాత్మకు సంకేతమని పైన చెప్పబడి యున్నది. అనగా ఆత్మజ్ఞానము గల చేతనునికి సంకేతమన్నమాట, విశ్వము మూడు అంశములుగా విభజింపబడినది రామానుజునిచే తన విశిష్టాద్వైత సిద్ధాంతమున - చిత్, అచిత్, ఈశ్వర అనునవి. అచిత్తం సర్వజడ పదార్థమును సూచించును. చిత్తు ప్రాణిలోకమును సూచించును. ఈ రెంటి యందును వ్యాప్తమయిన అద్వైతశక్తి "ఈశ్వర" అనబడినది. ఈ మూడును ఆది మధ్యాంత రహితములే. చిత్, అచిత్ అందు రెంటియందును అద్వైతమయిన ఈశ్వరశక్తి యున్నందున ఈ రెంటియొక్క స్థితి మార్పులు ఈశ్వరశక్తిపై నాధారపడియున్నను, ఈ రెంటికి గూడా, ఈశ్వరశక్తి వలె, వానివాని విశిష్టగుణము లున్నందున, సర్వవేదాంతము విశిష్టాద్వైతమును సూచించుచున్నదని శ్రీరామానుజుడు వ్యక్తము జేసెను. ఆండాళ్ జీవాత్మకు సంకేతమన్నపుడు, ఆమె చిత్తు

అచిత్తుల సమ్మేళనమునకు సంకేతమన్నమాట. చిత్, అచిత్ అను ఈ రెండు అంశములు ఈశ్వరశక్తిచే నిలిచియున్నవి. కావున, ఉదాహరణకు, మానవశరీరమున ఈ మూడును, అనగా చిత్, అచిత్ ఈశ్వర అనునవి సంయోగపడియున్నవి. కావున విశ్వములోని మూడు అంశములు ప్రతి జీవియందును ఉన్న వన్నమాట; పరిమాణమున, ప్రభావమున మార్పు ఉన్నది. అంతవరకే. ఇదియే జీవాత్మకు, సర్వంతర్యామి యగు వైష్ణవశక్తికిని ఉన్న సంబంధము. ఈ సంబంధము నెరిగిన ఆండాళ్ పరమాత్మతోటి దివ్యదాంపత్యమును తిరుప్పావైలో వెల్లడించినది. ఈ దివ్యదాంపత్యమును వెల్లడించుటలోనే చిత్, అచిత్, ఈశ్వర - యొక్క సంబంధము తెలియుచున్నది. ఇందు గలట్టి జ్ఞానమే తత్త్వత్రయ జ్ఞానము. ఈ తత్త్వత్రయ జ్ఞానము ప్రారంభమున పరాశరుడు విష్ణుపురాణమున తెల్పియున్నాడు. ఇట్టి తత్త్వత్రయ జ్ఞానమునే శ్రీరామానుజుడు స్వీకరించి తన విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించి యున్నాడు.

కాబట్టి శ్రీరామానుజుడ తత్త్వత్రయ జ్ఞానమును శాస్త్రీయముగా తన విశిష్టాద్వైత సిద్ధాంతమున ప్రతిపాదించి, ఆళ్వారులు చూపిన విష్ణు సంశ్లేష భావము నిజమైన భక్తిభావమని ప్రచారము చేసినాడు. తత్త్వత్రయ జ్ఞానమును వైష్ణవ సంశ్లేష భావమును రెంటిని అతిమనోహరముగా కావ్యరీతిలో తిరుప్పావై ప్రబంధమున ప్రతిబింబింప జేసిన ఆండాళ్ శ్రీరామానుజునకు ఆరాధ్యురాలు. అందువలన శ్రీరామానుజుడు తన జీవితమున పలుమారు తిరుప్పావై దివ్య ప్రబంధమును పఠించునపుడు, తన్మయుడై తన సంశ్లేషభావమున తాను ఆండాళ్‌గా భావించుకొని పరమానందమున నుండువాడట.

ఒకనాడు, రామానుజుడు తన ఆచార్య పంచకములో నొకరగు పెరియనంబి యింటిముందుకు పోగా (తిరుప్పావై పాశురముల పఠించుచు), రామానుజుని అన్నగా భావించి సంబోధించు ఆచార్యుని కుమార్తె అతుల్య వాడుకగా శ్రీరామానుజుని సమీపింపగా, సంశ్లేష

భావముననున్న రామానుజుడు, అతుల్యను నీళాదేవిగా భావించి, శ్రీకృష్ణుని మేల్కొల్పుమని చెప్పు తిరుప్పావై పాశురముల నెంతో ఆనందో ద్రేకమున అట్లే చదువుచుండ, నామె భయపడి అన్నగారికి మతిభ్రమణము గలిగినదేమో అని తలచి, లోనున్న తండ్రి వద్దకు పరుగిడి, ఆ వృత్తాంతమును తెల్పగా, తండ్రి పెరియనంబి సర్వమెరిగిన వాడు గాన "అమ్మాయీ! మీ అన్న తిరుప్పావై ప్రబంధమును పరవశమున పఠించు చున్నాడు లే, అమ్మా" అనెను. కావున ఇచట వెల్లడింపబూనుకొన్న విషయ మేమన, తిరుప్పావై యెంతటి ఘనమైన ప్రబంధమో, ఎంతటి శాస్త్రీయమైనదో, యెంతటి ఆధ్యాత్మికమైనదో, యెంత రసవంతమైనదో మనము గమనింపవలసి యున్నది.

3. శ్రీరామానుజుని విశిష్టాద్వైత సిద్ధాంతమునకు సహకారియగు తిరుప్పావై ప్రబంధము వైష్ణవ సంశ్లేష భావమును, తత్త్వత్రయ జ్ఞానమును వెల్లడించి, శ్రీరామానుజునకు ఉపకరించుటయే గాక, ఈ దివ్య ప్రబంధము రామానుజునకు మరియొక దివ్యసందేశమును గావించినది. ఇది మూడవ విషయము చాల ముఖ్యమయినది, సేవా భావమును వెల్లడించునది!

దర్శన సంభాషణ భాగ్యమును తానే అనుభవింప దలంచలేదు ఆండాళ్. ఆ భాగ్యమును తక్కిన గోపికాకన్యక లందరికిని కలుగజేయ దలచినది ఆండాళ్. నిజమైన జ్ఞాని తన జ్ఞానము నెల్లరకు పంచిపెట్టి వారిని ఉద్ధరింప జూచును. ఈ విషయము రామానుజున కెంతయో జ్ఞానదాయక మైనది. అందువలననే తన ఆచార్యుడు తిరుక్కోట్టి యూర్‌నంబి రామానుజునకు తిరుమంత్రము నుపదేశించి, రహస్యముగా నుంచుమని ఆజ్ఞాపించినను, దయార్థ్ర హృదయుడగు రామానుజుడు గురునాజ్ఞ నుల్లఘించుట వలన సంక్రమించు పాపమును సరకుసేయక, లోకకల్యాణము గోరినవాడై, దేవాలయ శిఖరము నెక్కి తిరుమంత్రమును సర్వులకు ప్రకటించినాడు. నిజమైన ఆచార్యుని తత్త్వమును ఆండాళ్ తన ప్రబంధమున సూచించినారు.

ఈ సందర్భములోనే రామానుజుడు సేవాభావము యొక్క ప్రాశస్త్యమును ప్రకటించినాడు. కావున శ్రీరామానుజుడు తన విశిష్టాద్వైత సిద్ధాంత ప్రబోధములు తత్త్వత్రయ జ్ఞానము, విష్ణు సంశ్లేష భావము, సేవా భావము లని వక్కాణించి యున్నాడు. ఈ మూడు భావములు తిరుప్పావై ప్రబంధము వెల్లడించు చున్నది.

ఇక తిరుప్పావై ప్రబంధములోని ముప్పది పాశురముల భావములను, ఒక్కటొక్కటిగా గమనింతముగాక ఆనందింతుముగాక - ప్రభావితుల మగుదుముగాక!

తిరుప్పావై ప్రబంధములోని -

**1. మొదటి తమిళ పాశుర భావము:**

"సంపద వృద్ధినందు ఈ తిరువాయిప్పాడిలో (వ్రేపల్లెలో) కైంకర్య లక్ష్మియు, దివ్యాభరణములును గల గోపికలారా! ఇది మార్గళిమాసపు (మార్గశీర్షమాస) శుక్లపక్ష పూర్ణిమాశుభదినము. తన కుమారునిపై (శ్రీకృష్ణునిపై) ఈగ, దోమను కూడ వ్రాలనీయక అతి జాగరూకుడుగా నున్న నందగోపుని కుమారుడును, చారునేత్ర యశోదాదేవి యొక్క సింహకిశోరము వంటి ముద్దుల పట్టియు, ఆశ్రిత తాపహరమగు నీలమేఘమును బోలు తిరుమేను (దివ్య శరీరము) గలవాడును, ఎర్ర కలువల వంటి నేత్రములుగల వాడును, సూర్యచంద్రులవలె ప్రకాశానందముల కలుగజేయు ముఖమండలమును గలిగిన వాడును అయిన నారాయణుడే, అనన్యగతికుల మగు మనయొక్క కోర్కెలను దీర్చువాడై యున్నాడు. కావున ఈ గోకులవాసు లెల్లరు స్తుతించునట్లు ఈ నోమున ప్రవేశించి స్నానమాడుటకు వచ్చువారు రండి".

వివరణము: శ్రీకృష్ణునితో కలిసి స్నానమాడుట యనగా శ్రీకృష్ణునితో సంశ్లేషించి ఆనందించుట అని భావము. శ్రీకృష్ణుడు అనంత కల్యాణ గుణప్రపూర్ణుడు గాన శ్రీకృష్ణునితో సంశ్లేషించుట అనగా కల్యాణ గుణానుభవమును పొందుట యగును.

వైష్ణవశక్తి అవాఙ్మానసగోచరము. ఆ వైష్ణవశక్తిని అనంత కల్యాణగుణ ప్రపూర్ణముగా నూహించు కొనగలుగుటయు శక్యమా? కావున అనంత కల్యాణగుణ ప్రపూర్ణునిగా శ్రీమన్నారాయణమూర్తిని సేవింపు మన్నారు. ఇదియు శక్యమా? శ్రీమన్నారాయణుడు వైకుంఠ నివాసి యనిగదా పురాణములు వర్ణించుట. కావున మనము చూడగలుగునట్టియు, మనలో కలిసి జీవించునట్టియు కల్యాణ గుణయుతుడగు పురుషోత్తముడే ఆరాధ్యుడు. అదియే భగవన్మూర్తి. కావున శ్రీకృష్ణుని సేవించుటకు ఆండాళ్ గోపికాకన్యల నందరిని ఆహ్వానించుచున్నది. కల్యాణగుణ పరిపూర్ణులగు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు భగవదవ తారములుగా పూజింపబడుటను విశిష్టాద్వైత సిద్ధాంతము ప్రేరేపించుచున్నది. కావున తిరుప్పావై యొక్క యీ అంశము ఈ విధమున భవిష్యత్తులో రామానుజుని ప్రభావిత పరచినది.

నిజమైన ఆచార్యుడు రహస్యమనునది పాటింపక, లోకకల్యాణ మును కోరినవాడై తనదివ్య విజ్ఞానమును తోటి మానవుల కెరుకపరచి సర్వులును సద్గతిని పొందుటకు తోడ్పడును - శ్రీరామానుజుడు తిరుమంత్రమును బహిరంగపరచినట్లుగా పూర్వము గోపకన్యల నందరిని శ్రీకృష్ణ సంశ్లేషమను స్నానమునకు ఆహ్వానించు ఆండాళ్ ఉత్తమోత్త ముడయిన ఆచార్యునకు సంకేతము.

నందగోపుడు ఆనందగోపుడు; తననందనుడగు శ్రీకృష్ణుని లోకానందమున కొసంగినవాడు. యశోద=యశమును (కీర్తిని) లోకమునకు ఇచ్చినతల్లి. ఈ కీర్తి యెట్టిది? శ్రీకృష్ణుడను కీర్తి, గీతాచార్యుడను కీర్తి. కావున నందనందనుడు, యశోదానందనుడగు శ్రీకృష్ణుడు లోకమునకు ఆనందమును, జ్ఞానమును ఒసంగినవాడు, కావున శ్రీకృష్ణుడు కల్యాణ గుణయుతడుగు పురుషోత్తముడు, ప్రత్యక్ష దైవతము. గీతా ప్రబోధము గదా! మానవునకు సద్గతి చూపునట్టిది?

శ్రీకృష్ణునితో కలిసిమెలసి గోపకన్యకలు స్వేచ్ఛగా విహరింప రాదను కట్టుదిట్టమును గావించిన గోపవృద్ధులే మరల ఈనాడు గోపకన్యకలు

గావించు నోమునకు శ్రీకృష్ణుని ఘటకునిగా నుండ ప్రార్థించిరి. పూర్వ కాలమున మతగురువులు, ఋషులు, మునులు ఏకాంత తపస్సునకు ప్రాధాన్య మిచ్చినవారై, వారివారి కోర్కెలను బడయుటకు తప మాచరించుటయే శ్రేష్ఠమయిన పథమని బోధించి యుండిరి. జ్ఞానము కంటెను, ధ్యానముకంటెను కర్మఫల త్యాగము గొప్పదని గీతాచార్యుడు చెప్పియున్నాడు. వైష్ణవ సంశ్లేష భావమున పరమానంద స్థితి అబ్బునని ఆళ్వారులు వారి జీవితముల ద్వారా వెల్లడించిరి. గురుపరంపరలో వారిదృక్పథములో ఇట్టి మార్పు వచ్చినది. ఈ మార్పునే సూచిస్తుంది గోపవృద్ధుల ఆలోచనలోని మార్పు. విష్ణు సంశ్లేష భావమను వేదాంత తత్త్వము ఈ పాశురమున సూచింపబడినది. మూఢమైన తపస్సులు, హఠయోగములు వారివారి కోర్కెలను పొందుటకు మార్గములుగా చెప్పబడి యున్నవిగాన, వీనిని వదలి లోకకల్యాణమును గూర్చు విష్ణు సంశ్లేషభావమును, శరణాగతి భావమును, సేవాభావమును భక్తుడుగా నుండువాడు పాటింపతగి యున్నవని ఈ పాశురమున సూచింప బడియున్నది.

సత్కాలము సత్కర్మమును ప్రేరేపించును, కార్యశుద్ధికి కార్యసిద్ధికి తోడ్పడును. ఇది సహజముగా మానవుల విశ్వాసమై యున్నది. అందువలన నోమునకు యుక్తమయిన పర్వదిన మదియని ఆండాళ్ అన్నారు. అది మార్గ శీర్షమాస శుక్లపక్ష పూర్ణిమా దినము. "మాసానాం మార్గశీర్షోహం" అంటాడు భగవానుడు గీతయందు. ఒక సత్కార్యమును పాటించువేళను, అట్టి సత్కార్యము ఫలప్రదమయిన వేళను కూడా శుభస్కరముగా భావించుటయేగాక, అట్టి సమయము సర్వులకు చిరస్మరణీయ మవుతుంది. అందువలననే ఆండాళ్ నోమునకు నిర్ణయించుకొనిన ఆ దినము, మార్గశీర్ష శుక్లపూర్ణిమ, భవిష్యత్కాలమున ప్రజలు, భక్తులు పర్వదినముగా భావించుచున్నారు. ఆండాళ్ ఇచట కాలము యొక్క ఔచిత్యమును ప్రశంసించుట, ఇత్యాదులు ఇందు పేర్కొనబడిన ఆధ్యాత్మిక విషయములు. ఇక ఇందుగల తల్లిదండ్రుల

వాత్సల్య వర్ణనము, శ్రీకృష్ణుని దివ్యవిగ్రహ వర్ణనము, నోము ప్రారంభకాల వర్ణనము మనోజ్ఞముగా నున్నవి. ఈ పాశురమిట్లు దివ్య విషయ, సారస్వత సౌందర్యములకు మేలుకలయికగా నున్నది కదా. ప్రతి పాశుర మిట్లేయుండును. నాచ్చియార్ తిరుమొళి పాశురములు గూడా ఇట్టి సౌరభముల వెదజల్లును. కావుననే ఆండాళును ఆళ్వారుగా భక్తులు భావించినారు; మహాకవి శిరోమణిగా పండితులు లెక్కించినారు. అందువలననే ఆండాళును ఋషికవి (Saint poet) అని అంటారు.

ఆధ్యాత్మికముగా ఈ పాశురమున సాధ్యస్వరూపమును, సాధన స్వరూపమును, అధికారస్వరూపమును వర్ణింపబడినవి.

## 2. రెండవ పాశురము:

"ఈ లోకమందు ఉజ్జీవింప జనించిన భాగ్యవతులారా! మనము మన నోమునెరవేరు వరకును, చేయవలసిన క్రియా విశేషముల గూర్చి వినుడు: క్షీరాబ్ధియందు యోగనిద్ర గావించెడు శ్రియః పతియొక్క కల్యాణ గుణములను అనుసంధించి, సంశ్లేషభావమున పరమానందమున నుండెదము గాక.... విశ్లేష దశయందు మనము ఇతర ప్రాపంచిక భోగ విషయముల యందు అన్వయింపము: భోగవస్తువులను వర్జింతుము గాక: నేతిని భుజింపము; క్షీరపానము చేయము; కాటుక, మైపూత పుష్పాద్య లంకారములను వర్జింతుము. శిష్టాచారముల పాటింతుము. పరులకు హాని కలుగజేయు అబద్ధపు మాటల వచింపము; ఒకరిని గూర్చి మరి యొకరితో చాడీలు చెప్పము. యాచకులగు జ్ఞానులకును, బ్రహ్మచారుల కును, సన్న్యాసులకును వారివారి కనుగుణముగా, యాచించు కొలది, దానములొసగి, మనము ఉజ్జీవించి, సంతోషించు విధమును తలచుచు, దివ్యమయిన మన వ్రతమును అనుష్ఠించెదము గాక!"

వివరణము: మొదటి పాశురము వేదాంత విజ్ఞానమును ప్రదర్శింపగా, రెండవ పాశురము వేదాంత విజ్ఞానానుసారముగా

గడపవలసిన జీవిత విధానమును తెల్పుచున్నది. ప్రాప్యప్రాపకములు రెండును ఈశ్వరుడేయని భావించువాని యొక్క కృత్యాకృత్యములు రెండవ పాశురమున వర్ణింపబడినవి.

ఆళ్వారుల జీవిత విధానము గాని గీతా జ్ఞానముగాని, విశిష్టాద్వైత సిద్ధాంతముగాని, సన్న్యాసమును అంగీకరింపవు. సమ్యక్ జీవితమును కర్మఫలత్యాగమును అవి ప్రబోధించుచున్నవి.

పరమానందము కొరకు వైష్ణవ సంశ్లేష భావమును, లోకకల్యాణము కొరకు కర్మఫల త్యాగమును సూచింపబడినవి.

"సంశ్లేష భావమున పరమానందమును దైవగుణానుభవమును పొందియుండెదముగాక! విశ్లేషించి యున్నపుడు (అనగా ఇతర వేళల యందు) ధార్మికమైనట్టియు, స్వార్థరహితమైనట్టియు, మమకార రహితమైనట్టియు, ఫలప్రదములగు సత్కార్యములను త్యాగబుద్ధితో లోకకల్యాణము కొరకు చేయవలయును" అని ఆండాళు ఈ పాశురమున బోధించుచున్నారు.

ఇదియే తన వ్రతమనియు, తన మతమనియు శ్రీమద్రామానుజా చార్యులవారు తాను రచించిన శరణాగతి గద్యయందు కడపటి వాక్యముల యందు పేర్కొని యున్నాడు.

ఆ వాక్యములు (రామానుజ మత సూత్రములు) ఇవి:

1. "అన్నృతం నోక్తపూర్వం మే, న చ వక్ష్యే।
   కదాచన రామో ద్విర్నాభి భాషతే॥
2. సకృదేవప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।
   అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ॥
3. సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ।
   అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥
4. ఇతి మయ్యైవ హ్యుక్తమ్॥

5. అత స్త్వం తవ తత్త్వతో మద్ జ్ఞాన దర్శన।
ప్రాప్తిషు నిస్సంశయః సుఖమాస్వ॥

6. అంత్యకాలే స్మృతిర్యాతు తవకైంకర్య కారితా।
తామేనాం భగవన్న ద్యక్రియమాణాం కురుష్వ మే॥"

పై సంస్కృత వాక్యములకు క్రింది ఆంధ్రీకరణమును జూడుడు:

1. "నేను ఇది వరలో అబద్ధమాడలేదు. ఇక మీదట కూడా అబద్ధము చెప్పను.

రాముడనువాడు (ఇతరుల రంజింపజేయువాడు) ఒకే మాటపై నుండును.

2. ఇప్పుడే శరణాగతి నగుటకు నేను నీ వాడనని చెప్పుకొను చున్నాను. సర్వ భూతములకు అభయ మిచ్చుచున్నాను (ఎవ్వరికిని హానిజేయను). అది నా వ్రతము.

3. ఇతరములైన అసత్యమార్గముల నన్నిటిని వదలి, నేను జెప్పు యీ ధర్మమునే (శరణాగతి భావము) ఆశ్రయింపుము. నాయీ ధర్మము నిన్ను పాపముల నుండి తొలగించును. చింతింప వలదు.

4. అని (ఇట్లు) నాచేతనే చెప్పబడినది.

5. అందువలన నీవు నీ వివేక తత్త్వమును బట్టి నా జ్ఞాన దర్శనమును పొందుటలో సంశయము లేదు. సుఖింపుము.

6. స్వామీ! నీ కార్యమును నన్ను ఇప్పుడే చేయనిమ్ము. అది నాకు అంత్యకాలమున కూడా జ్ఞప్తియందుండు గాక".

పైన పేర్కొనబడిన తిరుప్పావై యొక్క రెండవ పాశుర భావము నకును, శ్రీరామానుజుని మతమునకును గల సామ్యము నెరుగునది. రెండును శరణాగతి భావమును (సంశ్లేషభావమును) సమ్యక్ జీవితమును ప్రబోధించుచున్నవి.

తిరుప్పావైకిని శ్రీరామానుజుడు ప్రబోధించిన విశిష్టాద్వైత సిద్ధాంత సారమునకును గలట్టి సంబంధమును గమనించిన యెడల శ్రీరామానుజునకు ఆండాళ్ పైనను, ఆమె రచనలపైనను ఎంతటి విశ్వాసమును, గౌరవమును ఉండినవో ఊహించుకొన గలము.

నోము నెపమున ఆండాళ్ ఎంత గొప్ప ఆధ్యాత్మిక సూత్రములను తన రచనయందు సూచించినదో ఆలోచించుటకు అద్భుతముగా నుండును. ప్రతి పాశురమునకు కడపటి మాట "ఎంబావాయ్". (అనగా మా అభిప్రాయమును అనుసరింపుము అని భావము). కాబట్టి ఆండాళ్ ప్రబోధించు ఆచార్యుడే!

**3. మూడవ పాశురము:**

"గగనము వరకు పెరిగి, త్రిలోకములను తన శ్రీపాదములతో ఆక్రమించిన పురుషోత్తముని యొక్క దివ్యగుణనామ గానము భక్తితో చేయుచూ, మా నోము కొరకు మే మందరము కలిసి స్నానము చేయు దేశము సర్వవిధములుగా సుభిక్షముగా నుండునని మా అభిప్రాయము. వ్యాధి దుర్భిక్షాదులగు చెడుగు లుండవు. నెలకు మూడు వర్షములు నిలిచి కురియును. అత్యున్నతము లగుచు, ఎర్రని యెన్నుల తోడి ప్రకాశమున వర్ధిల్లు వరిసశ్యములు సమృద్ధిగా నుండును. అట్టి వరిపైర్ల మొదళ్లలో నున్న నీటియందు మత్స్యములు త్రుళ్లుచుండును. అందమగు యెర్రకలువలయందు నల్లగా నిగనిగలాడు తుమ్మెదలు మత్తెక్కి నిద్రించు చుండును. పసుల కొట్టమునందు బలిసిన పాలపాదుగులతో కదలక నిలుచున్న ఔదార్యముగల పశువులు (ఆవులు, గేదెలు), పాలుపితుకు వారు విశాలమయిన పాదుగులను రెండు చేతులతో పట్టుకొని, పిండగా పెద్దపెద్ద భాండములు నిండును. ఇట్టి పశుసంపద వర్థిల్లును" అని మా అభిప్రాయము అని ఆండాళ్ సెలవిచ్చుచున్నారు.

**వివరణము:** ఈ పాశుర భావము అతి మనోజ్ఞముగా నున్నది. భగవద్గుణ నామగానముతో భక్తిపరవశత్వమున వైష్ణవ సంశ్లేష

భావమున పరమానందము ననుభవించు ఆచార్య శిష్య బృందములున్న ప్రదేశము సర్వసంపదలతో అలరారుచుండును. చేతనులు వారి వ్యక్తి గతానందములకుగాని, సంఘక్షేమములకుగాని దైవ సంశ్లేష భావము నవలంభింపతగియున్నది. ఎంతటి అభయప్రధానము! ఎంతటి మంగళా శాసనము!

"భక్తిభావ మనగా భగవచ్ఛక్తి యొక్క అనంత కల్యాణ గుణ గానము చేయుచూ, లేక భగవత్కల్యాణ గుణానుభవముతో సర్వంతర్యామి యగు వైష్ణవశక్తితో సంశ్లేషపడియుండుట" అని మరల ఈ పాశురమున సూచింపబడినది.

ఇచట ఆండాళ్ ఆచార్యునివంటి వారు, గోపకన్యకలు శిష్యులు లేక భక్తుల వంటివారు. వీరి కలియక శుభస్కరము. వీరి శ్రీకృష్ణుని పొందు, దైవభక్తిన్ని గ్రహింపగలగుట. వీరందరి స్నానమే వైష్ణవ సంశ్లేషభావము. (గ్రుడ్డిగాచేయు అర్చనలకు మూఢవిశ్వాసముతో గూడిన వ్రతములు, తపములకు, స్వార్థపరకోర్కెలతో గూడిన ప్రార్థనములకును, ఆండాళ్ సూచించు వైష్ణవ సంశ్లేష భావమునకు ఎట్టి తారతమ్యమున్నదో గ్రహించునది! చీకటిని వెలుగనకును గల వ్యత్యాసము కదా!

నిజమైన దైవభక్తిగల మానవసంఘము సుభిక్షముగా శాంతి సంతోషములతోడ నుండునని సామాన్యుడు భావింప గలిగినపుడు, భక్తియనగా నేమో తెలిసికొనవలయును. భగవద్గీత భక్తియోగమున భక్తుని నిర్వచించునట్టి, "అద్వేష్టా సర్వభూతానాం...." "అనపేక్షశ్శుచిర్దక్ష......" ఇత్యాది శ్లోకభావములు చేతనుని ప్రభావితుని జేయుగాక!

నిజమైన ఆచార్యులు భక్తులు అయినట్టి, వైష్ణవ సంశ్లేష భావమున మెలగుచూ లోకకల్యాణముగోరు సాధుపుంగవులను సామాన్య ప్రజలు ఎట్లు ఆదరింప తగియున్నదో గమనింప తగియున్నది. సజ్జనులు లోకకల్యాణము కోరువారు; కావున సజ్జనులకు సర్వులు మంగళా శాసనము చేయవలయును. సంఘక్షేమము ఇందులో నున్నది.

ఈ పాశురమున తిరుమంత్రార్థ బలము సూచింపబడియున్నది.

ఈ పాశురమున ఆండాళ్ సూచించిన అభయమే తిరుమంత్రమన దగిన గీతాచరమ శ్లోకమున (సర్వధర్మాన్...... 18వ అధ్యాయము, 66వ శ్లోకమున) తెల్పబడినది. అదే విధముగా భవిష్యత్తులో శ్రీమద్రామానుజా చార్యులవారు తన మతమనబడు వాక్యములలో (రెండవ పాశుర వివరణ యందున్నది చూడుము) యీ క్రింది వాక్యమున అట్టి అభయమును ఇచ్చియున్నారు: "అత స్త్వం తవ తత్త్వతో మద్‌జ్ఞానదర్శన ప్రాప్తిషు నిస్సంశయః సుఖమాస్స్వ" (నీవు నీ వివేకముకొలది నా జ్ఞానదర్శనమును పొందుటలో సంశయములేదు. సుఖింపుము).

"గగనమువరకు పెరిగి, త్రిలోకములను తన శ్రీపాదములతో ఆక్రమించిన పురుషోత్తముడు" అన్న విషయమును గ్రహించెదముగాక!

దశావతార కథా ప్రకారము విష్ణుమూర్తి బలిచక్రవర్తిని శిక్షించెనా? రక్షించెనా? రక్షించెను.... ఎందుండి? అజ్ఞానము నుండి, స్వగర్వము నుండి..... వివరణమును గమనింపుడు:-

"బలి" అనగా దానము (ఇవ్వబడినది, ఆహారముగా), "బలి" అనగా బలము గలవాడు. "బలిచక్రవర్తి" అనగా "దానగుణమున చక్రవర్తి", "బలమున చక్రవర్తి" అని భావము. కథాప్రకారము బలిచక్రవర్తి మహాబలుడు, నిరాటంకముగ దానము చేయువాడు. "కృతయుగే బలిర్దాతా" అని లోకోక్తిగదా! ఇట్టి సుగుణద్వయమున్న బలిచక్రవర్తి, శారీరకముగా బలారోగ్య సంపద, మానసికముగా ఔదార్యగుణ సంపద గలిగినట్టి బలచక్రవర్తి ఒక విషయమున నిందితు డాయెను. ఎందు? అతడు గర్వి, అహంకారి, తనకంటె మరిగొప్పది లేదనువాడు. తనకంటె తక్కువవాని యందు ఔదర్యామున్నవాడు తనకంటె గొప్పవాని యెడ నమ్రత చూపవలయును. కాని బలి చక్రవర్తికి నమ్రత లేదు - శరణాగతి భావములేదు, ఆత్మ జ్ఞానములేదు,

తత్త్వత్రయ జ్ఞానము లేనివాడు. ఇది అతని అంధకారము. వామనుడు శారీరకముగా పొట్టివాడైనను సర్వజ్ఞుడు మానసికముగా - శ్రీకృష్ణుడు అర్జునునకు విశ్వరూపము నెరుకపరచినట్లు, వామనుడు బలిచక్రవర్తి మనసుకు నచ్చిన విధముగా భగవచ్ఛక్తి సర్వాంతర్యామి, నిత్యమైనట్టిది, సర్వశేషి అని తెల్పినాడు. ఈ దివ్యజ్ఞానము మనస్సునకు రాగా బలిచక్రవర్తి సత్యము నెరిగినవాడై శరణాగతి భావమును పొందెను. స్వర్గ మర్త్య పాతాళముల వ్యాపించిన వైష్ణవశక్తికి శరణాగతి అయినాడు. ఇది మానసిక భావము, మార్పు, బలిచక్రవర్తి శారీరకముగా క్రిందికి త్రొక్కబడలేదు. ఆయన దాసానుదాసుడైనాడు మానసికముగా. ఈ విధమున బలిచక్రవర్తికి విజ్ఞానమును గరపినట్టి వామనుని, దైవస్వరూపుడయిన వామనుని, కల్యాణ గుణముల స్తుతించినారు ఆండాళ్, మరియు ఆమె స్నేహితురాండ్రు గోపికాకన్యలు. భగవత్కల్యాణ గుణ గానము చేయుట అనగా అర్థమునెరిగి తిరుమంత్రమును జపించుట అని భావము. తిరుమంత్రమును జపించుట అనగా శరణాగతి భావమును పొందుట యగును. ఈ భావమును పొంది ఉజ్జీవించు వాడు సర్వోత్తరకాలమందును అనన్యార్హ శేషత్వ, అనన్య శరణత్వ, అనన్య భోగ్యత్వముల అను అకారత్రయ జ్ఞానమున సంతుష్టుడుగా నుండును. వామనుడు బలిచక్రవర్తికి వలె ఆండాళ్ మనకు ప్రపత్తిని బోధించుచున్నది. ఈ పాశురమున ఆండాళ్ ఆచార్యకత్వము వెల్లడియగుచున్నది. ఇట్టిది యీ పాశురమందున్న ఆధ్యాత్మిక సంపద వస్తువు. ఇందు భగవదనుభవ సహకారుల యొక్క అభీష్టములు నెరవేరునట్లు భగవత్సన్నిధిలో అపేక్షింపవలయునని సూచింపబడినది.

ఇక వర్ణింపబడిన దృశ్యములు, అనగా, సకాల వర్షములు, పైరు పంటలు, పంట చేలలలోని జలపుష్పాదులు, తుమ్మెదలను నల్లని మచ్చలుగల యెల్ల్రకులవ రేకులు, పాడిపశువులు మున్నగునవి, అతి రమణీయముగా మనోజ్ఞముగా ప్రకృతి సొగసులనీనుచున్నవి. ఆండాళ్ కవయిత్రి కదా!

**4. నాల్గవ పాశురము:**

"వర్షాధిపతియగు ఓ పర్జన్యుడా! ఓ ఇంద్రా! నీ యసమానౌ దార్యము వెల్లడి యగునట్లు నీవు సముద్రమును జొచ్చి, జలమును పూర్ణముగా పానముజేసి, ఉరుములతో మెరుపులతో ఆకాశమంతయు వ్యాపించి, శ్రీమన్నారాయణుని తిరుమేను వంటి నీలమేఘాకృతిని బొంది, బల సౌందర్యములతో నొప్పు సుదర్శన చక్రమువలె ప్రకాశించి, స్వామి పాంచజన్య శంఖము వలె గర్జించి, శ్రీశార్ఙ్గముచే విడవబడిన బాణ పరంపలను బోలు వర్షధాళలచే మిక్కుటమగు వర్షమును కురిపింపుము, అట్లు చేసితివేని లోకములోని ప్రజలు సుఖింతురు, మేము ఈ మార్గళి మాసమందు సంతోషముతో, సుఖముగా స్నానము చేయగలము. నీవిట్లు దైవకార్యమునకు సహకరించిన వాడవగదువు".

వివరణము: దైవకార్యములకు సర్వవిధముల సహకారము లభింప గలదనుట ఆండాళ్ గారి విశ్వాసము. కావుననే దైవకార్యమగు వారి మార్గళి మాసప్రాతఃకాల స్నానమునకు సహకరించు విధమున వర్షమును కురియింపుమని ఇంద్రుని ఆండాళ్ నియమించుచున్నది.

వారి యొక్క (ఆండాళ్ నాయకత్వమున గోపికా కన్యలయొక్క) నోము లోకకళ్యాణ ప్రదమగు వర్షము కొరకేగదా! లోకకల్యాణము కొర్కైన నోము కావున ఇంద్రుడును సహకార భావమున "తానెట్లు సహకరింప గలనో తెల్పుడు" అని అభ్యర్థించిన వాడాయెను. అట్లు సంశ్లేషించిన ఆండాళ్ గొప్ప వర్షమును కురియింపుమని ఇంద్రుని కోరగలిగిరి.

గొప్ప వర్షము వలన దేశము సుభిక్షముగా నుండునుకదా! అది నిర్వివాదాంశము; అది అటులనుండనిమ్ము. ఇచ్చట మరియొక విచిత్రమయిన ప్రయోజనము సూచింపబడినది: మార్గళిమాస మందు ఉషఃకాలమున నదిలోని నీరు అతీశీతలముగా నుండుటంజేసి, స్నానము సుఖకరముగా, వినోదముగా నుండదుకదా! అట్టి

తరుణమున గొప్ప వర్షముపడిన, నిరంతర ఘనవర్షధారా పరంపరల వలన నదిలోని నీరు కొంత వేడిమిని పొంది స్నానమునకు అతియోగ్యముగాను, సుఖతమము గాను, వినోద ప్రదముగను ఉండగలదు. గోపికలకిది ప్రత్యక్ష సుఖదాయక ఫలితము. కావుననే ఆండాళ్ ఇంద్రుని నియమించుటలో, "లోకమున కును, నోమునోచువారికును సుఖప్రదమగునట్లు గొప్ప వర్షమును కురియింపుము", అని కోరిరి. ఉషఃకాలమున స్నానమాడు గోపికా కన్యలకు వర్షము యొక్క ప్రయోజనము ఎంత రమణీయముగా సూచింప బడినదో గమనింపుడు! ఈ వర్ణన యెంతటి ఆహ్లాదకరము!

గోదాదేవి (ఆండాళ్) యెల్లప్పుడును వైష్ణవ సంశ్లేషభావమున ఆనందాబ్ధియం దోలలాడు వారుగాన, ఆమెకు "సర్వం విష్ణుమయమ్". వర్షము వైష్ణవలీల, వర్షము పడు తరిగలుగు మార్పులన్నియు వైష్ణవాంశములే ఆండాళ్‌కు. ఈ అంశములు ఎంత మనోహరముగా ఆధ్యాత్మికముగా వర్ణింపబడినవో గమనించి ఆనందించెదముగాక:

నీటి యావిరితో నిండి ఘనీభవించియున్న నల్లని యాదట్టమయిన మేఘవ్యాప్తి శ్రీమన్నారాయణుని తిరుమేనట (పవిత్రమయిన నీలమేఘకాంతులీను శరీరము)! విష్ణువు సర్వవ్యాపి గదా! ఆకాశమంతయు ఒకే నీలమేఘమయినది. మేఘము యొక్క మెరుపులు స్వామి సుదర్శన చక్రకాంతులట! మేఘము యొక్క గర్జనములు (ఉరుములు, పిడుగులు) స్వామి పాంచజన్య ధ్వనియట! వర్షధారలు స్వామి శ్రీశార్ఙ్గము చే విడువబడిన బాణపరంపరలట! (ఈ బాణపరంపరలు లోక కల్యాణము కొరకే గదా). ఎంతటి రమణీయ వర్ణనలు! పౌరాణిక భగవదంశముల వర్ణనలు బాగుగా ఆలోచించి చూడ ఎంతటి ప్రకృతి వర్ణనలగుచున్నవో గమనించి, ఆనందింపుడు.

లోక కల్యాణ పరులైన నిస్స్వార్థ భాగవతోత్తములకు ప్రకృతి శక్తులు సహకరించునని ఈ పాశురమున గోదాదేవి సెలవిచ్చుచున్నారు.

దేవతాంతర స్పర్శము లేనివారును, అనన్య ప్రయోజనులును, భగవదేక ప్రవణులును అయిన భాగవతులు భగవదను భవమునకు ఉపకరణము లైనవానియందు ప్రవేశించిన యెడల, ఆ దేవతాంతరములును గూడ సహకారులగుదురు. ఇట్టి ఆండాళ్ విశ్వాసము, ఆమెగారి యొక్క వైష్ణవ సంశ్లేష భావమును వెల్లడించుచున్నది.

ఈ పాశురార్థము ఆధ్యాత్మిక భావనలతో వైష్ణవ సంశ్లేష భావములతో, ప్రకృతి సౌందర్య వర్ణనలతో నలరారుచున్నది.

**5. ఐదవ పాశురము:**

"ఆశ్చర్య చేష్టితుడును, భగవత్సంబధముగల ఉత్తర మధురకు పాలకుడయిన వాడును, మిక్కిలి లోతైన జలముగల యమునానది తటమున వర్తించువాడును, యదుకుల దివ్యజ్యోతియయిన వాడును, తల్లి యశోదాదేవి గర్భమును యశోవంతము జేసినవాడును తల్లిచే ముండ్ల త్రాటిచే బంధింపబడినవాడును, దామోదరుడును అయిన శ్రీకృష్ణుని మనము పరిశుద్ధులమై వచ్చి, వానిపై పుష్పముల రువ్వి, అంజలి గావించి, నోరారస్తోత్రము జేసి, మనస్సుచే ధ్యానము చేసిన యెడల, మనము పూర్వము స్వరూప జ్ఞానమును పొందక ముందు గావించిన పాపములును, తరువాత జ్ఞానము గలిగిన తరువాత గూడ ప్రామాదికముగా గావించిన పాపములును నిప్పులోపడిన దూదివలె భస్మములై పోవును. 'ఏలో రెంబావాయ్' (ఇది మా అభిప్రాయమము. దీనిని యోచించి, అనుసరింపుము)."

వివరణము: "భగవదనుభవము నందు ప్రవేశించిన వారలకు గలుగు అనుభవ విరోధములను ఆ యనుభవమే పోగొట్టు"నని ఆండాళ్ గారు ఆనతిచ్చుచున్నారు. తిరుప్పావై ప్రబంధములోని మొదటి అయిదు పాశురము లందు ప్రాప్యమగు శ్రీకృష్ణానుభవమునకు ఏకాంతరమగు ఉపకరణములు సూచింపబడినవి.

తరువాత అనగా 6వ పాశురము నుండి 15వ పాశురము వరకు గలట్టి పది పాశురములందు ఆయేకాంతోప కరణములగొని అనుభవింప నిచ్చగలవారు మేల్కొలుపబడుచున్నారు.

విశిష్టాద్వైత సిద్ధాంతమునకు మూలమయిన తత్త్వత్రయ జ్ఞానము ననుసరించి అవాఙ్మానస గోచరమయిన వైష్ణవశక్తిని మనస్సునకు తెచ్చుకొను ప్రయత్నముల యందును అట్టి శక్తిని ఆరాధించి, ఆశక్తితో సంశ్లేషపడి ఆనందమును పొందు మార్గముల యందును, అనంత కల్యాణ గుణపూర్ణుడయిన పురుషోత్తముని ఆరాధించుట ఒక దివ్య మార్గముగా సూచింప బడినదిగదా! కావుననే వాల్మీకి మహర్షిచే తీర్చిదిద్ద బడిన శ్రీరామపాత్రయు, వ్యాసమహర్షిచే వర్ణింపబడిన శ్రీకృష్ణపాత్రయు భక్తులకు ఆరాధ్య దైవతములయినవి.

ఇచ్చట శ్రీకృష్ణుడు అనంత కల్యాణగుణ పూర్ణుడగు పురుషోత్తముడు, సర్వులకును ఆదర్శప్రాయుడు, అనుసరణీయుడు, ఆరాధ్యుడు. గోపికలు భక్తురాండ్రు ఆండాళ్ ఆచార్యుడు.

"మనోజ్ఞమూర్తియగు శ్రీకృష్ణునిపై పుష్పములను రువ్వి" అని చెప్పుటలో గల రమణీయతను మనమున తలప వలసినదేగాని, వర్ణింప నశక్యము - భక్తిలో శృంగారము!

భక్తిభావ ప్రదర్శనలోని వివిధ మార్గములు వర్ణింపబడినవి: పరిశుద్ధి (స్నానమేకాదు, త్రికరణశుద్ధి), పూజ లేక అర్చన, శరణాగతిభావ ప్రదర్శకమగు సాష్టాంగ నమస్కారము, స్తోత్రము, ధ్యానము అను పంచ భక్తిమార్గములు.

ఆండాళమ్మ గారు నిర్వచించిన యీ పంచభక్తి మార్గములే విపులీకరింపబడి తొమ్మిది భక్తిమార్గములుగా పేర్కొనబడినవి భక్తపోతనచే: "తనుహృద్భాషల నఖ్యముం, శ్రవణముం, దాసత్వముం, వందనార్చనముల్, సేవయు, ఆత్మలోనెఱుకయుం, సంకీర్తనల్, చింతనంబనునీ తొమ్మిది భక్తి మార్గములు సర్వాత్ముం

హరిన్ నమ్మి సజ్జనుడై యుండుట భద్రమంచు దలంతున్" అని సెలవిచ్చినారు పోతన. పోతన విశిష్టాద్వైత సిద్ధాంతమును అనుభవయోగ్యము చేసిన మహా పండిత భక్త శిరోమణి.

"ధ్యానాత్ కర్మఫలత్యాగః శ్రేయోహి" అను శ్రీకృష్ణపరబ్రహ్మ గీతా వాక్యమును మరువరాదు. ఇందు కొరకే సర్వభక్తిమార్గ జ్ఞానము! "త్యాగాశ్శాంతి రనంతరమ్" అని గీతాచార్యుడు సమన్వయమును పలికినాడు గదా!

"దైవసేవ, భక్తి" అన్నపుడు "సర్వభూతముల యెడ దయ, ప్రేమ" అగునని మఱువరాదు. "హరిసర్వాత్ముడుగదా!" హరిసేవయనగా సర్వాత్మ సేవయే యగును.

"పంచభక్తి మార్గముల వలన మన పూర్వ పాపములు నశించును - ఇక మీద మనము పాపముల చేయము" అని ఆండాళ్ సూచించుటలో "భక్తిమార్గము వలన మనము పుణ్యకార్యములనే చేయుదుము" అని సూచింప బడుచున్నది. పాపకార్యములు గాని, పుణ్యకార్యములు గాని యెవరియెడ? దైవము యెడనా? కాదు, తోటిమానవులయెడ, సర్వభూతముల యెడ. కావున భక్తిమార్గము యొక్క కడపటి ఉద్దేశము లేక ధ్యేయము "పుణ్యకార్యాచరణ" అవుతుంది. మనము జీవితమున పుణ్యకార్యములను చేయు సంకల్పము, ప్రోత్సాహము పొందుటకు భక్తిమార్గము ఉపకరించును.

ఇచ్చట ఆచార్యుడయిన ఆండాళ్ శిష్యులకు "భక్తి మార్గమును, దాని ద్వారా పుణ్యకార్యాచరణమును" ప్రబోధించుచున్నారు. ఇదియే గీతాసారము - శరణాగతి, స్వార్థరహిత, సేవాభావములు.

"తిరుప్పావై" ప్రబంధములోని ప్రతిపాశురమును "ఏలోరెంబావాయ్" అనుమాటలతో ముగియుచున్నది. "ఏల్, ఓర్, ఎంబావాయ్" "ఇది మా నోము, మా అభిప్రాయము బాగుగా యోచించుకొని అనుసరింపుము అని భావము. ఇది నిజమైన ఆచార్యుని ప్రబోధ పద్ధతి. ఆచార్యుడు తాను బోధించు విషయము

లోతుపాతులనెరిగి యుండ వలయును. ఆ విషయ రత్నమును కొంకు, బొంకు లేకుండ దృఢముగా చెప్పవలయును. అభయ ప్రధానముగా చెప్పాలి. విషయమును గ్రహించి, తరువాత పాటింపవలయునని సూచింపవలయును. అనుసరింపుడని దృఢముగా శిష్యుల నాజ్ఞాపింప గలిగి యుండవలె ఆచార్యుడను వాడు. ఇట్టి దివ్య లక్షణములు సంపూర్ణముగా ప్రదర్శించినారు, మన ఆండాళ్ అను ఆచార్యుడు.

ఇట్టి విధమేకదా చరమ శ్లోకమున గీతాచార్యుడు ప్రదర్శించినది! "సర్వధర్మాన్ పరిత్యజ్య, మమేకం శరణం వ్రజ, అహంత్వా సర్వపాపేభ్యో, మోక్షయిష్యామి మాశుచః" అనగదా. గీతాచరమ శ్లోకము. "శరణాగతి భావము వలన నీవు పాపములకు దూరమై పోదువు, మోక్ష భావమును పొందుదువు, ఇక చింతింప నవసరములేదు" అనికదా గీతాచార్యుడు అభయ ప్రదానము గావించినారు?

చరమ శ్లోక భావమును సూచింపదలచి, శ్రీరామానుజాచార్యుల వారు వేరుమాటలు వాడనొల్లక, చరమ శ్లోకమునే నొక్కి వక్కాణించి, "ఇతి మమైవహ్యుక్తమ్ (అని నాచే చెప్పబడినది) అని సెలవిచ్చినారు గదా! రెండవ పాశురభావము క్రింద నీయబడిన వివరణమును మరి యొకసారి పఠించునది.

నిప్పులో పడిన దూది, మాడి, భస్మమై యిక కంటికి నేమియు కనబడని విధమున ఎగిరి పోవును. "అట్టి గతి పాపములకు పట్టును భక్తి ప్రభావమున" అని చెప్పుట యెంత సమంజసముగా, సత్యముగా నున్నదో గ్రహింపుడు.

ఆండాళ్ ఆచార్యాకత్వము మహాద్భుతము.

వారి కవితాధోరణి మనోజ్ఞము - భక్తి వెలుగున శృంగార నిగనిగలు, శ్రీకృష్ణుని పై పుష్పముల "రువ్వి" - అని అంటుంది ఆండాళ్ గోపికల నుద్దేశించి. ఆండాళ్ ఋషికవయిత్రి (Saint Poet) అని సర్వులచే ప్రశంసింప బడినది కదా!

## 6. ఆరవ పాశురము:

"భగవత్సేవ కొరకు ఆండాళ్ నాయకత్వమున, ముందుగనే, వేకువనే, పడుకనుండి లేచిన గోపికాకన్యలు, ఇంకను నిద్రించుచున్నట్టి ఒక గోపిక యొక్క గృహమునకు బోయి, ఇంకను పడకపై పరుండి యున్నావేల? తెల్లవారుచున్నది. ఆకాశమున అరచుచు పోవునట్టి పక్షులయొక్క అరపులను నీవు వినుటలేదా? లెమ్ము" అని పలికిరి.

అందులకు ఆ తూగువదలని గోపిక, కొంతప్రాలుమాలికతో కాబోలు, లేవనిచ్చగించక, "తెల్లవారుచున్నదని నేను భావింపలేకున్నాను. ఆ పక్షులను గూళ్లనుండి మీరే లేపి యుందురు! తెల్లవారినదని చెప్పుటకు మరియొక గుర్తును తెల్పుడు" అని పలికెను.

"పక్షులకు ప్రభువయిన గరుత్మంతునకు నిర్వాహకుడగు విష్ణుమూర్తి యొక్క కోవెలయందు సన్నిధిపరివారమును లేపుటకు ఊదబడిన తెల్లగా ప్రకాశించు శంఖము యొక్క గొప్ప ధ్వనిని నీవు వినుటలేదా? లెమ్ము" అని గోపిక లనిరి.

అందుపై ఇంకను పడుకపై పవ్వళించి యున్న గోపిక "సరే, మీరు నన్ను లేపుటకు వచ్చినారు, మిమ్ములను నిద్రనుండి లేపిన వారెవరో తెల్పుడు", అని చమత్కారముగా ప్రశ్నించెను.

"యోగివరులును, ఋషిపుంగవులును తమ మనోభవుడగు హరిని చలింపజేయక, మెల్లగాలేచి, పూతనాశకటాసురుల సంహరించి, క్షీరాబ్ధిలో శేషునిపై శయనించియుండు ఈశ్వరుని సంకీర్తనము చేయుటకు పల్కిన హరి హరియను దివ్యపదజాలమును విని, మేము నిద్రనుండి లేచితిమి", అని గోపిక లనిరి.

**వివరణము:** కథా విషయము ప్రకారము శ్రీకృష్ణునిసేవకై, వేకువనే పడుకనుండి లేచిన గోపికలు కొందరు, ఆండాళ్ నాయకత్వమున ఇంకను నిద్రించుచున్న ఒకానొక గోపికయొక్క గృహమును జేరి, ఆమెను మేల్కొమ్మని పట్టుపట్టిరి. ఇది రమణీయముగనే యున్నది.

ఇచ్చట శ్రీకృష్ణుడు జగత్కారణభూతమగు ఈశ్వరశక్తికి సంకేతము. ఆండాళ్ ఆచార్యుడు. ముందుగా నిద్రలేచిన గోపికలు ప్రధాన సన్నిహిత శిష్యురాండ్రు. ఇంకను నిద్రించువారు కొంత సంస్కారము గలిగి, యింకను భావరూకత నొందతగిన భక్తులు. ఈ విషయమును తిరుప్పావై ప్రబంధమును చదువునప్పుడెల్లను మనమున నుంచుకొనవలసిన అవసరమెంతేని ఉన్నది. ఆద్యంతములు ఈ "శ్లేష" భావమును గమనింపవలయును. మొదటి భావము శృంగారము, రెండవ భాగము ఆధ్యాత్మికము.

నోమునోచు కథానుసారముగా, ఆండాళ్ ముందుగ నిద్రలేచిన కొలది మంది గోపికలతో గూడి యితరగోపికలను, అనగా ఇంకను వేంల్కొనని కన్యలను వేంల్కొలువుచున్నారు. అందరికిని శ్రీకృష్ణానుభవమున ప్రేమ యుండగా, ఒకరనిఒకరు మేల్కొలుపుట యెందులకని ప్రశ్నించెదరేమో! మహాప్రవాహము నందు దిగునపుడు సహాయకులు ఆవశ్యకమయినట్లుగా భగవదనుభవమను మహాప్రవాహములో దిగువారికి భాగవత సహాయము తప్పక అవసరము. అనంతకల్యాణ గుణపరిపూర్ణుడగు శ్రీకృష్ణుని యొక్క అనుభవమునందు ప్రావీణ్యములేని బాలికలకు తోడుకావలయును కదా! ఇదియునుగాక నిస్స్వార్థులు వారి సుఖముతో తృప్తినందెదరా? కాదు, అన్యులెల్లరు సుఖింపవలయునని గోరెదరు. అందులో శ్రీకృష్ణానుభవము, శ్రీకృష్ణ సంశ్లేషభావము మహానుభవమే! "ఏకస్వాదు న భుంజీత" - మిక్కిలి భోగ్యమయిన వస్తువును భుజించునపుడుగాని, అనుభవించునపుడుగాని, పదుగురితో గూడియేం అనుభవింపవలయును, అనునట్టి స్వభావము గలవారగుటచేత, తదీయులను ముందుంచుకొనక భగవత్సన్నిధికి పోగూడదను పద్ధతినెరిగిన వారగుటచేత, ఇతరులను మేల్కొలుపు చున్నారు. మరియు పెద్దలచే నియమింపబడిన నోమును అందరును సహకారభావమున లోకకల్యాణార్థము చేయవలసి యున్నది కదా!

శ్రీకృష్ణుని విషయమునందు అందరికిని కుతూహలము ఒకేరీతి నుండునపుడు కొందరు నిద్రించునట్లును కొందరు మేల్కొని యున్నట్లును ఎట్లు సంభవించినదని ప్రశ్నింతువేమో? తెలిసికొనుము! శ్రీకృష్ణానుభవము, వైష్ణవసంశ్లేషభావము లందు ప్రవేశించువారు ఆదిలో అప్పుడప్పుడు చంచల భావులు కావచ్చును. అది వారి మనః ప్రవృత్తిపై, వారి దృఢ మనస్సుపై ఆధారపడియుండును. విషయలోలత్వము నుండి పూర్తిగా ఒక క్షణమున గట్టుకెక్కుటకు అందరికి శక్యమే! కావున, వీరి కుతూహల మునకు కొదువ లేదు. కాని ప్రవీణులగు వరకు ఎక్కువ అనుభవము గలవారి ప్రాపు అవసరము గదా! భాగవతులకు కోవిదుడయిన ఆచార్యుని మార్గదర్శకత్వము ఎంతయేని అవసరము. నిజమయినట్టియు స్వార్థ రహితుడయినట్టియు, దయాళువయినట్టియు ఆచార్యుడు తనకు గలిగిన మోక్షభావముతో సంతృప్తినందునా? కాదు. అందరి మోక్షమును కాంక్షించును! ఇట్టి విజ్ఞాన ప్రేరితుడయికదా శ్రీమద్రామానుజాచార్యుల వారు తిరుమంత్రమును సర్వులకు ప్రకటించినారు! మోక్ష సన్యాస యోగసార మిది కదా! లోకశాంతికి దోహదమిచ్చుతత్త్వమిది. ఈ తత్త్వము మానవులలో లోపించినపుడు లోక శాంతి యెక్కడిది?

ఆండాళ్ తిరుమంత్ర రహస్యము నెరిగిన ఆచార్యసత్తముదు (ఆచార్య సత్తమురాలు), ముందుగా మేల్కొన్నవారు జ్ఞానులు. ఇంకను మేల్కొంచినవారు అజ్ఞానులు. వీరిని అజ్ఞానమను తూగునుండి జ్ఞానమను మెలకువలోనికి తేవలసిన బాధ్యత మొదటి యిద్దరిది. తిరుప్పావైలోని యీరహస్యము శ్రీరామాను జాచార్యుని ప్రభావితుని జేసినది. శ్రీరామానుజుని ఆచార్యకత్వము ఈమార్గముననే జయప్రదముగా సాగినది.

భాగవతులు అనవరతము గావించు విష్ణుసహస్ర గుణనామ గానము సామాన్యుల ప్రభావిత పరచుగాక - అని ఆండాళ్ ఉద్దేశించు చున్నారు. అందువలననే "హరి హరి" శబ్దములు విని నిద్రనుండి లేచితిమని చెప్పిరి.

పూతనా, శకటాసురులు కామక్రోధములకు అహంకార మమకారము లకు సంకేతములు - వీనిని జయించినవాడు శేషశాయితో సంశ్లేషించిన వాడగును. అతడే శేషశాయి అగును. శేషశేషీ భావము నెరిగినవాడగును. శాంతియుతుడగును. నిత్యానందుడుగా నుండును.

## 7. ఏడవ పాశురము:

(శ్రీకృష్ణ సంశ్లేషరసంబు నెరిగియు, మరల మరచియుండు నట్టియొక గోపకన్యను "తెల్లవారినది, లెమ్మ్మ" అనగా ఆ గోపిక "తెల్లవారినదని చెప్పుటకు ప్రకృతిగుర్తులు, మార్పులు ఏవో తెల్పుడు" అని యనగా, ఆండాళ్ నాయకత్వమున నున్న గోపికలిట్లు చెప్పుచున్నారు. ఇది యేడవ పాశురమునకు అవతారిక).

"భారద్వాజ పక్షులు ఒండొంటిగూడి కలకల ధ్వనితో సంభాషించు మాటలయొక్క గొప్పధ్వనులను నీవు వినుట లేదా? లెమ్మ్మ, చెలీ! (అయినను, ఇంకను ఓ గోపకన్యక పడకపై ఇటునట్లు పొరలుచూ నిద్రనుండి లేవలేదు). ఎంత పిచ్చిదానవు? తెల్లవారలేదని ఇంకను నిద్రించు చున్నావు? అవిగో, వినపడలేదా గోపకాంతల పాటల శబ్దములు? మంచి పరిమళమును వెదజల్లు చక్కని శిరోజములు గల గొల్లభామలు, కంఠమున ధరించి యున్న తేలికయగు తట్టబొట్టును, కన్నెబొట్టును గలగలయని శబ్దించునట్లు, హస్తములెత్తి కవ్వముతో పెరుగు చిలుకు శబ్దములు నీకు వినబడలేదా? ఆ యాదవస్త్రీలు, శ్రీకృష్ణుని సౌందర్యము నందు ఈడుపడి, పెరుగును చిలుకుచు పాడునట్టి గానమాధుర్యము నీచెవిని జొరలేదా? లెమ్మ్మ. (ఇంకను నిద్రమంపున పడకనుండి లేవ నిచ్చగించక, యేదో ఒక నెపముతో మరికొన్ని నిముసములు నిద్రింపకోరిన ఆ గోపకన్య, "మనయీ గోకులమున స్త్రీలు రేపవళ్లు పెరుగు చిలుకుచునే యుందురులే" అని అనగా) - అయ్యో, యిదియేమి తూగునీకు?

నీవు గోపికాకన్యలకు నాయకురాలవే? భక్తవత్సలుడగు నారాయణుడు శ్రీకృష్ణావతరామెత్తి కేశి యనురాక్షసుని హతమార్చిన కథా విశేషమును గొల్లభామలు రమణీయముగా గానము చేయుట వినుచుండియు, పడుకపై నింకను పరుండియున్నావా? ఓ సుందరీ, లెమ్ము, తలుపు తెరువుము" - అని గోపకన్యకలు కలకలనాదములతో చిరుకేకలు వేసిరి,"

వివరణము: ఇచ్చట నిద్రలేపబడుచున్న గోపకన్యక యితర గోపికలవలె సామాన్యురాలు కాదు. శ్రీకృష్ణానుభవమున కొంత గణుతి కెక్కిన కన్య. అయినను నోము నోచుటకై వచ్చిన కన్యలతో గూడి స్నానము చేయుటకు త్వరపడలేదు. ఆమె కొక ధైర్యమున్నది కదా! తాను భక్తి మార్గమున కొంత దవ్వేగి యున్నది గదా! ధనము వ్యయము చేయవలసిన అక్కర యెదురయినపుడు చిల్లిగవ్వలేని సంసారి తత్తర పడునేగాని, కొంత ఆర్థిక బలముగల పురుషుడు కొంత ధైర్యముగా, తత్తరపడక యుండును గదా!

కాని ఉన్నవాడు లేనివానిని ఆదుకొనుటకదా ధర్మము! కావున శ్రీకృష్ణానుభవము కొంతవరకు గల యీ గోపకాంత, నాకేమిలే అని మారాడవచ్చునా? నాయకత్వము కూడ వహింపవలసిన అవసర మున్నది. అది ఆమె ధర్మము కూడా! అందువలననే "నాయకురాలా" అని సంబోధింపడుచున్నది! ఈమె యెడ ఇతరకన్యలకు కొంత గౌరవ భావమున్నది. ఆ గౌరవ భావమును వెల్లడించుచూ, తమ్ముచేరుమని అభ్యర్థించుచున్నారు ఇతర కన్యలు.

ఎంతటి మృదు మధుర మర్యాద! అనుభవ యోగ్యులయెడ పిన్నలు చూపవలసిన మర్యాదయిది! వారి సాయమును అభ్యర్థించ వలసిన పద్ధతి. నోము నోచుగోపికలు సమవయస్కులను, తమకంటె చిన్నవారిని, తమకంటె పెద్దవారిని, అందరిని కూడ కూడగట్టు కొనుచున్నారు!

వేకువకాలమున వినబడు-భారద్వాజ పక్షుల పలుకులు, గోపస్త్రీల అలంకరణలు, వారు పెరుగు చిల్కు పద్ధతులు ఎంత రమణీయముగా వర్ణింప బడియున్నవో గమనించి ఆనందింపుడు, కొంత సంశ్లేష భావమున్న చదువరి తాను గోకులవాసినని భ్రమింపదా!

"ఈ గోకులములోని స్త్రీలు రేపవళ్ళు పెరుగును చిలుకుచు నుండెదరులే" అన్నప్పుడు అచ్చటి తరుగని పాడిసంపద మన మనముల నానంద పరచును. గోవులు, ఎనుములు దినమున కొకసారి కాదు పితుకబడుట! దినమున ఏ వేళలోనైనను పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, జున్ను, మీగడ, నేయి ఇట్టి పాడి కోకొల్ల! ఎంతటి పశు సంపద! ఎంతటి పాడిసిరి.

పెరుగుచిలుకు సౌందర్యవతులు కవ్వపు శబ్దములకు తగిన లయతో శ్రీకృష్ణామృత గానము సాగించుట, ఆ గానమునకు తగిన తాళములు వేయ బడుచున్నవో అనునటుల మెడయందు ధరింపబడిన ఆభరణముల గలగలధ్వనులు ఎంతటి మనోజ్ఞముల మనముల గాంచెదరు, ఆ యానందరముల మనముల వినెదరు. కన్యల కేశపరిమళములు, చిలుకబడుచున్న కమ్మని పెరుగు ఇత్యాదుల కమ్మని వాసనలు మనమున ఆఘ్రాణింపగలరు!

గొల్లభామల కంఠాభరణములు తట్టబొట్టు, కన్నెబొట్టు లని పేర్కొన బడినది. నిరాడంబర జీవితములు వారివి! కన్నెపడుచులు తెలతెల వారకముందే వారి విధ్యుక్తధర్మముల నెరవేర్చుటకు తయారయి యుందురు. పల్లె జీవితము అట్టిది. వీనికి భేదములుగానుండును కదా పట్టణవాసపు ఆడంబరములు, కొనితెచ్చుకున్న నాగరకతలు!

పెరుగు చిలుకునట్టి గొల్లభామల కంఠాభరణములు పేర్కొన బడినవేగాని, వారి హస్తాభరణములు పేర్కొన బడలేదు! కవ్వములతో పెరుగు చిలుకువేళ హస్తాభరణములు, వదులుగానున్న కంకణములు, గాజులు పనికడ్డముగదా! ఎంతటి కవితావిచక్షణత.

అనంత కల్యాణగుణ పరిపూర్ణుడగు పురుషోత్తముడు నారాయణాంశమని చెప్పబడినది. అట్టి పురుషోత్తముని ఆరాధించి, అనుసరింపవలయు నని సూచింపబడినది.

ఇత్యాదులు ఈ పాశురమున ప్రత్యక్షముగా కన్పడు విషయ రత్నములు, వర్ణనములు.

ఇకనిందలి ఆధ్యాత్మిక, అంతరార్థముల కొంత తఱచి గమనింతము గాక. తిరుప్పావై అను ప్రబంధము ఆద్యంతములు ఒక ద్వ్యయార్థ కావ్యమని యిదివరలోనే పేర్కొనబడినది కదా! (Allegory):

ఇచ్చట మేల్కొలుపు గోపికా కన్యలు భగవత్సేవను కోరి అందు ప్రవేశింపగోరు వారికి సంకేతములు. ఇంకను నిద్రించుచున్న గోపిక, దైవ సేవయందు కొంత ప్రావీణ్యము కలిగియు కొంత అలసత్వము బూనిన భక్తునకు సంకేతము. ఆండాళ్ తగిన హెచ్చరిక చేయునట్టి ఆచార్యవర్యుడు. నిజమయిన భక్తుడు, దైవసేవకుడు, దైవసేవయందు తాను ప్రావీణ్యమును పొందితినని తలచి, తాను పొందదగు మోక్షభావమునకే యెదురు చూచుచు ఇతర భక్తుల యొక్క (తక్కువ ప్రావీణ్యముగల భక్తులయొక్క) క్షేమముల పట్టించుకొనక యుండరాదు. అట్టి భక్తుడు సమానశ్రేయ భావమున తోటి పిన్న భక్తులను సన్మార్గమున నడుపవలయును. ఆచార్యవర్యుడు తన ప్రథమ శిష్యశ్రేణి ద్వారా సన్మార్గమును జనబాహుళ్యమునకు గొంపోవలయును. ఆచార్యునాజ్ఞను భక్తి ప్రావణ్యులగు శిష్యులు శిరసావహింప వలయును. దైవసేవ వ్యవస్థ కార్యక్రమ విధానము, ప్రచార విధానము ఇందు సూచింప బడినది. ఈ సూచనను అనుసరించి కాబోలు, భవిష్యత్కాలమున తిరుప్పావై ప్రభావితు డయిన శ్రీమద్రామాను జాచుర్యులవారు తన విశిష్టాద్వైత సిద్ధాంతము నిరాఘాటముగా ప్రసరించుటకు తగిన శిష్యవ్యవస్థను ఏర్పరచిరి. తిరుప్పావై ప్రబంధ ప్రభావము నేమని పొగడగలము?

భారద్వాజ పక్షుల కలకల నాదములు వేనిని సూచించుచున్నవి? అహంకార రహితులగు మహాభాగవతులు ఒకరినొకరు విడిచి పోవునపుడు పల్కుమాటల యొక్క గద్గద స్వరములను.

పెరుగు చిలుకుచున్న గోపకాంతలు గానముచేయు కీర్తనములు వేనికి సంకేతములు? సదాచార్యుల కృపచే పొందిన తిరుమంత్ర, ద్వయమంత్ర, చరమశ్లోక సమన్వయ భావసంపదతో స్వరూప, ఉపాయ, పురుషార్థ జ్ఞానము కలిగినట్టియు, సుశిక్షితమగు సంసారమున జయప్రదులగు చేతనులు పఠించునట్టి దివ్యప్రబంధాను సంధానముల దివ్య ఘోషములకు!

సుశిక్షితమగు సంసారజీవితము భక్తిమార్గమును చేరిన యెడల, అది ఉత్కృష్ణ జీవితమగునని గమనింపవలసి యున్నది. ఋషుల వేదపఠన ఘోషముల కంటె భాగవతులగు సంసారుల భగవన్నామ సంకీర్తనా గాన నాదములు మిక్కిలి పవిత్రములు, అర్థయుక్తములు, ఫలప్రదములు. సర్వజ్ఞాన, భక్తి, వైరాగ్య భావములు సక్రమ మయిన ఫలప్రదమయిన జీవితములను గడుపుటకు ఉపకరణములే యనిగ్రహింపవలసి యున్నది. విధ్యుక్త స్వధర్మ నిర్వహణము జ్ఞానభక్తి వైరాగ్య భావములకు మూలమై యున్నది. విశిష్టాద్వైత సిద్ధాంతము సన్యాసమును ప్రోత్సహింపదు. "శ్రీకృష్ణ గుణాను భవమున ఈడుపడిన గోపకాంతుల సంకీర్తనమని" చెప్పబడినతరి యీ భావము లన్నియు నిమిడియున్నవి.

"శ్రీకృష్ణ విజయము నెరిగి, భక్తితో శ్రీకృష్ణ భావముతో సంశ్లేషింప గలిగిన ఆ గోపకన్యక, బహుశః గోపకాంతల దివ్యగానమును వినుచు సుఖతరముగా, పడుకపై పరుండి యుండినదేమో" ఆమె వరకు అదిమంచిదే, భోగ్యమే. కాని ఆమెతోడి గోపికాకన్యల కివ్వవలసిన సహకారమును ఉపేక్షింప వచ్చునా? మరువవచ్చునా? తగదు. ఇచ్చట సేవాభావము సూచింపబడినది.

అట్లే భక్తుడయినవాడు తన స్థితికి తృప్తిపడియుండక, తోడి అనుచరుల నుద్ధరించి, ఉజ్జీవింప జేయవలయును. ఇది లోకకల్యాణార్థము. ఇదియే మోక్ష సన్న్యాస యోగము. ఇట్టి ఆండాళ్ ప్రబోధముల నుండియే శ్రీరామానుజుడు భావత్రయ ప్రాధాన్యమును, గమనించి యుండును. (భావత్రయము = శరణాగతి భావము, స్వార్థరహిత భావము, సేవాభావము - ఇది విశిష్టాద్వైత సిద్ధాంతసారము.

## 8. ఎనిమిదవ పాశురము:

(శ్రీ కృష్ణుని అనుగ్రహ విశేషము గలిగియుండియు నొక యాదవ భామిని యింకను పడుకపై నుండగా, ఆండాళ్ నాయకత్వమున నున్న గోపికా కన్యల బృందము ఆమెను లేపుటకు ఇట్లనిరి:

"తెల్లవారినది, లెమ్మా" అనిరి. అందులకు పడుకపై పరుండియున్న కన్య ఛలోక్తిగా "తెల్లవారలేదు, చంద్రబింబము వంటి ముఖముగల మీలో యొకతె తూర్పుదిక్కును చూడగా, ముఖప్రకాశము ఆ దిక్కున ప్రతి ఫలించుట చేత అరుణోదయ మయినట్లు కనుపడు చున్నదేమో! తెల్లవారినదని రుజువు చేయుటకు మరియొక చిహ్నమును వెల్లడింపుము" అనగా, వారిట్లు చెప్పుచున్నారు:

"ఎనుములు ఉదయముననే కొట్టము నుండి విడువబడి మంచుగడ్డి మేయుటకు ఈ ప్రక్కల యథేచ్ఛగా తిరుగుచున్నవి. చూడుము. ఇక లెమ్మా" అనిరి.

"మిగిలిన గోపకన్యకలందరు స్నానఘట్టమును చేరిరా" అని ప్రశ్నింపగా, గోపకన్యకలు, "నీవు తప్ప తక్కిన వారందరు, తిరుమల యాత్రకువలె, బృందముగా బయలుదేరి చనుచుండగా, అదిగో, అల్లక్కడ వారిని నిలిపి నిన్ను కలుపుకొని పోవుటకు ఇటకు వచ్చినారము", అని పల్కిరి గోపకన్యకలు - "నీవు శ్రీకృష్ణుని కటాక్షమునకు పాత్రురాలవు గదా! నిన్నుతోడ్కొని పోవుటకు వచ్చి

నిల్చున్నవారము. కుతూహలము గలదానా! లెమ్ము" అని మరియు ప

"సరే, లేచి చేయవలసిన కర్తవ్యమేమి?" అని గొల్లభామ ప్రశ్నింపగా, పిలువను నిల్చొనియున్న గోపికా బృందము, "శ్రీకృష్ణ గుణముల నోరార గానము చేసి, వానికి ప్రపత్తిచేసెదము. వాడెట్టివాడో నీకు తెలియకున్నదా? గుఱ్ఱపురూపుతో వచ్చిన కేశియను రాక్షసుని యొక్క నోటిని రెండు బ్రద్దలుగా చీల్చినవాడును, చాణూర ముష్టికులు అను మల్లురను నిరసించిన వాడును, బ్రహ్మాది దేవతలకు దేవుడయినవాడును, అయిన పురుషోత్తముని శరణు జొచ్చెదము గాక. ఆయన మనయందు కృపజేసి, మనకొరతలను విచారించి, మనలను తప్పక కటాక్షించును", అనిరి.

వివరణము: నిద్రించిన వారు సులభముగా మెలుకువగనరు. మరి మేల్కొన్నను త్వరగా పైకి లేవరు. ఒక విధమయిన తూగు, ప్రాలుమాలిక, ఉపేక్ష వారిని ఆవరించి యుండును. అట్లే అజ్ఞానాంధకారముతో నున్నవారు సులభముగా జ్ఞానపు వెలుగును చేరరు. ఒక వేళ జ్ఞానపు వెలుగున పడినను, అజాగ్రత్తవలనను అలవాటు వలనను మరల అజ్ఞానమున పడు అవకాశమున్నది. కొంత జ్ఞానమును పొందినవారు, ఒక విధమయిన గర్వమున బడి, మరల అంధకారమున పడు అవకాశ మున్నది. అందువలననే భాగవతులగు వారు ఎల్లప్పుడు సంశ్లేషభావమున ఎరుకలో, జ్ఞానములో, ఆనందములో నుండవలయును. విశ్లేషించిన సమయముల యందు ఉపేక్షలో పడగలరు. అందువలన అనుక్షణము సంశ్లేషభావమున నుండవలయును. అప్పుడు తన జీవితము సన్మార్గము నందే యుండగలదు. ఈ భావము "లేవమారాడుచున్న గోపికా కన్యతత్త్వమును"బట్టి వెల్లడియగుచున్నది. గోపకన్య ఉపమానము, సంశ్లేషభావము నలవరచుకొనియు తాత్కాలికముగా విశ్లేషించిన భాగవతుడు ఉపమేయము అగుచున్నారు.

సంఘ కార్యమునకు సభ్యులెల్లర సహకారము అవసరమయినట్లు, దైవకార్యమునకు భాగవతులెల్లరు కూడియుండవలయును. మరియు, భాగవతులు స్వార్థరహితులుగా వున్న ఇతర భాగవతులతో సద్భావమున కలిసి యుందురు. దైవకైంకర్యమున సోదర భావము మూలభావము. సోదరభావము లేనిది దైవభావమనునది లేదు. ఇచ్చట గోపకన్యకలు తోటి కన్యకలందరి నెట్లు కూడగట్టుకొనుచున్నారో, తమకంటె నెక్కువ ప్రావీణ్యముగల వారినెట్లు అహ్వానించుచున్నారో, మారాడు వారినెట్లు పట్టుదలతో వారి సన్మార్గమునకు మరల్చుకొనుచున్నారో గమనింపవలసియున్నది. ఇదియే వైష్ణవ భావము. భగవచ్ఛక్తి సర్వవ్యాపకమని నమ్మిన వారి భావము. విశ్వసోదరత్వమై వెలయునుగాక. (సమాశ్రయణము) చక్రాంకనము అనబడు వైష్ణవ కార్యముల యొక్క ముఖ్యోద్దేశమేమనగా! వైష్ణవులెల్లరు (చేతనులెల్లరు) సమతాభావమున సర్వంతర్యామి యగు వైష్ణవశక్తితో ఈడు పడవలయుననియు, ఆదిమధ్యాంత రహితమగు కాలచక్రమునకు అంకితులై యుండవలయు ననియు భావము. ఈ భావమును పొందక చక్రాంకనము, మొదలగు సంస్కారముల వలన ప్రయోజనము లేదు. అట్టి ఉజ్జ్వల భావములు కలిగియున్నపుడు అట్టి సంస్కరణ కార్యములు అర్థయుక్తములగును, యోగ్యములగును, అనుభవ యోగ్యములగును. గోపకన్యకలందరు - అనగ , ఆచార్యుడనదగిన పరమ భాగవతోత్తమురాలు ఆండాళ్, సామాన్య భాగవతులగు అసంఖ్యాక కన్యలు, కొంత ప్రావీణ్యమును పొందిన కన్యలు, అధిక ప్రావీణ్యము నందిన కన్యలు, మారాడుతున్న వారు తదితరులు, ఎట్లు సమతా భావమును పొంది, అన్యోన్యమైత్రీ సుహృద్భావములతో, పరస్పర యోగక్షేమములను కాంక్షించి ప్రవర్తించిరో అనునది చేతనులకు ఆదర్శప్రాయము. (This is Religious Socialism which is lacking in every section of the soceity in every nation now-a-days which deserves to be termed as Religious tragedy). ఇది నిజమైన వైష్ణవ

భావము. ఈ భావమునే శ్రీరామానుజుడు భవిష్యత్కా లమున, ప్రచారము జేసియున్నాడు. ఎల్లరను కలుపుకొనక, భేదభావమున స్వార్థపరముగా నుండుట మతమనిపించుకొనదు. ఈ యవాంఛనీయ భావములవలననే, ఈ స్వార్థపరత్వము అగ్రవర్ణులగు మతగురువులను ఆవరించి యుండుటవలననే, వివిధ వర్ణములవారి మధ్య అసూయ పెరగడము, అమానుషత్వము ప్రబలడము, అస్పృశ్యత వంటి అమానుషాచారములు" అగ్నివలె సంఘమును దహింపజేయడము, స్వమతము వారి చేతనే హీనముగా జంతువుల కంటే స్వల్పముగా జూడబడిన పంచములు ఇతర హీనకులముల వారనబడు దరిద్ర నారాయణులు గత 5, 6 శతాబ్దులలో మహమ్మదీయ మతమును, క్రైస్తవ మతమును స్వీకరించడము జరిగినది. ఈ దుర్మార్గచేష్టితములను గమనించియే పూర్వము దయార్ద్ర హృదయుడగు బుద్ధభగవానుడు సాంఘిక న్యాయమును చేకూర్చుటకు జీవిత సన్మార్గమును బోధించెను. బౌద్ధముకూడ హిందూమత మనబడు దానిలో అంతర్భాగమే. హిందూ మతమును ఒక విధముగా వాస్తవిక మార్గమునకు సంస్కరించినది బౌద్ధము. అందువలననే సంఘమున న్యాయమునకు నోచుకొనని పంచము లనబడువారు కొందరు విదేశమతములను స్వీకరింప నొల్లనివారు స్వదేశమతమగు బౌద్ధమును స్వీకరించిరి. హిందూమతస్థులు విశ్వసించు దశావతారములలో బౌద్ధావతారమొకటి కదా! శ్రీకృష్ణుని తరువాత వచ్చిన వాడేగదా బుద్ధుడు. బుద్ధుడు బోధించిన సాంఘిక న్యాయమును, సనాతన హిందువలనబడు వారు ఏలపాటించలేదు? ఈ పరిస్థితులలో పూర్వము ఆళ్వారులు విష్ణుసంశ్లేష భావము, భక్తి మార్గముల ప్రకటించిరి. తరువాత శ్రీమద్రామానుజాచార్యులు (1017-1037 A.D.) కులమునకు ప్రాధాన్యమివ్వక తనసిద్ధాంతమును స్వీకరించిన వారి నెల్లరను వైష్ణవులని పిలిచెను. వైష్ణవులు సమా శ్రయణమును పాటింప వలయునని బోధించెను. ఆండాళ్ ఈ పాశురమున సమాశ్రయ భావములను చూపినారు. ఇది సంఘ శ్రేయస్సునకు అతి ముఖ్యము.

"సూర్యుడుదయింపలేదు. తెల్లవారలేదు. మీలో నొకతె తూర్పు దిక్కును చూడగా ముఖప్రకాశము ఆ దిక్కున ప్రతిఫలించుటచేత అరుణోదయ మగునట్లు కనబడుచున్నదేమో" అని గొల్లకన్య అనుటలో నున్న సాలంకారముల గమనించునది.

మార్గశిర మాసము వేకువను మంచు దట్టముగా పడుట, భూమిపై పచ్చిగడ్డి మంచుబిందువులతో కప్పబడుట, అట్టిగడ్డిని గేదెలు ఆత్రముగా మేయుట మున్నగు దృశ్యములు మనసుకు వచ్చినపుడు, కొంత సంశ్లేష భావము గలవారు, గడ్డిపరకలను మేయునపుడు గలుగు పటపట శబ్దములు ఎనుములు వదలు బుసబుస శబ్దములు విననట్లుగానే భావింప గలరు. కవితా చమత్కృతి రమణీయముగానున్నది.

ఇందు వర్ణింపబడిన వైష్ణవ సంశ్లేష భావము, భాగవతుల సోదర భావము, శరణాగతి భావము ముఖ్యములు.

## 9. తొమ్మిదవ పాశురము:

"విశిష్ట నవరత్నఖచిత సౌధములందంతటను దీపములు వెలుగుచుండగా, సుగంధ ధూమ సౌరభములు పరిమళింపగా, మెత్తనై సుఖరమయిన హంసతూలికా తల్పములపై సుఖముగా నిద్రించు ఓ మేనమామ కూతురా! రత్నాల తలుపు గడియ తెరువుమని" పలికిరి గోపకన్యకలు మరియొక నిద్రించుచున్న కన్య యింటిముందు నిలిచి-

లేవక పరుండియే యున్న కుమార్తెను జూచి, తల్లీ, "యేలబదులు చెప్పకయే పరుండి యున్నావని" మందలించెను. అది వినిన గొల్లకన్యలు, "అత్తా నీవైనను నీకూతును లేపరాదా! ఇంకను లేవలేదే! మా పలుకు ఆమెకు వినబడలేదా? ఆమెకు చెవుడా? ఇప్పుడే నిద్రింపగా, ఆమె నిద్రకు భంగము వాటిల్లకుండుటకు కావలి బెట్టియున్నారా? దీర్ఘముగా నిద్రబోవు నటుల మంత్రింప బడినదా?'' అని కుతూహలమొప్ప" ప్రశ్నించిరి.

"నా కుమార్తె మేల్కొనునట్లు స్వామి తిరునామములను బిగ్గరగా నుచ్చరింపుడు" అని తల్లి లోనుండియే పలికెను. "ఇప్పటికే శ్రీవిష్ణు దివ్య సహస్రనామములను అనుసంధించితిమి. నీవు నీ స్వామి అనంతకల్యాణ గుణ నామావళిని అనుసంధించి, నీ కుమార్తెను లేపుము", అని గోపిక లనిరి.

వివరణము: ఈ పరుండి యున్న గోపకన్యక గోకులములోని గొప్ప ప్రాముఖ్యము గల కుటుంబమునకు సంబంధించినదిగా (నుండనోపు, శ్రీకృష్ణ కుటుంబము సంబంధమునను, ప్రభుత్వాధికారము లందును గణుతికెక్కిన కుటుంబముగా నున్నది. అందువలన అంతటి ధీమాలో నున్నయది. ఆమె కొప్పియున్న సంపద, సౌభాగ్య సుఖజీవితము ఇందులకు నిదర్శనము. సౌధముల వర్ణనము, అచటి దీపకాంతులు, సౌరభములు, హంసతూలికా తల్పములు, రత్నఖచిత ద్వారములు మొదలగునవి మనోజ్ఞముగా చిత్రింపబడినవి.

ఈ గోపకన్య భగవత్కటాక్షము నందిన భాగవతునకు సంకేతము. భగవత్కృపకు పాత్రుడనైతినని తలచు భాగవతోత్తముడు ఎంత నిశ్చింతగా శాంతియుతముగా ఆనందమున నోలలాడు చుండగలడో ఊహింపతగి యున్నది. భగవత్కృపా సంపద గల్గియున్న వానికి సర్వసంపదలు, సర్వ సుఖములు ఉన్నట్లేగదా!

భగవధ్యానమునను భగవత్సంశ్లేష భావమునను ఉన్నట్టి భాగవతుడు చలించడు. మరియితరులచేత ఆకర్షింప బడడు. తాను సంశ్లేష భావమున నోలలాడుచున్న వాడు గాన, ఇతర భాగవతులు సలుపు భగవద్గుణ నామగానామృతము కూడ వాని చెవి జొనుపడు. నిండుకుండలో పోయబడుచున్న నీరు క్రిందకు దొరలునేగాని; కుండలోనికి పోవునా? సంశ్లేషభావమున ఆనందమున నోలలాడు భక్తుని యొక్క చెవి జొరవు ఇతరములైన యేశబ్దములుగాని. అతని సంశ్లేషభావమున కేవియు భంగము కలిగింప జాలవు. అతడు, నిద్రనుండి లేవకుండుటకు మంత్రించబడిన వానివలె, నిశ్చలముగా

నుండును. ఇతర భాగవతులు ఎంత బిగ్గరగా భగవద్గుణగానము గావించినను, అది తన అంతరాత్మలో జనించిన సంశ్లేషమునకు ఈడుకాదు గదా!

మరియు క్షేత్రక్షేత్రజ్ఞ భావము గలిగిట్టియు, శేషశేషి భాగము గలట్టియు, స్వామి సొత్తు భావమునెరిగినట్టియు భక్తశిరోమణి భగవంతు నన్వేషింప పనియుండదు. భగవంతుడే, భక్తవత్సలుడుగాన, భక్తున న్వేషించుచు వచ్చును. తల్లికి బిడ్డయెడ నున్నట్టి వాత్సల్యమిట్టిది గదా! ఈ భావము నెరిగిన భాగవతోత్తముడు నిండుకుండ వలెనుండును. భగవద న్వేషణ గావించు మనస్సు భగవచ్ఛక్తిని పొందును. ఈ శక్తి తనలోనే జనించును.

## 10. పదియవ పాశురము:

"చక్కగా నోమునోచి, సుఖానుభవము చేయు ఓయమ్మా! వాకిటి తలుపులు తెరవకున్నను, లేచి ఒకమాటైనను పలుకరాదా?" అని గోపికలనిరి, శ్రీకృష్ణానుభవమునకు నోచుకున్న ఒక గోప వనితతో -

"మీరు నన్నేల నిందించెదరు? వాడిచట ఉన్నాడా?" అనెను గోప వనిత.

"వాడిచట లేడని నీవనినను, వాడు ధరించు తులసిమాల పరిమళ వాయువులు నీయింటి నుండి వెడలుచున్నవి గదా?" అనిరి. మరియును ఇట్లు పలికిరి, "మాచేత మంగళాశాసనము చేయబడి, మాకు పురుషార్థము నిచ్చువాడై, స్థిరధర్మముగల ఆ నారాయణుని శిరముపై నలంకరింప బడిన తిరుత్తుళాయి మాలికల పరిమళము నీయింటి నుండి వెడలు చున్నయది. ఇక లెమ్ము. పగటి కాలముననే యముని వాతబడిన కుంభకర్ణుడు నీకు ఓడి, తన నిద్రను నీకు వశము చేసి పోయినాడా? ఓ గాఢనిద్రా సక్తురాలైన దానా! మా నాయకీ! ఇక లేచివచ్చి తలుపు తెలుపుము".

వివరణము: ఇచ్చట నిద్రనుండి లేవగొట్ట బడుచున్న గోపిక శ్రీకృష్ణుని కృపకు పాత్రురాలై, నిరాఘాటముగా శ్రీకృష్ణాను భవమును పొందిన కన్య.

కొందరు వేదాధ్యయనము చేయుతరి, అందులో సమర్థుడయిన వాడే తక్కిన వారికి నిర్వాహకుడయినట్లు, తిరువాయప్పాడులోని (శ్రీ గోకులము లోని) బాలిక లందరిలోను కృష్ణసంశ్లేష మందు సమర్థురాలును, శ్రీకృష్ణుని వశపరచు కొనగలట్టియు, శ్రీకృష్ణుని పొరుగింటిదై యుండి, శ్రీకృష్ణుని నేరుగా అడ్డుదారినే పోయి సమీపించ గలట్టి యీ గోపకన్యకను నాయకత్వము వహింపమని యితర యాదవ కన్యలు ప్రార్థించుచున్నారు. ఈ విషయము అతి చమత్కారముగా వర్ణింప బడినది.

శ్రీ కృష్ణుడు తనకడ లేడని ఆ యాదవకన్య వచింపగా, శ్రీ పరిమళ వాయువు లామె యింటి నుండి వెడలుచున్నవని యనుటలో ఆమె శ్రీకృష్ణ సంశ్లేష భావము తెలుపబడు చున్నది. సర్వాంతర్యామి యయిన శ్రీకృష్ణుని పరిమళము భావించిన తావునందెల్ల ఉండునుకదా అని యిచట చూపబడినది.

"కుంభకర్ణుని వలె నిద్రించుచున్నా" వని గోపకన్యను అడుగుట వలన ఇచట నీచార్థము లేదు. ఈ నిద్ర తమోగుణము కాదు, మరియు అది నిద్ర కాదు, బాహ్య స్మృతిని గోల్పోయిన శ్రీకృష్ణ గాఢ సంశ్లేషభావము ఆమెది. "పగటి కాలమునందే యముని వాతబడిన కుంభకర్ణుడు, తన నిద్రను నీకు వశముచేసి పోయినాడా" అని మనోహరముగా, హాస్యముగా పేర్కొనబడినది, సారస్వతపు చెణుకిది.

నీవు ఎంతటి కృష్ణానుభవమున నున్నను, మా కొరకైనను ఒకమాట పలుక రాదా? లేని యెడల నిన్ను మేము అహంభావి, స్వార్థపరురాలు అనుటకు అవకాశమున్నది కదా? కాని మేమట్లు భావించుటలేదు. నీకు గల శ్రీకృష్ణ గాఢ సంశ్లేషభావమును మేమెరుగుదము. కావుననే మాకు నాయకత్వమును వహింపమని

అభ్యర్థించుచున్నాము," అని గోపకాంత లనుటలోని ఆధ్యాత్మిక భావము మిక్కిలి సున్నితమయినది.

ఈ కన్యక గాథ వైష్ణవ సంశ్లేషమున నున్న పరమభక్త శిరోమణికి సంకేతము. ఇది వరలో నుదహరింపబడిన పంచ భక్తిమార్గములును, నవభక్తి సాధనములును వదలి, "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని సూచింపబడినట్లు, ఈ పరమభక్తుడు శరణాగతి ప్రపత్తి భావసంపన్నుడై, వైష్ణవ సంశ్లేష భావమున నోలలాడువాడు: శరణాగతి ప్రపత్తి భావము వైష్ణవ సంశ్లేషభావమునకు సరియైన, నేరుగానున్నట్టి దగ్గరి అడ్డత్రోవ. గమ్యస్థానమును శీఘ్రముగాను, నమ్మకముగాను చేర్చగల దివ్య మార్గము. ఇది తారకమంత్ర మార్గము, తిరుమంత్ర మార్గము. అట్టి పరమభాగవతోత్తముని ప్రాపుకోరుట భాగవతులకు విధియై యున్నది. అట్టి భాగవతోత్తముని ఆశీర్వాదము అవసరము భక్తులకు. ఇట్టి భాగవతోత్తముడు ఇతర భాగవతులకు ఆచార్యునివలె ఉపకరింపలేక పోయినను, అట్టివాని సేవ ఇతరులను ప్రభావితులను జేయగలదు. శరణాగతి భావమున విష్ణుసంశ్లేషమున నున్న భక్తుడు సహజముగా బాహ్యస్మృతిని గోల్పోయి తన ఆనందమున నుండ గలుగుట సహజమే గదా! ఇట్టివాడు సర్వసంగ పరిత్యాగియయిన వైష్ణవ సంశ్లేషభావి. ఇది యిచ్చటి ఆధ్మాత్మిక భావము.

ఈ భక్తుడు చరమోపాయ నిష్ఠుడు. చరమ శ్లోకమున తెలుపబడిన ఉపాయమును గట్టిగా స్వీకరించిన వాడు. చరమోపాయమును గట్టిగా స్వీకరించిన వాడు. చరమోపాయమును భక్తులకు జూపుమని ఆయన అభ్యర్థింపబడు చున్నాడు. వైష్ణవభక్తుని విధియిది. మోక్షసన్యాస భావము గదా వారిది?

## 11. పదునొకండ పాశురము :

(అన్నిట శ్లాఘ్యురాలై కృష్ణునితో సమానురాలుగా నుండు నొకతెను లేపుచున్నారు).

"ఈనిన గోవులమంద లనేకములను పితికి, రణమున అరిబలంబుల నశింపజేసిన పవిత్ర యాదవకులమునకు పసిడి తీగెవంటి దానా! సుందరనితంబినీ! నడకయందు మరాళమా! అడవి నెమలి వంటి నడకగలదానా! లెమ్ము! బంధుజనులమైన మే మందరము నీవాకిట నిలిచి నీలమేఘశ్యాముని తిరునామము అనుసంధానము చేయుచున్నాము. కదలక మెదలక నుండు ఓ సుసంపన్నవతీ! ఏల యింకను నిద్రించుచున్నావు"

**వివరణము:** ఈ గోపకన్య, ఈశ్వరుడే ఉపాయము, ఉపేయము అని తలచియుండు శరణాగతుడయిన భాగవతోత్తమునకు సంకేతము.

ఈశ్వరుడే ఉపాయ ఉపేయములని భావించు భక్తుని యొక్క ఉనికి అతి గంభీరముగా కన్పట్టును. ఎంతకును అతడు కదలడు, మెదలడు. దైవానుభవమునకు స్వామియై యున్నాడు గదా!

ఈ గోపకన్య, భగవద్గుణాను భవమును ఒక రాశిగా చేసికొని, భుజించునట్టి సంపత్తిగల నిరుపాధిక పారతంత్ర్యముగల భక్తుని సూచించును.

ఇంకను, చేతనులను సంసారులనుగా చేయుట ప్రయోజనమా అన్న ప్రశ్నకు సమాధానము ఇయ్యది: కులమునకు తగిన ధర్మమును సాధనబుద్ధి (లేక) కైంకర్య బుద్ధితో అనుష్ఠించినచో దోషము లేదు.

**శ్లో॥ ప్రారబ్ధం భుజ్యమనో పి గీతాభ్యాస రతస్సదా।**
**స ముక్తస్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే॥**

## 12. పండ్రెండవ పాశురము:

(శ్రీ కృష్ణునెడబాయక సర్వవేళల సహచరుడుగా నున్న ఒకనొక యాదవ శ్రేష్ఠుని యొక్క సహోదరిని ఈపాశురమున లేపుచున్నారు)

"మొదటియీత యెనుము అధికమగు పాలచేపుచే, దూడను స్మరించి, పొదుగు నుండి క్షీరమును కార్చగా, ఇల్లంతయు

బురదయగునట్టి సంపన్నుని యొక్క సోదరీమణీ! మంచుచే తలలు తడియగా నీవాకిలి గడపను పట్టుకొని రావణ సంహారియగు శ్రీరాముని గుణగానము చేయుచున్నారు. మన గోపకన్యక లందరు. నీవు వినుటలేదా? ఏల నోరు తెఱవవు? ఇకనైనను లెమ్ము. నీ అధిక నిద్రను మే మెల్లరము గమనించితిమి ఇక లెమ్ము".

**వివరణము:** ఈ గోపకన్యక భాగవతాభిమాన నిష్ఠుడగు భక్తునకు సంకేతము. ఇట్టివాడు స్వాచార్యుడు. స్వాచార్యాభిమానము మూలమున భగవద్గుణములు ప్రసరింపగా, వినువారి యొక్క సాంసారిక తాపము చల్లబడును ఇదియే "మంచుచే తడసిన తలలు" సూచించును. పాలచేపుచే, దూడను స్మరించి, పొదుగు నుండి క్షీరమును కార్చుట - అను విషయము స్వాచార్యుని యొక్క, విష్ణుసంశ్లేషభావమును వెల్లడించు చున్నది.

వైష్ణవావతారములు రామ, కృష్ణావతారములు గాన, అభేదముగా గమనింప బడినవి. కాని శ్రీకృష్ణుడు స్త్రీలను పరీక్షించిన వాడుగాన, శ్రీరాముడు స్త్రీలను మిగులనెమ్మదిగా, చూచిన వాడుగాన, శ్రీరాముని గుణగానము చేయుచున్నారని చెప్పినపుడు, కన్యలు ఎక్కుడు అభిమానము చూపెదరని ఊహింప బడినది! ఇది యొక చమత్కారము. గోపకన్య గాఢనిద్ర వైష్ణవసంశ్లేషభావమును సూచించును. అట్టి సంశ్లేష భావమున నుండి యితరకన్యలు గావించు భగవద్గుణ గానమును వినుట లేదేమో! భగవద్విషయము రహస్యమని భావించి, ఊరకున్నదా? కాదు. భగవద్విషయము అంతటను ప్రసిద్ధమైనదేగదా! భగవద్విషయ ప్రచారము నిరాఘాటముగా జరుగవలయును.

"గోపకన్య యొక్క ఉపేక్షాభావము, గృహము పాలతో బురదయయి ఉన్నది" అను విషయములు ఆ గృహము యొక్క తరుగని భగవత్సంపదను చూపుచున్నవి. ఆళ్వారు యొక్కయు, భాగవతాభిమాన నిష్ఠుని యొక్కయు, స్వాచార్యుని యొక్కయు భగవత్సంపదకు మేరలేదు.

**13. పదుమూడవ పాశురము:**

"తెల్లని కమలమున నల్లని తుమ్మెద వలెనుండు నేత్రసౌందర్యము గలదానా! దుష్టుడగు రావణాసురుని హతమార్చిన శ్రీరామచంద్రుని యొక్క దివ్యచరితమును గోపకన్యక లందరు గానము చేయుచు వెడలి మనము నిర్ణయించుకొనిన సంకేత స్థలమందు చేరిరి. తెల్లవారినది. శుక్రుడు ఆకాశమధ్యమునకు వచ్చెను. బృహస్పతి అస్తమించెను. మీదు మిక్కిలి పక్షులు గూళ్లను వదలి మేతకై కూయుచు పోయినవి. ఇక లెమ్ము సోదరీ! ఇది సుదినము, సుసమయము, లెమ్మ, కపటము విడచి, మాతో కలిసి, కృష్ణునెడబాయుట వలన గలిగిన తాపము తీరునట్లు చల్లని నదియందు తీర్థమాడుదము రమ్ము. ఎందుల కింకను పడకనుం బట్టుకొని పరుండెదవు? లేచిరమ్ము, మాతోకలిసి ఆనందింపుము.

వివరణము: నేత్రసౌందర్యమును బట్టి, తనవద్దకు శ్రీకృష్ణుడే వచ్చునని తలచియున్న గోపకన్యను లేపుచున్నారు.

శ్రీకృష్ణగుణగానమునకు, శ్రీరామగుణగానమునకు అభేదము చెప్పబడినది; సహజమేగదా సత్య మెరిగిన భక్తులకు.

శ్రీకృష్ణునితోడి సహవాసమును, ఏకాంతముగాగాక, గోష్ఠియందు అనుభవించుట ఆనంద తమమ"ని గోపికలు సూచించుచున్నారు.

"శ్రీకృష్ణుని మనమున తలంచుచు, సంశ్లేషించి యుండు ఆనందము కంటే తోడికన్యలతో జేరి శ్రీకృష్ణ లీలలను అనుభవించుట యెంతయో సుఖకరమని" గొల్లభామలు తెలుపుచున్నారు.

"వైష్ణవసంశ్లేష భావమున ఆనందించుచుండు భక్తుడు తన ఆనందముతో సరిపుచ్చుకొనక వైష్ణవభక్తుల గోష్ఠియందు చేరి అందరును వైష్ణవసంశ్లేష భావమున నుండునట్లు చేయుట మిక్కిలి వాంఛనీయము. ఇది లోకహితము. ఒంటరిగా వైష్ణవసంశ్లేష భావమున నుండలేని భక్తుడు. తోడిభక్త బృందమును చేరి స్వామిగుణగానమున పాల్గొనుట వాంఛ నీయము గదా! నిర్మల మనస్కులై, లోకహితులై,

భక్తులెల్లరు గోష్ఠియందు చేరి సకాలమున కాలక్షేపము చేయుట చాల యుచితము - ఆనంద కరము".

**14. పదునాల్గవ పాశురము:**

"నేను తెల్లవారుజామున ముందుగా నిద్రనుండి లేచి, మీ యెల్లరను పడకల నుండి లేపెదను అని చెప్పిన నీవు ఇంకను నిద్రించుచున్నావే! సిగ్గులేనిదానా! లేచి అటుచూడుము, మీపెరటి తోట బావిలో యెఱ్ఱ కలువలు వికసించినవి. నల్లకలువలు ముకుళించినవి. బాగుగా తెల్లవారినదని తెలిసికొనుము. --- కావి వస్త్రములు ధరించి, తెల్లని దంతములు కలిగి తపోవేషధారులగు శైవులు తమతమ దేవస్థానములకు కుంచెకోలలు అను బీగములతో తలుపులు తెరచుటకు పోవుచున్నారు. మాటనేర్పరియగు పూర్ణురాలా! పాంచజన్య సుదర్శనములను ధరించిన శ్రీహస్తుడును, పుండరీకాక్షుడును అగు శ్రీకృష్ణుని తిరునామాను సంధానము చేయుటకు ఇక లెమ్ము!

వివరణము: ఈ పాశురమున అండాళ్ వైష్ణవ మతప్రచారకుడగు ఆచార్యునివలె మాట్లాడుచున్నది.

భాగవత గోష్ఠికంతయు నిర్వాహకులును, భగవత్సంబంధమును ఘటింపజేయు వారును, జ్ఞాన భక్తి వైరాగ్యములచే పూర్ణులును అగు ఆచార్యులకు హెచ్చరిక యివ్వబడినది. ఇట్టి ఆచార్యులు మిక్కిలి చురుకుగా ప్రవర్తించి భాగవతులెల్లరను ఉత్తేజపరచవలయును. ఆచార్యులపై ఘనతర బాధ్యత లున్నవి. ఆచార్యు డట్టి సమర్థుడు గానున్నపుడే గోష్ఠికార్యక్రమములు, వైష్ణవ సంఘకార్యక్రమములు, వైష్ణవ మతప్రచారములు బాగుగా జరుగగలవు.

ఈ పాశురమున పేర్కొన బడిన శివాలయములు, శివాలయార్చకులు అండాళ్ సంశ్లేషించిన శ్రీకృష్ణుని కాలము నాటివికావు. ఇవి అండాళ్ జీవించి యున్న కాలపు విషయములు.

ఆకాలమున శివాలయములు, వైష్ణవాలయములు రెండును ఉండినవి. చరిత్ర ప్రకారము మనదేశమున వైష్ణవము కంటెను, వైష్ణవాలయములకంటెను చాలకాలము ముందుగనే శైవము, శివాలయములు వెలసియుండినవి. వైష్ణవమును శైవమునకు వ్యతిరేకమయిన దర్శనమని తలంపరాదు. ప్రాచీన కాలము నుండి ఉన్న శైవము రానురాను హ్రస్వభావములను ప్రసరింపజేయు చున్నందున దానిని సంస్కరించుటకో యనునట్లు విశాల తత్త్వమును, వెదజల్లు వైష్ణవము తలయెత్తినది. శైవము కంటెను వైష్ణవము ఎట్లు విశాల భావయుక్తమో సూక్ష్మబుద్ధితో న్యాయబుద్ధితో గమనించ వలసినది. వైష్ణవము, శైవము అను నీ రెండు దర్శనములు పరస్పర విరోధులు కావు సరికదా, అవి రెండును పరస్పర సంబంధము కలిగినవి అని తెలిసికొనవలసియున్నది. భగవచ్ఛక్తి సర్వవ్యాపితముగాన వైష్ణవము. ఈ వైష్ణవశక్తి శివమును (మంగళకరమును) రౌద్రమును (భయంకరమును) అయి యున్నది. ఎట్లనిన వాయువు అనునది ఒక్కటే. అది మందముగా నున్నపుడు శుభన్కరముగాను, సుఖప్రదముగాను ఉండునుగదా? అనగా శివముగా నుండును, అదే పెనుతుపానుగా తయారయినపుడు ఎంత రౌద్రముగా, భీభత్సముగా నుండునో ఊహించుము. పెనుతుపాను అపాయకరము, భయంకరము. రౌద్రము అన్నమాట. కావున ఒకే వాయువు కొన్నియెడల శివముగా నున్నది. కొన్నియెడల రౌద్రముగా నున్నది. ఈ శివ, రౌద్ర తత్త్వములు వాయువు నందు రెండు లక్షణములుగా నున్నను, వాయువు ఒకటే కదా? కావున సర్వంతర్యామి యగు భగవచ్ఛక్తికి వైష్ణవశక్తి అను నామము తగియున్నది. ఈ వైష్ణవశక్తి కొన్నియెడల శివముగాను, కొన్నియెడల రౌద్రముగాను ఉండును. కాబట్టి భగవచ్ఛక్తికి "శివరౌద్రవైష్ణవశక్తి" అను నామము మిక్కిలి ఉచిత మయినది. దర్శనము ఇట్టిదైయుండ, రానురాను హ్రస్వదృష్టి గలట్టియు, మూఢ విశ్వాసములు గలట్టియు భక్తులు, గురువులనబడు వారివలనను, విపరీతార్థముల నిచ్చు పురాణ రచయితలవలనను, సత్యము కుంటు వడినది. శైవము, వైష్ణవము అనునవి రెండు వేర్వేరు

దర్శనములుగా విహరించుట యేగాక ఈ రెండును పరస్పర విరోధములుగా పరిణమించి నవి. ఇందు వైష్ణవము తనయొక్క విశాల భావమును, సత్యభావమును ప్రచారము చేయుచుండ, శైవము విపరీత మార్గము నవలంబించి, పెక్కుయెడల రాజాదరణగలిగి వైష్ణవమును నేరుగా నిరసించి వైష్ణవ భక్తులకు వైష్ణవాలయములకు ఘోరాపచారముల గావించినది. ఈ కారణమున ప్రతిచర్యగా వైష్ణవులు శైవుల హ్రస్వభావములను, మూఢ విశ్వాసభావములను పరోక్షముగా నైనను నిరసించుచుండిరి. అట్టి నిరసన యీ పాశురమున తొంగిచూచుచున్నది.

శైవము ఎందువలననో సన్యాసమును ఎక్కువగా ప్రోత్సహించు చుండెను. సన్యాస జీవితము ఉత్కృష్ట మయినదని ప్రశంసించి వర్ణించు చుండినది. (దరదృష్టవశాత్తు శంకరాచార్యుడు అద్వైత సిద్ధాంతమును బోధింపగా శైవులు దానిని అనుసరించినవారైనను, అద్వైత సిద్ధాంతవిశాల భావమును పొందక, అద్వైతమును శైవముగానే ప్రకటించుకొనిరి. వీరు మాయావాదమును స్వీకరించి, సన్యాస జీవితమును ఉత్కృష్టమైనదిగా భావించిరి).

వైష్ణవము సన్యాసమును ప్రోత్సహించదు. వైష్ణవము విష్ణుసంశ్లేష భావమును ప్రోత్సహించుటయేగాక, చేతనుడు ఇతరులకును, తన శరీరాత్మలకును, అపకారిగాని జీవిత విధానమును అవలంబించుటను అంగీకరించును. గీతలో వచింపబడిన మితాహారమును, దుఃఖమున భగ్నహృదయుడు కాకుండుటను, సుఖమున మత్తెక్క కుండుటను వైష్ణవము అంగీకరించును. అందువలన సన్యాసులు అవలంబించు కాషాయ వస్త్రధారణమును, ఉపవాసములను, తాంబూలచందనాది సేవన నిరాకారణమును వైష్ణవము సమ్మతించదు.

అందువలన ఈ పాశురమున చమత్కారముగా సందర్భోచితముగా శైవసన్యాసుల కఠిన జీవన పద్ధతి నిరసింపబడినది. తెల్లవారినదని చెప్పుటకు నిదర్శనముగా “కావి వస్త్రములు ధరించి,

తెల్లని దంతములు గలిగి తపోవేషధారులగు శైవులు తమ తమ దేవస్థానములకు కుంచెకోలలు అనుబీగములతో తలుపులు తెరచుటకు పోవుచున్నారు" అని చెప్పబడినది. సన్యాసులమని చెప్పుకొనుటకు కాషాయ వస్త్రధారణమును అవలంబించినవారు ఆ శైవభక్తులు. పరివ్రాజకబ్రువులు. సన్న్యాసి కర్మఫల సన్న్యాసమును వహింపవలయునుగాని, కర్మను నిరసించి, కాషాయ వస్త్రధారణను చేసిన చాలునా? తెల్లని దంతములు గలిగిన వారని చెప్పుటలో, వారు సన్యాసులమని గర్వపడుటకో, లోకమును మోసము చేయుటకో తాంబూలమును గూడ విసర్జించి, యేదో యతిదీక్షతో ఉన్నట్లు కనబడుదురు. ఇట్లు శైవభక్తు లనబడువారు పాటించుచుండిన నిరర్థక, అర్థరహిత జీవితములు ఇచ్చట హేళనగా వర్ణింపబడినది.

విశ్వమునకు, విశ్వశక్తికి, అనంతకల్యాణ గుణములకు చిహ్నముగా నున్న మనోజ్ఞమూర్తి, పురుషోత్తముడు అయిన శ్రీకృష్ణుడు తన శ్రీహస్తములతో చారుపీతాంబర భూషణములతో త్రిభువన సుందరుడుగా వర్ణింపబడినాడు. అట్టి మూర్తిని ఆరాధించు చేతనులు పరమానందము గానుండి, వైష్ణవసంశ్లేషభావమున నుండి, మంగళకరమైన జీవితమున పాలుపంచుకొనెదరు. వైష్ణవము అట్టి సత్యమైన, ఉజ్వలమైన, మనోహరమైన, నిర్మలమైన జీవిత విధానమును ప్రోత్సహించును.

### 15. పదునైదవ పాశురములు:

(ఈ పాశురమున లోపల పడుకపై పవ్వళించియున్న గోప కన్యకను, వెలుపల ఆమెను లేపుటకు వచ్చియున్న గోపకన్యలకును జరిగిన సంభాషణ గలదు).

"చిలుక పలుకులదానా! ఏల యింకను పరుండి యున్నావు?"

"పూర్ణలారా! చివ్వున పిలువకుడు. ఇదిగో వెంటనే వచ్చుచున్నాను"

"నీవు నేర్పరివయిన మాటకారివని మాకు మున్నె తెలియునులే!"

"అబ్బో, మాటనేర్పరులు మీరు. కాని, నన్నందురా? అట్లే కానిండు, సరే, యిపుడు నేను చేయవలసిన దేమున్నదో తెల్పుడు"

"నీవు శ్రీకృష్ణానుభవమునకు మాగోష్ఠికి రమ్ము. నీవు నీయింట్లో ఉండి వేరైన అనుభవమును పొంద సంకల్పింప నేల?"

"సరే అందరు వచ్చియున్నారా?"

"ఓ, సర్వ్వలు వచ్చియున్నవారు. రమ్ము. నీవు వచ్చి చూచుకొనుము"

"సరే యిక మనమందరము కలసి చేయతగిన దేమున్నది?"

"మనము చేయవలసినదా? - కువలయాపీడమను యేనుగును, కంసాది శత్రువులను సంహరించిన, అతి మానుష చేష్టితుడగు శ్రీకృష్ణుని గుణగానము చేయుటయే మనము చేయవలసినది.

**వివరణము:** ఏకాంత దైవచింతనము, ఏకాంత దైవధ్యానము లనబడు వానికంటే భగవద్భాగవతగోష్ఠి యందుండి, అందరును కలిసి దైవచింతన దైవగుణగానములు జరుపుకొనుట అత్యుత్తమమైనట్టి, ఆనంద దాయకమయినట్టియు, ఫలప్రదమైనట్టియు కాలక్షేప మార్గమని సూచింప బడినది.

ఏకాంత ధ్యానమున చేతనుడు ఏమి చేయుచున్నాడో, యేమి చూచుచున్నాడో, యేమి అనుభవించుచున్నాడో ఆతనికే యెరుక!

దైవగోష్ఠియందు ఇతర భాగవతుల నుండి అనుభవ జ్ఞానమును, ప్రబంధ జ్ఞానమును ఇతర భాగవతులతో కలిసి పొందుటకు వీలున్నది. మరియు సంతోషముగా దివ్యముగా కాలక్షేపము జరుగును. దైవగుణ బృందగానము భక్తులను, వినువారిని ఆనందమున నోలలాడించును. మనస్సునకు శాంతిని, తృప్తిని కలుగజేయును. దీనివలన అన్యోన్య సుహృద్భావము, భాతృభావము పెంపొందింప బడును.

("ఈ ఒంటరి చీకటి గదియందు నీవేమి చూచుదువయ్యా? వెలుపలికి రమ్ము! భగవంతుడు శ్రమయందును చెమటయందును

ఉన్నాడు చూడుము" అన్న రవీంద్రుని గీతాంజలిలోని మాటలు యిప్పట్టున పాఠకునికి జ్ఞప్తికి రాగలవు. దీనిని మీదు మిక్కిలి వివరింప నవసరములేదు.

భగవద్భాగవతులు గోష్ఠియందుచేరి, గీతను పఠించిన స్థలమున, భగవద్గుణ గానము చేసిన స్థలమున భగవంతు డున్నాడని భగవద్గీతా పీఠిక తెల్పుచున్నది గదా:

**శ్లో॥ యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం తథా,**
**మోదతే తత్రభగవా౯ కృష్ణో రాధికయా సహ.**

**శ్లో॥ గోపాలో బాలకృష్ణోపి నారద ధ్రువ పార్షదైః**
**సహాయో జాయతే శీఘ్రం యత్రగీతా ప్రవర్తతే.**

**శ్లో॥ గీతాయాః పుస్తకం యత్ర నిత్యపాఠశ్చ వర్తతే,**
**తత్రసర్వాణి తీర్థాని ప్రయాగాదీని భూతలే.**

**శ్లో॥ నివసంతి సదాదేహే దేహశేషేఽపి సర్వదా,**
**సర్వే దేవాశ్చ ఋషయో యోగినో దేహరక్షకాః.**

వైష్ణవగోష్ఠి యొక్క ప్రాధాన్యము వెల్లడింపబడినది. వైష్ణవగోష్ఠిని ఏర్పాటు చేయుట ఆచార్యుని కర్తవ్యము.

ఇచ్చట కువలయాపీడము, కంసుడు మదమాత్సర్యములకు సంకేతములు. మదమాత్సర్య రహితుడైన చేతనుడు నిజమైన భక్తుడు.

వైష్ణవ మతప్రచారకురాలుగా ఆండాళ్ యీ తిరుప్పావై ప్రబంధమున వైష్ణవాచార్యులను భక్తులను ఉత్తేజపరచుచున్నారు.

**16. పదునారవ పాశురము:**

"మా నాయకుడగు నందగోపాలుని సౌధద్వారపాలకుడా! ఉజ్జ్వల తోరణ ప్రభాసుర ద్వారమును రక్షించు రక్షకభటా! సువర్ణ రత్నమయములగు తలుపులను తెఱువుమా! అమాయికులమును,

నిష్కల్మషులము అగు గోపకన్యకలము. ఆశ్చర్యగుణ చేష్టితుడును, నీలమణి కాంతి దేహుడును అగు శ్రీ కృష్ణుడు మాకు వాద్యవిశేషమును కలుజసేదనని నిన్ననే వచించి యున్నాడు. పరిశుద్ధలమై మేల్కొలుపులు పాడుటకై వచ్చితిమి. నీవు మనసున ఏమనుకొన్నను, ముందు వెంటనే తలుపులు తెఱువుము. మాటలతో ఆటంక పరచుము. అయ్యా, స్నేహముగల స్థిరకవాటమును తెఱువుము".

**వివరణము:** పదునైదవ పాశురముతో ముందుగానే మేల్కొంచిన గోపకన్యలు ఇంకను నిద్రించుచున్న వారిని మేల్కొలుపుట పూర్తి అయినది. అందరు శ్రీకృష్ణుని సదనమును సమీపించిరి. (భాగవతుల్లెలరు ఒకరినొకరు కలిసికొని, గోష్ఠిగా స్వామి సేవా కార్యక్రమమునకు ఉద్యుక్తు లయినారు).

గోపకన్యకలు శ్రీకృష్ణుని సౌధమును చేరినను, అచట ద్వారపాలకుని సహకారము లేనిది శ్రీకృష్ణుని దర్శింపలేరు కదా? అందువలన ప్రవేశమునకు ద్వారపాలకుని అర్థించుచున్నార. (భాగవతులుగా నున్నవారు దైవసాన్నిధ్యమును కోరినవారై, మార్గమును తెలిసికొనుకు తిరుమంత్ర అర్థము నెరిగి భగవదనుగ్రహమును పొందిన ఆచార్యుని సహకారమును కోరవలయును గదా? ఇచట ఆచార్యుని ప్రాముఖ్యము వెల్లడింప బడినది).

## 17. పదునేడవ పాశురము:

"వస్త్రతీర్థ ప్రసాదములను దానము చేసెడు, మాస్వామియగు నందగోపాలా మేల్కొనుమా! లతాంగులకు చిగురైనదియు, కులప్రదీపమై నట్టియు, మాకు స్వామినియు అగునట్టి ఓ యశోదాతల్లీ! మేల్కొనుము. ఆకాశావకాశమును భేదించుకొని, పెరిగి, సమస్త లోకములను కొలిచిన దేవాదిదేవా! మేల్కొనుము. బంగారు పెండెరమును శ్రీపాదమందుగల సంపన్నుడవగు ఓ బలరామదేవా! మీ తమ్ముడును, మీరును నిద్రింపక మేల్కొనవలయును.

వివరణము: శ్రీకృష్ణునకు అతి సన్నిహితులును, అయిన వారల నెల్లరను ముందుగా లేపి, వారి సహాయమున, వారి సమక్షమున శ్రీకృష్ణుని లేపుటకు గోపికలు ప్రయత్నపడుచున్నారు. సన్నిహితులైనట్టి వారల నెల్లరను లేపకుండ శ్రీకృష్ణుని నేరుగా లేపుటుకు వీలుపడదు గదా? (భగవత్సేవకు ఆచార్యుని భక్త శిఖామణులను ముందుంచుకొని పోవలయును. ఆచార్యుల ద్వారా భగవంతుడు సులభుడగుచున్నాడు)

## 18. పదునెనిమిద పాశురము:

"మదగజ బలుడును, తరుగని భుజబలము గలవాడును అగు నందుని యొక్క కోడలా! ఓ సత్యాదేవీ! పరిమళ శిరోజ సంపత్సంపన్నురాలా! తలుపుగడియను తీయవమ్మా! తెల్లవారినది: కుక్కుటములు నలుదిక్కులను అరచుచున్నవి. పూలగురువింద తీగెల పందిళ్ళపై కోకిల సమూహములు మనోహరముగా కూయుచున్నవి వినుమా! పూబంతి సహితహస్తే! తలుపు తెరువుమమ్మా! మీరు వచ్చిన పనియేమని అడిగెద వేమో, చెప్పెదము, అవధరింపుము, నీప్రియుని కల్యాణ గుణగానము చేయుటకు మాకై మేమే యికతలపులు నెట్టుకొని లోనికి వచ్చెదమని భావించు చున్నట్లున్నావే! సత్యాదేవీ! ఎఱ్ఱదామర పుష్పమువంటి శ్రీహస్తమున సువర్ణకంకణాది ఆభరణంబులు ఘోషింపగా నీవే వచ్చి తలుపు తెరువుమమ్మా!"

వివరణము: శ్రీకృష్ణుని అర్ధాంగియైన సత్యాదేవిని వారిపడకటింటి ద్వారమును తెరువమని గోపకన్యలు అభ్యర్థించడము, పరిమళ శిరోజ సంపన్నురాలా అని ఆమెను సంబోధించడము, పూబంతిని ధరించిన కోమల హస్తకమలము, ఎఱ్ఱదామర పుష్పము వంటి శ్రీహస్తము సువర్ణకంకణాది అభరణములతో గలగలలాడుట - యిత్యాది వర్ణనములు అతి శృంగార రసశోభితములు.

తెల్లవారగానే నలువైపుల కుక్కుటముల 'కొక్కొరోక్కోలు" పూల గురువింద తీగెల పందిళ్ళపైనున్న కోకిల సమూహముల "కువ్వూ"

రవములు ప్రకృతి లక్షణములను, ప్రకృతి సౌందర్యములను అతి మనోహరముగా సూచించుచున్నవి.

శ్రీకృష్ణునకు సత్యాదేవి ప్రియురాలు, సత్యాదేవికి శ్రీకృష్ణుడు అత్యంత ప్రియుడు గదా! అట్టితరి "నీ ప్రియుడయిన శ్రీకృష్ణ గుణగానము చేయుటకు వచ్చినామని" గోపికలు సత్యాదేవితో పలుకుట ఆమెకును మిక్కిలి ప్రియమును చేకూర్చునుగదా!

ఇంతవరకు యీ పాశురము శృంగార భరితముగా నున్నది.

శ్రీకృష్ణ భగవానుడు యిచట గృహస్థుడు. సత్యాదేవి గృహిణి. గృహిణికి యివ్వవలసిన గౌరవ మర్యాదలు, గృహిణికి ఉన్నట్టి అధికారములు సూక్ష్మముగా సూచింపబడినవి.

ఇక ఈ పాశురము నందలి ఆధ్యాత్మిక విషయముల నరయుదము: భగవంతుడు భరించువాడు గాన లోకభర్త లోకమంతయు లోకేశ్వరుని భార్యయే కదా!

ఈ విషయముపోను, శ్రీకృష్ణావతారమున ప్రత్యేకించి పట్టమహిషులుగా చెప్పబడినవారు రుక్మిణీదేవి, సత్యాదేవి. శ్రీకృష్ణుడు సర్వంతర్యామి యగు వైష్ణవశక్తికి సాంకేతికముకదా! భగవంతమ్ అనగా విశ్వము+ వైష్ణవశక్తి అవుతుంది. విశ్వము నందుండి విశ్వము నావరించి యున్న వైష్ణవశక్తి అవాఙ్మానస గోచరము కదా! అనగా విశ్వమునందలి సంపద అంతయు వైష్ణవశక్తియే. ఈ వైష్ణవశక్తి యొక్క రెండు అంశములు ఐశ్వర్యము, సత్యము. రుక్మిణిదేవి విశ్వమునందున్న ఐశ్వర్యమునకు సాంకేతికము. సత్యాదేవి విశ్వసత్యమునకు సాంకేతికము. ఐశ్వైశ్వర్యము, సత్యము కలిసి భగవంతుడు అగుచున్నాడు. అవాఙ్మానస గోచరమయిన వైష్ణవశక్తిని పొందుట యనగా విశ్వసంపదను తెలిసికొనుట, విశ్వ సత్యమును తెలిసుకొనుట, శ్రీకృష్ణునకు రుక్మిణి, సత్య అను యిరువురు భార్యలనుటలోని భావము యియ్యది. ఇందు సత్యము అతి ముఖ్యమైనది. విశ్వసత్యమును తెలిసికొనుటయే విశ్వేశ్వరుని తెలిసికొనుట అగును. విశ్వసత్యము

తత్త్వత్రయము జ్ఞానము. ఈ తత్త్వత్రయము జ్ఞానమే "ఓం నమో నారాయణాయ" అను తిరుమంత్రమున సూచింపబడినది. తిరుమంత్ర సత్యమును తెలిసికొనుటచే భగవంతుని పొందిన వాడవుతాడు చేతనుడు. "కావున తిరుమంత్రము ద్వారా భగవంతుని పొందగలము" అను విషయము "సత్యదేవి ద్వారా శ్రీ కృష్ణుని సన్నిధానమును పొందుట"ను సూచించును. భగవంతునకు ప్రియమయినది తిరుమంత్రము, భగవంతుడు తిరుమంత్రమునందే ఉన్నాడు. (ఈ విషయమును అలంకార యుక్తముగా గాక వాస్తవముగా గమనింపతగియున్నది. (Don't be influenced by the use of personification). భగవంతుడు సత్యమునందే యున్నాడు, సత్యముద్వారా భగవంతుని పొందుము అను విజ్ఞానము చేతనుడు పొందవలసియున్నది. God is truth or truth is God - this Mahatma Gandhi's statement has such logical and philosophical basis. భగవత్శక్తి యొక్క ప్రియురాలు సత్యము. కావున సత్యము ద్వారా భగవత్శక్తిని అన్వేషించుట సుఖకరమైన, ఫలప్రదమయిన మార్గము. ఈ ఆధ్యాత్మిక సత్యము యీ పాశురమున "గోపకన్యలు సత్యాదేవి సహకారముతో శ్రీకృష్ణ సందర్శనమును కోరుట" యందు సూచింప బడినది.

ఇచ్చట సత్యాదేవి, తిరుమంత్రార్థము నెరిగి, తిరుమంత్రార్థమును బోధించు ఆచార్యునకు సాంకేతికము. అట్టి ఆచార్యుని ద్వారా భగవంతుని పొందగలము అను వైష్ణవమత ప్రచారక సత్యము యిందు సూచింప బడినది.

అభిమాన జనులెల్లరు వారి యజమానిని నిరాటంకముగా దర్శింప గలగినను, వారినాయకుని ద్వారా యజమానిని కలిసికొనుట సుఖకరము, ఫలప్రదము. అట్లే భక్తిమార్గమున భగవత్శక్తిని పొందవీలున్నను, విజ్ఞానముతో కూడిన భక్తితో, అనగా తిరుమంత్ర జ్ఞానముతో భగవత్శక్తిని సులువుగా పొందగలవు. కావున తిరుమంత్రము నెరిగిన ఆచార్యోత్తముని ఆశ్రయించుము - అని సూచింపబడుచున్నది. "మాకై మేమే శ్రీకృష్ణుని సందర్శించెదము, మాకైమేమే తలుపులు

నెట్టుకొని లోనికి ప్రవేశించెదము అని తలంపక, ఓ సత్యాదేవి! నీవే తలుపు తెరువుమమ్మా" అనుట యెంత అధ్యాత్మికార్థగాంభీర్యమో గమనించునది. ఏదో మూఢభక్తితో దైవ సాన్నిధ్యమును పొంద దలపక, సత్యమయిన జ్ఞానముతో, తిరుమంత్రార్థ జ్ఞానముతో భగవత్భక్తిని బడయుము.

ఇచ్చట భగవత్భక్తి, తిరుమంత్రము, సత్యము, ఆచార్యుడు, భక్తుడు మున్నగు పదములు సూచించు దివ్యార్థములను గమనించునది.

## 19. పందొమ్మిదవ పాశురము:

"పరిమళమును, ప్రకాశమును రెంటిని వెదజల్లు దీపములు నలుప్రక్కల వెలుగు చుండగా, యేనుగుదంతములచే చేయబడిన కాళ్లుగల మంచముపై సొగసు, చల్లన, మృదుత్వము, పరిమళము, ధావళ్యము అను పంచగుణశోభితమయిన హంసతూలికా శయ్యపై పరుండి యుండి, గుత్తులుగుత్తులుగా వికసించియున్న పుష్పముల ధరింపగా కేశభారముగల సత్యాదేవి యొక్క స్తనముల మీదుగా నుంచబడిన వికసిత వక్షస్థలము గల ఓ కృష్ణా! నోరుతెరచి ఒకపలుకు పలుకరాదా! కాటుకచే నలంకృతమయిన నేత్రములుగల సుందరీ! ఓ సత్యా! శ్రీకృష్ణుని యెడబాటును క్షణకాలమైనను సహింప నొల్లని నీవు, అయనను నిద్రమేల్కొన నివ్వవులే! ఇది నీ స్వరూపమునకుగాని, నీ స్వభావమునకుగాని తగునా?"

వివరణము: శ్రీకృష్ణుడేల పడకనుండి లేవలేదు? గోపకన్యకల మాటల శబ్దమును వినజాలని గాఢనిద్రయందున్నాడా ఆ నిర్నిద్రుడయిన స్వామి! కాదు. గోపకన్యలు వారికి భక్తులు, స్వజనులు. సత్యాదేవి తలుపు తెరచి వారిని ప్రవేశింపజేసిన, ఆమె, తనభక్తులును, స్వజనులును, గోపికా కన్యకలు అయినవారికి, ముందుండినది యగునుగదా! స్వామికి సర్వులును సమానముగదా! అట్టి ముందు

స్థానమును సత్యకివ్వనొల్లక, భక్తులయిన స్వజనులను వెనుకబడి యుండుటను ఒల్లక, శ్రీకృష్ణుడు సత్యాదేవిని పడకనుండి లేవకుండా జేయుటకై ఆమెను బిగికౌగిట నుంచుకొని యుండగా, గోపికలు శ్రీకృష్ణుని సంబోధించుచూ, "ఒకమాట పలుకవయ్యా" అని ప్రార్థించెదరు - ఇది యీ పందొమ్మిదవ పాశురమునకు అవతారిక.

ఈపాశుర భావము యెంతటి శృంగార రసభరితమో గమనింపుడు. స్వచ్ఛమయిన ప్రేమానురాగములను నూతన వధూవరులు ఈ శృంగార రసభరిత పాశుర భావమునెట్లు ఆనందించెదరో! గృహస్థులును వృద్ధులును అయినట్టియు, అదర్శదంపతులనబడు వారు యీ శృంగారరస శోభిత పాశురభావమును గమనించి, మైమరచి, వారి పూర్వ యౌవన జీవితముతో యెట్లు సంశ్లేషించి ఆనందించెదరో!

దీపముల కాంతులు, మంచపు వర్ణనము, పడకయొక్క సౌందర్య వర్ణనము, సత్యాదేవి యొక్క పరిమళ కేశములు, ఆమె యొక్క పుష్పాలంకరణము, ఆమె యొక్క కాటుకచే అలంకరింపబడిన చారు నేత్రములు మున్నగునవి యెంత రమణీయముగా వర్ణింపబడినవో గమనింపుడు. ఆండాళ్ యొక్క కవితాసారస్వత ప్రభలుయిట్టివి. పాటకులకు అద్భుతానందములను చేకూర్చెడివై యున్నవి.

ఇక యిచ్చటి ఆధ్యాత్మిక విజ్ఞాన వెలుగులెట్టివో గమనించి ప్రభావితుల మయ్యెదము గాక!

ఆండాళ్చే రచింపబడిన యిట్టి రసవత్తర పాశురభావముచే ప్రభావితుడయిన పరాశరభట్టర్ (శ్రీరామానుజాచార్యుల వారి శిష్యుడు, శ్రీరామానుజుని తరువాత విశిష్టాద్వైత మఠాధిపతి అయినవాడు) భవిష్యత్కాలమున, ఆండాళ్ ప్రతిభకు, ఆమెయొక్క శ్రీకృష్ణ సంశ్లేష భావమునకు, ఆమె రంగనాథస్వామితో ఐక్యమయిన విధమునకు అచ్చెరువంది, ఆమెయొక్క ఆధ్యాత్మిక స్థానమును నిరూపించి, ఆమెను ప్రశంసించుచు యీ క్రింది దివ్యపాశురమును శలవిచ్చియున్నారు. ఇది వైష్ణవ భక్తసేవ్యమై ద్రావిడ వేదమున అలరారుచున్నది.

శ్లో॥ నీళాత్తుంగ స్తనగిరితటీ సుప్తముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతిశిత శిరస్సిద్ధమధ్యాపయంతీ।
స్వోచ్ఛిష్టాయాం స్రజనిగళితం యాబలా త్కృత్యభుంగే
గోదాతస్యైనమ ఇదమిదం భూయ ఏవాస్తుభూయః॥

తాత్పర్యము:

యశోదాదేవి సోదరుడగు శ్రీకుంభుని కుమార్తెయైన సత్యాదేవి యొక్క స్తనములనెడు పర్వత ప్రదేశమున శయనించియున్న శ్రీకృష్ణుని, తమశేషత్వ పారతంత్ర్యములను విన్నవించి, మేల్కొలిపి తాము ధరించి విడిచిన మాలికచే బద్ధునిగాజేసి, బలాత్కారముగా ననుభవించిన ఆండాళ్ గారికి అనేకవందనములను సమర్పించుచున్నాడను. (ఈ శృంగార రసభరిత విషయము యొక్క అంతరార్థము యియ్యదియని గమనింపుడు: బహుకుటుంబి యగువాడు ఒకానొకప్పుడు తనసంసార చిక్కులనుండి కొంతసేద తీర్చుకొనుటకు ఏకాంతముగా చల్లని పర్వత సానువును జేరి కొంత విశ్రాంతిని బడయులాగున, సర్వలోక కుటుంబి యయిన సర్వేశ్వరుడు సత్యస్తనములనెడు పర్వత ప్రదేశము నాశ్రయించెను. లోకములో శేష శేషీభావము తెలియని వారనేకులుం డుటచే, వారి సంరక్షణార్థము అట్లుచేరి నాడనుట: మీదు మిక్కిలి భగవంతుడు సత్యమునే ఆధారముగా జేసికొని యున్నాడని భావము. భగవంతుడు సత్యమునందే యున్నాడు. ఆ సత్యము, చేతనునకు సంబంధించి శేషశేషీ భావము. ఈ భావమునెరిగిన ఆండాళ్ తాను స్వామిలో అంతర్భాగమనియే భావించెను. ఆమె వైష్ణవ సంశ్లేషభావమట్టిది.

స్వరూప స్వభావముల వలన నిజమైన భక్తుడు తాను భగవదను భవము గలిగి ఆనందించుచూ, యితర భక్తులెల్లరు అట్టి అనుభవమును పొందవలయునని కాంక్షించును. అతని స్వార్థరహిత భావము, మోక్షసన్యాస యోగములు అట్టివి. నిజమైన భక్తుని యొక్క యిట్టి స్వార్థరాహిత్య భావమునకు, మోక్షసన్యాస యోగతత్వమునకు

తార్కాణముగా సూచింప దలచిన, శ్రీరామానుజాచార్యునిది ప్రథమ స్థానము. ఈ విషయమును నాచే రచింపబడిన శ్రీరామానుజ దివ్య వైభవమను గ్రంథమున గమనింపగలరు.

## 20. ఇరువదియవ పాశురము:

"ముప్పది మూడు విధములగు దేవతలకు భయమును లేకుండా జేసి ధైర్యము నిచ్చిన ఓ బలశాలీ! నిదురమేల్కొనుము. ఆశ్రిత రక్షణ సామర్థ్యముగల వాడవా! శత్రువులకు దుఃఖమును జనింపజేయు నిర్మలుడా! నిద్రనుండి లెమ్ము" - (యిట్లు లేప ప్రయత్నించినను శ్రీకృష్ణుడు లేవమిచే గోపకన్యకలు మరలా నీళాదేవిని అర్థించుచున్నారు) "ప్రకాశవర్ణములందు బంగారు కలశముల వంటివిన్ని, మృదునయిన వట్టివిన్ని స్తనములును, ప్రవాళాధరమును, సన్నని నడుముగలట్టి పూర్ణురాలా! ఓ సత్యాదేవి! శ్రీ మహాలక్ష్మి! మేల్కొనుమమ్మా! ఆలవట్టమును, అద్దమును యిచ్చి, నీ నాయకుని, మమ్ములను యిప్పుడే స్నానము చేయింపుము".

వివరణము: సత్యాదేవి సౌందర్య వర్ణనము అతిమనోహరము, శృంగార రసభరితము.

నోము సందర్భమున శ్రీకృష్ణుడును, గోపికాకన్యలును యమునలో స్నానము చేయుటకు తగిన సహకారమును యివ్వమని సత్యాదేవిని గోపకన్యకలు కోరుచున్నారు. శ్రీకృష్ణుని అర్ధాంగియయిన సత్యను యిట్లు కోరుట సవ్యమే! ఈ వాస్తవము కూడా శృంగార భరితమే.

స్నానానంతరము కేశముల కురుల సవరించుకొనుటకును ముఖమున తిలకమును ధరించుటకును ముకురము (అద్దము) అవసరము. అట్టి తరి చిరుచెమట ముఖముపై పట్టిన దానిని ఆర్పుటకు విసనకర్ర (ఆలవట్టము) అవసరముకదా. కావున ఆ రెండు వస్తువులను యిమ్మని సత్యాదేవిని అడుగుచున్నారు. ఇదియు శృంగార రసభరితము.

సత్యాదేవి శారీరక సౌందర్యము, సౌష్ఠవము సంపూర్ణము. ఆమె మనస్సు కూడా పరిపూర్ణమయినది. అందువలనగదా సత్యాదేవిని "పూర్ణురాలా!" అని గోపికలు సంబోధించినారు.

సారస్వత మెరుగులందు చెఱుకులందు యీపాశురము యెంత రమణీయముగా నున్నదో చదువురులు గ్రహింపగలరు.

ఇక దీని అంతరార్థమును, ఆధ్యాత్మిక భావమును గమనించెదము:

"శత్రువులకు దుఃఖమును కలుగజేయు నిర్మలుడవా!" అన్నపుడు యీ శత్రువులు అరిషడ్వర్గములు. ఈ అరిషడ్వర్గములను పూర్తిగా లేకుండా చేసికొనుటయే శత్రువులను నాశనము జేయుట. ఈ అరిషడ్వర్గములను నాశనము చేసికొన్నవాడు నిర్మలుడు. భగవద్భక్తి మానవులను అరిషడ్వర్గ రహితులనుగా జేయును. అందువలన వారు నిర్మలులగుచున్నారు. భగవంతుడు నిర్మలుడై, భగవద్భక్తులు నిర్మలురే.

శ్రీకృష్ణునకును గోపికలకును ఆధారము సత్యాదేవి. సత్యాదేవి అనుగ్రహమున వారు శ్రీకృష్ణుని ఆదరమును సంపాదించుకొనవలయును. సత్యాదేవికి తెలియకుండా కృష్ణుడు గోపకన్యలను ఆదరింపలేడు. ఇది యిట్లుండనిమ్ము:

"ఓం" అనునది ప్రణవనాదము. ఇదియే భగవంతమ్, "ఓం" నందు మూడు శబ్దములున్నవి. అ, ఉ, మ. "అ" కారము దైవశక్తిని చూపుచున్నది. "మ" కారము జీవులను సూచించుచున్నది. "ఉ" కారము విశ్వములో అచిత్ పదార్థమునుగాని, సర్వ భౌతిక పదార్థమును గాని సూచించును. కావున దైవశక్తికిని, జీవశక్తికిని భౌతిక పదార్థమే ఆధారమగుచున్నది. జీవము భౌతికపదార్థము నందే ఉత్పన్నమగుచున్నది. భౌతిక పదార్థమునందును, జీవము నందును దైవశక్తి యున్నది. ఇదియే తత్త్వత్రయ జ్ఞానము. తత్త్వత్రయ జ్ఞానము ప్రకారము చిత్, అచిత్, ఈశ్వర అను మూడు తత్త్వములును సమానములు.

ఇందు అచిత్ తక్కిన రెంటికి ఆధారముగానున్నది. ఇట్లే సత్యాదేవి శ్రీకృష్ణునకును, గోపికలకును ఆధారముగా నున్నది. ఇట్టి శాస్త్రీయ విషయమును బట్టియే భక్తులు లక్ష్మీద్వారా స్వామిని పొందెదరను సూత్రము వెలువడినది.

**21. ఇరువదియొకటవ పాశురము:**

"ఉంచిన భాండములన్నియు నిండిపొర్లునట్లు విడువక పాలిచ్చునట్టి ఔదార్యముగల గోవులను ఆర్జించినట్టి నందుని కుమారా! మాకొరకైనను నిదుర మేల్కొనుము. దృఢప్రమాణసిద్ధుడవై, దృఢప్రమాణమగు వేదముచేత గూడ తెలిసుకొనుటకు అశక్యమగు మహిమాన్వితుడవై, ధర్మసంస్థాపనకై లోకమందవతరించిన వాడవును అయిన ఓ కృష్ణా! మేల్కొనుము. ఓడిన శత్రువులు నీధాటికి సహింప లేనివారై నీవాకిట జేరి నిన్ను నమస్కరించునట్లు, నీ దాసులమగు మేము నిన్ను నుతించుచు నీకు మంగళాశాసనము చేయుచూ వచ్చి ఆశ్రయించి యున్నాము. ఓ దేవా, లెమ్ము".

వివరణము: ప్రబంధరీత్యా, యిచట శ్రీకృష్ణుని తండ్రి నందుని గృహము యొక్క పశుసమృద్ధి, పాడిసంపదయును, శ్రీకృష్ణుని యొక్క పురుషోత్తమత్వమును, శ్రీకృష్ణ అవతార విశేషమును, శ్రీకృష్ణుని యొక్క నిరాఘాట బలసంపదయు, యితర పాలకులపై శ్రీకృష్ణునికి గల ఆధిక్యమును వర్ణింపబడినవి. శ్రీకృష్ణునికి మంగళాశాసనము పలుకుచూ, గొల్లభామలు ఆయనను నిదురనుండి మేల్కొలుపుచున్నారు.

"భోగదశయందు నేనును మీలో నొక్కతెనేగదా! మనమందరము కలిసి శ్రీకృష్ణుని ప్రార్థింతమురండు", అని సత్యాదేవి పలుకగా అందరును కలిసి, అనగా సత్యాదేవియును కలిసి శ్రీకృష్ణునకు మంగళాశాసనమును పలుకుచున్నారు.

భగవత్భక్తి యెల్లప్పుడు సత్యమునే ఆశ్రయించి యుండునని కదా యింతకు పూర్వమే గమనించియున్నాము!

"వర్ణనాతీతమగు స్వరూప రూపగుణవిభూతులను గల ఓ కృష్ణా! ఈ లోకమునందలి చేతనులకు ఆదర్శప్రాయుడవై సాక్షాత్తుగా బహుకాలము నుండి తేజస్సును బొందిన ఓనందకుమారా! నీకు శరణాగతులయిన సామంతుల వలె, మేమును నీ గుణసౌందర్యములకు నోడి, నిన్ను శరణుజొచ్చి నీకు మంగళాశాసనమును పలుకుచున్నాము. మేము - నీయొక్క నిరుపాధిక శేషత్వమునకు ఓడి, సర్వమును త్యజించిన వారమునై - అనగా - దేహాత్మాభిమానమును, స్వస్వాతంత్ర్యమును, అన్యశేషత్వమును, స్వాధీన కర్తృత్వమును, భోక్తృత్వమును, బంధువుల యందలి సంబంధ స్నేహములను, యితరోపాయములను, యితర పురుషార్థములను విడిచినవారమై - నీసన్నిధిచేరితిమి. నీవే సకల విధప్రాప్య ప్రాపకములని తలచి, నీకు మంగళాశాసనమును చేయుచున్నాము", అని ప్రత్యక్షముగా గోపికాకన్యలు స్వామిని సమీపించు చున్నారు. నిజమైన భక్తులు దైవశక్తిని యీవిధముగా సమీపించెదరు. ఇదియే శరణాగతి భావము. ఇదియే సర్వసంఘపరిత్యాగిత్వము. ప్రహ్లాదుడు, భీష్ముడు, విభీషణుడు యిత్యాది సూరివర్యులు అవలంబించిన ప్రపత్తి భావములిట్టివి.

ఉపదేశపాత్రులగు శిష్యులు ఆచార్యోపదేశముచే పరిపూర్ణ జ్ఞానము గల వారగుదురు. భగవద్గుణాను భవమున పరిపుష్టులగు శిష్యులను అనేకమందిని సంపాదించు కొనగలిగిన ఆచార్యునకు పురుషోత్తముడును విధేయుడే. ఈ భావము "పాలభాండములతో గూడిన నందుని గృహము, నందుని ఆధిక్యత, శ్రీకృష్ణుని ప్రసన్నత ఆదిగాగల విషయవర్ణనలయందు" వ్యక్తమగుచున్నది.

భగవంతుడు భక్తవత్సలుడే గాక భక్తవిధేయుడును అయియున్నాడు. అనగా భగవత్శక్తి భక్తునకు స్వాధీనమయియున్నది. ఈ విషయమును శాస్త్రోక్తముగా కారణయుక్తముగా గమనించిన యీ క్రింది శ్లోకము సత్యముగానే కన్పట్టునుగదా!

శ్లో॥ దైవాధీనం జగత్సర్వం
మంత్రాధీనంతు దైవతం।
తన్మంత్రం బ్రాహ్మణాధీనం
బ్రాహ్మణా మమదేవతా॥

ఇచ్చట "బ్రాహ్మణ" అన్నపుడు "కులమున బ్రాహ్మణుడు" కాదు బ్రహ్మజ్ఞానము, సత్యజ్ఞానమును పొందిన వాడు బ్రాహ్మణుడు - ఇతడు శ్రేష్ఠమయిన భక్తుడన్నమాట - "శ్రీభక్తుడు", కులముననే బ్రాహ్మణులైన కొందరు అజ్ఞానులు ఈ శ్లోకములోని "బ్రాహ్మణ" పదమును తమకు అపాదింపజేసికొని, యీ శ్లోకరత్నమును అర్థరహితము జేయుచున్నారు. బ్రాహ్మణోత్తములని పురాణమున ప్రసిద్ధిజెందినవారు అనేకులు కులమున బ్రాహ్మణులు గారని సర్వవిదితమే గదా! గుణనామవాచకమును కులనామ వాచకముగా పరిగణించినందున గలిగిన దుస్థితియిది. వ్యాసుడు, వాల్మీకి, విశ్వామిత్రుడు మున్నగు వారు కులమున బ్రాహ్మణులుకారు - గుణముననే బ్రాహ్మణులయిరి. సత్యము యింత బాహాటముగా చెప్పబడి యుండగా యేలనొకో సత్యము మరుగున పడుచూ, మూఢ భావములు పైకి తేలుచూ వచ్చినవి!

పై శ్లోకమున బ్రాహ్మణ" శబ్దమునకు "శ్రీభక్త" శబ్దమునుప యోగించిన, శ్లోకార్థము బహుసత్యముగా కన్పట్టుటయేగాక, మూఢార్థము నకును అతీతముగా నుండును కదా!

శ్లో॥ దైవాధీనం జగత్సర్వం
మంత్రాధీనంతు దైవతం।
తన్మంత్రం శ్రీ భక్తాధీనం
శ్రీభక్తా మమదేవతా॥

(అని భగవానువాచ)

"సర్వం విష్ణుమయం, అనగా, భగవత్శక్తి సర్వవ్యాపకమునై యున్నది. ఈ విషయము, ఈ సత్యము, ఈ తత్త్వత్రయ జ్ఞానము

మంత్రమునకు అధీనమై యున్నది, అనగా తిరుమంత్రమున, అష్టాక్షరీ మంత్రమందు గుప్తపరుపబడినది. ఈ తిరుమంత్రము భక్తుడెరుగును గదా, భక్తుని యొక్క అనుభవయోగ్యమయి యున్నదిగదా! కావున అట్టి భక్తుడే పురుషోత్తముడనయిన నాకు దైవమైయున్నాడు". అని భగవంతుని భాషణము.

ఇందువలననే భారత, రామాయణ, భాగవతాది పురాణము లందు పురుషోత్తములుగాను, అవతార పురుషులుగాను వర్ణింపబడిన శ్రీరామ శ్రీకృష్ణులు నారదాది దివ్యసూరులును, వారి ఆచార్యులను పూజించి యున్నారు. శ్రీరామ శ్రీకృష్ణులు అవతార పురుషులుగా నెరిగియు కూడా దివ్యసూరులు, ఆచార్యులు వారిపూజలను స్వీకరించిరి కదా! ప్రపంచమున మానవుల నడవడి యిట్టిదై యుండవలయును. ఇట్టి సందర్భమున సంఘము నందు అడకువకు, ప్రేమకు, గౌరవమునకు, వాత్సల్యమునకు కొరత లుండునా? ఉండవు.

భగవంతుడు భక్త వత్సలుడన్న విషయముననను, భగవత్సన్నిధిన ఆచార్య శిష్యులు సమానమనుటలోను, భక్తులు భగవంతునకు మంగళాశాసనము చేయుటలోను ఉన్న ఉన్నతసత్యములను విశిష్టాద్వైత సిద్ధాంతము వెల్లడించును.

"భగవత్భక్తితో భోగించుటయందు మీలో నేనొక్కతెను గదా!" అని సత్యాదేవి మాటలోని సత్యమిది.

నిజమైన ఆచార్యుడు, నిజమైన భక్తులున్న చోట పాలుపొంగినట్లు భక్తిభావము నెలకొనుననియు, వీరెల్లరు సమాశ్రయ, సమాశ్రేయ భావమున దైవశక్తితో సంశ్లేషించి ఆనందింతురనియు పాశుర భావము - అనగా పాశుర అంతరార్థము.

ఈ పాశురమున తండ్రి నందుడు ఆచార్యునకును, కుమారుడు కృష్ణుడు దైవమునకు, సత్యాదేవి విష్ణుసంశ్లేషమును పొందిన భక్తాగ్రేస రునకును, గోపికలు ఉపదేశపాత్రులగు శిష్యులకును సాంకేతికములు. ఎంతటి అద్భుతము యీ ఆండాళ్ కవిత్వము!

## 22. ఇరువది రెండవ పాశురము:

"ఈ అందమైనట్టియు సువిశాలమైనట్టియు, మహత్తైనట్టియు భూమిని యేలు పలువురు రాజులు అహంకార మమకార రహితులై గుంపులు గుంపులుగా దేవరవారి సింహాసనమును సమీపించి, శరణాగతులై యున్నవారి వలె, మేమును స్వామిసేవ కొరకై వచ్చియున్నాము. చిన్నగజ్జల యొక్క నోళ్లవలె వికసించినట్టి తామర పువ్వులవలె వాత్సల్యముతో యెఱ్ఱనైయుండు నయనములను ఆశ్రితులమగు మాపై వ్యాపింపచేయుము స్వామీ! చంద్రుడును, సూర్యుడును ఉదయించినట్లు సొగసైన నీ నేత్రద్వయముతో మా విషయమందు కటాక్షించినచో మావ్యసనము లన్నియు నశించి పోవును." ("ఏలోరెంబావాయ్").

వివరణము: ఈ పాశురమందు ఆండాళ్ నాయకత్వమున నున్న తిరువాయప్పాడులోని గోపికాకన్యలందరు స్వార్థరహితులై అహంకార మమకారములను వదలి, స్వామిని సమీపించి, వారి అనన్యార్హ శేషత్వమును వెల్లడించు కొనుచున్నారు.

ఇదే విధమున భగవంతునాశ్రయించు భక్తుడు మొదట అహంకార మమకారములను వదలి, స్వార్థరహితుడు కావలయును. అప్పుడే అతడు భక్తుడనని చెప్పుకొనుటకు అర్హతను పొందగలడు. (భగవద్గీతలోని, 12వ అధ్యాయము, భక్తియోగమునందలి 13, 14, 16 శ్లోకముల భావమును ఒకసారి మరలా గమనింపుడు)

శ్రీకృష్ణుని నేత్రసౌందర్యమును గోపికలను భవించుట శృంగారరస పోషకము.

శ్రీకృష్ణుని నయనములు భక్తులకు సూర్యుని వెలుగువంటి తీవ్ర నిశితజ్ఞానమును, చంద్రుని చల్లని వెన్నెలవంటి ఆనందమును గులుగ జేయునట్టివని అభివర్ణింపబడినవి. శ్రీకృష్ణుని నయనములు దివ్యజ్ఞాన లబ్ధికి సాంకేతికములు. సూర్యుడు అంధకారమును పారద్రోలి ఆరోగ్యమును కల్గించునట్లును, చంద్రుడు రాత్రి చీకటిని పోగొట్టి

ఆనందమును చేకూర్చునట్లు, దివ్యజ్ఞానము, వైష్ణవ సంశ్లేషభావము చేతనునికి మోక్షభావమును కలుగజేయును. మోక్షభావమనగా "బంధరాహిత్యమున ఆనందమయ భావము" అని అర్థము. ఇట్టి మోక్షభావమున గడుపు జీవితమే జీవితము. ఇదియే పురుషార్థము.

నిర్మల భక్తి భావతత్త్వమును పొందు స్థితి లేక మోక్ష భావమును పొందుస్థితి విశిష్టాద్వైత సిద్ధాంతమున మనోహరముగా జ్ఞానోదయ పూర్వకముగా వర్ణింపబడి యున్నది. ఆలోచనాపరులు, భక్తులు దీనిని ఆనందమున స్వీకరింతురుగాక: దేహాత్మాభిమానమును వదలుట, శేషత్వమును గమనించుట, అన్యశేషని వృత్తిని జ్ఞాతృత్వమువలన గలిగిన స్వస్వామి శేషత్వ నివృత్తిని పొందుట, స్వరక్షణమందు స్వాన్వయం నివృత్తిని పొందుట, ఉపాయాంతరములను తొలగించుకొనుట, తదేకోపాయము గలవాడగుట, స్వవ్యాపారమందు స్వాధీనకర్తృత్వ నివృత్తిని పొందుట, పారతంత్ర్య ప్రతిపత్తిని పొందుట, అనంతకల్యాణ గుణ పరిపూర్ణుడయిన భగవత్శక్తిని అనుభవించుట, (అనంత కల్యాణగుణ పరిపూర్ణ భగవత్శక్తి మూర్తిత్వమే (personinfication శ్రీమన్నారాయణమూర్తి), అట్టి భగవదనుభవజనిత ప్రీతిచే చేయబడు కైంకర్య నిర్వహణము, అట్టి దైవకైంకర్య నిర్వహణమున స్వభోక్తృత్వ బుద్ధిని తొలగించుకొనుట, అనుసోపానములను క్రమముగా అధిరోహించిన వాడే పరమభక్తి భావమును, లేక, మోక్ష భావమును పొందును. శ్రీరామానుజాచార్యుల వారి జీవిత చరిత్రను ఆమూలాగ్రముగా క్రమముగా గమనించిన, పై జూపిన సోపానములన్నిటిని వారెట్లు అధిరోహించి, కడకు మోక్షభావమున నుండిరో గమనింపగలము. ఇట్టితరి నాచే రచింపబడి, తిరుమల తిరుపతి దేవస్థానముల వారిచే ప్రచురింపబడిన "శ్రీరామానుజ దివ్య వైభవము" అను గ్రంథమును చదువవలసినదిగా చదువరులను హెచ్చరించు చున్నాడను.

దేహాత్మాభిమానికి పరమభక్తి కుదరదు. అట్టివానికి పరమభక్తి కలుగుజేయుటకు ఆచార్యోత్తముడు ప్రయత్నించి శ్రమపడినను వృథాప్రయాస అగును గదా!

"సూర్యచంద్రులు ఆయాకాలముల యందు ఆకాశమధ్యమున జేరి భూమండలమును రమ్యవంతముగా జేయు విధమున, దివ్యజ్ఞాన, దివ్యానందములతో పరిపక్వత పొందిన మమ్ము కటాక్షించి, మాకు పరమ భక్తిని కలుగజేయుము ఓ కృష్ణా" అని క్లుప్తముగా పాశుర తాత్పర్యమును గమనించేది.

"పరమ భక్తిచే - అవస్య మనుభవింప వలసినదిగా నుండు విశ్లేష వ్యసనము తీరును". ఈ భావము శృంగారముగా గోపికల పరముగను, భక్తి భావముగా భక్తుల పరముగను అలరారుచున్నది.

"శ్రీకృష్ణుని కటాక్షవీక్షణము సుఖరూపముగను, అజ్ఞాన నివర్తకముగను ఉండును" అనుట.

**23. ఇరువది మూడవ పాశురము :**

"చలికాలమున, పర్వతగుహయందు, దిట్టముగా శయనించి నిద్రించెడు శౌర్యవంతమయిన సింహము, మేల్కొని ఉగ్రముగా చూచి, వాసనగల వెంట్రుకలు నిక్కబొడుచుకొని యుండగా, నలుప్రక్కల కొంచెము కదలి, దేహమును ఒక ఊపుతో దులుపుకొని, బాగుగా విఱ్ఱవీగి, గర్జించి, వెలుపలికి వచ్చునట్లు, కానుగు పూవులవంటి శరీర శోభగల ఓ కృష్ణా! నీవు నీ శయనగృహము నుండి, యిటు వెడలివచ్చి, సిరిసంపద విజయములకు స్థానమగు యీ నీ సింహాసనమున ఆసీనుండవయి, మేము వచ్చిన కార్యమును విచారించి, కృప చేయుము".

వివరణము: నిద్రమేల్కొని పర్వత గుహద్వారమును జేరు మృగరాజము యొక్క పరాక్రమము గాంభీర్యము, హావసౌందర్యము స్వభావసిద్ధముగా రమణీయముగా వర్ణింపబడినవి. సింహముతో పోల్చబడిన యదుసింహము శ్రీకృష్ణుని యొక్క సౌందర్యమును, హావభావమును చదువరులు కళాత్మకముగా ఊహించుకొన వలసినది.

శ్రీకృష్ణుని శరీరసొంపు, శోభ, పరిమళము చదువరులు మనమున తలచి, సంశ్లేష భావమున అనుభవింప వలసినవి.

చలికాలపు రాత్రి వేళంతయు పడకగదియందు వెచ్చని శయ్యపై సుఖనిద్రను అనుభవించు ఆరోగ్యవంతుడు శయ్యనుండి అయిష్టముగా లేచినను, వెంటనే శారీరక ఉషారు, ఉత్సాహముల పొందుటకు చేయు హావభావములు యెంత కన్నులకు గట్టినట్లు వర్ణింపబడినవో గ్రహింపుడు.

సింహము యొక్క గాంభీర్య పరాక్రమములు గుహద్వారమున గదా! గుహలో నొంటరిగా పడినిద్రించుతరి దాని గాంభీర్యమంతయు గుప్తమై యుండునుగదా! విశ్వేశ్వరుడు శయనమున యోగనిద్రను గావించినను, మేల్కొన్నప్పుడు గదా విశ్వమువారిచే శోభిల్లునది?

శ్రీకృష్ణుడు శయనమున సత్యతో యేక శరీడుగా కన్పడెను. సత్యకొలది నిమిషములకు పూర్వము లేచివచ్చి గోపికలతో కలిసి పోయినది గాన, యికస్వామికి సత్యముతో యోగనిద్ర యెక్కడిది? విశ్వమునకు తాను ప్రసన్నుడై విశ్వము తనచే వికసింప బడవలసినదై యుండుగు గదా!

సర్వంతర్యామియగు ఈశ్వరశక్తి ప్రసరణ సంయోగ, ప్రభావముల వలన గదా జడపదార్థము ప్రకోపించి, తేజోవంతమై, సజీవ మగుచున్నది! గుండ్రముగా ముడుచుకొని హ్రస్వముగా నున్న రోమము, దులుపబడగా, నిక్కపొడుచుకొని దీర్ఘమయినట్లు, ఈశ్వరశక్తి సంయోగముతో గదా జడపదార్థము వికసించి, పరిమాణమున గొప్పదగుట, ఫలప్రదమగుట జరుగుచున్నది!

సింహము తన శీరరమును దులుపుకొన్నపుడు, రోమములు దీర్ఘముగా నిక్కపొడుచుకొని యుండుటయేగాక వానిమధ్యము నుండి వాసనలు నలుప్రక్కల వెదజల్లబడునుగదా! జడపదార్థముతో ఈశ్వరశక్తి

సంయోగ పడినపుడే జడపదార్థము జీవస్పర్శతో పరిమళమున రాజిల్లును.

యోగనిద్రయందున్న పురుషోత్తముడు జ్ఞానార్జన చేయును, నిద్ర నుండి లేవగనే సత్వగుణ ప్రధానమయిన రజోగుణ సంపన్నుడుగా రాజిల్లును. ఇది యంతయు తత్వత్రయములలోని ఈశ్వరశక్తి ప్రభావము గదా!

ఈ శాస్త్రీయమయినట్టియు, సత్యమయినట్టియు విశ్వముయొక్క లీలలు, విశ్వశక్తి యొక్క లీలలు ఈ పాశురమున రమణీయ సంఘటన ద్వారా, స్వామి నిద్రమేల్కొను సంఘటన ద్వారా ప్రదర్శింపబడినవి.

### 24. ఇరువది నాల్గవ పాశురము:

ఇరువది నాల్గవ పాశురము యొక్క అవతారికను ముందు గమనించి, తదుపరి దాని తాత్పర్యమును గ్రహింతుము గాక-

గోపికలు, తావు ప్రార్థించిన విధమున, శ్రీకృష్ణుడు కృపచేయుటను జూచి, వచ్చిన కార్యమును మరచి, శయనగృహము నుండి వెడలి, దివ్య సింహాసనము వరకు గంభీరముగా అడుగు లిడుచూ నడచి వచ్చు శ్రీకృష్ణుని సౌందర్యము నేత్రోత్సాహముగా నుండగా, ఆ చక్కదనమునకు గోపికలు మంగళాశాసనము చేయుచున్నారు.

ఇక పాశుర భావమును గమనింతము:

"ఆనాడు దేవతల సంరక్షణార్థము ఈ లోకమును కొలిచిన నీ శ్రీపాదయుగళమునకు మంగళమగుగాక! లంకానగరమునకు దండెత్తిపోయి రాక్షసరాజు రావణుని పదునాలుగు వేల రాక్షసులను హతమార్చిన నీ బాహుబల పరాక్రమమునకు మంగళమగుగాక! శకటాసురుని, కట్లువీడి రూపు నశించునట్లు తన్ని సంహరించిన నీయొక్క కీర్తికి మంగళమగుగాక! ఆవుదూడ రూపమున వచ్చిన ఒక

రక్కసుని, వెలగపండు రూపమున వచ్చిన మరియొక రాక్షసుని మీదుగా వేగముగా విసరివేయునపుడు పొంకముగానున్న నీ శ్రీపాదమునకు మంగళమగు గాక! గోవర్ధనగిరిని గొడుగుగా యెత్తి గోపకులను గోవులను రక్షించిన నీ సుగుణమునకు మంగళమగుగాక! శత్రునాశకమగు దేవరవారి బల్లెమునకు మంగళమగుగాక! ఈ యీవిధములుగా దేవరవారి వీరగాథలనే స్తోత్రము చేసి, తమ్ము అనుభవించుకొరకు (బంధువులచే, స్వజనులచే యిప్పటివరకు బహుకాలము శ్రమపడుచున్న మేము) బంధువుల యొక్కయు, ఊరివారి యొక్కయు సమ్మతమును యీనాడు పొందిన వారమై, నేడు (మిమ్ములనెడబాసి జీవించలేక) మీ అనుభవ ఆనందముల కొరకు వచ్చినారము. స్వామీ కృపసేయవలయును. ఏలోరెంబావాయ్"

వివరణము: పురుషోత్తముడు అవతరించుట "దుష్టశిక్షణ కొరకు, శిష్టరక్షణ కొరకు మీదు మిక్కిలి పెడదారిని బడ్డ ధర్మమును రక్షించి ఋజు మార్గమున వేయుటకొరకు" అని వచింపబడినది.

ఈ పాశురమున మొదట దుష్టశిక్షణను వర్ణించి, కడపట శిష్టరక్షణను దెల్పియున్నారు ఆండాళ్.

పురుషోత్తముడగువాడు సంఘము నుండి అహంకారమును, అహంభావమును, అజ్ఞానమును పారద్రోలి, తన్నాశ్రయించిన వారిని కృపజేయునని చెప్పబడి యున్నది.

ఈ పాశురమున వర్ణింపబడిన పురుషోత్తముని మూడు కార్య విశేషములు వరుసగా యిట్లున్నవి - దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మ సంస్థాపన. ఈ మూడు విషయముల కొరకే పురుషోత్తముడగు వాడు యీలోకమున ఉద్భవించునని గీతా 4వ అధ్యాయము 8వ శ్లోకమున చెప్పబడియున్నది:

**శ్లో॥ పరిత్రాణాయసాధూనాం**
**వినాశాయచ దుష్కృతామ్।**

ధర్మ సంస్థాపనార్థాయ
సంభవామి యుగేయుగే॥

"ధర్మసంస్థాపన" అనుటలోనే దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనునవి యున్నవి.

ఈ పాశురమున పురుషోత్తముని దివ్యాంగములకు, దివ్యాయుధములకు, దివ్యగుణములకు, దివ్యచేష్టలకు మంగళము చెప్పబడినది. ఇది పెరియాళ్వారు (విష్ణుచిత్తుడు) గావించిన "తిరుప్పల్లాండును" పోలియున్నది. (ఈ గ్రంథములోని 4వ అధ్యాయమును మరలా నొకసారి పఠింపుడు)

## 25. ఇరువది ఐదవ పాశురము:

శ్రీకృష్ణుడు "మీకు గావలసిన దేమి" అని గోపికలను అడుగగా, వారు, "మా ప్రతిబంధకములను, వ్యసనములను నీవేయెరుగుదువు గాన, వానిని నసింపజేసి మమ్ము అంగీకరింపుము" అని నుడివెదరు:

"ఓ కృష్ణా! అద్వితీయ సుగుణవతి దేవకీదేవికి పుత్రుడవై అవతరించి, అదే రాత్రి అద్వితీయ తేజోవంతురాలు యశోదాదేవికి కుమారుడవుగా రహస్యముగా పెరుగుచూరాగా, కంసుడు తాను భవిష్యత్కాలమున పడబోవు పాట్లనెరుగక, సహింపనివాడై యే విధము చేతనైనను మేనల్లుని, నిన్ను, వధింప తలపెట్టి యుండెను. అట్టి కంసుని తలంపును వ్యర్థమగు నట్లు జేసి, వానికడుపున నిప్పుమంటవై నిలిచిన ఓ దుష్టశిక్షణా! ఆశ్రితుల యందు అధిక వ్యామోహముగల ఓ స్వామీ! నీ యొద్ద పురుషార్థమును ప్రార్థించి, వచ్చి నిన్ను ఆశ్రయించిన వారము. మాకు పురుషార్థమును కృపజేయువాడవైతివేని, శ్రీమహాలక్ష్మి కోరుసంపదను, దానిని కాపుడుకొన గలిగిన వీర్యమును, నీ కల్యాణగుణగాన తత్పరతను మాకు లభింపజేసి, యింతవరకు నిన్ను యెడబాసినందు వలన గలిగిన శ్రమను తీర్చిమమ్ము సంతోష పెట్టుము - స్వామీ!"

వివరణము: చేతనుడు స్వరూపజ్ఞానసంపదతో తనలోని అపవిత్రతను పారద్రోలిన వాడై, తరువాత నైర్మల్యమున తన మనస్సును మోక్షభావమున నుంచుకొనును. ఇదియే దుష్టశిక్షణ, శిష్టరక్షణ యగుచున్నది. వ్యక్తిలోని యీ దుష్టశిక్షణ, యీ శిష్టరక్షణ వ్యక్తియొక్క తత్త్వత్రయ జ్ఞానముపై, స్వరూప జ్ఞానముపై, ఆధారపడియుండును. తత్త్వత్రయ జ్ఞానమే దైవచింతన. తత్త్వత్రయ జ్ఞానమే మానవునకు ఆత్మజ్ఞానము నొసంగును. ఆత్మజ్ఞానము వలన ఆత్మానందము కలుగును.

శ్రీకృష్ణ సందర్శనము కాగానే, శ్రీకృష్ణుడు వారినంగీకరించి నాడని గమనింపగానే, గోపికలు శ్రీకృష్ణుని కోరిన కోర్కెలేవి? యే భౌతిక సంపదలను, భౌతిక సుఖములను కోరలేదు! ఇచ్చట యేలాటి ద్వయార్థముల చూపక, ఆండాళ్ ఋషికవయిత్రి, గోపికలను గోపికా కన్యలనుగా నుంచక, హఠాత్తుగా వారిని భక్త శిఖామణులనుగా ప్రదర్శించినారు. శ్లేషార్థములు లేవు.

శ్రీమహాలక్ష్మి కోరుసంపదయేది? దానిని కాపాడుకొనదగ్గ వీర్యమెద్ది? ... ఇచ్చటనే అధ్యాత్మిక జ్ఞానమంతయు గుప్తమై యున్నది! "ఓం" కారము (ప్రణవము) తత్త్వత్రయ జ్ఞానమును వెల్లడించును. విశ్వము తత్త్వత్రయము అయి ఉన్నది. అ, ఉ, మ, "ఓం" అగుచున్నది గదా! "అ" దైవశక్తి లేక ఈశ్వరశక్తిని (అనగా సర్వాంతర్యామి యగు వైష్ణవశక్తిని సూచించును. "మ" జీవిమును సూచించును. "ఉ" విశ్వములోని జడపదార్థము, సర్వసంపదను సూచించును. కావున "ఉ" శ్రీ మహాలక్ష్మికి సూచకము. జడపదార్థము (శ్రీ మహాలక్ష్మి) యెల్లప్పుడు ఈశ్వరశక్తితో సంయోగమునే కోరును. అప్పుడే గదా జడపదార్థము నుండి జీవము ఉత్పన్నమయ్యేది? ఇదియే సృష్టి! జడపదార్థము ఈశ్వరశక్తితో సంయోగ పడుటయేగాక, అది యీశ్వరశక్తి నిల్పుకొనగలగాలి. అప్పుడే ప్రకృతి సంపద పెరుగుదల జరుగును మొదటిది సృష్టి, రెండవది

భక్తుడు కోరునది యీ సత్యజ్ఞానము. ఇక యీ సత్య జ్ఞానము నెరిగిన భక్తుడు కోరునది లేదు. వైష్ణవ సంశ్లేషభావమే. అట్టి భక్తుడు విశ్లేషమును భరింపలేడు, సంశ్లేషమును మరలా పొందుటయే అతనికి స్వస్థి, సుస్థిరస్థితి.

కృష్ణ విశ్లేషముననున్న గోపికలు విశ్లేషముననున్న భక్తునకు సాంకేతికము. శ్రీకృష్ణ దర్శనమును పొందిన గోపికలు విష్ణుసంశ్లేషమును పొందిన భక్తులకు సాంకేతికము.

భక్తుడు భగవద్గుణ గానమును కోరును, అందు ఆనందించును, అందు ప్రపంచ ఆనందమును చూచును. అందు ప్రకృతి ప్రపంచముల ఆనందమును కోరును. ఈ భగవద్గుణ గానము శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రముననను, భక్తరచయితలు గావించిన అసంఖ్యాక భక్తికీర్తనల యందును వ్యాపించి యున్నను, ప్రత్యేకించి సర్వమును తిరుమంత్రమున గుప్తపరుపబడి యున్నది. తిరుమంత్రమే, "ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీమంత్రము. అష్టాక్షరీ మంత్రోచ్చారణ దైవగుణగానమవుతుంది. ఇదియే తిరుమంత్ర ప్రభావము. కడకు గోపికలు (భక్తులు) కోరినది తిరుమంత్ర జ్ఞానము భక్తుడు గానున్నవాడు తిరుమంత్ర జ్ఞానమును ఆర్జింపంవలయునని యిచట సూచింపబడినది. తిరుమంత్ర విషయమై యీ గ్రంథమును అక్కడక్కడ కొంత జ్ఞానమును వెలువరింప జేసినను, 3వ అధ్యాయమున (వాడినేఁ వాడి) విపులముగా తెల్పియున్నాను. "శ్రీరామానుజ దివ్యవైభవ" గ్రంథమునందు కూడా దివ్యముగా, మనోహరముగా తిరుమంత్ర జ్ఞాన సౌరభమును చదువరులు పొందగలరు.

దైవమును ప్రార్థించుట వరముల పొందుటకు, ఆయురారోగ్య ఐశ్వర్యములను పొందుటకు అని భావించు మూఢులు యీ విజ్ఞానము వలన వారు చీకటి నుండి బయట బడగలరని ఊహింపబడినది.

దైవ జ్ఞానము, దైవప్రార్థనము తత్వత్రయ విచారణ అగును. ఆ విచారమే చేతనునికి మోక్ష భావమును గలిగించును.

**26. ఇరువది యారవ పాశురము :**

"ఆశ్రిత భక్తవత్సలా! ఇంద్ర నీలమువంటి తిరుమేనుగల ఓ కృష్ణా! మార్గశిరమాస స్నానము లాచరించుటకునై పెద్దలు సూచించు కార్యముల ప్రకారము మాకు కావలసినవి మనవి చేయుచున్నాము. భూమియెల్లను కంపించునట్లు ఘోషించు శ్రీపాంచజన్యము వంటి శంఖములను, విస్తారము గలవియై గొప్పగా శబ్దించు వాద్య విశేషములను, మంగళా శాసనకీర్తనల గానము చేయు వారును, మంగళ దీపముల బట్టువారును, ధ్వజమును బట్టువారును, మేలుకట్టును మాకు అవసరములుగాన కృపజేయుము ఓ వటపత్రశాయీ!"

వివరణము: గోపికాకన్యకలు నోమునకు కావలసిన ఉపకరణములను ఆపేక్షించుచున్నారు. శ్రీకృష్ణ సంశ్లేషమునం దాశగల గొల్లభామలు యిట్టి ఉపకరణములను కోరుటకు కారణమెయ్యది? శ్రీకృష్ణ సంశ్లేషమునకు అనుకూలమయిన నోమును ప్రస్తావించుట చేతను, శ్రీకృష్ణుని బాగుగా సేవించుటకును, శ్రీకృష్ణ తిరునామముల నోరార గానము చేయుటకును, వారి ఉపకార స్మృతి చేతను యీయుపకరణములు వారికి అవసరము లయినవి.

భక్తులును వారి భజన కార్యక్రమమున సంశ్లేషభావమును పొందుటకును, పరమానంద స్థితిని పొందుటకును యీ ఉపకరణము లను అవస్యముగా కోరుదురు.

శ్రీకృష్ణునకున్నది పాంచజన్యము ఒక్కటియే యని తెలిసియు కూడా గోపికల అనేక పాంచజన్యములను కోరుచున్నారు. ఇది యెట్లు శక్యమగును? అంటే, భగవంతునకు అశక్యమేమున్నది అని తాత్పర్యము. వామనుడుగా నుండి విశ్వరూపియై భూగగనములను

కొలిచిన వానికి, ప్రళయకాలమున వటపత్రశాయిగా నున్నవానికి అసాధ్యమేమున్నది? వాసు దేవుడుగదా? సర్వము తనయందు గలవాడు, సర్వము నందును తానుగలవాడును అయియున్నాడు గదా!

క్రింది గీతాశ్లోకమును గమనింపుడు - 8వ అభ్యాసము, 9వ శ్లోకము:

**శ్లో॥ కవింపురాణ మమశాసితారమ్**
**అణోరణీయాంస మనుస్మరేద్యః**
**సర్వస్యధాతారమ చింత్యరూపమ్**
**ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్॥**

తా॥ "సర్వజ్ఞుడును, పురాణ పురుషుడును, సర్వనియంతయు, అణువునకంటె అణువయినవాడును, సర్వమునకు పోషకుడును, చింతింప శక్యముగాని స్వభావముగలవాడును, అజ్ఞానాంధకారమున కవ్వల నాదిత్యునివలె ప్రకాశించు వాడును అయిన ఆపరమ పురుషుడు.."

ఈ పాశురమందు భగవత్సంశ్లేషమునకు కావలసిన ఉపకరణములు పేర్కొనబడినవి:

"సర్వాధికుడవైయును సర్వసులభుడవైన ఓ కృష్ణా! ఆశ్రిత వ్యామోహమే స్వరూపమై అధిక మనోహరమైన విగ్రహుడవయిన ఓ వాసుదేవా!" అని భగవంతుడు సంభోదింప బడుచున్నాడు.

నోము (ఏ నోముగాని) కామ్యార్థులకు సాధనముగను, నిష్కాములకు నిత్యముగను, ప్రపన్నులకు భగవత్కైంకర్యముగను ఉండును.

భక్తులనబడు వారికెల్లరకును గావలసినది అనన్యార్హ శేషత్వ జ్ఞానము. ఈ జ్ఞానము ఏకాక్షరీమంత్రమందు, అనగా "ఓం" కారమందు గుప్తమై యున్నది. ముందు పాశురార్థమున విపులీకరింప బడియున్నది.

ఓంకారమునకు శంఖధ్వని చిహ్నము. అందువలన గోపికలు ప్రధానముగా పాంచజన్యము కొరకు శ్రీకృష్ణుని ప్రార్థించినారు. మంగళాశాసనము చేయువారు "సత్సహవాసమునకు చిహ్నము.

భగవంతుని కృప అనగా దివ్యజ్ఞాన, సంశ్లేషభావ, ఆనందభావ ప్రాప్తి యగుచున్నది. భక్తులచే కోరబడునవి యివియే.

**27. ఇరువదియేడవ పాశురము:**

"శత్రుసంహారుడవగు సుగుణసంపదగల గోరక్షకుడా! నీ అనంత కల్యాణ గుణగానముజేసి, నోమునకు కావలసిన ఉపకరణములను పొంది, (అనగా పురుషార్థములను పొంది), వేము పొందు నన్మానములను లోకులు పొగడునట్టి విధమున, లెన్నగా హస్తాభరణములను, దండకడియములను, కమ్మలను, కర్ణపుష్పములను, పాదాభరణములను, మంచి వస్త్రములను ధరింతుము. తదుపరి పాలన్నము మునుగునట్లు నేయియుంచి, మోచేయి వరకు స్రవించునట్లు, దేవరవారితో అందరమును గూడియుండి, సుఖించెదముగాక. ఏలోరెంబావాయ్."

వివరణము: నోమునోచిన తరువాత దాని వలన లభించు పురుషార్థములను గోపికలు వచించుచున్నారు.

గోపికాకన్యకల పక్షమున వారినోము, నోమునకు కావలసిన ఉపకరణములు, వారుపొందు పురుషార్థములు, వారు ధరించు వివిధాభరణములు, వస్త్రధారణములు,వారు శ్రీకృష్ణునితో కలిసి అనుభవించు భోజనాదులు అతి మనోహరములు, భోగ్యములు, సుందరములుగా నున్నవి.

ఇక వీనిని భక్తుల పక్షమున పరికించి, అన్వయింపజేసి చూచిన, యివి అతిదివ్యములుగా చదువరులు గ్రహింపగలరు.

భగవంతుడు శత్రుసంహరకుడు, సుగుణసంపన్నుడు, రక్షకుడుగా వర్ణింపబడినాడు - భక్తులకు - ఎట్లు? - నిజమైన జ్ఞాన భక్తి

వైరాగ్యములతో గూడిన భగవత్సంశ్లేష భావమువలన చేతనుడు, అరిషడ్వర్గమును జయించినవాడై, సుగుణ సంపన్నుడై, తాను సంఘమునకు ఆదర్శప్రాయుడుగాను, మార్గదర్శకుడుగాను, రక్షకుడుగాను, పెంపొందును. భగవద్భక్తుడనగా సుగుణ సంపన్నుడై ఆనంద జీవితమును గడుపువాడనిగదా గీతానిర్వచనము?

గీతాభక్తి యోగము - 13, 14 శ్లోకములు:

**శ్లో॥ అద్వేష్టాసర్వ భూతానాం మైత్రఃకరుణ ఏవచ।**
**నిర్మమో నిరహంకారస్సమ దుఃఖ సుఖక్షమీ।**
**సంతుష్టస్సతతం యోగీ యతాత్మాదృఢ నిశ్చయః**
**మయ్యర్పిత మనోబుద్ధిర్యోమద్భక్తస్సమే ప్రియః॥**

తాత్పర్యము: సకలభూతముల యందును ద్వేషము లేక, వానియెడ మైత్రియు కారణ్యమును గలవాడై, మమకారాహంకారములను వదలి సుఖదుఃఖములయందు సమచిత్తుడును, క్షమాశీలుడునై, నిత్యసంతుష్టుడును, నియతాత్ముడును, దృఢనిశ్చయుండును, మనోబుద్ధులు రెంటిని నాయందు అర్పించిన వాడెవడో ఆనాభక్తుడు నాకు ప్రియుడు".

"భగవంతుడు శత్రుసంహారకు" డనగా "భగవద్భక్తి వలన చేతనుడు అరిషడ్వర్గమును చంపుకొనును, శత్రు భావమును అంతరింపజేసి కొనును" అని భావము. భగవద్భక్తుడే నిజమైన "అజాతశత్రుడు". అజాత శత్రుడనగా "శత్రువులు లేనివాడని" కాదు భావము. శత్రుభావము లేనివాడని అర్థము. (ధర్మరాజును "అజాతశత్రువు" అన్నపుడు "ధర్మరాజు యెడ శత్రుత్వము యెవ్వరికి లేదని కాదు. ధర్మరాజును శత్రువుగా అనేకులు భావించినారు. కాని ధర్మరాజుకు మాత్రం యెవ్వెరియెడను శత్రుభావములేదు.)

భగవత్కల్యాణ గుణములను గమనించిన భక్తుడు తానును కల్యాణ గుణ యుతుడగును. ఇక యితడు అరిషడ్వర్గ రహితుడు.

ఇక భగవత్కల్యాణ గుణములతో సంశ్లేషపడిన భక్తుని పరమానందము వర్ణనాతీతము.

"సర్వసులభుడవైన వాడవా! గోవిందా! నీ కల్యాణగుణముల అర్థమును తెలిసికొని వానిని ప్రశంసించుట సులభమేకాదు, సుఖకరమును కూడా. సర్వస్మాత్పరుడవై, సర్వసులభుడవయిన నిన్ను అనుభవించుటచే కలిగిన ప్రీత్యాధిక్యతచే, నిన్ను ప్రశంసించుచు గానము చేసిన మాకు పురుషార్థము లభించును. సందేహము లేదు. మేము కోరునట్టియు మేము పొందునట్టియు బహుమానములివి:

1. "శూడగమే" = చేతికి ధరించు ఆభరణము (హస్తాభరణము)
2. "తోళ్వళైయే"=భుజమున ధరించు ఆభరణము. (చక్రాంకితము) తులసిదండ.
3. "తోడే" = చెవిని ధరించు అభరణము (తిరుమంత్రము)
4. "శెవిప్పూవే"= కర్ణపుష్పము (భోగరూపమగుటచే భోగము నిచ్చునట్టి ద్వయమంత్రము)
5. "పాడగమే" = పాదమున కాభరణము (అశ్రయణరూప మగుటచే ఉపాయాంతర నివృత్తి రూపమగు చరమశ్లోకము)

ఈ మూడు రహస్యములచేతను, అనగా, తిరుమంత్రము, ద్వయ మంత్రము, చరమశ్లోకము అను యీ మూటిచే జ్ఞాన, భక్తి, వైరాగ్యముల పొందెదము, ఓ స్వామీ!

తరువాత శేషత్వజ్ఞానమగు వస్త్రమును ధరింతుము స్వామీ! ఇక దైవకైంకర్యమున భోక్తయగు నీతో భోగ్యమగు మేము సంబంధించి యుండి అనందింతుము. ఇదిగదా మాకు నీ సన్నిధిలో లభించు సన్మానము" అని భక్తులు స్వామిని సంబోధించుచున్నారు.

నోము స్నానమునకు బోవు గోపికలు శ్రీకృష్ణుని అర్థించిన విషయమును మిషగాగొని, భక్తులయొక్క అభీష్టములను గూర్చి

ఆండాళ్ యీ పాశురమున వ్యక్తము జేసిన విధము యెంతటి సుబోధకమో గమనింపుడు. తిరుప్పావై యొక్క సారాంశము యీ పాశురమున నున్నది. ఇది చరమ పాశురమన దగియున్నది. తక్కిన మూడు పాశురముల యందు యీ చరమ విషయము బలపరచ బడియున్నది.

**28. ఇరువది యెనిమిదవ పాశురము:**

"పశువులను వెంబడించిపోయి, అడవిని ప్రవేశించి, పశువులను మేపుకొనుచూ, జీవించువారము. జ్ఞానము కొంచెమైనను లేని గొల్లకులమున బుట్టినవారము. కాని యీ యాదవకులము నందు దేవరవారు జన్మించుటచే మేము పుణ్యవంతుల మగుచున్నాము. మాకిదే ఉపాయము. సర్వైశ్వర్య సంపన్నుడవగు ఓ గోవిందా! నీతోటి మాకున్న సంబంధము నీకును, మాకును తొలగ ద్రోసి కొనజూచినను తొలగునది కాదు. తెలివిలేని అమాయక బిడ్డలము ప్రేమమున, అతి పరిచయమున దేవరవారివైన నిన్ను తక్కువగా, చిన్నపేరుతో (కృష్ణా, ఓ కృష్ణా, ఓ అల్లరి కృష్ణా, ఓ మాయలకృష్ణా, ఓ చిలిపి కృష్ణా, ఓ నవనీతచోరా... అని) పిలుచుట మొదలగు వానిని గూర్చికోపింపక, సర్వస్వామియైన వాడవా! మా యిష్ట పురుషార్థమును కృపచేయుము. ఏలో రెంబావాయ్".

**వివరణము:** ఈ తిరుప్పావై ప్రబంధ మొదటి పాశురమున "నారాయణనే నమక్కే పఱైతరువాన్" (సర్వేశ్వరుడగు నారాయణుడే, మనకు గతియైయుండు వాడే, మనకోరికలను యిచ్చునట్టివాడుగా నున్నాడు) అని సంగ్రహముగా చెప్పబడిన ప్రాప్యప్రాపకములను 28, 29 పాశురములచే వివరించుచున్నారు. ఈ పాశురమున, అనగా 28వ పాశురమున చెప్పబడిన విషయమేమి? "లోక సమ్మతమునకై "నోము" అని ఒక నెపముతో నిన్ను సమీపించితిమి. ఓ స్వామీ! మా ఉద్దేశము అదికాదు. నా పాదారవిందముల యందు కైంకర్యమే మా ఉద్దేశము. అట్టి కైంకర్య రూప పురుషార్థము సిద్ధించుటకు కర్మయోగ,

జ్ఞానయోగాది సాధనములు మాయందు లేవు. నీతోటి సంబంధమును ముందుంచుకొని నీవే ఉపాయము కావలయునని విన్నవించు చున్నాము. మమ్ముల క్షమించి, మన్నించి, ప్రాప్యమగు పురుషార్థమును మాకు లభింప జేయుము, స్వామీ," అని గోపికలు ప్రార్థించుచున్నారు.

ఇచ్చట గోపికలు కేవలము భక్తులుగా వ్యవహరించుచున్నారు. కర్మ జ్ఞాన యోగముల కంటే భక్తియోగము శ్రేష్ఠమయినదని వక్కాణించు చున్నారు. అట్టి భక్తియోగము విష్ణుసంశ్లేష భావముననే పరిపక్వత జెందుచున్నదని సూచింపబడినది.

బాల్యమునుండి చనువుతో, ప్రేమతో, పరిచయముతో శ్రీకృష్ణుని సంబోధించు చుండిన గోపికలు రానురాను, శ్రీకృష్ణ మహిమాన్విత చేష్టితముల నెరిగిన వారై, వారిని పురుషోత్తమునిగాను, దైవసమానుని గాను, మహాత్మునిగాను అవతరాపురుషునిగాను గుర్తెరిగిరి.

ఇదే విధమున తన నెచ్చెలి బావమరదియైన శ్రీకృష్ణుని అతిచనువుతో సంబోధించుచుండిన అర్జునుడు, విశ్వరూప సందర్శనము తరువాత, తన లోపము నెరిగిన వాడై యిట్లు పలికెను: గీతా విశ్వరూప ప్రదర్శన యోగము - 41, 42, 43, 44 శ్లోకములు :

41. శ్లో॥ **సఖేతి మత్వాప్రసభ యదుక్తం**
**హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి।**
**అజానతా మహిమానం తవేదం**
**మ యా ప్రమాదా త్ప్రణయేనవాపి॥**

(తాత్పర్యము: నీయీ మహిమను యెరుంగని వాడనగుటచే, పొరపాటున నైననేమి, ప్రణయము చేతనైన నేమి, నీవు నా చెలికాడవని, ఓ కృష్ణా! ఓ యాదవా! ఓ నెచ్చెలీ! అని యిష్టము వచ్చిన విధమున పేర్కొని యుంటిని)

42. శ్లో॥ **యచ్చాపహాసార్థ మస త్కృతో౽సి**
**విహారశయ్యా సన భోజనేషు**

ఏకో౽థవాప్యచ్యుత త్వత్సమక్షం
తత్క్షామ యేత్వామహమప్రమే యమ్॥

(తాత్పర్యము: విహార శయనాసన భోజనాదుల యందొంటరిగా నున్నప్పుడైన నేమి, పెక్కండ్ర యెదుటనైన నేమి, పరిహాసార్థము నాచే సత్కరింప బడక పోవుటను క్షమింప వలసినదిగా అప్రమేయుడవయిన నిన్ను, ఓ కృష్ణా! ప్రార్థించుచున్నాను.)

43. శ్లో॥ పితాసి లోకస్య చరాచరస్య।
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయా।
నత్వత్సమో౽ స్త్యభ్యధికః కుతో౽న్యో
లోకత్రయే ౽ప్యప్రతి మప్రభావ॥

(తాత్పర్యము: ఓ అసాధారణ మహిమాన్వితా! ఈ చరాచర జగత్తునకు నీవు తండ్రివి, మరియు పరమ పూజ్యుడవైన గురుడవు. ముల్లోకముల యందు నీకు సమానుడే లేడన్నపుడు, యిక అధికుడు ఎందుండును?)

44. శ్లో॥ తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయేత్వా మహమీశ మీడ్యమ్
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియా యార్హసిదేవ సోఢుమ్॥

(తాత్పర్యము: నేను నాయీ శరీరము నీపాదముల పైవైచి, జగదీశ్వరుడవును, స్తోత్రార్హుడవును అయిన నిన్ను ప్రసన్నుడవుగా ప్రార్థించుచున్నాడను. ఓ దేవా! కుమారుని తప్పును తండ్రియు, చెలికాని తప్పును మిత్రుడును, ప్రియురాలి తప్పును ప్రియుడును వలె నా తప్పును సహింప నీవే అర్హుడవు.)

ఇదే విధముగా, అనగా గోపికలవలె, అర్జునుని వలె నిజమైన భక్తియు, సంశ్లేషభావము గలట్టియు భక్తుడు దైవమును (Personified God) ఏకవచనమునను, బహువచనమునను అభేదముగా

సంబోధించును. ఓ రామా! ఒరే రామా! రే - హరే - రారా! నను జూడరారా!.... అని పలుకుటలో తప్పేమియు లేదు. గౌరవ భావమునకు భంగము లేదు. పరిచయ, సన్నిహిత ప్రేమభావములనే చూపును.

యాదవకన్యలు యీ భౌతిక సంఘమున వారి పరిస్థితి వారి అమాయకత్వము, వారి అజ్ఞానము, వారి అల్పత్వమును వెల్లడించుటలో నున్న సత్య సౌందర్యములను, విధేయత వినమ్ర భావములను గమనింప నగును. భక్తుడు యెల్లప్పుడు వినయ విధేయతలతో, సానుభూతితో మెలగు చుండునుగదా! అతని భక్తిమార్గము సర్వభూత ప్రియత్వమును అఖిల మానవ సౌభ్రాతృత్వమును సూచించును.

భక్తుడు తన వినయ స్వభావమునను, అహంభావ రాహిత్యము చేతను, తానేమయినను, తెలియక నైనను తప్పుచేయు చున్నానేమో నని మెలకువగా యుండును: శ్రీ వేంకటేశ్వర స్తోత్రమున భక్తుడు కడపట యిట్లనుచున్నాడు:

**శ్లో॥ అజ్ఞానినా మయాదోషా౯**
**అశేషా౯ విహితా౯ హరే।**
**క్షమస్వత్వం క్షమస్వత్వం**
**శేషశైల శిఖామణే॥**

"కులములో నొకండు గుణవంతు డుండిన కులము వెలయువాని గుణముచేత" అన్నట్లు యదుకులమున పెరిగిన శ్రీకృష్ణుడు యదుకుల తిలకుడుగా ప్రణుతి కెక్కుటంజేసి, ఆ వంశమున జన్మించిన తాము పుణ్యవంతులమని గోపికలు పలుకుచున్నారు.

సర్వైశ్వర్య సంపన్నుడగు శ్రీకృష్ణుని రక్షణలో నుండుటంజేసి, శ్రీకృష్ణుని ప్రాపున నుండుటంజేసి, తామును సర్వైశ్వర్య

సంపన్నులమనియు, తమకు యేలాటి కొరతలు లేవనియు గొల్లభామలు తలచుచున్నారు.

"నీతోటి మాకున్న సంబంధము, నీకును మాకును తొలగ్రత్రోసికొన జూచినను తొలగునదికాదు", అనుచున్నారు శ్రీకృష్ణసేవలో నున్న గోపికలు. ఇది భక్తాగ్రేసరులు, ఆళ్వారులు అనుభవించి పలుకు విషయము. తత్త్వత్రయ జ్ఞానమును ప్రతిపాదించు వైష్ణవ విశిష్టాద్వైత సిద్ధాంత రహస్యమంతయు యీ వాక్యరత్నమున యిమిడి యున్నది. ఇందు అర్థపంచక జ్ఞానము తెలుపబడినది. పాంచరాత్రాగమమున గల అర్థపంచక జ్ఞానము, లేక, స్వరూప జ్ఞానము యిదియే. ఈ స్వరూప జ్ఞానమును భక్త శిఖామణులు పై వాక్యమున వెల్లడించినారు.

"నీతోడి మాకున్న సంబంధము నీకును, మాకును తొలగద్రోసికొన జూచినను తొలగునదికాదు". అను యీ వాక్యములోని దివ్యజ్ఞానము భగవద్గీతలోని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగమునందు గీతాచార్యుడు వ్యక్తము జేసియున్నాడు:

శ్లో॥ ఇదంశరీరం కౌన్తేయ।
క్షేత్రమిత్యభిధీయతే।
ఏతద్యోవేత్తితం ప్రాహుః
క్షేద్రజ్ఞ ఇతి తద్విదః॥ (13-2)

(తాత్పర్యము: అర్జునా! ఈ శరీరము క్షేత్రమనబడును. దీని నెవ్వడు తెలిసికొనుచుండునో వానిని తత్త్వవేత్తలు క్షేత్రజ్ఞుడందురు).

శ్లో॥ క్షేత్రజ్ఞం చాపిమాం విద్ధి।
సర్వక్షేత్రేషు భారత।
క్షేత్ర క్షేత్రజ్ఞయో ర్జ్ఞానం
యత్తత్ జ్ఞానం మతం మమ॥ (13-3)

(తాత్పర్యము: సకలక్షేత్రము లందునుగల అ క్షేత్రజ్ఞుడను సైతము నేనే యని గ్రహింపుము. క్షేత్రమునకును క్షేత్రజ్ఞునకును సంబంధించిన జ్ఞానమే జ్ఞానమని నా అభిప్రాయము)

ఈ జ్ఞానమునే 28వ పాశురమున గోపికలు (మహాభక్తులు) వెల్లడించి యున్నారు.

శ్లో॥ యథాప్రకాశయ త్యేకః
కృత్స్నం లోకమిమం రవిః।
క్షేత్రం క్షేత్రీ తథాకృత్స్నం
ప్రకాశయతి భారత॥ (13-34)

(తాత్పర్యము: సూర్యుడొక్కడే యీ లోకమునంతయు నెట్లు ప్రకాశింవ జేయుచున్నాడో, క్షేత్రజ్ఞుడట్లే క్షేత్రమనంబడు శరీరమునంతయును ప్రకాశింప జేయుచున్నాడు)

క్షేత్రజ్ఞుడు సర్వవ్యాప్తమయిన వైష్ణవశక్తి (ఈశ్వరశక్తి) అని గమనించేది. కావున క్షేత్రక్షేత్రజ్ఞ సంబంధము విడివడునది కాదుకదా! ఈ సంబంధము ప్రతి జీవికిని ఈశ్వరశక్తికి ఉండునది. ప్రతిజీవికిని మరియొక్క జీవికిని ఉండునది - ఇదియే తత్వత్రయ జ్ఞానము - విశ్వమంతయు కలిసి అచిత్+ చిత్ + ఈశ్వర అగుచున్నది. ప్రతిప్రాణియు అచిత్ + చిత్ + ఈశ్వర అగుచున్నది. ఈ జ్ఞానమునే గోపికలు (భక్తాగ్రేసరులు) వెల్లడించినారు. అనగా యీ జ్ఞానమును ఆండాళ్ తిరుప్పావై ప్రబంధమున వెల్లడించి నారనుట.

ఈ విధముగా క్షేత్రక్షేత్రజ్ఞులకు గల భేదమును సంబంధమును స్వరూప జ్ఞానముచే భక్తుడు తెలిసికొనును. మరియు, యీ ప్రపంచము యొక్క ప్రకృతి బంధమోక్షమును గూడా జ్ఞానియైన భక్తుడెరుంగును. అట్టి భక్తుని గతి పరమగతి, పరమపదము. ఇదియే మోక్షభావము.

ఈ క్షేత్రక్షేత్రజ్ఞ జ్ఞానమే శేషశేషీ భావము. భగవత్శక్తి సర్వవ్యాపిత మయ్యు, సర్వశేషి. అట్టి సర్వశేషితో భక్తుడు సంబంధ పడియుంటాడు.

ఈ తత్త్వజ్ఞానము గీతా పురుషోత్తమ ప్రాప్తి యోగమున గీతాచార్యునిచే విపులీ కరింపబడినది:

శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే।
క్షర శ్చాక్షర ఏ వచ।

**క్షర స్సర్వాణి భూతాని**
**కూటస్థో௨క్షర ఉచ్యతే॥** (15-16)

(తాత్పర్యము: లోకములో క్షరుడనియు, అక్షరుడనియు చెప్పబడు పురుషులిద్దరు (తత్త్వములు రెండు) గలరు. అందు క్షరుడు (క్షరము) సర్వభూత స్వరూపుడు (సర్వభూత స్వరూపి = అచిత్). అక్షరుడు (అక్షరమ్) సర్వమూలమయిన కూటస్థుడు (కూటస్థమ్)

ఈ కుటస్థుడు (కూటస్థమ్) ప్రాణము, ఆత్మ అని వ్యవహరింప బడుచున్నది.

**శ్లో॥ ఉత్తమః పురుష స్త్వన్యః**
**పరమాత్మే త్యుదా హృతః ।**
**యోలోకత్రయ మావిశ్య**
**బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥** (15-17)

(తాత్పర్యము: పై చెప్పబడిన పురుషులిద్దరు (తత్త్వములు రెండు, చిత్, అచిత్) గాక మరియొక పురుషుడు (శక్తి) ఉన్నాడు. ఇది పరమాత్మ (ఈశ్వర) అనబడును. ఈ యీశ్వరశక్తి సర్వవ్యాపితమై ఆరెంటిని భరించు చున్నది). (ఈశ్వరశక్తి చిత్, అచిత్ రెంటియందును సమముగా వ్యాపించి యున్నది. కావున ఈశ్వరశక్తి అద్వైతవము. కాని తత్త్వత్రయములో ప్రతియొక్క దానికిని దాని విశిష్టత యున్నందున యీ అద్వైతతత్త్వము విశిష్టాద్వైత తత్త్వముగా తెలిసికొన బడినది).

**శ్లో॥ యస్మాత్క్ష ర మతీ తో௨హ**
**మక్షరరాదపి చోత్తమః**
**అతో௨ స్మిలోకే వేదేచ**
**ప్రథితః పురుషోత్తమః॥** (15-18)

(తాత్పర్యము: నేను క్షరమునతిక్రమించిన వాడనై (అచిత్) అక్షరమున కంటే (చిత్తు) ఉత్తముడనై యున్నందు వలన, నేను పురుషోత్తముడనని ప్రఖ్యాతి జెందితిని. (పురుషోత్తమమ్ = సర్వశక్తులలో శ్రేష్ఠమయినది).

గోపికలు (భక్తులు) శ్రీకృష్ణుని పురుషోత్తమునిగా భావించి వానితో సంశ్లేషించిరి.

**శ్లో॥ యోమామేవ మసమ్మూఢో**
**జానాతి పురుషోత్తమమ్।**
**ససర్వ విద్భజతి మాం**
**సర్వభావేన భారత॥** **(15-19)**

(**తాత్పర్యము:** ఎవ్వడైతే యీ విధముగా నన్ను పురుషోత్తమునిగా తెలిసికొనుచున్నాడో ఆ సర్వజ్ఞుడయిన చేతనుడు (భక్తుడు) నన్ను సర్వాత్మకునిగా భజించుచున్నాడు).

భగవచ్ఛక్తి సర్వాత్మకమయినపుడు, జీవాత్మకును పరమాత్మకును విడివడుట అనునదేమున్నది? ఈ పరమజ్ఞానమును ఆండాళ్ మిక్కిలి సులువైన శైలిలో ఇట్లన్నారు - "నీతోటి మాకున్న సంబంధము, నీకును మాకును తొలగ ద్రోసికొన జూచినను తొలగునది కాదు" అని.

ఆత్మకు (ప్రాణమునకు) శరీరము ఆధారమయినటుల, ఈశ్వరశక్తికి శరీరము, ఆత్మలు ఆధారములై యున్నవి. ఇది విశిష్టాద్వైత సిద్ధాంతము చూపు తత్త్వత్రయజ్ఞానము. ఈ సంబంధమున ప్రాణియయిన చేతనునికి ఈశ్వరశక్తికి విడివడుట అనునదేమున్నది? ఇట్టి సంబంధమును గలిగియు, సామాన్య మానవుడు ఈ జ్ఞానమును కలిగి యుండుట లేదు. జ్ఞానియయిన భక్తుడు ఈ జ్ఞానమును గలిగినవాడై, యెరుకతో ఈశ్వరశక్తితో సంశ్లేషించి జీవించుచున్నాడు. తాను ఈశ్వరశక్తికి వేరైనవాడను కాదనియు, ఈశ్వరశక్తి తనకు వేరైనది కాదనియు తెలిసికొన్నవాడై ఈశ్వరశక్తితో (పురుషోత్తమునితో)సంశ్లేషించి జీవించును, భక్తుడయినవాడు. ఎంతటి సత్యముగా, రమణీయముగా, భోగ్యముగా నున్నది. యీ తత్త్వత్రయ జ్ఞానము! ఈ జ్ఞానమున మానవుడు తన ఔన్నత్యమును, కనుగొనును లేక గుర్తించుకొనును. తోటిమానవుని ఔన్నత్యమును లేక విలువను గమనింపగలడు. అట్టి

తరి మానవుడు సర్వభూత ప్రియుడై విశ్వమానవ సౌభ్రాత్రమున మనగలడు. మానవునకు ఈజ్ఞానవాసన లేశమయినను ఉన్నయెడల, ఈనాటి ప్రపంచమున, సంఘమున ఉన్న వర్గభేదములు, కులభేదములు, అస్పృశ్యత మున్నగు దురాచారములు కఠినత్వము, సానుభూతి రాహిత్యము ఇత్యాది తత్త్వములు ఇంత ఘోరముగా నుండునా? మానవుల యందు సమభావమును, సోదర భావమును పెంపొందించుటకే, అప్పటి అస్పృశ్యత మున్నగు దురాచారముల నంతరింప జేయుటకే శ్రీరామానుజాచార్యులు తన విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారమున శాస్త్రీయమైనట్టియు, సత్యమైనట్టియు తత్త్వత్రయ జ్ఞానమును ప్రతిపాదించి యున్నారు.

భగవద్గీతలోని యీ శ్లోకార్థములను గూడ గమనింపుడు:

శ్లో॥ మత్తః పరతరం నాన్య
త్కించి దస్తి ధనంజయ।
మయి సర్వమిదం ప్రోతం
సూత్రే మణిగణా ఇవ॥ (7-7)

(తాత్పర్యము: నాకంటే (ఈశ్వరశక్తి కంటే, పురుషోత్తమము కంటే) అతీతమయినది యేదియులేదు. దారమునందు మణిగణము వలె నాయందీ జగత్తంతయు గూర్పబడి యున్నది.

ఈ జ్ఞానము గలవాడు సర్వమానవ సౌభ్రాత్రమున మెలగును. ఈ జ్ఞానములేని పశుతుల్యుడు తోడి మానవులను నీచముగా చూచును, తాను కులమున, ధనమున, అధికారమున ఉన్నతుడనను అజ్ఞానము వలన.

శ్లో॥ చతుర్విధా భజన్తే మాం
జనాస్సుకృతి నోఽర్జున।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ
జ్ఞానీ చ భరతర్షభ॥ (7-16)

(తాత్పర్యము: అర్తుడును (కష్టములందున్నవాడు), జిజ్ఞాసువును, (తెలిసికొనవలయుననెడి కుతూహలముగలవాడు), అర్థార్థియయిన వాడును (సంపదలను కోరువాడును), జ్ఞానియయిన వాడును నిజమైన తత్త్వజ్ఞానముతో శోభిల్లు భక్తుడు - ఈ నాల్గుతెగల మానవులు నన్ను (సర్వాంతర్యామి యగు ఈశ్వరశక్తిని, పురుషోత్తముని) భజింతురు.

ఇందు కడపటి వారు, అనగా తత్త్రయ జ్ఞానశోభితులగు భక్తులు శ్రేష్ఠులు - ఈ తెగకు సంబంధించినవారు నోమునోచు గోపికలు, వారి నాయకురాలు ఆండాళ్.

ఈ పాశురములోని "నీతోటి మాకున్న సంబంధము, నీకును మాకును తొలగ త్రోసికొన జూచినను, తొలగునది కాదు" అను వాక్యము ఎంత సారవంతమయినదో, యెంతటి అణుశక్తిని మించిన శక్తియుత మయినదో గమనింపుడు! ఈ తత్త్వత్రయ జ్ఞానసత్యమే "అష్టాక్షరి" యనబడు "తిరుమంత్రము"న ఇమిడి యున్నది. ఒకనాడొక శ్రీవైష్ణవుడు శ్రీరామానుజాచార్యులవారిని సమీపించి యిట్లు ప్రశ్నించినాడు: "స్వామీ! నీవు మానవ సమత్వమును బోధించుచున్నావే, యిది నీవలన అగునా? ఈ దేశములోని యీ కులతత్వము, ఈ అస్పృశ్యతా దురాచారము, ఈ అగ్రవర్ణదురహంకారములనెడు చీడపుర్వులకు మందున్నదా? ఈ అస్పృశ్యతా దురాచార వృక్షమును నరకుటకు నీకున్న ఆయుధమేమి? నీ ప్రయత్నము సఫలమగునని నీకైనను విశ్వాసమున్నదా?" అని.

శ్రీరామానుజుడు వెంటనే యీ ప్రత్యుత్తరమును ధీరమనస్సుతో, మందహాస వదనార విందముతో పల్కెను:-

"నా ఆయుధము తిరుమంత్రము! ఈ ఆయుధముతో అస్పృశ్యతా విషవృక్షమును ఛేదించగలను! సందియయములేదు!" అన్నాడు దయాసింధువు రామానుజుడు.

ఇది నిజముగా సత్యమే - మానవులు మూఢులుగా నున్నంత వరకు ఈ దురాచారము మనగలదు - తత్త్వత్రయ జ్ఞానజ్యోతుల

వలన ఏనాడైనను మానవులు విజ్ఞానవంతులు కాకుందురా! దురాచారముల నంతరింప జేయుటకు సాధనము విద్యయే కదా! నిజమైన విద్యయే కదా! ఆ విద్య తిరుమంత్రమున గుప్తము గానున్నది. హేతువాదముననే దురాచారముల శాశ్వతముగా అంతరింప జేయగలము, భయమున, చట్టమున శాశ్వతముగా అంతరింప జేయజాలము, తాత్కాలిక ఫలితమే వీనివలన, నిజమైన జ్ఞానమే దురాచార అంధకారముల పారదోలగలదు. ఆ నిజమైన జ్ఞానము తిరుమంత్రమందున్న దని శ్రీరామానుజుడు తెల్పెను. వంశపారం పర్యముగా గురు పీఠము పరిమితమై యున్న తిరుమంత్రమును రామానుజుడు బహిరంగముగా అని జాతులవారికి చాటినాడు, కాని కారక్రమమున ఈ తిరుమంత్రమును అచార్యులను బడువారు, దక్షిణలను గొని, వారి శిష్యులకు చెవులలో ఊదుచున్నారు! చచ్చిన మానవుని కళేబరపు చెవియందు ఊదుచున్నారు! ఈ అంధకార శక్తులు పోవాలి. నిజమైన జ్ఞానము చదువరులకు చేతనులకు అందాలి - ఆండాళ్ మంగళాశాసనమున! శ్రీరామానుజుని ఆశీర్వచనమున!

ఈ సందర్భమున, ఈ పాశుర భావమును చదివిన పాఠకులు ఆండాళ్ గారికి జేజేలు పలుకుదురుగాక!

గోపికలు (భక్తులు) "మాయిష్ట పురుషార్థమును కృపజేయము" అని శ్రీకృష్ణుని ప్రార్థించుచున్నారు. వారి యిష్టపురుషార్థం బెయ్యది? దైవకైంకర్యమని తరువాతి (29 వ) పాశురమున చెప్పబడును.

ఈ పాశుర భావమును బట్టి గోపకన్యల యొక్క (భక్తుల యొక్క) దైవకృప కొరకైన ఆలోచన క్రమమును పరిశీలించెదము గాక.

"జ్ఞానహీనులైన సంసారుల ననుసరించి, సంసార జీవితమునే ప్రాప్యముగా చేకొని, దేహపోషణమునే కాలక్షేపముగా నుంచుకొని యుంటిమి. నిన్ను పొందుటకు మేము చేసిన కర్మానుష్ఠాన మిదియే. అంతకంటె మించినది మాకు వలను పడలేదు గదా! జ్ఞానమును,

జ్ఞాన విశేషమయిన భక్తిని పొందిన వారముకాము. కాని, యితర అపమార్గము లను, ఉపాయములను పాటించిన వారము గాము. దోషమెరుంగని కులమున బుట్టిన వారము మేము''. (శ్రీరామానుజాచార్యుల వారు కూడా పతితులయిన అస్పృశ్యులనబడు అంత్యకులజులను బడు వారి విషయములో కూడా యీ విధముగా ఆలోచించినారు. "వారు అమాయకులు, కష్టజీవులు. అగ్రకులముల వారు చెప్పుకొను విద్యాగొప్పలు వారికి లేకున్నను, అపరాధము లెరుగని జాతియందు పుట్టిన వారు. కష్టములను, అగౌరవమును ఓపికతో తరతరాలుగా భరించుచు వచ్చినవారు. వారు నిజముగా ఉన్నత కులజులు" అని అన్నారు. "వారు దైవ సాన్నిధ్యమునకు అర్హులు").

"జన్మమున తక్కువ కులమున పుట్టినను మేము పురుషార్థమును పొందవలసినదే. దానిని వదలము. పుణ్యములేని వారికి పురుషార్థము లభింపదని అందువేమో? మాకు పుణ్యమునకు కొరతయే మున్నది? ఏ విషయమందును కొరతలేని దేవర వారుండగా మాకిక యే కొరతలును లేవు. (పురుషోత్తముడన బడువాడు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు) మానవ సంఘములోని వాడే కావున, యే మానవుడును తాను తక్కువ వాడని భావింప నవసరమేమున్నది? కుల, వర్గ విభేదములు లేక మానవులు సమానముగా భావింప బడవలసినదే అను భావమున శ్రీరామానుజుడు తిరుమంత్రమును సర్వులకు బహిర్గతము చేసినాడు).

"సర్వైశ్వర్య సంపన్నుడు దేవరవారుండగా మాకు యే కొరత లేదనుచున్నారే, ఉన్నవారు లేనివారి కొరతలను తీర్చవలయు ననెడి నిర్బంధ మున్నదా అని అడిగెద వేమో! స్వామీ! మా కులమందవతరించిన అశరణ్య శరణ్యుడ వగు నిన్నే రక్షణగా మేము శరణుజొచ్చితిమి గాన మాకుగల మీ తోటి సంబంధ మే నిర్బంధము అని మనవి చేసి కొనుచున్నాము. (ఉన్నవారికి లేనివారి యెడ, జ్ఞానులకు, అజ్ఞానుల యెడ గురువులకు శిష్యులయెడ, ఉన్నతులకు

పతితుల యెడ యీ నిర్బంధమున్నది. మొదటి తరగతివారు రెండవ తరగతి ఉద్ధరణకు కృషి చేయవలయును. ఈ సూత్రము పాటింప బడియుండె నేని సంఘమున యిన్ని దురాచారములు ఉండనేరవు. మతము యొక్క నైతిక విలువలు అడుగంటుటచే మతము యొక్క ప్రాముఖ్యత తగ్గుచున్నది.)

"ఏదేని ఒకకారణమును బట్టి వచ్చినది గాదు నీతోటి మాకున్న సంబంధము. ఇది స్వరూప జ్ఞానమును బట్టి వచ్చినది. జీవాత్మ పరమాత్మలకు గల స్వరూప సంబంధ జ్ఞానము గలవారు నీతోటి సంబంధము నెట్లు మరువగలరు? (స్వరూప జ్ఞానమున్న మానవులు యితరులను సోదరుల వలె జూచెదరుగాని, నీచముగా చూడరు! అట్టి సమభావము లేనివాడు స్వరూప జ్ఞానములేని వాడే, యెన్ని బిరుదములను తగిల్చుకొన్నను.)

"పురుషార్థమును పొందుటకు భగవద్విషయము నందు ద్వేషభావము లేకుండుట యే సాధనము. భగవద్విషయమందు భక్తి గలవాడు, అనగా, సర్వులను సమభావముగా చూచువాడు పురుషార్థ మును పొందును. (పురుషార్థమనగా మోక్ష భావము).

భగవత్కైంకర్యమే పురుషార్థ మన్నపుడు, భగవత్కైంకర్యమన్నపుడు స్వరూప జ్ఞానముతో పరోపకారార్థ జీవితమును గడపుట యగును. దైవకైంకర్యమని దేవాలయముననో, గృహముననో ఆహార నైవేద్యముల నుంచి నపుడు, వానికి భోక్తలు యితరులే గదా! కైంకర్యకర్త భోక్తకాడు గదా! కావుననే దేవాలయమున, దైవకైంకర్యమునకు, వండిన అన్నమునే, వినియోగించి, అట్టి ఆహారమును యెల్లరు అనగా అర్చకులు ఆచార్యులు మొదలు భక్తులు, అతిథులు అందరు పుచ్చుకొనవలయునని శ్రీ రామానుజుడు బోధించియున్నారు. దైవకైంకర్య జీవితమనగా పరోపకార జీవితమే అగును. పరోపకారియైన వాడు స్వార్థరహితుడుగా నుండును. అట్టివాడు మోక్షభావమున

నుండును. గోపికలు (భక్తులు) సూచించిన దైవకైంకర్యమనునది యిదియే. దీనిని తిరువారాధన అంటారు. తత్త్వత్రయ జ్ఞానమును గూర్చి ధ్యానించుటయే తిరువాధ్యానమగును.

**29. ఇరువది తొమ్మిదవ పాశురము:**

"మిక్కిలి ప్రాతఃకాలమందు అందరమును వచ్చి, దేవర వారిని సేవించి, నీయొక్క సేవ్యమగు పాదారవిందములకు మంగళా శాసనము చేయుటయందు మా అభిప్రాయమును విన్నవించు చున్నారము. వినుడు. పశువులను మేపి జీవించు వంశమునందు అవతరించిన నీవు అంతరంగ కైంకర్యములను మానుండి అంగీకరింపక పోకూడదు! నేడు ఒక ప్రయోజనమును గొనిపోవుటకు మాత్రము వచ్చిన వారము కాము. అవివేకమునకు తార్కాణముగా వ్యవహరింపబడు గొల్లకులమున పెరిగితివే గాని, స్వామీ! నీవు మా మనోభావముల తెలిసికొన లేకపోదువా? లీలా మానుష విగ్రహా! గోవిందుడైన వాడా! సర్వకాలములందును ఏడేడు జన్మములకును దేవరవారితో శేషభూతులమై యుండ గలవారము. దేవరవారికే మేము దాస్యము చేయగలవారము. మాకు యిక యితర మయిన అభీష్టములు లేకుండా పోవుగాక! ఏలో రెంబావాయ్".

వివరణము: ఉపాయ స్వరూపము జెప్పి, తమకు ఉద్దేశ్యమయినది కైంకర్యమని అండాళమ్మ ప్రబంధ తాత్పర్యమును చెప్పి నిగమించు చున్నారు. ప్రాప్యమును, ప్రాప్యరుచిని వర్ణించి, దానిని వాడే యిప్పించ వలసిన దనియును, ప్రాప్యవిషయమున తమకున్న త్వరను యీ పాశురమున తెలియ జేయుచున్నారు. ఈ ప్రబంధమున ముందుగా చరమ దశయగు అర్థమును అనుభవించి, అది స్థిరముగా నుండ గలందులకును, దానిని కాచియుండి వృద్ధిపొందించుటకును, ప్రాప్యమును చెప్పి ప్రబంధకర్త (అండాళ్) పరినమాప్తము చేయుచున్నారు.

ఇచ్చట గొల్లభామలు పామరులగు చేతనులకు సాంకేతికము. శ్రీకృష్ణుడు సర్వాంతర్యామియగు వైష్ణవ శక్తికి సాంకేతికము.

భక్తుడయిన చేతనుడు స్వామి పాదములకు మంగళా శాసనము పలికి, స్వామినుండి (తన సంశ్లేషభావమున) మంగళా శాసనమును పొంది, అంతరంగ కైంకర్యమును తన జీవితమంతయు స్వామికి దాసుడుగా నుండ వలయునని నిర్ణయించు కొనుటయే గాక తన వారసులు, తన వంశీయులు, భవిష్యత్కాలమున యేడేడు జన్మల వరకు, యింకను అనేక అసంఖ్యాక తరముల వరకును ఆచంద్రార్క తారార్కముగా స్వామికి దాసులుగా నుండవలయునని కోరుచున్నాడు. ఎట్టి దివ్యమయిన కాంక్ష! (మానవజాతి యెల్లప్పుడును, రాబోవు సర్వకారముల యందునూ, సేవా భావమున మెలగి ప్రపంచమును శాంతియుతము, ఆనందయుతము చేయవలయు ననెడిది భక్తుని యొక్క కోరిక).

శ్రీమద్రామానుజాచార్యుల వారు శరణాగతి గద్యమును సమాప్తి చేయుచూ, తన మతమును గూర్చి పలికినదిదియే:

**"అంత్యకాలే స్మృతిర్యాతు తవకైంకర్యకారికా**
**తామేనాం భగవన్నద్య క్రియమాణాం కురుష్వమే॥**

(స్వామీ! నీకార్యమును నన్ను యిప్పుడే చేయనిమ్ము. అదినాకు అంత్యకాలములో గూడా జ్ఞప్తియందుండు గాక).

దైవకైంకర్యమనగా నేమో యింతకు పూర్వమే నిర్వచింపబడినది. ఇది సత్కార్యము, పరోపకారార్థ కార్యము అవుతుంది.

"దైవకైంకర్య భావము నామనస్సున యెల్లప్పుడు నెలకొని యుండుగాక" అను ఆండాళ్ గారి వాక్యము యీ క్రింది సూక్తులను మన మనస్సునకు దెచ్చుచున్నది:

1. శ్రీరామానుజ మత వాక్యము, పైననే, బేర్కొబడినది గదా.
2. కుర్యాద్విద్వాం స్తథాసక్త, శ్చికీర్షుర్లోకస గ్రహం.
   (గీత: 3-25 ఉత్తరబాగము)
3. ధీమహి ధియోయోనః ప్రచోదయాత్
   (గాయత్రీమంత్ర ఉత్తర భాగము)

4. Lead me not into temptation. నన్ను వ్యసనములలో పడనీయకుము (Christian Daily prayer - a line from it)

5. Show me the straight path - నాకు ఋజు మార్గమును జూపుము (the main line from Namaz, Daily prayer of the Mahammadens) etc.,

ఇందు సూచింపబడిన భక్తుల యొక్క ఆలోచనా క్రమమును గమనింపదగి యున్నది:

"మిగుల సాత్త్విక కాలమగు ప్రాతఃకాలమందు దేవరవారిని యెడబాసి, సహింపలేక, వచ్చి, దేవరవారిని సేవించి, దేవరవారి తిరువడి గళకు (దివ్య పాదయుగళి) మంగళా శాసనము చేయుట యందు ప్రయోజనమును వినుడు, స్వామీ! జ్ఞానవంతులు కారుణ్యమును ప్రధానముగా గలవారై, యితరుల యొక్క కష్టములను చూచి, సహింపలేక, యితరులు ఉజ్జీవించునట్లు మనోవాక్కాయముల సేవజేయుదురు. దైవకైంకర్యము కొరకు ప్రార్థించుట చేతను, కైంకర్యము కూడా మంగళా శాసనమగుటచేత, మంగళాశాసనమునకు ఫలముగా నీవు యిప్పించ వలసినదియు, మేము పుచ్చుకొనవలసి నదియు మంగళా శాసనమే అగును. రజస్తమోగుణములచే కలత నొంది మేము ఒక వేళ దేహసంబంధమును బట్టి వచ్చిన దృష్టఫలములను మాయొక్క కోరిక చేతను, హితపరుడవగు నీవు వినుటకును, యిచ్చుటకును కర్తగా నుండవలసినది లేదు".

చేతనుడు తత్త్వత్రాయ జ్ఞానసంపదతో, శరణాగతి భావమున, వైష్ణవ సంశ్లేష భావమున పరమానంద భరితుడై దైవకైంకర్యమను పరోపకారార్థ కార్యక్రమమున జీవితమును గడపవలసి యున్నది. ఈ సందర్భమున పరోపకారార్థమై దేవాలయసేవ చేయవచ్చును. దేవాలయములు ప్రార్థనా లయములు మున్నగువానిని అర్థయుక్తముగా నిర్మింప వచ్చును, వాని నిర్మాణమునకు యే విధముననైనను సహకరింపవచ్చును, వాని సక్రమ నిర్వహణకు విరాళములు విరివిగా నివ్వవచ్చును. కాని తాను దైవమునకు

విరాళములు, బహుమానములు, ముడుపులు మున్నగు వానిని చెల్లించుచున్నాననెడి భావమును, నాకు దానినిమ్ము, దీనినిమ్ము అని భగవత్శక్తిని అర్థించుటయును, యెంతటి వ్యర్థములో అజ్ఞాన యుతములో గమనింప దగియున్నవి. చేతనుడు గావించుచున్న యీ వ్యాపారసరళి - తత్త్వజ్ఞానమునకు, ఆధ్యాత్మ జ్ఞానమునకు యెంత దూరముగా నున్నదో, యెంత విరుద్ధముగా నున్నదో, యెంతటి అసత్యమార్గమున నున్నదో, యెంతటి మూఢనమ్మకమో గమనింప తగి యున్నది.

ఆకాశమున ప్రకాశించుచూ! మనలను ఉత్తేజపరచు తారాగణములో సూర్యచంద్రుల వంటివి తిరుప్పావైలోని పాశురములలో యీ 28, 29 (రెండు) పాశురములు, నవరత్నములలో వజ్రములవంటివి, పుష్పములలో పారిజాతముల వంటివి.

**30. ముప్పదియవ పాశురము:**

"ఓడలతో గూడిన సముద్రమును మధనము జేసిన విష్ణువును, కేసిని సంహరించిన స్వామియును, అయిన శ్రీకృష్ణుని, చంద్రముఖు లయినట్టియు, విలక్షణా భరణ శోభితు లయినట్టియు గోపికలు సమీపించి, స్తోత్రము జేసి, వారి నోమునకు కావలసిన ఉపకరణములను (పురుషార్థములను) పొందిన కథా ప్రకారము ముప్పది పాశురములు గల తిరుప్పావై ప్రబంధమై అలరారు చున్నయది. ఇయ్యది పుడమికి అలంకారమయిన శ్రీవిల్లిపుత్తూరు నివాసియు, శ్రమహరమగు తామరపుష్ప, తులసీదళ హారములను అనుదినము కట్టి స్వామికి సమర్పించునట్టి వాడును అయిన బ్రాహ్మణోత్తముడు, ద్విజకుల తిలకుడు, విష్ణుచిత్త నామాంకితుడగు పెరియాళ్వార్ల పుత్రికయగు ఆండాళ్ చేత (గోదాదేవి చేత) రమణీయముగా రచింపబడిన ముప్పది పాశురయుత ప్రబంధ రత్నము. ఇయ్యది ద్రావిడ భక్త, పండిత, విద్వాంసులచే ప్రశంసింప బడినట్టియు, తిరువాయిప్పాడి యందలి (శ్రీ విల్లి పుత్తూరు నందలి) గోపికలు పరవశమున గుంపులు గుంపులుగా గూడి బృందగానముగా పఠింప బడినట్టియు, భక్తి ప్రబంధ

రాజము. ఈ త్రిదశ ద్రావిడ పాశుర పుష్పమాలను స్వీకరించి, యిందున్న పాశురముల నన్నింటిని, ఒక్కదానిని కూడా వదలక, యీ జీవితకాలమున లేక యీ సంసార కాలమున, సంపూర్ణ తాత్పర్యమును గ్రహించుచూ పఠించిన వారు, చాతుర్పర్వత భుజబలుడును, కంజాక్షుడును, శ్రీముఖుడును, ఉభయ విభూతి నాయకుడును, అయినట్టి శ్రీయః పతియొక్క ఇహపరములగు ఉభయ విభూతులందు అద్వితీయ పరమకృపకు పాత్రులై, పరమానందమును పొందుదురు. "ఏలో రెంబావాయ్".

వివరణము: "తిరుప్పావై" ప్రబంధ పరిసమాప్తమును, పరిపూర్ణతను పఠనా ఫలితమును యీ కడపటి పాశురము నిర్మలముగా సూచించు చున్నది.

భగవత్శక్తిని, అనగా సర్వంతర్యామియగు వైష్ణవశక్తిని, ఆది విష్ణుమూర్తి నుండి, శ్రీకృష్ణమూర్తి వరకు యీ పాశురము సూచించు చున్నది. శ్రీకృష్ణావతారమునకు ముందున్న భగవదవతారముల నన్నిటిని సూచించునట్లయినది.

ఓడలకు చలనము కలుగకుండునట్లు, పాలసముద్రమును చిలికి, శ్రీమహాలక్ష్మిని లభింపజేసినాడు శ్రీమహావిష్ణువు. అదే విధముగా వైష్ణవభక్తి వైష్ణవ సంశ్లేష భావములు గలిగియున్న చేతనుడు, తాను యేలాంటి శరీర కష్టములనుగాని, మనోక్లేశములను గాని యెరుగక, ఆత్మజ్ఞానమును ఆత్మానందమును అయిన సంపదను పొందును.

చంద్రముఖులును, విలక్షణాభరణ శోభితులును అయిన గోపికలు, జ్ఞానశోభితులును సకల సద్గుణయుతులును అగు వైష్ణవభక్తులను సూచించును. (వైష్ణవభక్తు లన్నపుడు వీరు ఒక తెగవారని భావింపరాదు. వైష్ణవభక్తుడనగా భగవత్శక్తి సర్వవ్యాపితమయి నట్టిదని నమ్మువాడు. అనగా తత్త్వత్రయ జ్ఞానము నెరిగినవాడు. వైష్ణవభక్తు డనబడు వానికి భాష, మత, జాతి, లింగయిత్యాది విచక్షణలు అన్వయింపవు. అతడు విశ్వపౌరుడు). నిజమైన భక్తుడు దైవశక్తిని గ్రహించిన వాడై, దానిని గూర్చి ధ్యానించినవాడై పురుషార్థమును

పొందును. పురుషార్థ మనగా మోక్ష భావము. సామాన్యముగా కొలది భక్తిమార్గమును అవలంభించిన వాడు దేవాలయమునకు పోవుట, దైవమును స్తోత్రము చేయుట, తన ఈప్సితార్థరమును మనమున వెల్లడించుకొనుట మున్నగు మార్గముల పాటించు వాడగును. ఇది సంఘమున కనబడు విషయము. ఇట్టి సామాన్య ఆచారయుక్తుడగు భక్తుడు నిజమైన భక్తాగ్రేసరుడయి మోక్ష భావమును పొందవలయు ననియే గీతాచార్యుడు, విశిష్టాద్వైత సిద్ధాంతా చార్యుడు తెలిపియున్నారు.

"తిరుప్పావై" అను ముప్పది పాశురముల తమిళ (ద్రావిడ) ప్రబంధమునకు తన కర్తృత్వమును తెలియజేయు సందర్భమున, తన జన్మస్థానము, తన తండ్రి మున్నగు వారిని వర్ణించిన విధము యెంత మనోహరముగా, విషయ భూయిష్టముగా నున్నదో పాఠకులు గమనింతురు గాక.

"తిరుప్పావై" గ్రంథము లాక్షణిక సారస్వత ఖండముగాను, భక్తిరస రచనముగాను, శృంగార సంగీత సంకీర్తనల పుంజముగాను, బృందగాన నాట్యప్రేరేపిత ప్రోత్సాహకము గాను ఉండునట్టిదని, రచయిత అండాళ్ గారే పల్కుచున్నారు.

ఈ ప్రబంధ పఠనా విధానమును సూచించు సందర్భమున, ప్రబంధమును సంపూర్ణముగా ఏ యొక్క పంక్తినికూడా వదలక, అర్థయుక్తముగా పఠింపవలయునని అండాళ్ శలవిచ్చుచున్నారు. ఇది చాలా ముఖ్యమును, విశిష్టమును యై యున్నది. కొన్ని ప్రబంధ పఠనా ఫలితమును పేర్కొనుచూ, గ్రంథకర్తగాని పీఠికకర్తగాని, అర్థరహితముగా నైననుసరే ఒక అధ్యాయమును చదివినను, ఒక శ్లోకమును పఠించినను, ఒకపాదమును పలికినను యీయీ ఫలితములు చేకూరునని, హాస్యాస్పదముగా తమ పీఠికలయందు బేర్కొని యున్నారు. భగవద్గీత పీఠికయందును యీ విధమున ఫలితము సూచింపబడినది, యిక యితర గ్రంథముల గూర్చి చెప్పనేల? సామాన్యముగా సంస్కృత భక్తి రచనల యందెల్లను యీవిధముగా

ఫలితార్థము తెల్పబడినది. ఇది మూఢులను, మూఢవిశ్వాసులను యెంతటి కుమార్గములకు త్రిప్పనోకదా! ఈ దురాచార విధమును మొదట నిరసించినవారు వైష్ణవ భక్తులయిన ఆళ్వార్లుగానే కన్పట్టు చున్నారు. ఆళ్వార్ల ద్రావిడ భక్తి ప్రబంధముల యందెల్లను కడపటిగా చెప్పబడిన పఠనాఫలితము యిట్లు చెప్పబడినది - "ఈ ప్రబంధమును అర్థయుక్తముగా చదివి, విషయమును మనమునకు దెచ్చుకొని, తదనుగుణముగా సజ్జనభక్తి జీవితమును గడుపువాడు పరమానంద భరితుడై, మోక్ష భావమున నుండును" అని. ఇదే విధమున ఆండాళ్ తన "తిరుప్పావై" ప్రబంధ పఠనా ఫలితమును తెలియజేసినారు.

ఈ విధముగా "తిరుప్పావై" ప్రబంధము దివ్యవిషయమును తెల్పుటయేగాక, ఆ దివ్యవిషయమును అవగాహనకు దెచ్చుకొని, తదనుగుణముగా జీవితమును మలుపుకొమ్మని పాఠకులకు సూచించుచూ వారికి మంగళాశాసనము చేయు చున్నారు ఆండాళ్ గారు.

తిరుప్పావై ప్రబంధ తాత్పర్య విషయము యీ క్రింది అంశముల గలిగి యున్నది: ప్రపన్న నిష్ఠాక్రమము, సర్వేశ్వరుడు సర్వసులభుడను విషయము, పురుషోత్తముడగు శ్రీకృష్ణుడు పరమేశ్వరుడను విషయము, శ్రీకృష్ణ సంశ్లేషభావము, భగవద్విషయమున ప్రయత్నపడు వారెల్లరు యేలాటి తారతమ్యము లేక సమాన సోదర భావము నందుండ వలసిన విషయమును, ఆచార్యుల యొక్క బాధ్యతలు, ఆళ్వారులు చేతనులపై జూపిన కారుణ్యము, తిరుమంత్రార్థ విషయము, ప్రణవ విషయము, ద్వయమంత్ర విషయము, చరమశ్లోక విషయము, శరణాగతి స్వార్థరాహిత్య సేవాభావములు, శేషశేషీ భావము, క్షేత్ర క్షేత్రజ్ఞ భావము, ప్రమేయ ప్రమాణ ప్రమాతలనంబడు సత్యత్రయజ్ఞానము, ఉభయవిభూతులు, అర్థపంచక జ్ఞానము, స్వరూపజ్ఞానము, ప్రాప్యప్రాపకములు, మోక్షభావము మున్నగు పవిత్ర విషయములు.

ఈ ప్రబంధము నందలి మొదటి అయిదు పాశురముల ద్వారా, ఆండాళమ్మగారు, ప్రపన్న నిష్ఠాక్రమమును, భగవత్ ప్రాప్య సౌలభ్యమును, కృష్ణావతార సారాంశమును, కృపతో తెల్పుచున్నారు.

తరువాతి పదిపాశురముల ద్వారా, ఆళ్వార్ల జ్ఞానానుసారమైన వివిధా చార్య భక్తజన సోదరభావమును, సేవాభావమును, వైష్ణవ సంశ్లేషా నందమును తెలుపబడినవి. వివిధాళ్వార్ల జ్ఞాన సంపద యీ ప్రబంధమున యిమిడి యున్నదని భక్తుల భావము.

ఈ విధముగా భక్తులయి నట్టియు, ముక్తులయి నట్టియు, ఆళ్వారాదులను, (ఇచ్చట ఆళ్వారాదులనుటలో ఆండాళ్‌కు ముందు వెలసిన తొమ్మిది మంది ఆళ్వారులు, ప్రహ్లాదుడు విభీషణుడు భీష్ముడను పురాణాళ్వార్ల త్రయము అగుచున్నది. కాలమానము ననుసరించి ద్వాదశాళ్వార్లలో ఆండాళ్ గారు పదియవవారు. వీరి తరువాతి ఆళ్వార్ల ద్వయము మధురకవి ఆళ్వారు, నమ్మాళ్వారు) నిత్యకైంకర్యమునం దాసక్తి గల నిత్యులను, నిత్యానపాయినియగు శ్రీమహాలక్ష్మిని చేకూర్చుకొని, వీరినందరిని ముందుంచుకొని, నిత్యముక్తాను భావ్యుడగు సర్వేశ్వరుని ఆశ్రయించు ప్రకారము వివరింపబడినది.

ఈ విధముగా, గురుపరంపరా పూర్వకమగు ద్వయమంత్రము నందు ప్రతిపాదింపబడినట్లు, తిరుప్పావై ప్రబంధమున ఆండాళ్ ఆనతిచ్చి యున్నారు. ఇందు ప్రపత్తి, విష్ణునంశ్లేషభావము, తిరువధ్యానము, తిరువారాధనలు క్రమముగా వెల్లడింప బడియున్నందున, యీ ప్రబంధము నిత్యాను సంధానమునకును, నిత్య తిరువధ్యాన తిరువారాధనలకు ఉత్తమ తమమయిన ఆధార గ్రంథము. ఆళ్వార్లెల్లరు, ఆచార్య పరంపర (లక్ష్మీనాథ సమారంభాం నాథయామున మధ్యమాం. అస్మదాచార్య పర్యంతాం వందేగురు పరంపరాం॥) సర్వులు వారివారి రచనల యందు వ్యక్తము చేసిన వైష్ణవ విశిష్టాద్వైత సిద్ధాంత జ్ఞానసారమంతయు, భక్తిసారమంతయు "తిరుప్పావై" యందు యిమిడి యున్నది. తిరుప్పావై ప్రబంధమును

సంపూర్ణ అర్థజ్ఞానముతో అనుసంధించిన యెడల, అది, ద్రావిడ దివ్యవేద సర్వస్వమును (నాలాయిరమ్ సర్వమును) పఠించిన దానితో సమానమగును. (శృతి స్మృతులన్నిటి యందు భగవద్గీతకు యివ్వబడిన స్థానము యిట్టిది గదా! ప్రస్థానత్రయ జ్ఞానమంతయు గీతయం దిమిడియున్నదని గదా నర్వులు విశ్వసించు చున్నారు? సర్వశాస్త్రమయీ గీతా-) "సర్వద్రావిడ వేదమయీ తిరుప్పావై" "తిరుప్పావై" విశిష్టత మీదు మిక్కిలి యియ్యది: అది ఆధ్యాత్మిక విషయ సంపదను కలిగి యుండుటయే గాక, ఆ యాధ్యాత్మిక విషయ, సత్య, సంపదలను పొందుటకు మార్గమును అనుభవ యోగ్యముగా తేటతెల్లముగా తెల్పుచున్నది. ఈ అనిర్వచనీయ మయినట్టియు, అద్వితీయ మయినట్టియు జ్ఞాన సంపదను చిరుతప్రాయ ముననే ఆండాళ్ నిర్వచింప గలుగుటను మనమేమని ప్రశంసింప గలము! ఆమె ఋషికవయిత్రి!

అందువలనగదా ఉడైయవరులు (శ్రీమద్రామానుజాచార్యుల వారు) తిరుప్పావై ప్రబంధమును నిత్యాను సంధానముగా ఆదరించు కొనుచూ వచ్చిరి!

కనుకనే ఆండాళమ్మగారికి దాస భూతులగు సమస్తమయిన వారికి తిరుప్పావై ప్రబంధము నిత్యాను సంధేయముగా నుండుట సంప్రదాయమైయున్నది.

తిరుప్పావై ప్రబంధము దైవకైంకర్యమును ప్రేరేపించునదియై, ప్రణవమంత్రము, పంచాక్షరీ మంత్రము, అష్టాక్షరీ మంత్రము, ద్వయ మంత్రము గీతాచరమ శ్లోకము, మున్నగు దివ్యమంత్రార్థ శోభితమై అలరారుచున్నయది అని పైన పేర్కొనబడినది గదా. ఇప్పుడిచట ఆ విషయము వివరింప బడుచున్నయది: ఈ వివరణము అతి ముఖ్యమును అవసరమును అయి యున్నది:

1) "ఓం"ను ప్రణవనాదము, ఓంకారము, ప్రణవమంత్రము, ఏకాక్షరీ మంత్రము అని పలునామముల భక్తులు పాటించుచున్నారు. ఇది వేదోపనిషత్తుల నుండి గ్రహింపబడినది. "గిరామస్మ్యేకమక్షరమ్"

(పలుకులలో ఏకాక్షరమైన ప్రణవమును నేను) అని గీతా ప్రమాణము గదా (10-25). ఓం = అ, ఉ, మ. "అ" దైవశక్తిని, "మ" జీవరాశిని, "ఉ" అచిత్ పదార్థమును (లేక సర్వసంపదను, శ్రీలక్ష్మిని) సూచించును. కావున "ఓం" అనునది తత్త్వత్రయ జ్ఞానమును వెల్లడించుచున్నది. ఇట్టి విజ్ఞానమునకు సాంకేతిక మయిన "ఓం" ఏకాక్షరీ మంత్రమే. మంత్రమనగా, సూత్రము, జ్ఞానము, సలహాయని వివిదార్థముల భావింపబడుచున్నది. "ఓం" అనునది యెట్టి విశిష్ట మంత్రమో గమనింప దగియున్నది. "ఓం" స్వరరూపము. భగవత్శక్తి స్వరరూపి అన్నారు. పంచ భూతములలో ఒకటయిన ఆకాశము (సూన్యప్రదేశము) స్వరపూరితము గదా! ఓంకార ప్రణవ నాదస్వరూపము భగవత్శక్తి అని చెప్పబడినది గదా. "విశ్వాంతరాళ వివిధ గోళభ్రమణ జనితనాదగాన శ్రవణ వినోదియైన అయేకైకనాథుడు" అని ఆంగ్లకవి శిఖామణి షేక్స్పియర్ భగవంతుని వర్ణిస్తాడు. ("He who alone hears the music of the spheres") "ఓం" కారమును జపించుట అనగా కేవలము నోటితో అనంతముగా ఉచ్చరించుటగాదు. తత్త్వత్రయ జ్ఞానమును మనస్సునకు దెచ్చుకొని, వినమ్రుడయి, శరణాగతి భావమున నుండుట, ఈ భావము పలుమార్లు తిరుప్పావై ప్రబంధమున కన్పడును.

2) "నమశ్శివాయ" అనునది పంచాక్షరిమంత్రము. సర్వంతర్యామి యగు భగవత్శక్తి (వైష్ణవశక్తి) శివముగాను, రౌద్రముగాను ఉండును. ఇందు అల్పజ్ఞానియు, పరిమిత శక్తియుతుడును అగు సంసారియయిన మానవుడు భగవత్శక్తియొక్క శివశక్తినే (శివ=శుభస్కరమయిన) గ్రహించి ఆనందింపగలడు. రౌద్రమన్న దానిని అతడు సుస్వాగతింపగలడా? శివ రౌద్రశక్తులను రెంటినీ స్వాగతించి, సంశ్లేషింపగల శక్తి భగవానులయిన ఆళ్వారులకే యొప్పును. కావున సంసారియయిన చేతనుడు పంచాక్షరీ మంత్రమును సేవ్యముగా భావించును. ఇది సహజము కూడాను. అనిర్వచనీయమును, అనంతమును, గంభీరమును అయిన విశ్వము నంతటిని మానవుడు అవగాహన చేసికొనగలడా? శివభాగమును, అనగా తనకు

సుఖకరమయిన భాగమునే స్వీకరింప కాంక్షించును. భజించును. అందువలననే విశిష్టాద్వైత సిద్ధాంతము అనంతకల్యాణ గుణప్రపూర్ణ మయిన సాకార వైష్ణవశక్తి సేవ్యము, ఆనందకరము అని భక్తులకు సూచించును. అందువలన పంచాక్షరీ మంత్రము శైవమును, వైష్ణవమును అగుచున్నది. శైవము, రౌద్రము అను రెండు అంశములతో గూడిన వైష్ణవము లోనిదే గదా శైవము! కావున శైవము, వైష్ణవము పరస్పర వ్యతిరేక మలుకాదు. తొక్క, కండ కలిసి కదళీఫల మగుచున్నది. తొక్క కదళీ ఫలమునకు అసంబంధమయినది కాదు కదా! పండితులయిన గురుపీఠ స్థులును శివ, వైష్ణవ భేదములను సృష్టించి, అమాయకులగు మానవులను పెడమార్గముల పట్టించినారు. ఈ రెండు పేర్లమీద వేర్వేరు మతము లుండడము, వేర్వేరు గురు పీఠములుండడము, వేర్వేరు సారస్వతములు, గ్రంథములు, దేవాలయములు, ఆరాధన క్రమములు ఉండడము శోచనీయము, అజ్ఞాన సూచకము. సర్వవ్యాపితము "వైష్ణవము" అన్నపుడు వైష్ణవములో చేరనిదేమున్నది? వైష్ణవము దేనికిని విరోధము కానేరదు' భగవత్శక్తి శివము, శంకరము అని విష్ణుసహస్రనామ స్తోత్రమున గలదు గదా! ఇది వ్యాస ప్రోక్తము కదా! భగవదవతార పురుషుడగు శ్రీకృష్ణుడు శుభస్కరమైన వాడనియు, మంగళకరుడనియు, సుఖపెట్టువాడనియు తిరుప్పావై ప్రబంధమందు వర్ణింపబడియున్నాడు. అందువలన నీప్రబంధము, పురుషోత్తముని వర్ణించుతరి, పంచాక్షరీ మంత్ర సౌరభమును వెదజల్లు చున్నయది. "పంచాక్షరీమంత్ర స్మరణ" అనగా అర్థరహితముగా "పంచాక్షరిని" జపించుట కాదు, ఆ మంత్రార్థమును గమనించుకొని ప్రపంచమున సర్వము శుభస్కరముగా నుండుగాక అని మంగళాశాసనము చేయుట యగును. "శివశివ అనరాదా, భవ భయ బాధలనణచుకో రాదా" అను త్యాగరాజస్వామి కీర్తన ప్రకారము, "మనము సర్వుల శుభమును కోరుచూ, ద్వేషరహితులముగా నున్నయెడల, మనకు భవభయ బాధలు ఉండవు" అని భావము. "శ్రీకృష్ణుని సేవించిన మనకు భవభయబాధలు వుండవని" ఆండాళ్ తిరుప్పావై గ్రంథమున పలుమార్లు వెల్లడించి యున్నారు. అందువలన

తిరుప్పావై అనుసంధానమున పంచాక్షరీ జప ప్రభావమున్నది అని భక్తులు గ్రహింపగలరు. అదియేదో వైష్ణవతెగకు సంబంధించిన గ్రంథమని తలచుట అపచారమగును.

3. "ఓం నమో నారాయణాయ" అనునది అష్టాక్షరి మంత్రము. దీనిని తిరుమంత్రము అని కూడా అందురు. మంత్రరాజమిది. ఓం + నమో + నారాయణాయ. "ఓం" ను గూర్చి యింతకుముందే తెలిసికొన్నాము గదా!" నారాయణాయ" అను శబ్దము సర్వంతర్యామి యగు వైష్ణవశక్తిని సూచించును. "ఆశక్తికి శరణాగతి యగుచున్నాను" అని "నమో" శబ్దము సూచించును. కావున అష్టాక్షరీ మంత్రము యొక్క భావము, "తత్త్వత్రయ జ్ఞానముతో నేను సర్వంతర్యామి యగు వైష్ణవశక్తికి శరణాగతుడ వగుచున్నాను", అని. ఇది వైష్ణవ మంత్రము. ఈ మంత్ర సౌరభముతో అలరారు చున్నయది తిరుప్పావై ప్రబంధము. పంచాక్షరి "శివ మంత్రము" అని పిలువ బడుచున్నది గదా. ఈ వైష్ణవ మంత్రము, శైవమంత్రములకు గల సంబంధమును మనము తెలిసికొని ఆనందింప వలసియున్నది. ఇవి పరస్పర విరోధములయి నట్టివిగావు. "శివమంత్రమునకు "మ" జీవము, మాధవమంత్రమునకు "రా" జీవము" అని త్యాగరాజస్వామి, తనకీర్తనయందు భగవత్భక్తిని నిర్ణయించి, నిర్వచించు సందర్భమున అంటాడు. ఈ వైష్ణవ, శివ మంత్రముల యొక్క (ఈ అష్టాక్షరీ, పంచాక్షరీ మంత్రముల యొక్క) బీజాక్షరములను లేక జీవాక్షరములను కలిపిన "రామ" అను శబ్దము యేర్పడును గదా! "రాముడు" అనగా సర్వులను రంజింపజేయువాడని అర్థము. సక్రమమయిన జీవితమును గడపుచూ పరోపకారార్థ కార్యముల నెరవేర్చుచూ, సర్వులను రంజింప జేయువిధమున చేతనుడు జీవయాత్ర చేయవలయును. అందువలన "రామ" మంత్రము యొక్క ప్రాధాన్యతను యిట్లు గమనింప వలయును. ఈ సత్యము ఒకానొక పాశురమున వివరింప బడి యున్నదికదా!

4) ఐక ద్వయమంత్రమును గూర్చి విచారింతము:

"శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే
శ్రీమతే నారాయణాయ నమః"

అనునది ద్వయమంత్ర మనబడు చున్నది: "లక్ష్మీ సమేత నారాయణుని చరణములను శరణముగా పొందుచున్నాను. లక్ష్మీ సహితుడగు నారాయణునకు నమస్కారము" అని ద్వయము యొక్క అర్థము. భగవచ్ఛక్తి సర్వసంపద యుతము, అట్టి శక్తి యొక్క, అనగా, నారాయణుని యొక్క (మూర్తి భావమున, Personification)పాదములను శరణముగా పొందుచున్నాను అనుటలో సత్యమును గమనింప దగియున్నది. "చరణములు" సేవకు సాంకేతికము. "నేను సర్వసంపద యుతమయిన "భగవచ్ఛక్తికి ప్రణమిల్లుచున్నాను. ఈ జ్ఞానముతో వినమ్రుడనై దాసునిగా మెలగెదను" అని ద్వయము యొక్క భావము. అనగా, "దైవధ్యానము, దైవకైంకర్యము". ఈ ద్వయమంత్రము తిరుమంత్ర మునకు సమమయినది. అష్టాక్షరీ అనబడు తిరుమంత్రము వేద ఉపనిషత్తులలో తెల్పబడినను, ఆళ్వారులువారి దివ్యపాశుర, కీర్తనములతో గానము చేసినను, ప్రథమ వైష్ణవాచార్యుడయిన శ్రీనాథమునులు యీ తిరుమంత్రమును శిష్యుల కుపదేశించు ఆచారమును ప్రారంభించి నట్లున్నారు. ఈ మంత్రమును గుప్తముగానుంచి, ఆచార్యుడు తన ప్రధాన శిష్యునకే ఉపదేశించు ఆచారము పాటింప బడుచుండెను. ఆచార్యుడు, అన్యులెరుగకుండా తనశిష్యునకే రహస్యముగా యీ మంత్రమును చెవిలో వేయు ఆచారము ఉండినది. ప్రతిమంత్రము యొక్క విషయము యిట్లుగానే యుండెడిది. శ్రీరామానుజాచార్యుల వారే మొట్టమొదటిసారిగా తిరుమంత్రమును యెల్లరకు బహిర్గతము చేసినాడు. ఈ తిరుమంత్రార్థ మయినట్టియు కొలది విశేషముతో శ్రీరామానుజుడు "ద్వయమంత్రమును" కల్పించి, శిష్యులకు బోధించి నట్లయినది. ద్వయము నందు తిరువధ్యానము, తిరువారాధన రెండును సూచింపబడి యున్నది. అనగా జ్ఞాన, పరోపకార జీవితమును అది

సూచించును. ఇదియే దాని ప్రత్యేకత. ఈ ద్వయ మంత్రార్థము తిరుప్పావై ప్రబంధమున విపులీకరింపబడి యున్నది.

5) ఇక కడపటిది యగు చరమశ్లోక విషయమును గమనింతము:

"సర్వధర్మా౯ పరిత్యజ్య, మామేకం శరణంవ్రజ।
అహం త్వా సర్వపాపే భ్యో, మోక్షయిష్యామి మాశుచః॥"


అనునది గీతాచరమ శ్లోకము. "నాచే చెప్పబడిన యీ అనేక ధర్మములను పాటింపలేక పోయినను, ఈ ధర్మమును మాత్రము తప్పక పాటింపుము: ఒక్కడైన నాకు శరణు జెందుము. అట్టి యెడ నేను నిన్ను సకల పాపముల నుండి విముక్తుని జేయుదును. శోకింపకుము" అని చరమ శ్లోకభావము. కాని, దీని ఫలితార్థమును గమనింప దగియున్నది. "సర్వధర్మములలో శ్రేష్ఠమయిన ధర్మము స్వార్థరాహిత్యము. ఇయ్యది నిన్ను సకలపాపముల నుండి దూరముగా నుంచును. శోకింపకుము", అని ఫలితార్థము. ఇది ఉపాయ అభయములతో గూడినది. ఇదియును ఒక భావమున కొందరిచే ద్వయమనబడుచున్నది. చరమశ్లోకము వెల్లడించు ప్రపత్తి, మోక్ష భావములు తిరుప్పావై ప్రబంధమున సవిస్తరముగా తెల్పబడి యున్నవి.

తిరుప్పావై ప్రబంధ ప్రాశస్త్యము ఇట్టిది. వైష్ణవ భక్తులు దీనిని భగవద్గీతకు సమానముగా భావింతురు. సర్వజ్ఞుడయిన గీతాచార్యుడు స్వధర్మ నిర్వహణను త్రోసి పుచ్చ ప్రయత్నించుచున్నట్టి శిష్యునకు ఆత్మ జ్ఞానమును కల్పించి, స్వధర్మ నిర్వహణకు కర్మఫల త్యాగమునకు పురికొల్పుచూ చేయబడిన బోధనామృతము గీత. ఆత్మజ్ఞానమును పొందిన చేతనుడు భగవచ్ఛక్తిని స్వీకరించు తెరగును తెల్పునది తిరుప్పావై. జ్ఞాని, అజ్ఞానికి చేసిన బోధ గీత - జ్ఞాని తన్ను భగవతున కెరింగించుకొని ఆనందించు క్రమము తిరుప్పావై.

***ఆండాళ్ తిరువడిగళే శరణమ్***

T.T.D. Religious Publications Series No. 635

Price : Rs.30/- 25 = 00



తిరువాంబుపాటి రాఘవయ్యగారు బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు జిల్లాలో అధ్యాపకులుగాను, ప్రిన్సిపాలుగాను పనిచేసి రిటైర్ అయ్యారు. విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదన చేసే పలు గ్రంథాలు రచించారు. రామానుజ దివ్యవైభవం, వాస్తవం, ఆళ్వారుల దివ్యవైభవం వాటిలో కొన్ని మాత్రమే. వీటిని ఆంగ్లంలో ఆయనే అనువదించారు కూడా.

నాలాయిర దివ్యప్రబంధంగా ప్రసిద్ధిచెందినటువంటి పాశురాలలో నిత్యానుసంధానం చేసే కొన్నింటిని గ్రహించి భావ వివరణ ఇచ్చారు. తొండరడిప్పొడి ఆళ్వారు, తిరుప్పాణి ఆళ్వారు, తిరుమంగై ఆళ్వారు, పెరియాళ్వారు, ఆండాళ్ మొదలగు వారు పరవశించి గానం చేసిన పాశురాల విషయ వివరణ వున్న గ్రంథమే ఈ భక్తిసారం ప్రథమ భాగము.

Published by Sri Ajeya Kallam, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.